

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
విజయవాడ సిటీ



మంగళవారం | 13-2-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 299 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 10.35 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాషాఢ తె. 4.57 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 11.02-12.50; దుర్ముహూర్తం: ఉ. 9.04-9.50, రా. 10.20-11.09; అమృతఘడియలు: రా. 9.46-11.34; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.13

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

జస్టిస్ సిటీలోనే తాత్కాలిక హైకోర్టు!



కొత్తగా నిర్మించే సిటీ సివిల్ కోర్టుల్లో ఏర్పాటు

అంచనా వ్యయం 108 కోట్లు.. 8 నెలల్లో సిద్ధం

అక్కడ ఏర్పాటుకు న్యాయమూర్తుల బృందం ఓకే

సీఎంకు తెలిపిన సీఆర్‌డీఏ అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజధానిలోని జస్టిస్ సిటీలో రూ.108 కోట్లతో నిర్మించనున్న సిటీ సివిల్ కోర్టుల్లో తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 1.96 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ సముదాయం 8 నెలల్లో పూర్తి కానుంది. ఇందులో తాత్కాలిక హైకోర్టును నడిపేందుకు.. భవనాల పరిశీలనకు వచ్చిన న్యాయమూర్తుల బృందం కూడా అంగీకరించినట్లు సీఆర్‌డీఏ అధికారులు సీఎం చంద్రబాబుకు సోమవారం తెలియజేశారు. హైకోర్టు రాష్ట్రానికి తరలివస్తే.. 24 కోర్టు హాళ్ల ఏర్పాటు

మిగతా 6వ పేజీలో...

శివోహం..!

మహాశివరాత్రికి రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాలన్నీ సుందరంగా ముస్తాబయ్యాయి. ఇప్పటికే బ్రహ్మోత్సవ శోభతో అలరారుతున్న శ్రీశైలంలో సోమవారం గజ వాహనంపై ఊరేగిన మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం ప్రవాహమిది. (ఇన్‌సెట్‌లో) విద్యుత్ దీపాలంకరణతో కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం.






2

విదిలింపే!

నాలుగేళ్లలో ఇచ్చింది 20 వేల కోట్లే



అందులో 'ప్రత్యేకం' 10 వేల కోట్లే

మిగతావి అన్ని రాష్ట్రాలకు ఇచ్చేవే!

బీజేపీ నేతల లెక్క 3.55 లక్షల కోట్లు

పోల్చిచూస్తే హస్తిమశకాంతరం

నిధులపై ప్రభుత్వ వర్గాల విశ్లేషణ

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు ఈ నాలుగేళ్లలో.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులెన్నో తెలుసా? కేవలం రూ.20 వేల కోట్లు. ఇందులో ప్రత్యేకంగా ఇచ్చినవి రూ.10 వేల కోట్లు మాత్రమే. రాష్ట్రానికి కనీవినీ ఎరుగని రీతిలో కేంద్రం లక్షల కోట్ల మేర నిధులు ఇచ్చిందని బీజేపీ నేతలు గత శనివారం ఢిల్లీలో ప్రకటించడం.. ఈ గణాంకాలు తప్పుల తడకలని టీడీపీ నేతలు తిప్పికొట్టిన నేపథ్యంలో... రాష్ట్రానికి అసలెన్ని నిధులు వచ్చాయో ప్రభుత్వ వర్గాలు లెక్కలు తేల్చాయి. రెండు మిత్రపక్షాల నడుమ మాటలు, ఆరోపణలు, విమర్శలు అంతకంతకు ముదురుతున్న పరిస్థితుల్లో.. రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన నిధులు.. వాటి పరిస్థితి ఏంటి అన్న విషయంపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు దృష్టిసారించి లెక్క తేల్చాయి. సుమారుగా రూ.3.55 లక్షల కోట్ల మేర నిధులు ఇచ్చామని బీజేపీ చెప్పగా.. ముఖ్యమైన పద్దుల కింద కేంద్రం నుంచి వచ్చింది రూ.20 వేల కోట్లు మాత్రమేనని తేలింది (అంటే ఆ మొత్తంలో కేవలం 5.6 శాతమన్న మాట). ఇందులో ప్రత్యేకంగా ఏపీకి ఇచ్చింది రూ.పది వేల కోట్లు (2.8 శాతమే). అన్ని రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో భాగంగా వచ్చింది మిగతాది. అయితే అన్ని రాష్ట్రాలతోపాటు ఇవ్వాల్సిన నిధుల్లో కూడా రాష్ట్రానికి అన్యాయం జరిగిందని.. బీజేపీ జాబితాలో పేర్కొన్న పథకాల కింద రాష్ట్రానికి మొత్తం రూ.28 వేల కోట్లు రావలసి ఉండగా.. అందులో రూ.పది వేల కోట్లే వచ్చాయని ఆ వర్గాలు వెల్లడించాయి. పోలవరం ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని చెప్పారు. నాబార్డు ద్వారా రుణం ఇప్పించి.. తానే చెల్లిస్తానని ప్రకటించింది. ఇంతవరకు రాష్ట్రం సొంతంగా ఖర్చుపెట్టిన రూ.7,179 కోట్లే తిరిగి

మిగతా 16వ పేజీలో...

పోరాటమే వర్తమానం

నాడు స్వతంత్ర సమరం.. 6

నేడు రాష్ట్ర ప్రయోజనాలకై పోరు!

అది గత చరిత్ర.. ఇది ప్రస్తుత చరిత్ర

మూడున్నరేళ్లుగా సహకరిస్తున్నాం

కేంద్రం మనకు చేయూతనివ్వాలి

ఎంపీల పోరు అభినందనీయం: సీఎం

ఏనాడైనా మిత్రధర్మం పాటించారా?

యుద్ధం, భిక్షం.. మాటలేల? 16

విభజన కుట్ర లోకేశ్, బాబుదే

బాబు 2 కళ్ల సిద్ధాంతం వల్లే భద్రాద్రి తెలంగాణకు

టీడీపీపై బీజేపీ నేతల ధ్వజం

హోదా కోసం వైసీపీ ధర్నా బాట

1న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

3న ఎంపీల ఢిల్లీ యాత్ర

5న జంతర్‌మంతర్‌లో ధర్నా

పార్టీ ముఖ్యులతో జగన్ భేటీ

రాజీనామాలపై తర్జనభర్జన



కరెన్సీ..

శ్రీకాకుళం జిల్లా పలాసలో ఏటీఎం వద్ద బారులు తీరిన ఖాతాదారులు

కటకట

బ్యాంకుల దగ్గర జనం జాగారం

ఏటీఎంలో పెట్టరు.. బ్యాంకులో ఇవ్వరు

రెండురోజులుగా ఏటీఎంలకు చేరని డబ్బు

ఎక్కడివక్కడే మూత.. ఖాతాదారుల గగ్గోలు

బ్యాంకుల్లో 50 వేలడిగితే 10 వేలు చేతికి

2 వేల నోటు చలామణి తగ్గిస్తున్న ఆర్బీఐ?

'బ్యాంకు దివాలా బిల్లు' వార్తలతో భయం

భారీగా డిపాజిట్లు తీసుకొన్న ఖాతాదారులు

దాంతో చెస్ట్‌లకు పడిపోయిన నగదురాక

అత్యవసరాలూ తీరక జనంలో అసహనం

బ్యాంకు కౌంటర్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు

ఏటీఎంల ముందు పడిగాపులు... బ్యాంకుల ముందు తోపులాటలు. ఎంత పడిగాపులు కాసినా, ఉన్న ఏటీఎంలు అన్నింటికీ తిరిగినా..నోట్లు మాత్రం రావు. నో క్యాష్ బోర్డులే పలకరిస్తున్నాయి. సరే కదా అని ఉసూరుమంటూ బ్యాంకుకు వెళ్తే అక్కడా అదే పరిస్థితి. రూ.50 వేలు కావాలంటే పది వేలు చేతిలో పెడుతున్నారు. 'అదేంటి? మా డబ్బు మాకివ్వడానికి ఏంటి?' అని గొడవపడ్డా... ఉన్నది అందరికీ పంచడం తప్ప ఏం చేయలేమంటూ సమాధానం!

రాష్ట్రవ్యాప్తంగా గత రెండురోజులుగా ఇదే పరిస్థితి! దీంతో మళ్లీ నగదు కొరతపై భయాందోళనలు నెలకొన్నాయి. బ్యాంకులు, ఏటీఎంల వద్ద పడిగాపులు పడుతున్న ఖాతాదారుల్లో 'పెద్ద నోట్ల రద్దు' నాటి కలవరం

మిగతా 6వ పేజీలో...

సంక్రాంతికి కియ

22న అనంతకు చంద్రబాబు

రేపు కియ ప్రతినిధుల రాక



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లపై 'కియ' కార్లు పరుగులు పెట్టనున్నాయి. అనంతపురం జిల్లాలో స్థాపించిన కియ కార్ల ప్లాంటులో ఉత్పత్తయ్యే కార్లు 2019 సంక్రాంతి నాటికి బయటకు రానున్నాయి. ఈ కార్లను జనవరిలో మార్కెట్లోకి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. వాస్తవానికి.. కియ ప్లాంటు నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యాల కంటే శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే భవన నిర్మాణ పనులను వేగవంతం చేసిన కియ సంస్థ .. ఈ పనులను సమీక్షించాలని సీఎం చంద్రబాబును కోరాలని నిర్ణయించింది. ఈ నెల 22న కియ ప్లాంటును పరిశీలించాలని.. ప్లాంటునకు సంబంధించి

మిగతా 6వ పేజీలో...

సులభతర వ్యాపారంలో ఏపీ టాప్

రెండో స్థానంలో ఉత్తరాఖండ్

9వ స్థానంలో తెలంగాణ 6



'నీరు-ప్రగతి'కి శ్రీకారం చుట్టి పొక్లెయిన్‌తో మట్టి తీస్తున్న సీఎం

ఊరు కోసం ఉద్యమించండి

మహా సంగమానికి కార్యోన్ముఖులం అయ్యాం

రండి...జల సంరక్షణలో భాగస్వాములవ్వండి

ప్రజలను కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కొత్తగా మరో 2 కోట్ల ఎకరాలకు సాగునీరు

రియల్ టైమ్‌లో పోలవరం.. వేగం పెంచండి

కాంట్రాక్టు సంస్థలకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): "గ్రామాల్లో కరువును శాశ్వతంగా దూరం చేసేందుకు జల సంరక్షణలాంటి వినూత్న కార్యక్రమాలను ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. నదులపై ఆధారపడడమే కాకుండా, భూగర్భంలోనూ జలాలను నిల్వ చేసే కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తున్నాం. ఊరు బంగారు

మిగతా 6వ పేజీలో...



16

బుట్టా రేణుకకు పదవీ గండం?

సీఎస్‌డబ్ల్యూలో సభ్యురాలిగా ఎంపీ

లాభదాయక పదవేనన్న స్థాయీ సంఘం

అనర్హత వేటుకు సిఫారసు

జూనియర్ డాక్టర్ల సమ్మె బాట

రేపటి నుంచి నిరవధిక సమ్మె

స్తంభించనున్న వైద్య సేవలు 18

ఆందోళనలో పదివేల మంది

16 నుంచి అత్యవసర కేసులూ బహిష్కరణ

ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం వెల్లడి

బెజవాడలో మరో భూమాయ!

వైద్యుడి భూమిపై ఓ ముఠా కన్ను



నకిలీ పత్రాలతో రూ.కోటికి బేరం

బ్యాంక్ రుణం కోసమూ ప్రయత్నం

కీలకంగా వ్యవహరించిన మహిళ

యజమానిని, ముఠాను బెదిరించి

భారీగా డబ్బులు గుంజిన వైనం

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బెజవాడలో మరో భూమాయ వెలుగుచూసింది. నిన్న స్వాతంత్ర్య సమరయోధుడి భూమికి ఒక ముఠా ఎసరు పెడితే, ఇప్పుడు ఓ వైద్యుడి భూమిలో పాగా వేసి నకిలీ దస్తావేజులు పుట్టించింది మరో ముఠా. అయితే, ఈ వ్యవహారంలో పోలీసులను సైతం బురిడీ కొట్టించడానికి ఈ ముఠా చేసిన ప్రయత్నం వికటించింది. ఓ మహిళ సహా పదిమందిని సోమవారం బెజవాడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, విజయవాడ సూర్యారావుపేట ప్రాంతానికి

మిగతా 13వ పేజీలో...

'ఐఆర్ఆర్'కు నోటిఫికేషన్ ఇవ్వండి

8 వేల ఎకరాల సమీకరణకు సీఎం ఆదేశాలు

అమరావతిలో సమీకృత బిజినెస్ పార్క్ 3

20 ఎకరాల్లో ఏర్పాటుకు సీఆర్‌డీఏ ప్రతిపాదన





అదే సాధకుడికి శివరాత్రి



పరంజ్యోతి

శివమహాపురాణంలో ఒక ఆసక్తికరమైన కథ ఉంది. పార్వతీపరమేశ్వరుల వివాహ సందర్భం అది. పురోహితుడు.. 'మీ తండ్రి పేరేమిటి?' అని శివుణ్ణి ప్రశ్నించాడు పురోహితుడు. నా తండ్రి ఎవరు! అని శివుడు ఆలోచిస్తుంటే నారదుడు 'బ్రహ్మ' అనండి అన్నాడు. అది చెప్పాక 'మీ తాత ఎవరు?' అని శివుణ్ణి అడిగితే విష్ణువు అని చెప్పాడు. 'మీ ముత్తాత ఎవరు?' అనే ఆఖరు ప్రశ్న అడగ్గానే శివుడు 'నేనే ముత్తాతను' అన్నాడు. శివుడు ఆద్యంతాలు కనుక్కోలేని లింగస్వరూపుడు. దేవతలందరిలో నిర్గుణరూపం ధరించినవాడు. దక్షుడు శివుణ్ణి గుణహీనుడని నిందిస్తే "ఆయన నిర్గుణుడు" కాబట్టి ఆ తిట్టు కూడా స్తోత్రమే అని చెప్పుకొంటాం. స్వస్వరూపం కాకుండా లింగరూపంలో సాక్షాత్కరించే శివుడి 'ఆద్యంతాలు కనుక్కొంటాం' - అని బ్రహ్మవిష్ణువులు ప్రయత్నించే కథ ఒక ప్రతీక మాత్రమే. నిర్గుణతత్వం తెలుసుకోవాలనుకొంటే సాధకుడు విష్ణుత్వం పొంది సహస్రారం వైపైనా వెళ్లాలి, బ్రహ్మత్వం పొంది మూలధారంలోని కుండలినైనా స్పృశించాలి అన్న యోగరహస్యం అందులో ఉంది. ఈ యోగం ద్వారా పరబ్రహ్మ సాక్షాత్కారం కలగడమే లింగోద్భవం. అదే సాధకుడికి శివరాత్రి. నిర్గుణుడైన శివుడు నిత్యతృప్తికి చిహ్నమై ఆనందస్వభావం గల నందిని ఎదురుగా పెట్టుకున్నాడు. మంద, తమోగుణాలుగల గజము చర్మం ధరించి వాటికి అతీతంగా ఉండాలని సందేశం ఇచ్చాడు. విభేదాలను భస్మం చేసి దానిని ధరించి అద్వైతభావన, స్థిరత్వం సూచిస్తున్నాడు. డమరు చేతిలో ధరించి శివుడు నాదబ్రహ్మమయినాడు. అలాంటి 'శివం' ఓ సర్వ వ్యాపకమైన ఉనికి. దు:ఖాన్ని నశింపజేసి మంగళతత్వాన్ని కలిగిస్తుంది. **-డాక్టర్ పి.భాస్కరయోగి**

▸▸ **కోటప్పకొండపై**

వీర దేశభక్తి గీతం




చిన్నపరెడ్డి నివసించిన రెడ్డిపాలెంలోని గృహం

తెల్ల దొరతనాన్ని సవాల్ చేసిన రణ రుద్రుడు సైరా చిన్నపరెడ్డి.. కొండ కేంద్రంగా స్వేచ్ఛాసమరం

▸▸ **అండమాన్‌లో బందీ..రాజమండ్రిలో ఉరి**

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గాదె సుబ్బారెడ్డి, లింగమ్మ దంపతుల ఆరో సంతానంగా చిన్నపరెడ్డి 1864లో జన్మించాడు. పాడిపంట ఉన్న రైతు కుటుంబం కావడంతో, ఆయన తన చిన్నతనంనుంచీ మూగజీవాలను ప్రేమించేవాడు. తనకు అన్యాయం అని పిస్తే, ఎంతటివారినైనా దూకుడుగా ఎదుర్కొనేవాడు. ఆయనకు గుర్రపుస్వారీ అంటే చాలాఇష్టం. వీధుల్లో అధికారులు, జమిందారులు తప్ప అన్యులు గుర్రాలమీద తిరగరాదన్న నిబంధన అప్పట్లో ఉండేది. అయినా, చిన్నపరెడ్డి లక్ష్యపెట్టేవాడు కాదు. పేదలపై దాడులు చేస్తున్న జమిందారులను, భూ స్వాములను ఆయన ఎదుర్కొన్నాడు. వాళ్ల కల్లాలపై దాడిచేసి, ధాన్యంబస్తాలను కొల్లగొట్టి, పేదలకు పంచిపెట్టేవాడని చె బుతారు. చేబ్రోలు ప్రాంతంలో నీలి మందు పంట ఎక్కువ. తమ పంటకు ధర లేకపోవడంతో, ఒకసారి ఆయన తన గుర్రంపై మద్రాస్‌కు సరుకును తీసుకుపోయాడు. మద్రాస్ వీధుల్లో తిరుగుతున్నప్పుడు 'వందేమాతరం' అనే నినాదం చెవిన పడింది. కూంబ్ నది ఒడ్డున 1907లో జరిగిన బహిరంగ సభలో ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు, లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ నోట ఈ నినాదం వినిపించింది. రెడ్డిపాలెం తిరిగి వచ్చిన తరువాత, తన గుర్రంపై గ్రామగ్రామానికి తిరుగుతూ..వందేమాతరం నినాదాన్ని ఆయన వ్యాప్తి చేయడం మొదలుపెట్టాడు. చిన్నపరెడ్డి పోరాటం బ్రిటిష్ పాలకులకు, జమిందారులకు కంటగింపుగా మారింది. శివభక్తుడైన చిన్నపరెడ్డి మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కోటప్పకొండకు వస్తున్నాడని వారికి సమాచారం అందింది.




సైరా చిన్నపరెడ్డి ఊహాచిత్రం

కొండ దారిలో నెత్తుటి రణం..

చిన్నపరెడ్డి తన ఎద్దులను బండికి కట్టి, ప్రభలతో 1906లో కోటప్పకొండకు బయలుదేరాడు. స్థానిక జమిందారు ప్రోద్బలంతో నాదెండ్ల వద్ద కొంతమంది ఆయన ప్రభను అడ్డుకొన్నారు. వారి దాడిని చిన్నపరెడ్డి వీరోచితంగా తిప్పికొట్టాడు. ఆ తరువాత రెండు సంవత్సరాలకు, చిన్నపరెడ్డిని కోటప్పకొండపై ఎదుర్కోడానికి అధికారులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయనపై బ్రిటిష్ పాలకుల ఆగ్రహానికి మరో కారణం కూడా ఉంది. మహా శివరాత్రి నాడు లక్షల మంది భక్తులు కోటప్పకొండకు వస్తారు. చిన్నపరెడ్డి ఈ కొండ కేంద్రంగా వారందరిలో కలియ దిరుగుతూ, దేశభక్తిని ప్రచారం చేసేవాడు. ఇలా తమకు కొరకరాని కొయ్యగా మారిన చిన్నపరెడ్డిని అరెస్టు చేయడానికి ఏడాది తరువాత, తిరిగి అదే కొండపై మరోసారి అధికారులు ప్రయత్నిం చారు. వారికి ఆయన ఎదురు పడగానే కాల్పులు జరిపారు. ఆ తూటాలు చిన్నపరెడ్డి ప్రాణసమానమైన ఎద్దుకు తగిలి, అది చనిపోయింది. దీంతో ఆయన అనుచరులు రెచ్చిపోయారు. ఇదే అదునుగా, శాంతిభద్రతలకు భంగం కలిగించిన అభియోగంపై చిన్నపరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అయితే, వారు అక్కడినుంచి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయారు. చిన్నపరెడ్డిని వదిలేయాలంటూ ప్రజలు తిరగబడ్డారు. కొండపై తాత్కాలికంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌కు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఇద్దరు యువకులు చనిపోయారు. మరింత రెచ్చిపోయిన జనం, డీఎస్పీని పట్టుకొని కొట్టారు. సబ్ కలెక్టర్ దఫేదారులపై దాడిచేశారు. జనం ప్రతిఘటనలో ఓ కానిస్టేబుల్, ఉప్పు డిపార్ట్‌మెంట్ ఉద్యోగి మరణించారు. ఈ అల్లర్లకు, మరణాలకు చిన్నపరెడ్డే కారణమని అధికారులు కేసు పెట్టారు. గుంటూరు న్యాయస్థానంలో ఆయనతోపాటు వందమందిపై కేసు నడిచింది. చిన్నపరెడ్డి సహా 21 మందికి ఉరిశిక్షను కోర్టు విధించింది. ఈ తీర్పుపై మద్రాసు హైకోర్టులో అప్పీలుకు వెళ్లగా, చిన్నపరెడ్డికి మాత్రం ఉరిశిక్షని ఖరారుచేసి, మిగతావారిని కోర్టు వదిలేసింది. విచారణ కాలమంతా చిన్నపరెడ్డిని అండమాన్ దీవుల్లో ఉంచారు. 1910 అక్టోబరులో రాజమండ్రి జైలులో ఆయనను ఉరితీశారు.

> వర్షంలో, చలిలో, చీకటిలో దారితప్పి భయంతో వణికిపోతున్న ఓ యువతికి తోడుగా నడిచి, త్రికూటాచలం వద్ద పరమశివుడు శిల అయ్యాడని చెబుతారు. ఈ ప్రాంతాన్నే ఇప్పుడు కోటప్పకొండ అని, ఇక్కడ కొలువైన పరమేశ్వరుడిని కోటప్ప అని పూజిస్తున్నారు. ఆ కోటప్ప భక్తుడు గాదె చిన్నపరెడ్డి. తన స్వామిలాగే ఆయన కూడా, ఆపదలో ఉన్నవారిని, అన్నార్థులను ఆదుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడాడు. బానిసగా ఒక్కరోజూ బతకబోనని శపథం చేసి, బ్రిటిష్ సామ్రాజాన్ని సైతం ఎదిరించాడు. కోటప్పకొండ కేంద్రంగా రణం నడిపి, సైరా చిన్నపరెడ్డి అంటూ.. చరిత్రలో, జానపద గాథల్లో కొనియాడబడ్డాడు.


- పొన్నూరు టౌన్



చిన్నపరెడ్డి ప్రాణసమానమైన గుర్రం సమాధి



విద్యుత్ కాంతులతో యనమలకుదురు కొండపై శివాలయం



విద్యుత్ కాంతులతో కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయ రాజగోపురం

మహా శివరాత్రి పూజలకు గుంటూరు జిల్లా నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ ముస్తాబైంది. మంగళవారం ఇక్కడ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఈ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు దేశం నలుమూలల నుంచి సుమారు పది లక్షల మంది భక్తులు వస్తారని అంచనా కాగా, ఇందుకు తగ్గట్టు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున మంత్రి మాణిక్యాలరావు, స్పీకర్ కోడెల పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. తిరునాళ్లకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం స్పీకర్ కోడెల శివప్రసాదరావు, కలెక్టర్ కోన శశిధర్, ఎస్పీ అప్పలనాయుడు పర్యవేక్షించారు. 3 వేల మంది పోలీసుల పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

- కోటప్పకొండ(నరసరావుపేట)

పసివారిపై ప్రాణాంతక వ్యాధి పంజా

▸▸ **ముగ్గురు చిన్నారులకు కాలేయ వ్యాధి**

▸▸ **ఆపరేషన్‌కు ఒక్కొక్కరికీ 30 లక్షలవుతుందన్న వైద్యులు**

▸▸ **ప్రాణభిక్ష పెట్టాలంటూ తల్లిదండ్రుల వేడుకోలు**

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12: తమకు వచ్చిన వ్యాధి ఏమిటో కూడా తెలియని చిన్నారులను మృత్యువు వెంటాడుతోంది. ఆ విషయం తెలియని ఆ పసిపిల్లలు ఆటపాటలతో కాలం గడుపుతున్నా... ఆ ఆనందం తాత్కాలికమేనన్న కఠిన నిజం తెలిసిన పేద తల్లిదండ్రులు భగవంతుడిపై భారంవేసి ఆదుకునే వారికోసం ఎదురుచూస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట ఇస్మాయిల్ నగర్‌కు చెందిన అమర్తి వెంకన్న, చిన్న దంపతులకు ఏడేళ్ల కుమారుడు దుర్గాప్రసాద్, నాలుగేళ్ల లక్ష్మి, ఏడాది వయసున్న మార్త ఉన్నారు. దుర్గాప్రసాద్‌కు మూడేళ్ల వయసులో పొట్ట పెరుగుతూ వచ్చింది. ఎదిగే క్రమంలో పొట్ట పెరుగుతుందని స్థానిక వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోలేదు. వయసు పెరిగే కొద్దీ అతడికి పొట్ట పెరుగుతూ రావడం తల్లిదండ్రులను కలవరపెట్టింది. చిన్నపిల్లల వైద్యులను సంప్రదించగా... కాలేయ సమస్య ఉండొచ్చని, పరీక్షలకు హైదరాబాద్ లేదా విశాఖపట్నం తీసుకెళ్లమని సూచించారు. దాంతో తల్లిదండ్రులు పరీక్షలు చేయించగా కాలేయ సంబంధిత వ్యాధిగా తేలింది. ఆపరేషన్ చేయించకపోతే చనిపోతాడని ఆపరేషన్‌కు రూ.30 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. కూలి పనులు చేసుకునే తమకు అంత మొత్తం తీసుకురావడం కలలో కూడా సాధ్యంకాదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పను కలిసి సమస్యను విన్నవించారు. ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.15 లక్షలు మంజూరు చేయించారు.



చిన్నారులతో తల్లిదండ్రులు

వైద్యానికి నిధులు సరిపోని కారణంగా కాకినాడ ఎంపీ తోట నరసింహాన్ని కలిసి సమస్యను చెప్పారు. స్పందించిన ఆయన పీఎం రిలీఫ్ ఫండ్‌లో రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఈ రెండు పత్రాలను పట్టుకుని కుమారుడితో తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లారు. కేర్, కిమ్స్, అపోలో వంటి ఆసుపత్రులలో వైద్యులను కలిసి పరిస్థితిని వివరించారు. అయితే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు కాకుండా నగదు తీసుకురావాలని, ఆపరేషనుకు రూ.25 లక్షలు, పరీక్షలకు రూ.5 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పారు. మరోవైపు.. కుమారుడి మాదిరిగానే ఇద్దరు ఆడపిల్లలకూ పొట్టలు పెరుగుతున్నాయని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు చూపించారు. ఒక్కరి వైద్యానికే ముప్పై లక్షలైతే, ముగ్గురికి సుమారు తొంభై లక్షలు ఖర్చు అవుతుందని.. ఇంత సొమ్ము ఎలా తేగలమని గుండెలవిసేలా రోదించారు. ప్రజావాణిలో మూడుసార్లు కలెక్టర్‌ను కలిసి తమ సమస్య విన్నవించామని, అయినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ పిల్లలకు ప్రాణభిక్ష పెట్టాలని వారు దాతలను కోరుతున్నారు.

▸▸ **విద్యుత్ బల్బులో శివలింగం**



చినదొడ్డిగల్లు (నక్కపల్లి), ఫిబ్రవరి 12: విశాఖ జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామంలో కార్పెంటర్‌గా పనిచేస్తున్న యువకుడు దార్ల రవి సందర్భాన్ని బట్టి అనేక కళాఖండాలను తయారుచేస్తున్నాడు. తాజాగా మహాశివరాత్రిని పురస్కరించుకుని విద్యుత్ బల్బులో చెక్కతో తయారుచేసిన శివలింగాన్ని, పైన ఓంకారాన్ని అమర్చాడు. ఇందుకు తనకు అరగంట సమయం పట్టిందని రవి తెలిపాడు.

లోకం తీరు



..మా అందరిపై నేరారోపణలున్నాయనే కదయ్యా! నా ముని మనవణ్ని ఎన్నికల్లో నిల్చోబెడుతున్నా!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
శ్రీకాకుళం	18.0	35.0
హైదరాబాద్	19.0	31.6
కడప	19.0	34.2
గుంటూరు	20.0	34.0
విజయవాడ	21.0	31.9
విశాఖపట్నం	21.4	30.8
అనంతపురం	22.2	34.4
నెల్లూరు	23.8	31.6
కర్నూలు	21.5	33.6

కొనసాగుతున్న అల్పపీడనద్రోణి

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అరేబియా నుంచి కేరళ వరకు అల్పపీడనద్రోణి కొనసాగుతున్నది. ఉత్తరాది నుంచి పయనిస్తున్న వెస్టర్న్ డిస్ట్రబెన్స్ ప్రభావంతో వీస్తున్న గాలులతో సముద్రాల నుంచి వీస్తున్న తూర్పుగాలులు కలుస్తుండడంతో దేశంలో వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీని ప్రభావంతో మధ్యభారతం దానికి ఆనుకుని వున్న తెలుగు రాష్ట్రాల్లో మేఘాలు ఆవరించాయి. తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో తెలంగాణలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారి ఒకరు తెలిపారు. మేఘాల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా, రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 12 డిగ్రీలు నమోదైంది.



ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

ఇకపై ఎన్నికల్లో పోటీచేయబోను. అనారోగ్యం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నా. కొద్దిరోజులుగా వెన్ను, మోకాళ్ల నొప్పితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ఎన్నికల్లో పాల్గొనకపోయినా పార్టీ కోసం మాత్రం పనిచేస్తా.

- కేంద్రమంత్రి ఉమా భారతి



అయోధ్య స్థలాన్ని హిందువులకు ఇచ్చేయండి

"ముస్లింలు పెద్ద మనసు చేసుకుని అయోధ్యలోని స్థలాన్ని హిందువులకు ఇవ్వాలి. రాముడు అయోధ్యలో జన్మించాడని హిందువులు భావిస్తారు. ఈ స్థలం హిందువులకు ఎంతో ముఖ్యంగానీ, మనకు కాదు".

- జాతీయ మైనారిటీ కమిషన్ చైర్మన్ రిజ్వీ

కీమోథెరపీ పనితీరును అంచనా వేసే వ్యవస్థ!

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: చాపకింద నీరులా విజృంభిస్తోన్న కేన్సర్‌కు కీమోథెరపీనే మార్గం. ఈ చికిత్స తీసుకుంటే కేన్సర్ నయం అవుతుందో లేదో చెప్పడం చాలా కష్టం. ఇది ఒక్కో రోగిలో వ్యాధి తీవ్రత, శరీర లక్షణాలను బట్టి పనిచేస్తుంది. అందుకే రొమ్ము కేన్సర్‌తో బాధపడే వారిలో కీమోథెరపీ ఏవిధంగా ప్రభావం చూపుతుందో ముందే అంచనా వేసే ఓ వ్యవస్థను కనుగొన్నారు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. కీమోథెరపీ వల్ల రోగి శరీరంలో కలిగే మార్పులను ముందుగానే గుర్తించి 3డీ ఇమేజ్‌ల రూపంలో చూపిస్తుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

అలర్జీలకు చెక్‌పెట్టే పరికరం

లండన్, ఫిబ్రవరి 12: వాతావరణ కాలుష్యంతో చాలామంది శ్వాసకోశ వ్యాధులతో పాటు పలు రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు గాలిలోని అలర్జీ కారకాలైన ధూళికణాలు, శిలీంద్రాలు, పుప్పొడి ఒక కారణమే. వాటిని ఎదుర్కొనేందుకు యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ శాస్త్రవేత్తలు వినూత్న పరికరాన్ని రూపొందించారు. కోల్డ్‌ప్లాస్మా టెక్నాలజీతో పనిచేసే ఈ పరికరం.. గాలిలోని అలర్జీ కారకాలు మన దగ్గరకు చేరకుండా వాటిని నిర్మూలిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



శేషుడిపై కైలాసనాథుడి వైభవం

» రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాల్లో సోమవారం గంగాభవానీ సమేత కైలాసనాథుడు బంగారు శేషవాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు. కైలాసనాథుడి దేవేరి అయిన పార్వతీదేవి బంగారు యాళివాహనంపై స్వామివారిని అనుసరించారు. వినాయకస్వామి మూషికవాహనం పైన, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై వారి వెంట వెళ్లారు. స్వర్ణకాంతులతో దేదీప్యమానమై వెలుగుతూ పురవిహారం చేస్తున్న స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఇక మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి మాణిక్యాలరావు ముక్కంటికి పట్టువస్త్రాలను అందజేశారు.

మెట్టుగూడగిరిపై గిరిజనుల దీక్ష

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 12: శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో గిరిజన సమస్యల పరిష్కారం కోసం గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం గిరిజన దీక్ష చేపట్టారు. బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా 41 రోజులుగా గిరిజనులు వివిధ దశల్లో పోరాటం చేస్తున్నారు. అయినా.. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో 'గిరిజన దీక్ష' పేరుతో ఆదివాసీలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ముందుగా ఐటీడీఏ కార్యాలయ ముఖద్వారం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం తెలియజేసి అడవితల్లి విగ్రహం వద్దనివాళులర్పించారు. అనంతరం మెట్టుగూడ వద్దకు ర్యాలీగా వెళ్లి దీక్ష చేపట్టారు. పాలకొండ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో 1,250 గిరిజన గ్రామాలున్నప్పటికి 108 గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతాల్లో చేర్చడం శోచనీయమన్నారు.



'ఐఆర్ఆర్'కు నోటిఫికేషన్ ఇవ్వండి

» పూలింగ్‌లో 8వేల ఎకరాల సమీకరణకు సీఎం ఆదేశాలు

» అమరావతి నిర్మాణానికి 500కోట్లకు మసాలా బాండ్లు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్డు(ఐఆర్ఆర్)కు సంబంధించిన సర్వే పూర్తయినందున దానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబు ఏపీసీఆర్డీయేను ఆదేశించారు. వెలగపూడిలోని సీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సీఆర్డీయే సమీక్ష సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు ఇతర కీలకాంశాలపై చర్చ జరిగింది. 97.50కి.మీ. పొడవుతో ఏర్పాటై, కృష్ణా- గుంటూరు జిల్లాల్లోని 41 గ్రామాలతో పాటు విజయవాడ, అమరావతి చుట్టూ సాగే ఈ రహదారికి, దీనితో రాజధానిని అనుసంధానించే క్యాపిటల్ సిటీ రోడ్ల పొడిగింపు కోసం సుమారు 8,000 ఎకరాలను సమీకరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ భూములను పూలింగ్ పద్ధతిలో తీసుకోవాలని, అలా ఇచ్చేందుకు అంగీకరించని వారినుంచి భూసేకరణ విధానం ద్వారా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అమరావతి నిర్మాణానికి అవసరమయ్యే నిధుల్లో రూ.500కోట్లను మసాలా బాండ్ల ద్వారా సమీకరించుకునేందుకు ముఖ్యమంత్రి అనుమతినిచ్చారు. ఎస్.పి.బి. సంస్థ ఈ ప్రక్రియను చేపట్టనుందని అధికారులు తెలిపారు. రాజధానిలో ఐటీ రంగం వేళ్లూనుకునేందుకు వీలుగా అక్కడ 5.50ఎకరాల్లో రూ.284 కోట్లతో రెండు భారీ టవర్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. రాజధానిలోని 400, 220 కె.వి. విద్యుత్తు లైన్లను మార్చేందుకు రూ.1,370 కోట్లతో చేపట్టనున్న పనులకూ సీఎం అనుమతించారు. రాజధానిలో నిర్మిస్తున్న రహదారులను వర్షాకాలానికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు.

డస్సాల్ట్ సిస్టమ్స్ అధికారులతో చర్చలు

విజయవాడలో ఏప్రిల్ 10నుంచి 12వరకూ నిర్వహించనున్న హ్యాపీ సిటీస్ సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో చర్చించారు. అలాగే దావోస్‌లోని ఎకనమిక్ ఫోరమ్‌లో తనను కలసిన డస్సాల్ట్ సిస్టమ్స్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు వర్చువల్ 3డీ సిటీ ప్రతిపాదలను వివరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, హ్యాపీ సిటీస్ సదస్సులో వర్చువల్ 3డీ సిటీకి సంబంధించి డెమోను ఇవ్వాలని డస్సాల్ట్ సిస్టమ్స్ అధికారులను కోరారు.



అమరావతిలో సమీకృత బిజినెస్ పార్క్!

» 20 ఎకరాల్లో ఏర్పాటుకు సీఆర్డీయే ప్రతిపాదన

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిలో ప్రపంచస్థాయి ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్క్ ఏర్పాటుకు ఏపీసీఆర్డీయే ప్రతిపాదించింది. ఆర్థిక కార్యకలాపాలతో పాటు నివాసం, వినోదం, అద్భుత రుచులనందించే ప్రదేశంగా దీన్ని అభివృద్ధి చేయనుంది. 20 ఎకరాల్లో, రాజధానిలోని పలు కీలక ప్రాజెక్టులకు చేరువలో, విజయవాడ, మంగళగిరి, గుంటూరుకు అందుబాటులో ఈ బిజినెస్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. సువిశాలమైన ఖాళీ స్థలాలు, ఆహ్లాదం గొలిపే పచ్చదనం మధ్య ఎనిమిది అంతస్తుల భవనాలు, మొత్తం 50.80 లక్షల చదరపుటడుగుల నిర్మాణ స్థలంతో రూపుదిద్దుకునే దీని ఏర్పాటుకు మొత్తం రూ.1,872 కోట్లు వ్యయమవుతుందని అంచనా. ఇది పూర్తయితే దీనిద్వారా 20వేల నుంచి 30వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఏడాదికి రూ.700 కోట్ల నుంచి రూ.800కోట్ల ఆదాయం లభిస్తుందని భావిస్తున్నారు. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఆర్థిక కార్యకలాపాలు, అదీ అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగేందుకు వీలుగా ప్రతిపాదించిన ఈ బిజినెస్ పార్కులో 4 ప్రాంతా(డిస్ట్రిక్ట్)లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవి కార్పొరేట్ (10.10లక్షల చ.అ.), రెసిడెన్షియల్ (20.80లక్షల చ.అ.), మీడియా (10.10 లక్షల చ.అ.) రెడ్ (ఆహారం- 8లక్షల చ.అ.). వీటిలో కొన్ని స్థలాలను వాటి నిర్మాణ వ్యయానికి అనుగుణమైన ధరలకు విక్రయించాలని, మరికొన్నింటిని నెలవారీ లీజు ప్రాతిపదికన ఆసక్తి ఉన్న సంస్థలకు ఇవ్వాలని సీఆర్డీయే ప్రతిపాదించింది. వీటి అమ్మకం ద్వారా రూ.1,521 కోట్లు, లీజుల ద్వారా రూ.1,344 కోట్లు లభిస్తాయని అంచనా వేశారు. పార్క్ నిర్మాణ వ్యయంలో రూ.563 కోట్లు విదేశీ సంస్థల నుంచి సమీకరించాలని, మరో రూ.282 కోట్లు ఈక్విటీ రూపంలో సమకూర్చుకోవాలని నిర్ణయించారు. పేరుకు తగ్గట్టుగానే ఈ పార్క్‌లో ఐటీ, ఫైనాన్స్, టెలికం, మీడియా (కంటెంట్ ప్రొడక్షన్, బ్రాడ్‌కాస్టింగ్, డిజిటల్ మీడియా తదితరాలు), మూవీ స్టూడియో, ట్రైనింగ్ అకాడమీ, దేశ, విదేశీ వంటకాలను అందించే ఆహారశాలలు, రిటైల్, వినోదం తదితరాలు సువిశాలమైన ప్రాంగణాల్లో కొలువుదీరనున్నాయి. కార్యాలయాలకు నడిచి చేరుకునేందుకు వీలుగా ఆఫీస్ స్పేసెస్‌ను ఏర్పాటు చేస్తారు. దీనికోసం అందరికీ అనువుగా ఉండే ప్రదేశాన్ని సీఆర్డీయే ప్రతిపాదించింది. 1,345 ఎకరాల్లో నిర్మితమవుతున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు దిగువన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఎన్.ఐ.డి, విట్, ఎస్.ఆర్.ఎం.లకు సమీపంలో ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి విజయవాడకు 20 కిలోమీటర్లు, మంగళగిరి 35 కి.మీ., గుంటూరు 52 కి.మీ. దూరంలో ఉన్నాయి.

ర్యాగింగ్‌ను అణిచేయండి!

» నిట్‌లో ర్యాగింగ్‌పై కేంద్రం తీవ్ర హెచ్చరిక

» ఒక విద్యార్థి అడ్మిషన్ రద్దు.. ఐదుగురిపై సస్పెన్షన్ వేటు

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో ఇటీవలి ర్యాగింగ్ ఉదంతాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. బాధ్యులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. చర్యలు తీసుకోని పక్షంలో నిధులు ఆపేస్తామని హెచ్చరించింది. బిహార్ విద్యార్థిపై ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై ప్రాథమికంగా తీసుకున్న చర్యలను నిట్ వర్గాలు కేంద్రానికి పంపించాయి. అప్పట్లో ఐదుగురు విద్యార్థులను 40 రోజులపాటు సస్పెండ్ చేశారు. దీనిపై సంతృప్తి చెందని కేంద్రం, ర్యాగింగ్‌కు పాల్పడ్డ విద్యార్థులపై మరింత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. దీంతో నిట్ వర్గాలు రంగంలోకి దిగాయి. వాస్తవానికి ఈనెల 2న బిహార్‌కు చెందిన ప్రథమ సంవత్సర విద్యార్థిపై 15 మంది ఏపీ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ఇది కాస్తా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ భేదాలుగా మారిపోయింది. ఉత్తరాదికి చెందిన విద్యార్థులు ధర్నాకు దిగారు. ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు సమాచారమందించారు. సీసీ కెమేరా ఫుటేజీలను పరిశీలించి, నిందితులను గుర్తించింది. దీనిపై ర్యాగింగ్ హెల్ప్‌లైన్ సైతం స్పందించింది. కేంద్రానికి, డీజీపీకి సమాచారమందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. అయితే, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్రం నిట్‌కు ఘాటుగా లేఖ రాసింది. ర్యాగింగ్‌ను అణిచేయాలని, బాధ్యులపై ఉక్కుపాదం మోపాలని సూచించింది. దీంతో నిట్ అధికారులు మొత్తం 15 మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. అందులో ఒక విద్యార్థి అడ్మిషన్‌నే రద్దు చేశారు. మరో ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. మిగిలిన 9 మంది విద్యార్థులకు హాస్టల్ వసతిని రద్దు చేశారు. ర్యాగింగ్‌ను నిరోధించకపోతే నిట్ బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, అందుకే తగుచర్యలు తీసుకున్నామని నిట్ అధికారి ఒకరు తెలిపారు.

జూన్ నుంచి ఎయిమ్స్ తరగతులు

విజయవాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ నుంచి ఎయిమ్స్ తరగతులు ప్రారంభిస్తున్నట్టు మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. విజయవాడలో సోమవారం జరిగిన మహిళల ఆరోగ్య భద్రతపై ఆరోగ్య దీప్తి కార్యక్రమంలో కామినేని మాట్లాడుతూ, గతంలో సీఎం చంద్రబాబు చేపట్టిన సంస్కరణల వల్ల రెండు రాష్ట్రాల పరిధిలో 22 మెడికల్ కాలేజీలు ఉండేవన్నారు. ప్రస్తుతం కొత్త రాష్ట్రంలో ఎక్కువ కాలేజీల ఏర్పాటుకు చంద్రబాబే కారణమని తెలిపారు. త్వరలో అమరావతిలో కొత్తగా అత్యాధునిక వసతులతో ఎయిమ్స్ భవనాలు నిర్మిస్తున్నామని, నిర్మాణాలు పూర్తికావడానికి ఆలస్యమవుతున్నందున తాత్కాలికంగా విజయవాడలో జూన్ నుంచి తరగతులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఏడాదికి రూ.1450 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు చెప్పారు.

బాలుడిపై మరో బాలుడి లైంగికదాడి

మాచర్ల, ఫిబ్రవరి 12: బాలుడిపై మరో బాలుడు లైంగికదాడి చేసిన సంఘటన గుంటూరు జిల్లా మండల కేంద్రమైన కారంపూడి యానాది కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు ఇంటిముందు ఆడుకొంటుండగా నరసింహారావు అనే బాలుడు మేకపాలు పిండుదాం రమ్మని చెప్పి తన ఇంటికి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లెలినే చెరబట్టాడు

తక్కెళ్లపాడు, ఫిబ్రవరి 12: గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం తక్కెళ్లపాడులో నివసించే ఓ వివాహితుడు మూడు నెలల క్రితం సొంత బాబాయి కుమారెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆమె గర్భవతి అని డాక్టరు నిర్ధారించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

థామస్‌కు అండగా ఉంటాం

» మానవతావాదులను కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

» శస్త్రచికిత్సకు సాయం చేస్తామని ఫోన్లు

చిత్తూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 12 : థామస్ దైన్యస్థితికి పలువురు చలించారు...ఆపన్న హస్తం అందించడానికి సిద్ధంగా ఉన్నామంటూ ముందుకొచ్చారు. 'ఊపిరి తీస్తున్న రోగం... సాయం కోసం ఓ కుటుంబం వేడుకోలు' శీర్షికన చిత్తూరు జిల్లా గుడిపాల మండలం పొల్‌పురం గ్రామానికి చెందిన థామస్ దీనగాథ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఊపిరితిత్తులు పాడై, గుండె పనితీరు దెబ్బతిని, చికిత్సకోసం రూ.40లక్షలు భరించలేక ఇంట్లోనే మృత్యువుతో పోరాడుతున్న థామస్ దీనగాథను చదివిన పలువురు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. అతని మేనమామ యేసయ్యకు చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, మచిలీపట్నం ప్రాంతాల నుంచి 15 మంది ఫోన్లు చేసి వివరాలు తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు పీఏ మనోహర్ ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాయానికి అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకొని తమను కలిస్తే ప్రభుత్వం తరపున సాయమందిస్తామని సూచించారు. మిగిలిన వారంతా సాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్టు చెప్పారని బాధితుడి మేనమామ ఏసయ్య తెలిపాడు. కాగా, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి సోమవారం తిరుపతి 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఫోన్ చేసి.. కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందిన ఏదైనా ఆస్పత్రి నుంచి శస్త్ర చికిత్సకు వైద్యుల ధ్రువీకరణ పత్రంతో పాటు అవసరమైన పత్రాలు అందిస్తే ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి సాయం మంజూరు చేయిస్తానన్నారు.

మార్చి 31లోగా చట్టబద్ధత కల్పించాలి: ముద్రగడ

కావలిటౌన్, ఫిబ్రవరి12 : కాపులకు బీసీ రిజర్వేషన్లపై మార్చి 31 లోగా చట్టబద్ధత కల్పించాలని, లేకపోతే మరో ఉద్యమం తప్పదని కాపు రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం హెచ్చరించారు. నెల్లూరు జిల్లా కావలిలో సోమవారం ఆయన కాపు నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...రాష్ట్రంలో కాపుల పల్స్ సర్వే మళ్లీ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కాపు రిజర్వేషన్ ఉద్యమంలో భాగంగా వైసీపీ అధినేత జగన్‌ను కలసి మద్దతు కోరినందుకు ముఖ్యమంత్రి తనను అంతర్జాతీయ తీవ్రవాదిగా చూస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో పవన్ కల్యాణ్‌ను రోడ్డుపైకి లాగారని, ప్రత్యేకహోదా సాధించే విషయంలో పవన్‌కల్యాణ్, తాను బచ్చాలమని అన్నారు.

రేషన్ అక్రమాల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

» మంత్రి ప్రత్తిపాటి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ వేలు ముద్రలు పడటం లేదంటూ రేషన్ ఎగవేతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ 15 రోజుల నుంచి 20 రోజులకు పెంచుతున్నట్టు వివరించారు.

రేపు యూసీఐఎల్‌కు సీఎండీ రాక

పులివెందుల, ఫిబ్రవరి 12: యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్)కు సీఎండీ అన్సారీ బుధవారం రానున్నారు. యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ కాలుష్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో శనివారం 'యురేనియం టెర్రర్' శీర్షికన, ఆదివారం జిల్లా సంచికలో 'మరణశాసనమే' అనే శీర్షికతో కథనాలు వెలువడ్డాయి. యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ నాసిరకం నిర్మాణం కారణంగానే అనర్థాలు సంభవిస్తున్నట్టు ప్రజల నుంచి ఆరోపణలు ఎదురవుతున్నాయి. ఈ సందర్భంలో సీఎండీ రాక ప్రాధాన్యం సంతరించుకుంది.

గుంటూరు-గుంతకల్ విద్యుదీకరణ పూర్తి

» విజయవంతంగా ట్రయల్ రన్

కురిచేడు, ఫిబ్రవరి 12: గుంటూరు-గుంతకల్ రైల్వే మార్గంలో త్వరలో విద్యుత్ రైళ్లు నడవనున్నాయి. నంద్యాల సమీపంలోని దిగువమెట్ట వద్ద బొగద సొరంగం వద్ద విద్యుదీకరణ పూర్తి కావడంతో ఆదివారం పాణ్యం నుంచి దిగువమెట్ట వరకూ విద్యుత్ రైలుతో ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. త్వరలో దక్షిణ మధ్య రైల్వే భద్రతా కమిషనర్ శ్రీరామ్ కృపాల్ ఈ విద్యుత్ రైలు మార్గాన్ని పరిశీలించనున్నారు. ఆయన ఆమోద ముద్రతో ఈ నెలాఖరు లేదా మార్చి మొదటివారం నుంచి గుంటూరు-గుంతకల్ మార్గంలో పూర్తి స్థాయిలో విద్యుత్ రైళ్లు నడిచే అవకాశముంది.

అంతర్జాతీయ 'ఎర్ర' స్మగ్లర్ తషిషెర్ప అరెస్ట్

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 12: నేపాల్‌కు చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ తషిషెర్ప, కర్ణాటకకు చెందిన స్మగ్లర్ బీటీఎం నజీర్‌ను తిరుపతి అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి తెలిపిన వివరాలు.. నేపాల్ రాజధాని ఖాట్మండుకు చెందిన తషిషెర్ప అలియాస్ మహ్మద్‌ఇషాక్, బెంగుళూరులోని అరెకేరెకు చెందిన బీటీఎం నజీర్ ఆదివారం ఓ కారులో ఎర్ర దుంగలను స్మగ్లింగ్ చేసుండగా రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేసి, కారుతో పాటు ఆరు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిచ్చిన సమాచారం మేరకు రామచంద్రాపురం ఎస్ఐ భాస్కర్‌నాయక్, అర్బన్ పోలీస్ ప్రత్యేక బృందం మైసూరు చేరుకుని ఓ గోడౌన్‌పై దాడి చేసి రూ.కోటిన్నరకుపైగా విలువజేసే ఒకటిన్నర టన్నుల బరువైన 45 ఏ క్లాస్ దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక, తమిళనాడుకు చెందిన మరికొంత మంది స్మగ్లర్లను పట్టుకునేందుకు వేట ప్రారంభించామని ఎస్పీ మహంతి తెలిపారు. నజీర్‌ను పది స్మగ్లింగ్ కేసుల్లో నిందితుడిగా గుర్తించామన్నారు. స్థానికంగా ఎర్రచందనం దుంగలను సేకరించి బెంగుళూరులోని గోడౌన్లలో నిల్వ చేస్తాడన్నారు. వీటిని తషిషెర్ప నేపాల్, వియత్నాం, మలేషియా దేశాలకు ఎగుమతి చేస్తాడన్నారు. గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలద్వారా ఎర్రచందనాన్ని తరలిస్తున్నట్టు విచారణలో తెలిసిందన్నారు.


యూజీసీ ప్రతిపాదనలు

ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళించే దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చేస్తున్న ప్రయత్నం అభినందించదగినది. వర్సిటీలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల్లో బోధన సిబ్బంది నియామకాలకు సంబంధించి యూజీసీ మార్గదర్శకాలు రూపొందించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు పీహెచ్‌డీని తప్పనిసరి చేయడంనుంచి వివిధ ఉద్యోగాల భర్తీలోనూ, పదోన్నతుల్లోనూ పాటించాల్సిన నియమాలను, పరిగణనలోకి తీసుకోవాల్సిన అర్హతలను యూజీసీ ఈ ముసాయిదాలో సూచించింది. ముసాయిదాను తన వెబ్‌సైట్‌లో ఉంచిన యూజీసీ, ఈ నెల 28లోగా వర్సిటీలు, కాలేజీలనుంచి అందిన సూచనలు, అభిప్రాయాలమేరకు మార్పు చేర్పులు చేసి తుదిమార్గదర్శకాలను విడుదల చేస్తానని చెబుతున్నది.

'యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ ఆన్ మినిమమ్ క్వాలిఫికేషన్స్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ టీచర్స్ అండ్ అదర్ ఎకడమిక్‌స్టాఫ్ ఇన్ యూనివర్సిటీస్ అండ్ కాలేజెస్, అండ్ మెజర్స్ ఫర్ ది మెయింటెనెన్స్ ఆఫ్ స్టాండర్డ్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్–2018' అనే సుదీర్ఘమైన శీర్షికతో ఈ ముసాయిదా అందుబాటులో ఉన్నది. ఉన్నత విద్యారంగంలో బోధనా ప్రమాణాలు దిగజారిపోతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, వాటిని నిలబెట్టడమే లక్ష్యంగా మార్గదర్శకాలను రూపొందించినట్టు యూజీసీ చెబుతున్నది. ఇప్పటివరకూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులో నియామకం కోసం అభ్యర్థికి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) లేదా స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) లేదా పీహెచ్‌డీ ఉంటే సరిపోయేది. 2021జులై 1 తరువాత చేపట్టబోయే నియామకాలకు నెట్ లేదా సెట్‌తో పాటు పీహెచ్‌డీ కూడా తప్పనిసరిగా ఉండాలని యూజీసీ అంటున్నది. జ్ఞాపకశక్తికి ప్రాధాన్యం ఇచ్చే అర్హత పరీక్షలతో పాటు పరిశోధన జ్ఞానానికి కూడా పెద్ద పీట వేయాలన్నది యూజీసీ ఆలోచన కావచ్చు. ఈ అర్హత పరీక్షల్లో ఏదో ఒకదానిని దాటుకొచ్చేవారి సంఖ్యతో పోలిస్తే, పీహెచ్‌డీలు పూర్తిచేసిన వారి సంఖ్య స్వల్పంగా ఉన్నది కనుక నియామకాలపై ఈ ప్రతిపాదన ప్రభావం అధికంగానే ఉంటుందని విద్యారంగ నిపుణులు అంటున్నారు. సీనియర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అసోసియేట్, ప్రిన్సిపాల్ ఇత్యాది పోస్టుల భర్తీలో, పదోన్నతిలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అర్హతలు, పాటించాల్సిన నియమాల విషయంలోనూ యూజీసీ కొన్ని ఆంక్షలు ముందుకు తెచ్చింది. కనీస పనిదినాలు, రోజువారీ పనిగంటలు, సెలవులు, అకడిమిక్ అంశాలకు సంబంధించిన యూజీసీ ఆలోచనలను అటుంచితే, ఒక విద్యాసంస్థలో మంజూరైన మొత్తం పోస్టుల్లో తాత్కాలిక అధ్యాపకులు పదిశాతానికి మించకూడదన్న నియమం విశేషమైనది. అలాగే, ఏ పేరుతో పిలుస్తున్నప్పటికీ ఈ తాత్కాలిక అధ్యాపకులకు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు ఇవ్వాల్సిందేనన్న నియమం ప్రశంసించదగినది. యూనివర్సిటీల్లోనూ, కాలేజీల్లోనూ కాంట్రాక్టు ఫ్యాకల్టీయే అత్యధికశాతం ఉన్న వాతావరణంలో యూజీసీ నిబంధనలు వాటికి పెద్ద పరీక్షే. ప్రభుత్వాల పుణ్యమాని 60నుంచి 70శాతం వివిధస్థాయి అధ్యాపక పోస్టులు భర్తీకాకుండా ఖాళీగా మిగిలిన స్థితిలో, వేర్వేరు పేర్లతో కాంట్రాక్టు ప్రాతిపదికన దశాబ్దాలుగా పనిచేస్తున్న అధ్యాపకులే అధికం. రెగ్యులర్ సిబ్బందితో సమానంగా పనిచేస్తున్నా, పేరు కారణంగా తాము నామమాత్రపు వేతనాలతో దినసరి కూలీలుగా మిగిలిపోతున్నామన్నది వారి వేదన. ఇకపై వీరి సంఖ్య 10శాతానికి మించకూడదన్న నియమం, సమానవేతనాలన్న యూజీసీ ప్రతిపాదన కచ్చితంగా వీరికి న్యాయం చేకూరుస్తుంది. అయితే, భవిష్యత్ నియామకాలకు హేతుబద్ధతనూ, న్యాయాన్నీ చేకూర్చే ఆలోచన చేస్తున్న యూజీసీ, దశాబ్దాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారి విషయంలో దృష్టిపెట్టినట్టు లేదు. బోధనానుభవం విస్తృతంగా ఉన్న తమను రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వాలకు మొరబెట్టుకోవడం, వేర్వేరు కారణాల రీత్యా వారి కోరిక నెరవేరకపోవడం చూస్తున్నదే. కొన్ని రాష్ట్రాలు రెగ్యులర్ నియామకాలు చేపట్టే ప్రయత్నం చేసినప్పుడల్లా కాంట్రాక్టు అధ్యాపకులు న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఆ ప్రక్రియ తాత్కాలికంగానైనా నిలిచిపోతుండటం జరుగుతున్నదే. ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళించాలన్న సంకల్పం ప్రశంసించవలసిందే కానీ, దశాబ్దాలుగా దానిని అధ్వాన్నస్థితిలోకి నెట్టివేసిన నేపథ్యంలో, అది మరింత లోతుగా జరిగినప్పుడే అసలు లక్ష్యం నెరవేరుతుంది.

నివాళి

మన రాజకీయ చరిత్రకారుడు



జి. వెంకటరామారావు
(14.02.1935 – 11.02.2018)

ఎనభై రెండేండ్ల ప్రాయంలోనూ యువకులతో పోటీ పడుతూ చురుకుగా రచనలు చేస్తోన్న పరిశోధనాత్మక రచయిత, చరిత్రకారుడు గోవిందు వెంకటరామారావు ఆదివారం రాత్రి (ఫిబ్రవరి 11వతేదీ) ఆకస్మికంగా మరణించారు. జర్నలిజం తన వృత్తికాకపోయినా, జర్నలిస్టులతో సమానంగా రాజకీయాలను, సమకాలీన సాంఘిక, ఆర్థిక పరిణామాలను నిరంతరం అధ్యయనం చేస్తూ సాధికారికంగా, సరళమైన శైలిలో సామాన్య ప్రజానీకం కోసం ఆయన రచనలు చేశారు. చివరి రోజులదాకా రచనా వ్యాసంగాన్ని కొన సాగిస్తూనే ఉన్నారు. చివరి రచన మార్చ్ సంచిక 'తెలంగాణ'లో ప్రచురణకు సిద్ధంగా ఉంది. తెలుగులోని దాదాపు అన్ని ప్రతికల్లో సుమారు రెండువేల వ్యాసాల దాకా రాసారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మాధాపురంలో 1935 ఫిబ్రవరి 14వ తేదీన ఆయన జన్మించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. మన చరిత్ర, సంస్కృతి, రాజకీయాలకు సంబంధించిన రచనలు చేయడంలో, రెండు తెలుగు రాష్ట్రాల చరిత్రలోని ప్రధాన ఘట్టాలను ఈ తరానికి పరిచయం చేయడంలో, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రలను వక్రీకరించకుండా రాయడంలో గొప్ప కృషి చేశారు. రచనా వ్యాసంగంతో వటవృక్షంలా విస్తరించిన ఆయనను ప్రభుత్వం గుర్తించి గౌరవించకపోవడం బాధాకరం. చంద్రునికో నూలుపోగులా గత డిసెంబర్ 10వ తేదీన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి రావిచెట్టు రంగారావు 141 జయంతిని పురస్కరించుకుని 'రావిచెట్టు రంగారావు తెలుగు భాషా వికాస పురస్కారం' ప్రదానం చేశారు. ప్రభుత్వ విద్యాశాఖలో 38 సంవత్సరాలు పనిచేసి 1993లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. చదివింది ఉర్దూ మీడియంలో అయినా తెలుగు భాషపట్ల మక్కువతో తమ కళాశాల వార్షిక సంచిక 'తెలుగు వీణ'కోసం కథానిక రచించారు. అలా కాల్పనిక రచనతో రచనకు శ్రీకారం చుట్టిన ఆయన ఆ తర్వాత కాలంలో చరిత్ర, సమకాలీన సాంఘిక, ఆర్థిక అంశాలను కూలంకషంగా అధ్యయనం చేసి 1965నుండి గత ఐదు దశాబ్దాలుగా పుంఖానుపుంఖాలుగా రచనలు చేశారు. తెలుగువారి నిజమైన చరిత్రకు, సంస్కృతికి తన రచనల ద్వారా అక్షరరూపమిచ్చిన ఆయన ధన్యులు.

■ టి. ఉడయవర్లు

'రైతు బడ్జెట్' ఓ రాజకీయ గారడీ!


కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశ పెడుతూ, 'ఈ బడ్జెట్ ప్రత్యేకంగా వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయుటపై దృష్టి పెట్టిందని' పేర్కొన్నారు. వ్యవసాయ పంటలకు ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం ఎంఎస్‌పీగా ఇవ్వటాన్ని ఒక సూత్రంగా అమలు చేస్తామనీ, 2017–18లో దీనిని రబీలో అమలు చేశామనీ, ఇది రైతుల ఆదాయం రెట్టింపు చేసే దిశగా చరిత్రాత్మక నిర్ణయమనీ ప్రకటించారు. ఎంఎస్‌పీకి ఇదొక ముఖ్యమైన అడుగనీ, ఎంఎస్‌పీని పెంచుతూ ప్రకటించడమే సరిపోదనీ, దీని పూర్తి లాభం రైతులు పొందేటట్లుగా చేయాలనీ, అందుకు మార్కెట్లో ధరలు ఎంఎస్‌పీ కంటే తగ్గినప్పుడు, ప్రభుత్వమే మార్కెటులో జోక్యం చేసుకొని సేకరిస్తుందనీ, లేక మరొక విధమైన యంత్రాంగం ద్వారా ఎంఎస్‌పీ కంటే తగ్గిన ధర వ్యత్యాసాన్ని రైతుకు నేరుగా అందచేస్తామనీ ప్రకటించారు. గత 4 సంవత్సరాలుగా ఎన్నికల ప్రణాళికలో 'వ్యవసాయ పంటలకు ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం లాభం వుండేటట్లుగా ఎంఎస్‌పీ నిర్ణయిస్తామని' చేసిన వాగ్దానాన్ని పూర్తిగా విస్మరించింది. ఆచరణలో ఈ వాగ్దానం అమలు సాధ్యం కాదని సుప్రీం కోర్టుకు తెలియచేసింది. ఆ విధమైన వాగ్దానాన్ని మోడీ చేయలేదని పార్లమెంటులో కూడా 2017 జులైలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి బుకాయించారు. దేశంలోని అన్ని రైతు సంఘాలు కలిసి, ఏర్పరిచిన ఐక్యవేదిక ఏఐకేఎస్‌సీసీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన 'ఉత్పత్తి ఖర్చులపై (సి2+50) గిట్టుబాటు ధర ఇవ్వాలి' అని డిమాండ్ చేస్తూ గత 7నెలలుగా జరిపిన ఆందోళనల ఒత్తిడి, గుజరాత్, రాజస్థాన్ ఉప ఎన్నికల్లో ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం దిగి వచ్చి, పంటల ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం అదనంగా ఎంఎస్‌పీ నిర్ణయిస్తామనీ, మార్కెట్లో ఎంఎస్‌పీ కంటే ధరలు తగ్గితే వ్యత్యాసాన్ని రైతుకు ప్రభుత్వం చెల్లిస్తుందని విధానపరంగా, సూత్రరీత్యా అంగీకరిస్తూ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటన చేయడం ఆహ్వానించ తగిన పరిణామం.

పంటల ఉత్పత్తి ఖర్చుపై అదనంగా 50 శాతం ఎంఎస్‌పీగా నిర్ణయించటం సూత్ర రీత్యా అంగీకరించినప్పటికీ, ఎంఎస్‌పీ నిర్ధారణకు సమగ్రమైన ఉత్పత్తి ఖర్చు సి2 కాకుండా, కొన్ని ఖర్చులను మినహాయించి ఏ2+ఎఫ్ఎల్‌ను ప్రాతిపదికగా తీసుకుంటామని వివరణ ఇస్తున్నారు. అంతేగాక, ఉత్పత్తి ఖర్చులపై 50శాతం అదనంగా ఎంఎస్‌పీ నిర్ణయించే విధానం రబీ పంటలనుండే అమలు చేసినట్లుగా ప్రకటించారు. ఇది పూర్తిగా అబద్ధం. రబీ నుండే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామనే ప్రకటన పూర్తిగా అవాస్తమని, బీజేపీ అనుబంధ సంఘం భారతీయ కిసాన్ సంఘ్‌తో సహా, దేశంలోని అన్ని రైతు సంఘాలూ ప్రకటించాయి. ఒకవేళ, అరుణ్ జైట్లీ ప్రకటన వాస్తవమైతే, ఇప్పటి వరకు మోదీ ప్రభుత్వం కానీ, బీజేపీ నాయకులుకానీ ఎందుకు ప్రకటించలేదు? ఎంఎస్‌పీ నిర్ధారణ ఏ2+ఎఫ్ఎల్ ప్రాతిపదిక అయితే, యూపీఏ హయాంలో 4 సంవత్సరాలు (2009–2014) సగటున 69 శాతం పెరగగా, ఎన్డీఏ 4సంవత్సరాల (2014–18)లో సగటున 39శాతం మాత్రమే పెరిగింది. యూపీఏ అప్పటికే ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం పైగా ఇస్తున్నప్పుడు బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో చేర్చి, మోదీ ఎందుకు ప్రచారం చేసినట్లు? 2015 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50శాతం ఎంఎస్‌పీగా ఇవ్వటం సాధ్యం కాదని ఎందుకు తెలియచేసింది? 2014లో అధికారానికి వచ్చిన మోదీ ప్రభుత్వం పెంచిన ఎంఎస్‌పీ, యూపీఏ2 కంటే తక్కువగా వుంది. అందరూ డిమాండ్ చేసిందీ, స్వామినాథన్ కమిషన్ డిమాండ్ చేసిందీ సి2 పై 50 శాతం నికర లాభం కలపాలనే. ఇప్పుడు ప్రజలను, ప్రత్యేకంగా రైతాంగాన్ని మభ్యపరిచి, మోసం చేయటానికే ప్లేటు ఫిరాయించి, మోదీ ప్రభుత్వం నాటకలాడుతోంది.

వ్యవసాయ పంటలన్నింటికీ కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం లేదు. కేవలం 23 పంటలకు కనీస మద్దతు ధర, చెరుకుకు చట్టబద్ధ మద్దతు ధరను నిర్ణయించడం జరుగుతోంది. ఎంఎస్‌పీ నిర్ణయించటానికి, ఉత్పత్తి ఖర్చులను ఒక ముఖ్యమైన ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతోంది. ఉత్పత్తి ఖర్చును లెక్క వేసే పద్ధతి అత్యంత లోపభూయిష్టంగా వుంది. ఎంఎస్‌పీని నిర్ధారించటానికి ఉత్పత్తి ఖర్చులు అంచనా కొరకు అనుసరిస్తున్న పద్ధతిలో సమస్యలను పరిశీలించటానికి ఏప్రిల్ 2013 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం నియమించిన రమేష్ చంద్ కమిటీ తన నివేదికను మార్చి 2015లో కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. ఎంఎస్‌పీని నిర్ధారించే పద్ధతిలో 23 లోపాలు గుర్తించి, వాటిని సవరించాలని సిఫారసు చేసింది. వ్యవసాయ కుటుంబ యజమాని శ్రమకు సాధారణ కూలి వేతనం కాకుండా, నిపుణుడైన శ్రామికుడి వేతనం వుండాలి; యాజమాన్య నిర్వహణ, ధైర్యంగా, తెగింపుతో నిర్ణయాలు తీసుకున్నందుకు సి2పై వ్యవసాయదారుని వేతనం 10శాతం అదనంగా ఇవ్వాలి; ఉత్పత్తి ఖర్చులు అంచనా వేయాటనికి గత 3 సంవత్సరాల్లో సగటు ఖర్చు, ఉత్పత్తి పరిగణలోకి తీసుకోవడం జరుగుతోంది, ఈ సందర్భంలో వర్తమాన సంవత్సరంలో పెరిగే ఉత్పాదకాల ధరలు, ద్రవ్యోల్బణం పరిగణలోకి తీసుకోవాలి, పంటల కోతల తర్వాత అయ్యే ఖర్చు.. శుభ్రం చేయుట, గ్రేడింగు చేయుట, ఆర బెట్టుట, రవాణా ఖర్చులు, తదితర ఖర్చులను కూడా ఉత్పత్తి ఖర్చులో చేర్చాలి– మున్నగు సిఫార్సులు చేసింది. ఎంఎస్‌పీ నిర్ధారణలో లోపాలు సరిదిద్దితే, ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ఎంఎస్‌పీ 25 శాతం పెరుగుతుందని నిపుణుల అంచనా.

వ్యవసాయ పంటల ఉత్పత్తి ఖర్చులు అంచనా వేయటానికి సీఏసీపీ వివిధ పద్ధతులను అనుసరిస్తోంది. ఇందులో ముఖ్యమైనవి ఏ2+ఎఫ్ఎల్, సీ2లు వున్నాయి. ఏ2, అనగా వ్యవసాయదారుడు ఉత్పత్తిలో పెట్టే అన్ని ఖర్చులు.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీల వేతనాలు, దుక్కిదున్నుట, సాగునీటికయ్యే ఖర్చు, భూమి కౌలు, తదితరాలు వున్నాయి. ఎఫ్ఎల్ అంటే, కుటుంబ సభ్యుల శ్రమ వేతనం. మొత్తం పెట్టుబడి, ఆస్తులపై వడ్డీ సీ2లో చేరుతుంది. ఏ2 +ఎఫ్ఎల్‌లపై ఆదాయాన్ని స్థూల ఆదాయం అనీ, సీ2పై వచ్చే ఆదాయాన్ని నికర లాభంగా పేర్కొంటున్నారు. దీర్ఘకాలంగా రైతు సంఘాలు సీ2పై నికర లాభాన్ని కోరుతున్నారు. స్వామినాథన్ కమిషను కూడా సీ2పై 50 శాతం అదనంగా నికర ఆదాయం ఇవ్వాలని కోరింది. అందరూ మొత్తం ఉత్పత్తి ఖర్చులపై నికర లాభం సీ2+50% కోరుతున్నారు. సీ2ను ప్రాతిపదికగా చేసుకుంటే, వ్యవసాయదారులకు కొంత లాభం వుంటుంది. ఎంఎస్‌పీ నిర్ధారణకు ఏ2+ఎఫ్ఎల్‌ను ప్రాతిపదికగా చేసుకుంటే, వ్యవసాయదారులకు లాభం వుండదు. 2017–18 సంవత్సరం ఖరీఫ్‌లో ధాన్యంకు ఉత్పత్తి ఖర్చులు ఏ2 + ఎఫ్ఎల్ ప్రకారం రూ. 1117లు, సీ2 ప్రకారం రూ. 1484, దీనికి 50శాతం కలిపితే, వరుసగా రూ.1676, రూ. 2226లు అవుతుంది. కానీ, ప్రకటించిన ఎంఎస్‌పీ రూ.1550 మాత్రమే. ఈ విధానం రైతుల ఆదాయం రెట్టింపు చేయటానికి ఎంత మాత్రం తోడ్పడకపోగా, వ్యవసాయంలో సంక్షోభం మరింత పెరుగుతుంది.

'ఎంఎస్‌పీ పెంచటమే సరిపోదు, ఎంఎస్‌పీ ప్రకటన ద్వారా వచ్చే పూర్తి ప్రయోజనం రైతులకు దక్కాలి. మార్కెట్లో ధరలు ఎంఎస్‌పీ కంటే తగ్గితే, ప్రభుత్వమే నేరుగా మార్కెట్‌లోకి వెళ్లి, ఎంఎస్‌పీ ధరకు కొనుగోలు చేయాలి. లేదా, ఇతర యంత్రాంగం ద్వారా వ్యత్యాసాన్ని రైతాంగానికి అందచేయాలి. కేంద్రం, రాష్ట్రాలతో నీతి అయోగ్ సంప్రదించి, లోపాలు లేకుండా యంత్రాంగాన్ని ఏర్పరచాలని' ప్రకటించారు. ఈ ప్రక్రియ ఎంత కాలంలో పూర్తి చేయాలనే దానికి కాల వ్యవధి నిర్ణయించలేదు. అందువల్ల, యంత్రాంగాన్ని ఏర్పరచటానికి సంప్రదింపులు, కమిటీలు, కమిషన్ల పేరిట 2019 సార్వత్రిక ఎన్నికల వరకు కాలయాపన చేసే ప్రమాదం వుంది. కనీసం, వచ్చే ఖరీఫ్ నుండి ఈ పథకాన్ని అమలు చేయటానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి. అయితే, ఈ పథకానికి బడ్జెట్‌లో కేవలం రూ.200కోట్లు మాత్రమే కేటాయించారు. 2017–18 ఖరీఫ్‌లో మార్కెట్లో పంటల ధరలు




> 'రైతుల బడ్జెట్' పేరుతో మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అత్యంత మోసపూరితమైనది. వ్యవసాయదారుల ఆదాయం రెట్టింపు చేయటానికి ఇది తోడ్పడదు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయుటానికి మాత్రమే తోడ్పడుతుంది.

ఎంఎస్‌పీ కంటే, తక్కువగా ధరలు తగ్గడం వల్ల రైతాంగం రూ. 32,700 కోట్లు నష్టపోయిందని అంచనా. కనుక, మార్కెట్లో ధరలు తగ్గినప్పుడు రైతాంగాన్ని ఆదుకొనేందుకు, కనీసం రూ.1లక్ష కోట్లు, 'ధరల స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేయాలి.

2018–19 సంవత్సరానికి వ్యవసాయ రంగానికి కేటాయింపులు కంటి తుడుపుగా వున్నాయి. మొత్తం బడ్జెట్ 13 శాతం పెరగగా, వ్యవసాయ రంగానికీ, అనేక పథకాలకూ కేటాయింపులు తగ్గాయి. మొత్తం బడ్జెట్ పెరుగుదల చూసినా, ద్రవ్యోల్బణం పరిగణనలోకి తీసుకున్నా కేటాయింపులు తగ్గాయి. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయించింది 2.3 శాతం మాత్రమే. ఒక డాలరు విలువ చేసే బియ్యం ఉత్పత్తిలో సబ్సిడీ అమెరికాలో 45 శాతం, యూరపులో 65 శాతం వుండగా, భారతదేశంలో 12 శాతం మాత్రమే వుంది. అయినప్పటికీ, ఉత్పత్తి ఖర్చు తగ్గించటానికి సబ్సిడీలు పెంచలేదు. ఎంఎస్‌పీ కంటే ధరలు తగ్గినప్పుడు 'మార్కెట్లో జోక్యం' పథకానికి కేటాయింపు గత బడ్జెట్‌లో రూ. 950 కోట్లు వుండగా, ఈ ఏడాది కేవలం రూ. 200 కోట్లు మాత్రమే కేటాయించారు. మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు మార్కెట్ జోక్యం పథకం అమలు చేసే బాధ్యత, రాష్ట్రాలపై రుద్దుతున్నట్లుగా వుంది. వడ్డీ రాయితీ పథకానికి కేటాయింపులు ఏమాత్రం పెంచలేదు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని ఒక వైపున రైతులందరికీ కల్పిస్తామని చెపుతూ, కేవలం రూ. 13,000 కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్లను అభివృద్ధి చేయటానికి కేవలం రూ.2000 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపు 1/4 వంతు మార్కెట్లను కూడా అభివృద్ధి చేయటానికి సరిపోదు. ఉత్పత్తి పెంచాలంటే, సాగు నీరు అందించటం ముఖ్యమైనది. ప్రధాన మంత్రి కృషి సించాయ్ పథకానికి గత ఏడాది కేటాయించినది రూ.7377 కోట్లు కాగా, ఈ ఏడాది కొద్దిగా పెంచి, రూ.8851కోట్లు కేటాయించారు. ఇది సాగునీరు కల్పించటానికి, చివరికి ఒక రాష్ట్రానికి కూడా ఎంత మాత్రం సరిపోదు. రాష్ట్రీయ కృషి వికాస్ పథకానికి గత ఏడాది రూ.4500కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.3600 కోట్లకు తగ్గించారు. పర్యావరణ మార్పుల వల్ల 20 నుండి 25 శాతం పంట నష్టం జరుగుతుందని, ఆర్థిక సర్వే పేర్కొన్నది. అయితే, ప్రకృతి వైపరీత్యాల నిధికి, బడ్జెటులో అవసరమైన కేటాయింపులు లేవు. 'రైతుల బడ్జెట్' పేరుతో మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అత్యంత మోసపూరితమైంది. వ్యవసాయదారుల ఆదాయం రెట్టింపు చేయటానికిది తోడ్పడదు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయుటానికి మాత్రం బడ్జెట్ తోడ్పడుతుంది.

■ వేములపల్లి వెంకట్రామయ్య

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

> ద్రవ్యలోటును నియంత్రించాలన్న ప్రపంచ బ్యాంకు విధానాన్ని విడనాడాలి. పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవాలి. భారీ స్థాయిలో మదుపు చేయాలి. ఇలా చేసిన పక్షంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 12 నుంచి 15 శాతానికి పెరగడం ఖాయం.

ద్రవ్యలోటు అదుపు అవశ్యమా?

మొబైల్ ఫోన్లు, మరికొన్ని ఇతర సరుకులపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హెచ్చు దిగుమతి సుంకాలను విధించారు. దేశీయ ఉత్పత్తిదారులకు చౌక దిగుమతుల నుంచి రక్షణ సమకూర్చడానికి, కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించేందుకై దిగుమతి సుంకాలను పెంచడం జరిగింది. భారతీయ పెట్టుబడులు విదేశాలకు తరలిపోవడంపై ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు.

దిగుమతుల పెరుగుదల, విదేశీ పెట్టుబడుల నిష్క్రమణ– ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) తీరుతెన్నులు ఆశించిన విధంగా లేవని సూచిస్తున్నాయి. ఎగుమతుల పెంపుదలకు, మన దేశీయ పెట్టుబడుల అవసరాలను సమృద్ధంగా తీర్చుకొనేందుకు విదేశీ మదుపులను విశేషంగా ఆకర్షించడానికి ఒక ప్రధాన మార్గంగా ప్రపంచీకరణను భావించడం జరిగింది. అయితే పైన పేర్కొన్న వాస్తవాలు, ప్రపంచీకరణ పరిణామాలు సరిగ్గా అందుకు విరుద్ధంగా సంభవిస్తున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. దిగుమతుల పెరుగుదలకు, మన పెట్టుబడులు విదేశాలకు వెళ్ళిపోవడానికే ప్రపంచీకరణ వాస్తవంగా దారి తీసిందని స్పష్టమవుతోంది.

విదేశీ మదుపుదారులకు అధిక ప్రాధాన్యమిచ్చే విధానాన్ని ఆర్థిక మంత్రి జైట్లీ కొనసాగిస్తున్నారు. భారత ప్రభుత్వం తన ద్రవ్యలోటును నియంత్రించవలసిన అవసరం గురించి అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు పదే పదే నొక్కిచెబుతూ వస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు మెరుగుపడాలంటే ద్రవ్యలోటు నియంత్రణ మినహా మరో మార్గం లేదనే విధానాన్ని 1980వ దశకంలో దక్షిణ అమెరికా దేశాల ఆర్థిక సంక్షోభాల సందర్భంలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, అమెరికా ప్రభుత్వం రూపొందించాయి.

గత శతాబ్ది ద్వితీయార్థంలో లాటిన్ అమెరికా దేశాల నాయకులు అత్యంత అవినీతిపరులు. వారు ప్రభుత్వ ద్రవ్యలోటును అమితంగా పెంచి, దేశీయ విపణి నుంచి భారీ రుణాలు తీసుకొని ఆ సొమ్మును, విదేశాలకు తరలించి స్విస్ బ్యాంకుల్లో తమ వ్యక్తిగత ఖాతాలలో జమ చేసుకోవడం జరిగింది. ఈ పరిస్థితులలో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ద్రవ్యలోటును అదుపు చేసుకొని, ఆదాయానికి అనుగుణంగా వ్యయాలు చేయాలని ప్రపంచ బ్యాంకు నిర్దేశించింది. అదే సమయంలో వర్ధమాన దేశాలు తమ సరిహద్దులను విదేశీ వాణిజ్యానికి తెరవాలని ప్రపంచ బ్యాంకు నిర్దేశించింది. ఇలా చేయడం వల్ల తమ ఎగుమతులను పెంపొందించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొంది. అలాగే విదేశీ బహుళజాతి కార్పొరేట్ కంపెనీల మదుపులను అనుమతించడం వల్ల తమ దేశీయ మదుపుల అవసరాలు పూర్తిగా తీరతాయని అభివృద్ధిచెందుతున్న దేశాలకు ప్రపంచ బ్యాంకు సూచించింది.

ప్రభుత్వాధినేతలు అంతులేని అవినీతికి పాల్పడి, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడమే ద్రవ్యలోటు నియంత్రణ విధాన రూపకల్పనకు మూలకారణం. అయితే నిజాయితీపరులైన నాయకులు ప్రభుత్వాధినేతలుగా ఉంటే ప్రభుత్వ రుణాలను హై వేలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించడం ఖాయం. అప్పుడు ద్రవ్యలోటు నియంత్రణ అవసరమే ఉండదు.

మరి మన ఆర్థిక మంత్రి తీరు చూస్తుంటే తమ ప్రభుత్వం అవినీతికరమైనదని. నిజాయితీగా రుణాలు తీసుకొని, అవినీతికి తావు లేకుండా మదుపు చేయగల పరిస్థితిలేదని భావిస్తున్నట్టుగా కన్పిస్తోంది. కనుకనే కాబోలు ప్రపంచ బ్యాంకు నిర్దేశాన్ని అనుసరించి ప్రభుత్వ మదుపులను, ప్రభుత్వ రుణాలను గణనీయంగా తగ్గించి ద్రవ్యలోటును నియంత్రించడానికి పూనుకున్నారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు స్థూల దేశీయోత్పత్తిలో 3.5 శాతంగా ఉన్నది. దీన్ని 2018–19 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తిలో 3.2 శాతానికి తగ్గిస్తామని ఆర్థిక మంత్రి జైట్లీ హామీ ఇచ్చారు.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో రెండు పరస్పర విరుద్ధ గొంతులతో మాట్లాడారు. ప్రపంచీకరణ ప్రతికూల పర్యవసానాల– దిగుమతుల పెరుగుదల, దేశీయ పెట్టుబడులు విదేశాలకు వెళ్ళిపోవడం– గురించి ఆయనకు పరిపూర్ణ అవగాహన ఉన్నది. అయినా ఆయన ప్రపంచీకరణ వెనుకే పరుగెడుతున్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికై ద్రవ్యలోటును నియంత్రించడానికి పూనుకున్నారు. ఆర్థికమంత్రి ఒకేసారి రెండు గుర్రాలపై స్వారీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు సుమా! అంతేకాదు, ఏక కాలంలో పరస్పర అభిముఖంగా గమిస్తున్న గుర్రాలపై స్వారీ చేయడానికి కూడా ఆయన ప్రయత్నిస్తున్నారు! ఈ స్వారీ సఫలం కాదని, ఆయన పడిపోతాడని మరి ప్రత్యేకంగా చెప్పాలా?

విదేశీ పెట్టుబడులు దేశానికి రావడమనేది ఆర్థిక మంత్రి చేతుల్లో లేదు. భారత్‌లో మదుపు చేయాలా వద్దా అనే విషయమై నిర్ణయాన్ని బహుళజాతి కార్పొరేట్ సంస్థల ప్రధాన కార్యాలయాలు తీసుకుంటాయి. ఆ సంస్థలకు అనుకూలంగా దేశ ఆర్థిక వ్యవస్థను తెరవడమే ఆర్థిక మంత్రి చేయగలిగేది. అంతవరకు మాత్రమే. మన దేశంలో మదుపు చేసేలా బహుళజాతి సంస్థలను ప్రభావితం చేయలేరు. గుర్రాన్ని చెరువు వద్దకు తీసుకువెళ్ళగలం గాని అది నీరు తాగేట్టు చేయలేము కదా. అయితే భారీ రుణాలు తీసుకొని మరింతగా మదుపు చేయడమనే విషయమై నిర్ణయం తీసుకోగల అధికారం ఆర్థిక మంత్రికి ఉన్నది. కొన్ని సంవత్సరాల క్రితం 4.5 శాతంగా ఉన్న మన ద్రవ్యలోటును నేడు 3.5 శాతానికి తగ్గించినా విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తడం లేదు. ఆర్థిక మంత్రి జైట్లీ ఈ వాస్తవాన్ని విస్మరించకూడదు. ద్రవ్యలోటును 3.5 నుంచి 3.2 శాతానికి తగ్గిస్తే విదేశీ పెట్టుబడుల రాక ఇతోధికంగా పెరిగిపోగలదని ఆయన ఎలా భావించారు? ద్రవ్యలోటు నియంత్రణ అనేది నిజాయితీగా వ్యవహరించే తమ ప్రభుత్వానికి వర్తించదని ఆయన గుర్తించి తీరాలి. ద్రవ్యలోటును నియంత్రించాలన్న ప్రపంచ బ్యాంకు విధానాన్ని విడనాడాలి. పెద్దఎత్తున రుణాలు తీసుకోవాలి. భారీ స్థాయిలో మదుపు చేయాలి. ఇలా చేసిన పక్షంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 12 నుంచి 15 శాతానికి పెరగడం ఖాయం.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

'వలస' ప్రభావాలతో ఉజ్వల భవిష్యత్తులోకి...

సమాజంలో తమ భావాలను వ్యక్తీకరించేందుకు భాష కేవలం ఓ సాధనం. మానవ ప్రస్థాన ప్రారంభ దశలో మనుగడ అవసరాలను తెలియజేసేందుకు మాత్రమే వినియోగింపబడిన భాష అనంతర కాలంలో మనస్సును ప్రతిబింబించే, ఆలోచనలను వ్యక్తం చేసే శక్తిగా రూపాంతరం చెందింది. సామాజిక రాజకీయ ఆర్థిక దృక్కోణంలో అత్యున్నత స్థాయిలో మెదడు పంపే సంకేతాలను అందంగా, అద్భుతంగా, ఆకర్షణీయంగా ఒక క్రమ పద్ధతిలో అలంకరించే ప్రక్రియే సాహిత్యం. సొంత అస్తిత్వం, పరిసరాల పట్ల అవగాహన పెంచేది సాహిత్యం. స్వీయ లక్షణాలకు, సమాజానికి అభివ్యక్తి సాహిత్యం.

ఆరు శతాబ్దాల పాటు ప్రపంచాన్ని నడిపించిన వలస పాలనా విధానాలు 20వ శతాబ్దంలోని వ్యక్తుల మనస్తత్వాలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపాయి. బ్రిటీష్ వలస పాలనా విధానాల వలన ఆంగ్ల భాష అంతర్జాతీయ భాషగా అవతరించింది. వలస వాదం ముగిశాక అమెరికా సకల రంగాలలో అగ్రగామిగా ఆవిర్భవించడంతో ప్రపంచవ్యాప్తంగా ఆంగ్ల భాషకు విశేష స్థానం లభించింది.


భారతీయ సాహిత్యాన్ని వలసపాలనా యుగానికి పూర్వం, అనంతరం అనే రెండు విభాగాలుగా విభజించవచ్చు. రెండు శతాబ్దాల పాటు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల పాలనలో ఉన్న భారతావని 19వ శతాబ్దంలో ఆంగ్ల భాషను ఆలింగనం చేసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో వినూత్నమైన భావజాలాలు, ఆలోచనలు, పరిష్కారాలు, సమస్యలు వ్యాసాలు, పుస్తకాల రూపంలో విరివిగా ప్రచారంలోకి వచ్చాయి. 19వ శతాబ్ది తొలిదశలో రచయితలు సామాజిక సమస్యలపై విరివిగా రచనలు చేశారు. రాజా రామ్మోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవ్‌చంద్ర సేన్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అనిబీసెంట్, సురేంద్రనాథ్ బెనర్జీ, జ్యోతిరావు పూలే వంటి వారు సామాజిక సమస్యల గురించి తమ రచనల ద్వారా సమకాలీన సమాజంలో కొత్త చైతన్యాన్ని కలిగించారు. ఆ రచనల వెనుక వారి ప్రధాన ఉద్దేశం సామాజికుల్లో తమ చుట్టూ జరుగుతున్న అన్యాయాల పట్ల ఆలోచన రేకెత్తించాలన్న లక్ష్యం మాత్రమే.

1882లో బంకించంద్ర ఛటర్జీ 'ఆనంద్‌మఠ్' నవల ద్వారా జాతీయోద్యమాన్ని, దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేశారు. అనంతరం ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రబీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు ఆ బాటలోనే పయనించారు. 1910లో ఠాగూరు రచించిన 'గోరా' కూడా వలస పాలనా విధానాలకు ప్రతిస్పందనే.

వలస వాదం అనంతరం రచయితలు ప్రపంచాన్ని నూతన కోణంలో దర్శించేందుకు ప్రయత్నించారు. ఉనికిని చాటుకోవడం, జాతీయ, సాంస్కృతిక వైభవం, విభజన, వాస్తవికత, మానవ సంబంధాలు, ప్రజాస్వామ్య భావాలు వంటి వాటిపై దృష్టి సారించారు. వలసపాలన అనంతరం భారతీయుల ఆంగ్ల రచనల వలనే భారత దేశంలో ఆంగ్ల భాష బాగా అభివృద్ధి చెందింది.

ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్.కె.నారాయణ్, రాజారావు వంటి వారు సామాజిక, సాంస్కృతిక, జాతి అస్తిత్వ సమస్యలను తమ నవలల్లో ప్రస్తావించారు. అనితా దేశాయి, అరుంధతి రాయ్ ఝుంపా లాహిరి, శోభా డే, కమలా మార్కండేయ, నయనతార సెహ్గల్, కిరణ్ దేశాయి వంటి మహిళా రచయితలు ఆంగ్లంలో మంచి రచనలు చేశారు.

19, 20వ శతాబ్దాల్లో సమస్యలను ప్రభావవంతంగా వ్యక్తం చేయడానికి ఆంగ్ల భాషను రచయితలు ఆశ్రయించారు. తద్వారా జనావళిలోకి విస్తృతంగా అది చొచ్చుకుపోయింది. ఆంగ్ల భాషలోని సాహిత్య అనేకం నేడు స్థానిక భాషల్లోకి అనువదితమవుతున్నాయి. ఈ అనువాద కృషికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించాలి. వాణిజ్య విలువ లేని సాహిత్యాన్ని అంతర్జాలం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.



> ప్రతి సమాజం, అందులోని ప్రజలు మౌలికమైన జీవన పరిస్థితులను అధిగమించి జీవితానికి ఒక విస్తృత అర్థాన్ని అత్యున్నత స్థాయిలో అర్థం చేసుకునేందుకు తాపత్రయపడతారు. ఈ కోరికను సాహిత్యం పలు రూపాల్లో తీర్చగలదు. అందుకే నేను భారతదేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా సాహిత్యానికి మంచి రోజులు ఉన్నాయని ఆశావహదృక్పథంతో ఉన్నాను.

భారతీయుల్లో ఆంగ్ల భాష మాట్లాడేవారి సంఖ్య స్వల్పమే అయినప్పటికీ నేడు ఆంగ్ల భాషలో రచనలు చేయడానికి అడ్డంకులు గతంలో కంటే చాలా స్వల్పంగానే ఉన్నాయని పేర్కొనవచ్చు.

అనేక దేశాల్లో మాదిరిగానే భారతదేశంలో కూడా వర్తమాన యుగంలో సాహిత్యానికి విలువ ఉందని నేను అనుకుంటున్నాను. 20వ శతాబ్ది రచయిత 19వ శతాబ్దిలో వచ్చిన బాల్జాక్, డికెన్స్, టాల్‌స్టాయి, దాస్తోవస్కి వంటి వారి రచనలు చదివినప్పుడు ఓ వింత అనుభూతికి లోనవడం కద్దు. గతించిన ఆ రోజుల్లో కాల గమనం మెల్లగా సాగడం చేత రచయితలు తమ దృష్టిని, శక్తిని రచనల సారాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు వినియోగించేవారు. దైనిక జీవన కార్యకలాపాలు మహావేగంతో జరిగిపోతుండడం వర్తమాన యుగ లక్షణం. కనుకనే గత కాలపు సాహిత్య కృతులకు నేటి రచనలకు మధ్య వ్యత్యాసాలు కొట్ట వచ్చినట్టు కన్పిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు పడక గదిలోకి కూడా చొరబడిన నేపథ్యంలో రచయితలు అంతర్జాలాన్ని, అత్యాధునిక సాంకేతికతలను వాడుకుని చాలా వేగంగా రచనలు చేస్తున్నారు.

భారతీయ సాహిత్యం పట్ల నేను ఆశావహ దృక్పథంతో ఉన్నాను. ఈ సాహిత్యం ఎక్కువకాలం నిలబడాలంటే ప్రస్తుత జీవనవాహినికి సన్నిహితంగా ఉన్న రచనలు విరివిగా రావాలి. మారుతున్న కుటుంబ, సామాజిక పరిస్థితులను అవి ప్రతిబింబించాలి. ప్రపంచం కుగ్రామంగా మారుతున్న తీరును విశ్లేషించాలి. ప్రతి సమాజం, అందులోని ప్రజలు మౌలికమైన జీవన పరిస్థితులను దాటుకుని జీవితానికి ఒక విస్తృత అర్థాన్ని అత్యున్నత స్థాయిలో అర్థం చేసుకునేందుకు తాపత్రయపడతారు. ఈ కోరికను సాహిత్యం పలు రూపాల్లో తీర్చగలదు. అందుకే నేను భారతదేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా సాహిత్యానికి మంచి రోజులు ఉన్నాయని ఆశావహ దృక్పథంతో ఉన్నాను.

తెలుగు రాష్ట్రాలు రసభరితమైన సాహిత్యానికి ప్రథమ చిరునామా. అయితే నేటి తరం విద్యా విధానం ఉద్యోగం కోసమే తప్ప మంచి వ్యక్తిత్వం కలిగిన పౌరులను తయారు చేసేందుకు వినియోగింపబడట్లేదని నేను భావిస్తున్నాను. ఈ ఉద్యోగ వేట కోసం వల్లెవేసే చదువుల వలన మేధోవికాసానికి తీవ్రభంగం ఏర్పడుతోంది. వాణిజ్య అవసరాలను దాటుకుని బలమైన నైతికత సాధించేందుకు మేధస్సులను సానపెట్టాల్సిన సమయమిది. తెలుగు రాష్ట్రాల్లో పలు పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా సాహిత్యాభిలాషను పెంపొందించేందుకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని నేను చెప్పగలను. కథలు, కథానికలు, కవితలు వంటివి కాలంతో పాటు తమను తాము ఎలా మార్చుకున్నాయనే అంశాలు సాహితీ జిజ్ఞాసను రగిలిస్తాయి. విశ్లేషణాత్మక వార్తలు పరిశోధించే శక్తిని అందిస్తాయి. ఎలక్ట్రానిక్ మీడియా ఈ కోవలోకి రావట్లేదని నా అభిప్రాయం. సరైన రచనలు అందించగలిగితే 'అంతర్జాల' ప్రపంచం వాటి ప్రాచుర్యానికి పటిష్ఠ మార్గాన్ని చూపగలదు. వాణిజ్య అవసరాల కోసమే పనిచేస్తూ అలసిపోయిన మేధస్సును దృష్టిలో ఉంచుకుని సాహిత్య పద్ధతులను సరికొత్తగా తీర్చిదిద్దితే మానవాళిని సకల అంతరాలకు అతీతంగా మరింత సన్నిహితం చేయవచ్చని నా ఉద్దేశం.

■ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

(అమెరికాలోని హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 10, 11తేదీల్లో నిర్వహించిన 15వ భారతీయ మహాసభల్లో భాగంగా 'ఆధునిక భారతదేశంలో సాహిత్యం, భాషలు, ఉనికి, అవగాహన' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో చేసిన ప్రసంగం క్లుప్తపాఠం.)

అసెంబ్లీలో జయలలిత చిత్రపటం

- ఆవిష్కరించిన స్పీకర్ ధనపాల్
- కార్యక్రమాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు, దినకరన్
- హైకోర్టులో డీఎంకే, పీఎంకే పిటిషన్లు



అసెంబ్లీలో ఆవిష్కరించిన జయలలిత చిత్రపటం

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి జయలలిత చిత్రపటాన్ని తమిళనాడు శాసనసభలో ఏర్పాటు చేశారు. చిత్రపటాన్ని స్పీకర్ ధనపాల్ సోమవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి పళని స్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పలువురు నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే అక్రమాస్తుల కేసులో దోషిగా తేలిన ఆమె చిత్రపటాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ ప్రతిపక్ష పార్టీలైన డీఎంకే, కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. అన్నాడీఎంకే అసమ్మతినేత, ఆర్కే నగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ సైతం ఈ కార్యక్రమాన్ని బహిష్కరించారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యే విజయతరణి దీనిపై స్పీకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలపడం కలకలం రేపుతోంది. అసెంబ్లీలో జయలలిత చిత్రపటం ఏర్పాటును వ్యతిరేకిస్తూ డీఎంకే, పీఎంకే, ద్రవిడ కళగం పార్టీలు మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై మంగళవారం విచారణ జరుగనుంది. అక్రమాస్తుల కేసులో నేరస్తురాలని కోర్టు తీర్పు ఇచ్చిన జయలలిత చిత్రపటాలను, ఆమె పేరును ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించకూడదంటూ డీఎంకే ఎమ్మెల్యే జె.అన్బళగన్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలపకుండా ఆమె చిత్రపటాన్ని అసెంబ్లీలో ఆవిష్కరించడం నేరమని డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది విల్సన్ తాజా పిటిషన్‌లో పేర్కొన్నారు.

పట్టణాలకు అదనపు ఇళ్లు

- ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ గృహనిర్మాణ పథకాల కింద ఆంధ్రప్రదేశ్‌కు భారీగా అదనపు ఇళ్లు మంజూరయ్యాయి. మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలోని అఫర్డబుల్ హౌసింగ్ ప్రోగాం(ఏహెచ్‌పీ)కి 1,18,485 ఇళ్లు, గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలోని బెనిఫియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ)కి 23,962 ఇళ్లు అదనపు కోటా కింద తాజాగా కేంద్రం నుంచి మంజూరయ్యాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటికే ఏహెచ్‌పీలో 2,43,162 ఇళ్లు రాష్ట్రానికి వచ్చాయి. బీఎల్‌సీలో 1,02,977 ఇళ్లు మంజూరయ్యాయి. వాటికి అదనంగా ఇప్పుడు వచ్చిన ఇళ్లతో కలిపితే ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం పట్టణాలకు 4,88,586 ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రాయితీ ఇస్తోంది. మున్సిపల్ శాఖ ఏహెచ్‌పీలో అపార్ట్‌మెంట్ల తరహాలో ఇళ్లు నిర్మిస్తుంటే, బీఎల్‌సీ కింద పట్టణాల్లో స్థలాలు ఉన్న పేదలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీల సహకారంతో వారే సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. బీఎల్‌సీ పథకంలో కేంద్రం లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రాయితీ ఇస్తున్నాయి. ఈ పథకంలో ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.3.5లక్షలుగా నిర్ణయించారు. అందులో రూ.2.5లక్షలు రాయితీగా వస్తుంటే మిగిలిన లక్షను లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. ఈ ఇళ్లు 30 పట్టణాలకు మంజూరయ్యాయి. ఏహెచ్‌పీలో 24 మున్సిపాలిటీలకు, బీఎల్‌సీలో 13 మున్సిపాలిటీలకు వచ్చాయి. వీటికి సంబంధించి ప్రతిపాదనలను ఆయా శాఖలు ఇటీవల ప్రభుత్వానికి పంపాయి. ఒకట్రెండు రోజుల్లో దీనిపై ఉత్తర్వులు వెలువడుతాయని అధికారులు భావిస్తున్నారు. ఆ వెంటనే కొత్తగా వచ్చిన కేటాయింపులకు లబ్ధిదారుల ఎంపికను ప్రారంభిస్తారు.

బీఎల్‌సీలో 3లక్షల డిమాండ్

లబ్ధిదారులు నిర్మించుకునే బీఎల్‌సీలో రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల డిమాండ్ ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. పట్టణాల్లో స్థలాలున్న పేదల సంఖ్య మరీ ఎక్కువగా లేదు. స్థలాలు లేని పేదలే ఎక్కువగా ఉన్నారు. వారికోసం ప్రభుత్వం భారీగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపడుతోంది. స్థలాలున్న పేదల సంఖ్య తక్కువే అయినా ఇటీవల వరకు అనుమతుల విషయంలో, నిర్మాణాల్లో జాప్యం జరిగింది. ప్లాన్ అప్రూవల్స్ విషయంలో చాలా మంది ఇబ్బందులు పడటంతో ప్రభుత్వం బీఎల్‌సీలో నిర్మించే ఇళ్లకు మినహాయింపులిచ్చింది. దీంతో బీఎల్‌సీ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. తాజా కేటాయింపులతో రాష్ట్రంలో దాదాపు చాలా వరకు మున్సిపాలిటీలు రాయితీ ఇళ్ల పరిధిలోకి వచ్చాయి. గతంలో వచ్చిన వాటితో సహా మొత్తం 84 మున్సిపాలిటీలకు ఇళ్లు మంజూరయ్యాయి.

మోడల్ స్కూళ్లూ రాష్ట్ర పరిధిలోకే!

- పాఠశాల విద్య అధీనంలోకి.. 164 మోడల్ పాఠశాలలు
- స్వయం ప్రతిపత్తి కొనసాగింపు
- ఎమ్మెల్సీల కమిటీ సిఫారసుకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 2012-13 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన మోడల్ స్కూళ్లు ఇకపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి రానున్నాయి. అయితే, వాటి స్వయంప్రతిపత్తిని యాథాతథంగా కొనసాగించనున్నారు. కానీ, ప్రత్యేక యూనిట్లుగా పరిగణించనున్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఏపీ మోడల్ స్కూల్ సొసైటీ కింద స్వయంప్రతిపత్తితో నడుస్తున్న ఈ పాఠశాలలు త్వరలోనే రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధీనంలోకి రానున్నాయి. ఎమ్మెల్సీలతో ఏర్పాటు చేసిన కమిటీ ఈ మేరకు చేసిన సిఫారసుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం.. మోడల్ స్కూళ్లు 2018-19 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యాశాఖ అధీనంలోకి వస్తాయి. ఆయా స్కూళ్లన్నీ సొసైటీ నుంచి విడిపోనున్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు విడుదల కానున్నాయి. దేశ వ్యాప్తంగా మోడల్ స్కూళ్లను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల పాటు నిధులను విడుదల చేసింది. ఆ తర్వాత నిధులను నిలిపివేసింది. ఫలితంగా మోడల్ స్కూళ్ల వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుంది. వీటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు కూడా నిలిచిపోయాయి. దీంతో వారంతా ఆందోళన బాటపట్టారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రంతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. రాష్ట్రంలో పూర్తిగా ఇంగ్లీషు మీడియం బోధనతో నిర్వహిస్తున్న 164 మోడల్ స్కూళ్లలో 2,063 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాళ్లు ఉన్నారు. నాలుగు స్కూళ్లకు తప్ప మిగిలిన అన్నింటికీ సొంత భవనాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 80 వేల మంది విద్యార్థులు వీటిలో చదువుతున్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేసే టీచర్ల జీతాలు, ఎస్టాబ్లిష్‌మెంట్ కోసం ఏటా రూ.160 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం డీలింక్ చేసిన పథకాలు/కార్యక్రమాల్లో మోడల్ స్కూళ్లను చేర్చడంతో నిధులు ఆగిపోయాయి. ఆయా స్కూళ్లను నిర్వహించుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే పెట్టింది.

పౌరసరఫరాల శాఖ చేతికి జీసీసీ గోదాములు!

- 19 స్టాక్ పాయింట్ల స్వాధీనానికి ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నిర్వహిస్తున్న 19 మండల స్థాయి నిల్వ కేంద్రాల(ఎంఎల్ఎస్ పాయింట్లు)ను స్వాధీనం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. జీసీసీలో సిబ్బంది కొరత వల్ల నిర్వహణ కష్టంగా మారిందని, ఈ క్రమంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నందున ఈ కేంద్రాల బాధ్యత తీసుకోవాలని కార్పొరేషన్ వీసీఎండీ ఇటీవల పలుమార్లు లేఖలు రాయగా, స్వాధీనానికి అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిప్రకారం.. శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, పాతపట్నం, విజయనగరంలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సాలూరు, విశాఖపట్నంలో పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు, కాశీపట్నం, కె.డి.పేట, చింతపల్లి, జి.కె.వీధి... తూర్పుగోదావరిలో రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, ఏలేశ్వరం, చింతూరు, పశ్చిమగోదావరిలో కేఆర్ పురం, కుకునూరు కేంద్రాలు పౌరసరఫరాల కార్పొరేషన్ పరిధిలోకి రానున్నాయి.

శరవేగంగా 'ఫైబర్‌నెట్'

▸ ప్రాజెక్టుపై సీఎస్ సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా ఇంటింటికీ రూ.149కే టీవీ, ఇంటర్నెట్ సేవలు పూర్తి నాణ్యతతో అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ ఆదేశించారు. ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టు పురోగతిపై సోమవారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన తొలిసారిగా రాష్ట్రస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్వర్క్ లిమిటెడ్ సీఎండీ సంజయ్ సింగ్ పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు వీలుగా మూడు నాలుగు జిల్లాలకు ఒక ఏజెన్సీకి పనులు అప్పగించాలన్నారు. సీఎం చంద్రబాబు వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని సీఎస్ ఆదేశించారు. దాదాపు 1400 సీఎం హామీలు అమలు చేయాల్సి ఉందన్నారు. జన్మభూమి, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని సీఎస్ అధికారులకు సూచించారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఇలాంటి ఫిర్యాదులను పర్యవేక్షించేందుకు ఆర్టీజీలో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా.. అమరావతిలో ఏపీహెచ్ఆర్డీ డీపీఆర్‌ను సీఆర్డీఏ ప్లానింగ్ విభాగం పరిశీలించిన తర్వాతే స్థలం కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తామని దినేశ్ కుమార్ తెలిపారు.

పోలవరం పనులు 53% పూర్తి: దేవినేని

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు 53% పూర్తయిందని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. సచివాలయంలో సోమవారం మాట్లాడుతూ, రాష్ట్రంలో నాలుగేళ్లలో సాగు నీటి రంగానికి రూ.51వేల కోట్లు ఖర్చు చేయగా, పోలవరం ప్రాజెక్టుకే ఇప్పటి వరకూ రూ.12,910 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం రూ.4932 కోట్లు విడుదల చేయగా, రీయింబర్స్‌మెంట్ కింద ఇంకా రూ.2847కోట్లు విడుదల కావాల్సి ఉందన్నారు. కాగా, పోలవరం ప్రధాన కుడి కాలువ పనులు 91శాతం, ఎడమ కాలువ పనులు 60శాతం, హెడ్ వర్క్సు 39శాతం, డ్యాం వర్క్సు, స్పిల్‌వే, ఇతర పనులు 71శాతం పూర్తయ్యాయని తెలిపారు. కాంక్రీటు పనులు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేయాలని నవ యుగ కంపెనీని ఆదేశించామని చెప్పారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఖర్చు, పనుల వివరాలను 'పోలవరం.ఏపీఈ.జీవోవీ.కామ్' వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని మంత్రి చెప్పారు.

'ఈసీబీసీ' టెక్నికల్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)' టెక్నికల్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఇంధన సామర్థ్యం కలిగిన భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహించడమే దీని లక్ష్యం. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఏయూడీ) ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీకి ఆచార్య వేదాల శ్రీనివాసాచారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, ఇంధన శాఖ కార్యదర్శి సలహాదారు కె.రంగనాథం, ఏపీసీఆర్డీఏ కమిషనర్, ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖర రెడ్డి, డీటీసీపీ, ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్, ఎనర్జీ ఎఫిషియన్సీ బ్యూరో, ఎనర్జీ ఎకనమిస్ట్ సౌరభ్ దిడ్డి, ఏఎస్‌సీఐ అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్‌కిరణ్ బిలోలికర్, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ విశాల్ గార్గ్ ఉంటారు.

ఈఎస్ఐ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయాలి

▸ కేంద్ర కార్మిక మంత్రికి పితాని వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీలోని 13 ఈఎస్ఐ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. పితాని మాట్లాడుతూ.. విశాఖకు మంజూరు చేసిన 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈఎస్ఐ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. అయితే, నిబంధనలు మారాయని, తాజా నిబంధనల ప్రకారం వివరాలు పంపించాలని కేంద్ర మంత్రి సూచించారని చెప్పారు.

ఇక కేంద్రం నుంచి చంద్రన్న స్కాలర్ షిప్‌లు!

▸ 'స్కాలర్‌షిప్స్.జీఓవీ.ఇన్'లో దరఖాస్తు చేసుకోవాలి!

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చంద్రన్న బీమా పథకం లబ్ధిదారుల కుటుంబాల్లోని విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు ఇక నుంచి కేంద్రమే నేరుగా ఇవ్వనుంది. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన-చంద్రన్న బీమా పేరుతో అమలవుతున్న ఈ పథకం ఇప్పటి వరకు రాష్ట్ర విద్యాశాఖ పరిధిలోని సెకండరీ విద్య బోర్డు, ఇంటర్మీడియట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషనల్ విభాగాల ద్వారా అమలవుతోంది. సెర్ప్ దీన్ని సమన్వయం చేసి పర్యవేక్షిస్తోంది. ఈ విభాగాలు అర్హులైన విద్యార్థుల వివరాలను నేరుగా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్‌లోడ్ చేస్తుండడంతో, విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో స్కాలర్‌షిప్‌లు జమ అవుతున్నాయి. కానీ, ఇక నుంచి విద్యార్థులు నేరుగా స్కాలర్‌షిప్స్.జీఓవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు మ్యాచింగ్ ప్రీమియంగా రూ.259.76 కోట్లు చెల్లించింది. ఇది కాకుండా, ఈ పథకం ప్రకటించిన మొదటి ఏడాది ప్రమాద మరణాలకు చెల్లించే రూ.5 లక్షల బీమా కోసం అదనంగా రూ.80 కోట్లు చెల్లించింది.

సంక్రాంతికి 'కియ'

(మొదటి పేజీ తరువాయి)

కీలక ఫ్రేమ్‌ల బిగింపు కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం చంద్రబాబును అభ్యర్థించాలని కియ యాజమాన్యం భావించింది. బుధవారం చంద్రబాబును కలవాలని కియ యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 22న అనంతకు రావాలని.. ప్లాంటు అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనివ్వాలని సీఎంను కోరనున్నారు. ఆ రోజు సీఎం కియ ప్లాంటును సందర్శించే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

జస్టిస్ సిటీలోనే తాత్కాలిక హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టులో 40 కోర్టు హాళ్లు ఉన్నాయి. విభజన జరిగాక వాటిలో 24 ఏపీకి వస్తాయి. 15 మంది న్యాయమూర్తులు రానున్నారు. హైకోర్టులో చిన్న బెంచ్‌ల హాళ్లు 40-20 అడుగుల సైజులో ఉండాలి. అదే చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని కోర్టు హాళ్ల పరిమాణం 100-60 అడుగుల పరిమాణంలో ఉండాలి. వీటినే కోర్టు-1గా పిలుస్తారు.

చెన్నై అపోలోలో అరుదైన శస్త్రచికిత్స

▸ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక

▸ మెదడుకు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు




కోలుకుంటున్న ధన్యశ్రీతో తల్లిదండ్రులు, అపోలో వైద్యులు

చెన్నై, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మెదడు తీవ్రంగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాలుగేళ్ల చిన్నారికి చెన్నైలోని అపోలో ఆసుపత్రి వైద్యులు ప్రాణం పోశారు. బ్రెయిన్ డీకంప్రెసివ్‌క్రాంజెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించి మెదడుకు పునరుజ్జీవం కలిగించారు. చెన్నై తండయార్‌పేటకు చెందిన ధన్యశ్రీ గత నెల 29న రోడ్డుపై నడిచి వెళ్తుండగా.. పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ రెండో అంతస్థు నుండి జారిన ఓ వ్యక్తి చిన్నారిపై పడ్డాడు. ఈ ప్రమాదంలో ధన్యశ్రీ మెదడు తీవ్రంగా దెబ్బతింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న చిన్నారిని వెంటనే అపోలో చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మెదడు వాచింది. సకాలంలో చికిత్స అందకపోతే మెదడు నిర్జీవమయ్యే ప్రమాదం ఉంది. ఆస్పత్రి పీడియాట్రిక్ ఐసీయు సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సుచిత్రరంజిత్ నేతృత్వంలోని వైద్య బృందం చిన్నారికి వెంటనే బ్రెయిన్ డీకంప్రెసివ్‌క్రాంజెక్టివీ శస్త్రచికిత్స నిర్వహించారు.

సులభతర వ్యాపారంలో..

ఏపీ టాప్



▸ రెండో స్థానంలో ఉత్తరాఖండ్

▸ 9వ స్థానంలో తెలంగాణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సులభతర వ్యాపార విధానం(ఈవోడీబీ)లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈవోడీబీ విధానంపై మూల్యాంకనం చేస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ఇచ్చిన మార్కులను పరిశీలిస్తే.. 94.85 శాతంతో ఏపీ ముందంజలో ఉంది. ఉత్తరాఖండ్ 92.14 శాతంతో రెండో స్థానంలో ఉంది. 91.06 శాతంతో మూడో స్థానంలో కర్ణాటక, 90.79 శాతంతో ఛత్తీస్‌గఢ్ నాలుగో స్థానంలోను, 90.79 శాతంతోనే ఉన్న హరియాణా ఐదో స్థానంలోను.. అంతే శాతంతో ఉన్న జార్ఖండ్ ఏడో స్థానంలోను ఉన్నాయి. 90.24%తో మహారాష్ట్ర 8వ స్థానంలోను, 89.97 శాతంతో తెలంగాణ తొమ్మిదో స్థానంలోను.. 89.97 శాతంతో రాజస్థాన్ పదో స్థానంలో ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, బీహార్, గోవా, పంజాబ్, కేరళ, జమ్మూకశ్మీర్, ఢిల్లీ ఉన్నాయి. వాస్తవానికి.. ఈవోడీబీ విధానంలో రాష్ట్రాలు పంపిన సమాచారంపై ప్రపంచబ్యాంకు మూల్యాంకనం చేసింది.

పచ్చదనంలో..

▸ రాష్ట్రంలో పెరిగిన అడవుల విస్తీర్ణం..

▸ 'వనం-మనం'తో సత్ఫలితాలు.. అటవీశాఖకు అభినందనలు

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపొందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయంలో కేరళ రెండో స్థానం, తెలంగాణ ఐదో స్థానం సాధించాయి. 'స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-2017' పేరిట కేంద్ర అటవీ, పర్యావరణశాఖ పరిధిలోని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) రూపొందించిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదికను కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ సోమవారం విడుదల చేశారు. తాజా నివేదిక ప్రకారం.. 2015-17 మధ్య కాలంలో ఏపీలో 2,141 చదరపు కిలోమీటర్ల మేర అటవీ విస్తీర్ణం పెరిగింది. 1,101 చదరపు కిలోమీటర్లతో కర్ణాటక, 1,043 చ.కి.మీ.తో కేరళ, 885చ.కి.మీ.తో ఒడిశా, 565 చ.కి.మీ.తో తెలంగాణ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కాగా, దేశవ్యాప్తంగా ఒక్క శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. 2015తో పోల్చితే దేశంలో 8,021 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్తగా అడవులు చేరాయి. కాగా, ఎఫ్ఎస్ఐ సర్వేలో మన రాష్ట్రం ఈ ఘనత సాధించడం పట్ల అటవీశాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వనం-మనం' ఫలితాన్నిచ్చిందని పీసీసీఎఫ్ మల్లికార్జునరావు పేర్కొన్నారు.

పోరాటమే వర్తమానం

▸ ఎంపీల పోరు అభినందనీయం: సీఎం

▸ నీరు-ప్రగతి, వ్యవసాయంపై టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'మూడున్నరేళ్లుగా కేంద్రానికి సహకరిస్తున్నాం. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వంటి అంశాల్లో అండగా నిలిచాం. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీకి కేంద్రం మరింత సహకారం అందించాలి. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయి వచ్చేదాకా చేయూతనివ్వాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'స్వాతంత్ర్యం కోసం పోరాడడం గత చరిత్ర. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడడం ప్రస్తుత చరిత్ర. రాష్ట్రం కోసం పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు. ఇదే స్ఫూర్తితో యంత్రాంగం పని చేయాలి. మూడున్నరేళ్లుగా అధికార యంత్రాంగం తోడ్పాటు వల్లే సమస్యలు అధిగమించగలిగాం. బాధ్యత పెంచాం. సామర్థ్యం చూపాం. దీనిని ఇకపై మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కొనసాగించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షం అడుగడుగునా ఫిర్యాదులతో అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. 'ప్రతిపక్ష పోకడలు ప్రజా ప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమే' అని సీఎం అన్నారు. కన్వర్జన్స్ ద్వారా ఉపాధి పథకంలో ప్రతి రూపాయినీ ప్రజోపయోగానికి ఉపకరించేలా చేశామన్నారు.



గుంటూరు జిల్లా వెంకటపాలెం వద్ద జల సంరక్షణ పనులు ప్రారంభిస్తున్న చంద్రబాబు

జలసంరక్షణ ఉద్యమంలో అందరూ..

రబీ వ్యవసాయ పనులు పూర్తి కావచ్చాయని, రాబోయే రెండు నెలల్లో ఉపాధి పనులను ముమ్మరం చేయాలని సీఎం సూచించారు. 116 రోజుల జల సంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపిచ్చారు. 'రెండో దశ జలసంరక్షణ ఉద్యమంలో మంత్రులు, కలెక్టర్లు, యంత్రాంగం పాల్గొని విజయవంతం చేయాలి. చెరువుల్లో పూడికతీత, ముళ్ల కంపల తొలగింపు ముమ్మరం చేయాలి. ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 14వేల చెరువులు, 2500 సెలయేళ్లు, 10 వేల చెక్‌డ్యాముల్లో చేపట్టిన జల సంరక్షణ పనులు విజయవంతం కావాలి' అని అన్నారు. రబీ పంట రుణాల లక్ష్యం 76శాతం చేరుకున్నా.. మిగిలిన రుణాలను రైతులకు వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ శ్రీకాకుళం, కడప జిల్లాల్లో మరింత వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఇ-నామ్ అమలును నీతి ఆయోగ్ వ్యవసాయ కమిటీ సభ్యుడు రమేశ్‌చంద్ర ప్రశంసించారని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పేర్కొనగా.. ఈ-నామ్ అమలులో ఏపీ దేశంలోనే ముందుండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యాన రంగం, పాడి పరిశ్రమలో మరింత పురోగతి సాధించాలన్నారు.

రోజుకు 150 ఇళ్లు పూర్తికావాలి..

'నిరుడు అక్టోబరు 2న లక్ష గృహాల సామూహిక గృహప్రవేశం విజయవంతం చేశాం. త్వరలో నిర్వహించే లక్షన్నర గృహాల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలి' అని సీఎం అన్నారు. ప్రస్తుతం రోజుకు 100 ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నామని, దీనిని 150 ఇళ్లకు పెంచాలని నిర్దేశించారు. 2016-17లో పనులు ప్రారంభించిన ఇళ్లన్నీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. 2017-18, 2018-19లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం ముమ్మరం చేయాలని చెప్పారు. గాలి నాణ్యతలో ఏపీ ముందుండాలని.. అటవీశాఖ మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యావరణం బాగుంటేే పర్యాటకంలో గణనీయ ప్రగతి సాధిస్తామని.. దేశంలో ఇప్పటికే పర్యాటకంలో మూడో స్థానంలో ఉన్నామని.. మొదటి స్థానానికి చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. పింఛన్లకు నగదు కొరత లేకుండా చూడాలని, రాష్ట్రంలో నగదు కొరత నివారణకు ఆర్‌బీఐకి లేఖ రాయనున్నట్లు సీఎం తెలిపారు.

రియల్ టైమ్‌లో

పోలవరం

▸ ప్రాజెక్టును ఎవరూ వేలెత్తి చూపకూడదు

▸ కాంట్రాక్టు సంస్థలకు చంద్రబాబు ఆదేశం

▸ లక్ష్యం అధిగమిస్తామన్న నవయుగ ఎండీ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): "పోలవరం ప్రాజెక్టు పనులు రియల్ టైమ్‌లో జరగాలి. సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఉంచండి" అని జల వనరులశాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాంక్రీట్ పనుల వేగాన్ని పెంచాలని కాంట్రాక్టు సంస్థలకు నిర్దేశించారు. ఇకపై వారం వారం కాకుండా.. ప్రతి రోజూ ప్రగతి నివేదికలను తనకు పంపాలని కోరారు. వచ్చే నెల 15నాటికి పోలవరం ప్రాజెక్టు పనుల సమగ్ర నివేదికలు ఆమోదం పొందాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను సమీక్షించారు. "పోలవరం పనులు సకాలంలో పూర్తి చేయాలి. దీనికోసం ఒక రిజిస్టర్ తయారు చేసుకోవాలి. రియల్ టైమ్ పద్ధతిలో పని చేయాలి. పోలవరం పనుల్లో ఎవరూ వేలెత్తి చూపకుండా ఉండాలి. ప్రతి రోజూ ప్రోగ్రెస్ ఇవ్వాలి. వచ్చేవారం నాటికి మరింత ప్రగతి కావా"లని సీఎం ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ప్రాధాన్య ప్రాజెక్టుల వేగం పెంచండి

రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని జల వనరుల శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం ఆయన ఈ అంశంపై సమీక్షించారు. "అనంతపురంలో ప్రాధాన్య ప్రాజెక్టుల వేగాన్ని పెంచండి. మార్చి 15 నాటికి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి" అని ఆదేశించారు. ఈ అంశంపై తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో చంద్రబాబు సమీక్షించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పనులను, శ్రీకాకుళం జిల్లాలో వంశధార-నాగావళి నదుల అనుసంధాన విషయాలను చర్చించారు. కొండవీటివాగును ఏప్రిల్‌లో, మల్లెమడుగు ప్రాజెక్టును జూన్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణయించిన లక్ష్యాలమేరకు 116రోజుల కాల వ్యవధిలో ప్రాధాన్యప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

కరెన్సీ.. కటకట

మొదటి పేజీ తరువాయి

కనిపిస్తోంది. శనివారం సాయంత్రానికి ఏటీఎంలు ఖాళీ అయ్యాయి. ఆదివారం నాడు ఏటీఎంలు పనిచేయలేదు. సోమవారం కూడా ఏటీఎంలలో నగదు పెట్టలేదు. మంగళవారం శివరాత్రి. దీంతో నగదు కావాలన్న ప్రజలకు జాగారమే దిక్కు! బ్యాంకుల నుంచి నగదు ఇవ్వకపోవడం, ఏటీఎంలో డబ్బుల్లేకపోవడంతో ప్రజల ఇక్కట్లు వర్ణనాతీతం! చిన్న అవసరాల నుంచి పెద్ద అవసరాల వరకు నగదు కోసం నానా పాట్లు పడటం కనిపించింది.

అక్కడ బోర్డులు.. ఇక్కడ బొటాబొటీ..

సాధారణంగా ప్రధాన బ్యాంకు బ్రాంచ్‌ల దగ్గర ఉన్న ఏటీఎంలలో ఎప్పుడూ డబ్బు ఉంటుంది. కానీ సోమవారం జనానికి ఉన్న ఈ చివరి ఆశా నీరుగారిపోయింది. పలు బ్యాంకుల ప్రధాన బ్రాంచ్ ఏటీఎంల ముందు నో క్యాష్ బోర్డులు వేలాడదీశారు. విజయవాడలోని పలు బ్యాంకుల ఏటీఎంలలో ఆదివారం నాడే డబ్బులులేవు. దీంతో ఎక్కువమంది ప్రధాన బ్రాంచ్ ఏటీఎంలకు పోటెత్తారు. దీంతో సోమవారం ఉదయానికి అక్కడి ఏటీఎంలూ నిండుకున్నాయి. చేసేదిలేక డెబిట్ కార్డును జేబులో పెట్టుకొని జనం బ్యాంకుల దగ్గరకు వెళ్లారు. చాలాసేపు వేచిచూసి, తమ సమయం రాగానే.. డబ్బుల కోసం చేతులు చాపారు. 'లేదు.. అంత ఇవ్వలేం. ఇప్పటికి కొంతే ఇస్తాం' అని కౌంటర్‌లోని ఉద్యోగి చెప్పడంతో.. జనం అసహనం ఆగ్రహంగా మారింది. అక్కడున్న బ్యాంకు ఉద్యోగులతో వారు గొడవ పడ్డారు. ఒక్క బెజవాడలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ఖాతాదారులు ఇబ్బందులెదుర్కొన్నారు.

చెస్ట్‌ల నుంచి ఆగిన పంపిణీ

దాదాపు అన్ని జిల్లాల్లోను బ్యాంకు చెస్ట్‌ల నుంచి నగదు పంపిణీ ఆగిపోయింది. సోమవారానికి కావాల్సిన నగదు కోసం గత శుక్రవారం నాడే బ్యాంకులు ఇండెంట్ పెట్టాయి. శనివారం, ఆదివారం సెలవు కావడంతో శుక్రవారమే ఆ పనిచేశాయి. కానీ సోమవారం చెస్ట్‌ల నుంచి ఒక్క రూపాయి కూడా బ్యాంకులకు ఇవ్వలేదు. అడిగితే.. డబ్బు రాగానే చూస్తాం అని సమాధానమిస్తున్నట్లు సమాచారం. రిజర్వుబ్యాంకు నుంచి డబ్బు రావాల్సి ఉందా? చెస్ట్‌లలో ఉన్నా ఇవ్వడం లేదా? అన్నది ప్రశ్నగా మారింది. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10-12వేల కోట్ల రూపాయలు చెస్ట్‌ల నుంచి బ్యాంకులకు వెళ్తాయి. కానీ శుక్రవారం నుంచి ఇది నిలిచిపోవడంతో నగదు కొరత తీవ్రస్థాయి లో ఉంది.

ఆ బిల్లుతో తగ్గిన డిపాజిట్

బ్యాంకులు నష్టాల బారిన పడి డిపాజిట్‌దారుల డబ్బును తిరిగివ్వకున్నా.. ఇక చేసేదేమీ లేదన్నట్లుగా ఓ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్నట్టు వచ్చిన వార్తలతో ఖాతాదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆ వార్తలోని నిజానిజాలతో సంబంధం లేకుండా ఆదుర్దాగా బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. కాలపరిమితి తీరిన తమ డిపాజిట్లను వెంటనే క్లియర్ చేసుకొని, నగదును ఇంటికి తెచ్చేసుకుంటున్నారు. మళ్లీ డిపాజిట్ చేయడంలేదు. సాధారణంగా ఒక బ్యాంకు శాఖను తీసుకుంటే, ఆరోజు బ్యాంకుకు వచ్చిన వసూళ్లు, బ్యాంకు చేసే చెల్లింపులకు మధ్య తేడాను చెస్ట్‌నుంచి తెచ్చుకుంటుంది. ఇప్పుడు డిపాజిట్లు తగ్గిపోవడంతో వచ్చేది తగ్గిపోయింది. అదే సమయంలో ఖాతాదారులు తీసుకునేదేమో పెరిగిపోయింది.



మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం

ఇలాగయితే ఎలా..

విజయవాడలో ఉంటున్న ఒక వ్యక్తి...పశ్చిమగోదావరి జిల్లాలో వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు అక్కడ చెల్లింపులు చేయాల్సి వచ్చింది. వెంటనే అక్కడున్న తమ మనిషి ఖాతాలో రూ.49వేలు వేశారు. ఏటీఎం ద్వారా తీసుకోవాలని సూచించాడు. కానీ అక్కడ ఏటీఎంలో నగదు లేదు. ఇక్కడ నుంచి డబ్బు వేసినా అక్కడ నగదు తీసుకునే అవకాశం లేకపోవడంతో మాటప్రకారం చెల్లింపులు చేయలేదనే రిమార్కు తనపై పడిందని ఆయన వాపోయాడు. అదే సమయంలో పలువురు ఆస్పత్రుల అవసరాలు, అమ్మానాన్నల అవసరాలు, ఇతర అవసరాలకు నగదు బదిలీ చేసినా..ఏటీఎంలలో నగదు లేకపోవడంతో వాటిని తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో 'మా పరిస్థితి కూడా ఘోరంగానే ఉంది' అని బ్యాంకు ఉద్యోగులూ వాపోతున్నారు. "ఖాతాదారులకు విజ్ఞప్తి చేసి ఖాతాల్లో నిల్వ ఉంచమని అడుగుతాం. కానీ వారు అడిగినప్పుడు డబ్బు ఇవ్వకపోవడంతో మమ్మల్ని నిలదీస్తున్నారు" అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి, అమరావతి

గాలి పీల్చినా అనారోగ్యమే!

వాయు కాలుష్య కోరల్లో ఏపీ!

▸ ముఖ్య నగరాల్లో ప్రమాద ఘంటికలు

▸ అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి

▸ విజయవాడలో మరీ అధికం!.. గ్రీన్‌పీస్ నివేదికలో చేదు నిజాలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాలుష్యానికి కాదేదీ అనర్హమన్నట్లు.. ఆహార దినుసులు.. కూరగాయలు వంటివే కాదు.. గాలి కూడా అనారోగ్య హేతువుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాల్లోనూ వాయు కాలుష్యం ప్రమాదస్థాయికి చేరుకుందని గ్రీన్‌పీస్ ఇండియా ఇచ్చిన నివేదికలే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఎయిర్ కొలిప్సే-2 పేరిట గ్రీన్ పీస్ ఇండియా తన రెండో వార్షిక నివేదికను విడుదల చేసింది. దేశంలో తగ్గిపోతున్న గాలి నాణ్యతపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే ఉద్దేశంలో భాగంగా.. ఏటా నివేదికలు వెల్లడిస్తోంది. కాలుష్యాన్ని గణించడంలో కీలకంగా చెప్పే పీఎం-10 స్థాయిని దేశంలోని 280 నగరాల్లో ఏడాది సరాసరిన తీసుకుని గణిస్తే ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఏపీలో ఇదీ పరిస్థితి

ఏపీలోని 15 నగరాల్లో కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ (సీపీసీబీ) నిర్దేశించిన పీఎం-10 స్థాయి కాలుష్య స్థాయి(60 యూనిట్లు) కన్నా అధికంగా ఉంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్దేశించిన కాలుష్య ప్రమాణాల కన్నా ఇది మూడు రెట్లు అధికం. 2015, 2016 మధ్య కాలంలో విశాఖపట్నం, విజయనగరం నగరాల్లో వాయు కాలుష్యం స్వల్పంగా పెరిగింది. గుంటూరు, కర్నూలు, విజయవాడ, ఏలూరులో స్వల్పంగా తగ్గాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు కర్నూలు, తిరుపతిలో తప్ప మిగిలిన పట్టణాల్లో ప్రతి నెలా పీఎం-10 స్థాయి కాలుష్యం ప్రామాణిక కాలుష్య స్థాయి కంటే అధికంగా ఉంది. అనంతపురం, విజయవాడ, విజయనగరంలో వరుసగా మూడు నెలలు డెయిలీ ప్రామాణిక కాలుష్యస్థాయి(100 యూనిట్లు) కంటే ఎక్కువగా ఉంది. గుంటూరు, విశాఖపట్నంలో ఏడాదంతా కాలుష్యస్థాయి 70- 90 మధ్య ఉంటోందని నివేదికల్లో పేర్కొన్నారు. ఒక నెలలో విజయనగరంలో పీఎం-10 స్థాయి అత్యధికంగా రికార్డు 2016లో వార్షిక పీఎం- 10 స్థాయి సరాసరి విజయవాడలో 101, గుంటూరు 88, విజయనగరం 86, అనంతపురం 85, విశాఖపట్నంలో 77యూనిట్లు ఉంది. 2016లో విజయవాడలో వార్షిక పీఎం-10 స్థాయి కంటే 1.7 రెట్లు అధికంగా నమోదవ్వగా, డబ్ల్యూహెచ్ఓ వార్షిక ప్రమాణాలకు ఇది 5 రెట్లుగా ఉండడం ఆందోళనకర అంశం. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ మినహా.. మిగతా 23 రాష్ట్రాల్లోని నగరాల్లో నివసిస్తున్న 58 కోట్ల మంది జనాభాకు గాలి నాణ్యత గణాంకాలు అందుబాటులో లేవు. దేశ జనాభాలో కేవలం 10 కోట్ల మందికి.. అంటే 16 శాతం జనాభాకే గాలి నాణ్యత వివరాలు తెలుసుకునే అవకాశముంది.

ఊరు కోసం ఉద్యమించండి

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తుకోసం చేపట్టే ఇలాంటి మంచి కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొనాలి. ఉద్యమస్ఫూర్తితో భాగస్వాములు కావాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోటి 15 లక్షల ఎకరాలకు సాగునీటి అందిస్తున్నామని, అదనంగా మరో రెండు కోట్ల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో ఉన్నామని ఆయన వెల్లడించారు. రాజధాని నగరం అమరావతి పరిధిలోని వెంకటాయపాలెం గ్రామంలో నీరు - ప్రగతి కింద చేపట్టే జల సంరక్షణ రెండో దశ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వెంకటాయపాలెంలో పాలవాగు అభివృద్ధి పనులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీబీకి పూజలు చేసి .. దానిని స్వయంగా నడిపి తవ్వకాలను లాంఛనంగా మొదలుపెట్టారు. నీరు-ప్రగతి పేరిట 116 రోజులపాటుసాగే జల సంరక్షణా ఉద్యమంలో రాష్ట్ర ప్రజలందరూ పాల్గొనాలని చంద్రబాబు కోరారు. గోదావరి - కృష్ణా నదుల అనుసంధాన ప్రక్రియతో జాతీయ స్థాయిలోనే నదుల అనుసంధానానికి కొత్త దారి చూపామన్నారు. నాగావళి - వంశధార - కృష్ణా - గోదావరి - పెన్నా నదులను అనుసంధానం చేసే మహా సంగమానికి కార్యోన్ముఖులయ్యామని తెలిపారు. "గోదావరి - పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా త్వరలో తొలి దశ పనులకు శ్రీకారం చుడతాం. ఇదే సమయంలో నాగావళి - వంశధార నదుల అనుసంధాన ప్రక్రియను చేపడుతున్నాం" అని వివరించారు.

రాజధానిని అద్భుతంగా ఆవిష్కరిస్తాం!

రాజధాని నగరాన్ని బ్లూ-గ్రీన్ సిటీగా మలుస్తున్నామని చంద్రబాబు వివరించారు. రాజధాని అభివృద్ధి పనులను ఈ ఏడాదంతా చేపడతామని ప్రకటించారు. రాజధాని నిర్మాణం కోసం తనపై విశ్వాసంతో రూ.40,000 కోట్ల విలువైన 33,000 ఎకరాలను అందజేశారంటూ రైతులను అభినందించారు. రాజధాని నిర్మాణం అద్భుతంగా ఉంటుందని, నంబర్ వన్‌గా గుర్తింపును పొందుతుందన్నారు. రాజధాని కోసం నిర్మిస్తోన్న రహదారులను చూస్తే అభివృద్ధి స్పష్టమవుతుందన్నారు.

రాజధాని నగరం భవిష్యత్ అవసరాలకోసం ఇప్పటి నుంచే జల సంరక్షణతో పాటు .. అవసరమైన తాగు నీటిని అందించేందుకు కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సూచించినట్టు, భవిష్యత్‌లో రాజధాని నగరానికి వరద ముప్పులేకుండా ఉండేలా కొండవీటివాగు నీటిని దారి మళ్లిస్తూ బ్యారేజీని నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీలో 3.07 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. ఈ బ్యారేజీ ద్వారా నగరంలో 10 లక్షల మందికి తాగునీటిని, 13 లక్షల ఎకరాలకు సాగునీటిని ఇస్తున్నామని చెప్పారు. ఈ బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వద్ద ఒక బ్యారేజీని, దిగువన మరో బ్యారేజీని నిర్మిస్తున్నామన్నారు. దీనివల్ల రాజధానిలో 50లక్షల మందికి తాగునీరందుతుందని వివరించారు.

పని చేయకుండా పదవులెందుకు?

పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా మొదటి సంవత్సరం 6 టీఎంసీలు, రెండో సంవత్సరం 55 టీఎంసీలు, మూడో సంవత్సరం 108 టీఎంసీలు గోదావరి నుంచి తీసుకువచ్చి కృష్ణా డెల్టాను సుభిక్షం చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రకాశం బ్యారేజీ వెనుక నుంచి నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువకు సాగునీటిని అందించే కార్యాచరణను చేపడుతున్నామన్న ఆయన, ఇందుకోసం రూ. 10,000 కోట్లు వ్యయం చేయనున్నామన్నారు. రాష్ట్రంలో చేపట్టే జల సంరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులూ, మహిళలూ, ఉద్యోగులూ రైతులూ పాల్గొనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి పొలానికీ నీరు పారేలా సాగు నీటి సంఘాలు కృషిచేయాలని ఆయన ఆదేశించారు. లేదంటే ఈ సంఘాల అధ్యక్షులు ఉన్నా లేనట్టేనని వ్యాఖ్యానించారు.

విజేత



ఈ రోజుల్లో అమ్మాయిలు రాణించని రంగం లేదు. కొన్నింటిలో పురుషులతో సమానంగా కృషి చేస్తూ, తమదైన ముద్ర వేసేందుకు తహతహలాడుతున్నారు. 'మేం మహిళలం, మమ్మల్ని ప్రత్యేకంగా పరిగణించాలి' అనటం లేదు. అతివలు దూసుకుపోతున్న అలాంటి రంగాల్లో కంపెనీ సెక్రటరీ ఒకటి. కంపెనీ సెక్రటరీస్‌కు సంబంధించి పార్లమెంట్ ఆమోదిత సంస్థ 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా'. దేశవ్యాప్తంగా ఆ సంస్థకు చాప్టర్లు ఉన్నాయి. అందులో హైదరాబాద్‌లోని చాప్టర్‌కు ఎ ప్లస్ గ్రేడ్ ఉంది. అంతటి విఖ్యాతి కలిగిన హైదరాబాద్ చాప్టర్‌కు చైర్‌పర్సన్‌గా తెలుగు మహిళ కవితా రాణి శాఖమూరి ఈ ఏడాది ఎన్నికయ్యారు. దాదాపు పదిహేనేళ్ల తరవాత హైదరాబాద్ చాప్టర్‌కు ఒక మహిళ నేతృత్వం వహిస్తుండటం విశేషం. ఈ రంగం వైపు రావడం నుంచి చైర్‌పర్సన్‌గా ఎన్నిక వరకు అడుగడుగునా ఆమె పాజిటివ్ యాత్ర ఆసక్తికరం. ఆ విశేషాలను ఆమె 'నవ్య'కు వివరించారు.

పట్టుదలే పెట్టుబడి

మాది గుంటూరు జిల్లా నిడుబ్రోలు. ఆర్థికంగా ఎగువ మధ్యతరగతి కుటుంబం మాది. మా తలిదండ్రులు మొదటి నుంచి పిల్లల చదువులపై శ్రద్ధ చూపేవారు. నాన్న కొసరాజు రవీంద్రనాథ్ బీకామ్, అమ్మ ప్రసూనాంబ పియుసి చదువుకున్నారు. అయిదో తరగతి వరకు స్థానికంగా కాన్వెంట్‌లో నన్ను చదివించారు. తరవాత మున్సిపల్ హైస్కూల్‌లో చేర్పించారు. బీకామ్ వరకు తెలుగు మీడియంలోనే చదివాను. టెన్త్ నుంచి కాలేజీ వరకు టాపర్‌ని. చదువుపై విపరీతమైన ఆసక్తి. బీకామ్ పాసైన రోజుల్లోనే చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉన్న మా కజిన్ ఒకరు ఇంటికి వచ్చారు. ఆడపిల్లలకు కంపెనీ సెక్రటరీ కోర్సు బాగుంటుందని చెప్పారు. అందులో లాభనష్టాలను వివరించారు. నా ఆసక్తిని గమనించిన మా తలిదండ్రులు నన్ను చెన్నైకి పంపారు. ఈ లోపు వివాహం జరిగింది. శ్రీవారు యుగంధర్ సంపత్ కుమార్. ఎంబిఎ చేసిన ఆయన 'రుచి కార్పొరేట్ సొల్యూషన్స్' ఎండీ. బీకామ్ చదివిన మా మావగారు రాధాకృష్ణ మూర్తి ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా చేశారు. మా అత్తగారు లలితాంబ ఇంటర్ చదివారు. అలా ఇంట్లో అందరికీ చదువుపై మంచి అవగాహన ఉంది. కంపెనీ సెక్రటరీ కోర్సు చేస్తే ఎంత బాగుంటుందో మావగారికి తెలుసు. దాంతో ఆయన, మా వారు నన్ను ప్రోత్సహించారు.

అప్పట్లో మేం గుంటూరులో ఉండేవాళ్ళం. మా వారు నన్ను ఒక రోజు హైదరాబాద్‌కు తీసుకువచ్చి, ఉండేందుకు అన్ని వసతులు సమకూర్చి, చేతిలో ఒక సెల్ ఫోన్ పెట్టి వెళ్ళారు. 'నువ్వు ఈ కోర్సు పూర్తి చేయి, భవిష్యత్తు బాగుంటుంది' అన్నారు.

ఇక్కడే ఒక విషయం చెప్పాలి... కంపెనీ సెక్రటరీ కోర్సులో చేరినప్పుడు దాని విశిష్టతపై కజిన్ చెప్పింది తప్ప నాకంటూ ప్రత్యేక అభిప్రాయం లేదు. కోర్సులో చేరిన తరవాత మాత్రం సబ్జెక్టులపై పూర్తిగా అవగాహన పెంచుకున్నాను. అంతే కాదు, ఇదే విషయమై నిడుబ్రోలు నుంచి మా జిల్లాలో సెమినార్లలో చెప్పేదాన్ని. మొదటి నుంచి సమాజ సేవ అంటే నాకు ఇష్టం. వివిధ కోర్సులపై ముఖ్యంగా ఆడపిల్లలకు అవగాహన ఉంటే రాణిస్తారని నమ్మేదాన్ని. నమ్మడమే కాదు ఆచరణలో పెట్టేదాన్ని. ఏడేళ్ళుగా ఇక్కడి చాప్టర్ కార్యకలాపాల్లో వివిధ హోదాల్లో పాలుపంచుకుంటున్నా. ఇప్పుడు అధ్యక్ష బాధ్యతలు చేపట్టా.

❖ మొదటి సమావేశంలోనే ప్రశంసలు

కోర్సు పూర్తి చేసిన తరవాత, నేను ప్రైవేటు ప్రాక్టీస్ ఎంచుకున్నా. అందుకోసం ప్రైవేటుగా ప్రాక్టీస్ చేస్తున్న చిదంబరం అనే పెద్దాయన దగ్గర చేరాను. ప్రాక్టీస్‌లో మెలకువలు నేర్చుకునేందుకు ఆయన చాలా తోడ్పాటు అందించారు. ఆ క్రమంలో మొదటిసారి ఒక కంపెనీ వార్షిక సమావేశాన్ని నిర్వహించా. వార్షిక సమావేశం అంటే నిజానికి మన ఇళ్ళలో జరిగే ఒక వేడుక లాంటిది. వచ్చిన అతిథులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా ఎంతో మర్యాదగా చూసుకుంటాం. ఫంక్షన్ స్థాయిని బట్టి కొన్నిరోజుల ముందు నుంచి ఒక ప్లాన్ ప్రకారం పనిచేస్తాం. ముఖంపై నవ్వు పులుముకుంటాం. ఇక్కడ కూడా అదే పద్ధతి. అయితే అంతా అధికారికంగా ఉండాలి. షేర్ హోల్డర్లందరికీ సమావేశ వివరాల నుంచి మర్యాదల వరకు అంతా పద్ధతి ప్రకారం జరగాలి. సమావేశంలో వెల్లడించాల్సిన సమాచారం పక్కాగా ఉండాలి. ఎక్కడా బెసగకూడదు. నా మొదటి సమావేశం విజయవంతంగా ముగిసింది. కంపెనీ యాజమాన్యం ఎంతో ప్రశంసించింది. 'పక్కా ప్రొఫెషనల్‌గా పని చేశావమ్మా' అన్నారు. ఆ విజయం అంత తేలికగా ఏమీ సాధ్యం కాలేదు. పది రోజులు లోతుగా అధ్యయనం చేసి మరీ సన్నద్ధం కావడంతో అంత మెరుగ్గా పనిచేయగలిగాను. ఆ కంపెనీ జెన్ సెక్యూరిటీస్. దాని అధినేత కంతేటి రవీంద్రబాబు. ఇంతకు మునుపు చెప్పిన ప్రశంస కూడా ఆయన నుంచి వచ్చినదే. గుంటూరు నుంచి హైదరాబాద్ రావడానికి ఆయనే కారణం. 'నీ తెలివి తేటలకు హైదరాబాద్ కరెక్ట్ ప్లేస్' అని చెప్పి ప్రోత్సహించారు. ఆయన చేసిన మేలు మరువలేనిది.

❖ సవాళ్ళూ ఉంటాయి మరి!

మరీ లోతుల్లోకి వెళ్ళకూడదు కాని, కంపెనీ సెక్రటరీగా నేను పాల్గొన్న ఒక సమావేశం తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఆ కంపెనీ డైరెక్టర్ల మధ్య సఖ్యత పూర్తిగా చెడింది. ఒకరి అంతం మరొకరు చూసుకునే పరిస్థితి. అలాంటి సమయంలో ఓ సమావేశం ఉదయం పదింటికి ఆరంభమై రాత్రి ఎనిమిది గంటలకు ముగిసింది. ప్రత్యర్థులను చల్లబరిచి, సమంజసమైన పరిష్కారం చూపి ఒప్పించేసరికి నాకు చుక్కలు కనిపించాయి. తలప్రాణం తోకకు రావడం అంటే ఏమిటో అర్థమైంది. అలాగే మరో కుటుంబ కంపెనీ. భార్యభర్తలు ఇద్దరూ కలిసి నిర్వహిస్తున్నారు. ఇద్దరి మధ్య గొడవ విడాకుల వరకు వచ్చింది. కంపెనీలోనూ అదే గొడవ పొడసూపింది. ఒక మహిళగా ఈ కేసులో నేను అతని భార్యపక్షాన ఉంటానంటే కుదరదు. కంపెనీ సెక్రటరీగా నిబంధనలే నేను అమలు చేయాలి. సమన్యాయం పాటించాలి. ఎవరో ఒకరికి వంతపాడటం ప్రొఫెషనల్‌గా కుదరని పని. ఇది కూడా అతి కష్టం మీదే తేల్చాను. ఇలాంటి ఒకట్రెండు తప్ప అన్నీ సాఫీగానే జరిగాయి.

❖ కత్తిమీద సాము

కంపెనీ లాభాల బాట పట్టాలన్న ఆకాంక్ష ఒక్కటే డైరెక్టర్లలో ఉంటుంది. అయితే నిబంధనలకు అనుగుణంగా కంపెనీ సాగాలి. డైరెక్టర్ల ఆశలు, కంపెనీ నిబంధనల మధ్య సమన్వయం కుదర్చాలంటే ఎంతో పరిజ్ఞానం ఉండాలి. చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే డైరెక్టర్ల ప్రశ్నలకు పరిష్కారం కనుగొనాలి. ఎంతటి జటిల సమస్యకైనా మన కంపెనీ సెక్రటరీ ఇట్టే పరిష్కారం చూపుతుందన్న నమ్మకం పెంచుకోవాలి. ఉన్న వెసులుబాట్లను ఉపయోగిస్తూనే, 'ఈ నిబంధనలను పాటించక తప్పదండీ' అని సున్నితంగా, పద్ధతిగా చెప్పగలగాలి. పట్టుదలకు మన పరిశ్రమ తోడైతే ఈ రంగంలో ఎదగడానికి ఆకాశమే హద్దు!

● మద్దిపట్ల మణి, ఫోటోలు: ఎం.గోపీకృష్ణ



ఒక పురుషుడి విజయం వెనుక మహిళ ఉంటుందంటారు. నా అనుభవం మాత్రం మహిళ విజయం వెనుక కుటుంబం అంతా ఉండాలని అనిపిస్తుంది. ఇటు మా ఇంట్లో, అటు అత్తగారింట్లో అందరూ ఎంతో కొంత చదువుకున్న వారు కావడంతో నా ఆకాంక్ష నెరవేరింది. ఈ రోజుకీ నా కుటుంబమే నాకు పెద్ద అండ.

ఆడపిల్లలకు అనువైన కోర్సు

ఆడపిల్లలకు బాధ్యతలు ఎక్కువ. పెళ్ళి, పిల్లలు, తనదంటూ సంసారం ఉంటాయి. అన్నీ హాయిగా అనుభవిస్తూనే, చక్కగా, హుందాగా చేసుకునే పని అంటూ ఏదైనా ఉందంటే అది కంపెనీ సెక్రటరీ మాత్రమే. కంప్యూటర్, చేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు పనులు చక్కబెట్టే రోజులివి. దీనికి మన పరిజ్ఞానం తోడు కావాలి. ఇంట్లో కూర్చుని కూడా కంపెనీ సెక్రటరీగా ప్రైవేటు ప్రాక్టీస్ చేయవచ్చు. పనిగంటలను మనకు అనుకూలంగా మార్చుకుని బాధ్యతలను నెరవేర్చవచ్చు. కంపెనీ సెక్రటరీ పని దాదాపుగా నగరాల్లోనే ఉంటుంది. కర్మాగారాలు ఎక్కడ ఉన్నప్పటికీ, చాలావరకు కంపెనీల ప్రధాన కార్యాలయాలు మెట్రో నగరాల్లోనే ఉంటాయి. అందువల్ల పని యావత్తు నగరాల్లోనే ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో పనిచేయాల్సిన అవసరమే ఉండదు. ప్రైవేటు ప్రాక్టీస్ అయినా కార్పొరేట్ కార్యాలయలో పని చేసినా ఇబ్బంది ఉండదు. ఐటి మాదిరిగా షిఫ్టుల్లో పని చేయనవసరం లేదు. బ్యాంకులు, ఇన్సూరెన్స్, జిఎస్‌టి, సెక్రటేరియల్ సంబంధ న్యాయ సేవల వరకు దేనినైనా నచ్చినది ఎంపిక చేసుకుని హాయిగా మన పని చేసుకోవచ్చు. ఇప్పటి నిబంధనల ప్రకారం పట్టుమని పాతికేళ్ళు నిండకుండానే ఈ కోర్సు పూర్తి చేయవచ్చు. తరవాత ఎకాయెకిన డైరెక్టర్ల సరసన కూర్చుని వ్యవహారాలను చక్కబెట్టే ఉద్యోగం మనల్ని ఆహ్వానిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారెవ్వరూ నిరుద్యోగులుగా లేరు. ఇప్పటికి ఉన్న డిమాండ్‌ను చూస్తే మరో పదేళ్ళయినా ఉపాధికి ఢోకా ఉండదు.

ప్రేమ కానుక ఇస్తున్నారా...

జస్ట్ ఎ మినిట్!



ప్రేమికుల రోజు వస్తోందంటే కుర్రకారు గుండెల్లో గంట మోగుతుంది. పూలగుత్తులూ, గ్రీటింగ్ కార్డులూ, ఒకటేమిటి? ప్లాన్లు బోలెడన్ని ఉంటాయి. అయితే 'ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి?' అనే మీమాంస ఒక పట్టాన తేలదు. జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే ఇలాంటి ఇబ్బందులు పడక్కర్లేదంటున్నారు 'ప్రేమ గురువులు'.

గిఫ్ట్

కొత్తగా ట్రై చెయ్యండి

ప్రేమికుల రోజున నూటికి తొంభై అయిదుగురు ఇచ్చే బహుమతుల్లో తప్పనిసరిగా ఉండేవి ఏమిటో తెలుసా? పువ్వులు. ప్రత్యేకించి ప్రేమకు చిహ్నం లాంటి గులాబీ పూలు. వాటితోపాటు వేరే గిఫ్ట్‌లు కూడా చాలామంది ఇస్తూ ఉంటారు. అయితే, ఏ గిఫ్ట్ కావాలని మీ స్నేహితుణ్ణో, స్నేహితురాలినో అస్సలు అడగొద్దు. వాళ్ళని ఊహించుకోనివ్వండి. వాటిని మించిన బహుమతి ఇవ్వడానికి ప్రయత్నించండి. గుండె ఆకారం బొమ్మల్లాంటివి ఇప్పుడు బాగా అరిగిపోయిన ఓల్డ్ ఫ్యాషన్ అయిపోయాయి. కొత్తగా ఏదైనా ట్రై చెయ్యండి.

అభిరుచి ముఖ్యం

మీరు ఇచ్చే బహుమతి మీ అభిరుచిని, దాన్ని అందుకొనేవారి అభిరుచిని ప్రతిఫలించాలి. అంతేకానీ తాహతుకు మించి ఖర్చు చేయనక్కర్లేదు. నిజమైన ప్రేమలో దేని విలువైనా ఖరీదులో ఉండదనేది గుర్తుంచుకోండి.

ఇలా ప్లాన్ చెయ్యండి

ఒక్కోసారి మీ స్నేహితురాలో, స్నేహితుడో మాట్లాడే మాటల్లో మీకు కొన్ని సూచనలు దొరకొచ్చు. జాగ్రత్తగా గమనించండి. 'ఫలానా చోట ఆ వస్తువులు బాగుంటాయి!', 'మనం ఎప్పుడూ ఆ రెస్టారెంట్‌కి వెళ్ళలేదు కదా!'... ఇలాంటి మాటల్లో వారి ఆసక్తిని మీరు తెలుసుకోవచ్చు. దాని ప్రకారం ప్లాన్ చేసుకోండి.

మొక్కగా మొదలై

మీ మధ్య ప్రేమ ప్రారంభ దశలో ఉంటే ఒక చిన్న మొక్కను బహుమతిగా ఇవ్వడం మంచి ఐడియా. 'ఈ మొక్కలా మన అనుబంధం రోజురోజుకూ పెరగాలి!' అని ఒక నోట్ కూడా దానికి జత చేయండి. ఆ మొక్కను మీ ఫ్రెండ్ శ్రద్ధగా సంరక్షిస్తూ ఉంటే మీ పట్ల ఆసక్తి గాఢంగా కొనసాగుతున్నట్టు మీకు అర్థమవుతుంది. మీ అనుబంధం పెళ్ళి వివాహ బంధంగా మారితే... ఇదంతా మీకు ఒక తియ్యటి జ్ఞాపకం అవుతుంది.

గరిట తిప్పండి



అమ్మాయి, అబ్బాయి కలిసి రెస్టారెంట్లకు వెళ్తూండడం ఇప్పుడు మామూలే. మరి వాలెంటైన్స్ డేకీ, మామూలు రోజులకీ తేడా ఏం ఉంటుంది? అందుకే స్వయంగా వండి మీ ఫ్రెండ్‌కి వడ్డించండి. అది మీ ఇద్దరికీ ఎంతో స్పెషల్ అకేషన్ అవుతుంది.

ఏదైనా సొంతంగా

వాలెంటైన్స్ డే గ్రీటింగ్ కార్డులు మార్కెట్లో గుట్టలకొద్దీ దొరుకుతాయి. వాటిలో కొటేషన్లు కూడా బాగానే ఉంటాయి. కానీ అవి మీ సొంత అనుభూతులు కావు కదా! మీరేం అనుకుంటున్నారో కాగితం మీద పెట్టండి. స్వయంగా గ్రీటింగ్ తయారు చెయ్యండి. మీ చేతుల్తో మీ ఫ్రెండ్‌కు అందించండి.

నిజాయతీ ముఖ్యం

మీ భావాలను వ్యక్తపరుస్తూ ఒక కవిత లేదా కవితాత్మకంగా ఉన్న వాక్యాలూ రాయండి. అయితే అతిగా ఇంప్రెస్ చెయ్యడానికి లేనిపోనివి రాయొద్దు. అసంబద్ధమైన వర్ణనలు చెయ్యడానికి ప్రయత్నించొద్దు. ప్రేమలో నిజాయతీ ముఖ్యమని గుర్తుపెట్టుకోండి.

హర్ట్ చెయ్యొద్దు

మీ బహుమతులు... ముఖ్యంగా గర్ల్ ఫ్రెండ్స్‌కు ఇచ్చేవి- వారు అవమానపడేలా, సిగ్గుపడేలా, బాధపడేలా ఉండకూడదు.

లావుకు సెలవు చెప్పాలంటే...

లావుగా ఉన్న అమ్మాయిలు సన్నబడడానికి పడని కష్టం ఉండదు. సన్నగా...నాజూగ్గా...నేవళీకంగా, అందంగా ఎలా కనిపించాలని ఇరవైనాలుగు గంటలూ ఆలోచిస్తుంటారు. అయితే ఇది ఒక రోజులో సాధ్యమయ్యే పని కాదు. దీనికి పద్ధతైన డైట్ అలవాటు చేసుకోవాలి. అంతేనా...? నిత్యం వ్యాయామాలు కూడా చేయాలి. ఇందుకు కొన్ని చిట్కాలు...

- ✳ జీవనశైలిలో శాశ్వత మార్పులు రావాలి.
- ✳ తినే ఆహారం విషయంలో మార్పులు ఉండాలి.
- ✳ నిత్యం వ్యాయామాలు చేయాలి.
- ✳ మంచి నిద్ర పోవాలి.
- ✳ పీచుపదార్థాలు ఉండే కాయగూరలను తినాలి.
- ✳ నీళ్లు బాగా తాగాలి.
- ✳ లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లు ఎక్కాలి.
- ✳ ఎంట్రెన్స్‌కు దూరంగా కారు పార్కు చేసుకుంటే కనీసం కొంతదూరమైనా నడవొచ్చు.
- ✳ సరిగా నిద్రపోకపోతే ఆకలి మందగిస్తుంది.
- ✳ తక్కువ నిద్ర పోతే ఎక్కువ బరువు పెరుగుతారు.
- ✳ రోజూ కనీసం 45 నిమిషాలు నడవాలి.
- ✳ టైముకు ఆహారం తీసుకోవాలి.
- ✳ క్రమశిక్షణాయుతమైన జీవితాన్ని పాలో అవాలి.
- ✳ ఇన్ని చేసినా శరీర బరువు తగ్గలేదనుకోండి వైద్యుని సంప్రదించాలి.
- ✳ లావుగా ఉన్నామనుకోగానే చాలామంది సర్జరీకి వెళిపోతుంటారు. కానీ ఇది సరైన నిర్ణయం కాదు.
- ✳ పూర్తి స్థాయి వైద్యపరీక్షల అనంతరం వైద్యుల సూచనల ప్రకారం నడుచుకోవాలి.



నేడు మహాశివరాత్రి

స్మరించినంత మాత్రాన ముక్తినిచ్చే క్షేత్రం అరుణాచలం. స్వయంభువుగా కొలువైన అక్కడి శివుడు అరుణాచలేశ్వరుడు. ఈ క్షేత్ర మహిమ పురాణ ప్రసిద్ధం. శివ పురాణం, స్కాంద పురాణం, లింగ పురాణాల్లోనే కాకుండా ఋగ్వేద, అధర్వణ వేద మంత్రాల్లో కూడా అరుణాచల ప్రసక్తి ఉంది. కొన్ని ఉపనిషత్తులు, సంహితలు అరుణాచల మాహాత్మ్యాన్ని ప్రశంసించాయి.

అరుణాచలం.. శివమయాచలం!

శివరాత్రితో ముడిపడిన క్షేత్ర పురాణం!

అరుణాచలానికి ఎన్నో పేర్లున్నాయి. ప్రధానంగా శోణాద్రి (ఎర్రని కొండ)గా ప్రాశస్త్యం పొందింది. ఈ పేరు రావడానికీ, అరుణాచలానికీ- శివరాత్రికీ ఎంతో సంబంధం ఉంది. దీనికి సంబంధించిన కథ ఇది.

బ్రహ్మ విష్ణువుల మధ్య 'ఎవరు గొప్ప?' అనే వాదం తలెత్తింది. అది వివాదంగా మారింది. యుద్ధానికి దారితీసింది. బ్రహ్మాస్త్ర, నారాయణాస్త్రాల ప్రయోగానికి వారు సిద్ధమవుతున్న సమయంలో- బ్రహ్మ విష్ణువుల మధ్య మహాగ్ని స్తంభంగా పరమ శివుడు ఆవిర్భవించాడు. ఇదీ క్లుప్తంగా కథ.

అలా ఆవిర్భవించింది శివుడని తెలుసుకున్న బ్రహ్మ విష్ణువులు ప్రార్థించడంతో శివుడు సాక్షాత్కరించాడు. "త్రిమూర్తులలో ఎక్కువ, తక్కువలకు తావు లేదు. సృష్టి-స్థితి-లయాలకు ప్రతీకలుగా ముగ్గురినీ పరాశక్తి సృష్టించింది. ఆమె సంకల్పాలను నిర్వర్తించడమే మన కర్తవ్యం" అని హితబోధ చేశాడు.

శివుడు అగ్నిలింగంగా ఆవిర్భవించిన సమయం మాఘ కృష్ణ చతుర్దశి- అర్ధరాత్రి. ఆ రోజును మహా శివరాత్రి పర్వదినంగా యావద్భారతదేశం పాటిస్తోంది. మహాదేవుడికి తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, నిర్వహిస్తారు. భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, శివనామాన్ని జపిస్తారు. శివాలయాలకు వెళ్తారు. రాత్రి జాగరణం చేసి, లింగోద్భవ సమయంలో (అర్ధరాత్రి) శివుడిని దర్శించి, అనుగ్రహ పాత్రులవుతారు.

ఆధ్యాత్మిక రమణాచలం!

మహాశివరాత్రి అనగానే తమిళనాడులోని అరుణాచలం గుర్తుకొస్తుంది. అరుణాచలం అనగానే భగవాన్ శ్రీ రమణ మహర్షి స్మరణకు వస్తారు. పద్నాలుగేళ్ళ వయసులో అరుణాచలం వచ్చిన వెంకటరామన్ (రమణ మహర్షి) జీవితాంతం అరుణగిరి సానువులలోనే గడిపారు. అరుణాచలానికీ, రమణ మహర్షికీ మధ్య అంత విడదీయరాని బంధం ఉంది. "అరుణాచలాన్ని పాషాణాలు, ముళ్ళ పొదలతో కూడిన మామూలు పర్వతంగా భావించవద్దు. ఇది పరమేశ్వరుని ప్రతిరూపం. అరుణం అంటే శక్తి- పార్వతి, ప్రకృతి, అచలం అంటే నిశ్చలాత్మ, శివుడు, పురుషుడు. ప్రకృతీ పురుషుల సమ్మేళనం... సగుణ నిర్గుణా ఏకత్వ రూపం ఇది!" అని ఆయన అనేవారు.

హిమాలయాల కన్నా పురాతనం!

పురాతత్వ శాస్త్రవేత్తలు కూడా అరుణగిరి గొప్పతనాన్ని శాస్త్రీయంగా నిరూపించారు. సృష్టికి పూర్వమే అరుణగిరి ఉందనీ, సూర్యుడి నుంచి విడివడిన భూమి అగ్నిమయంగా ఉన్న దశ నుంచి ప్రకృతిలో సహజ సిద్ధమైన మార్పులు పొందుతూ చల్లబడి ఏర్పడిన తొలి పాషాణమయ స్థానం అనీ, ఇది ఆసియా ఖండంలో భాగం కాదనీ, అప్పటి మహా సముద్రంలో మునిగిన లెమోరియా ఖండంలో భాగమనీ, హిమాలయాల కన్నా పురాతనమైన పర్వతమనీ ధ్రువపరిచారు.

దీనికి సంబంధించి-

గంగాచ మూలభాగస్థా
యమునా గగనస్థితా!
సోమోద్భవ శిరోభాగే
సేవంతే శోణ పర్వతః!!

అని స్కాంద పురాణం స్పష్టంగా చెబుతోంది.



సాధారణంగా పర్వతాలు చెట్లూ, పుట్టలతో పచ్చగా ఉంటాయి. కాని అరుణగిరి ఆ పేరులోనే ఉన్న వర్ణంతో ప్రకాశిస్తూ ఉంటుంది. "అరుణగిరి అగ్నితత్త్వానికి సంకేతం. ఇది ధరిత్రికి హృదయం వంటిది. సత్య స్వరూపం. జ్ఞాన తేజస్సు. శ్రేష్ఠతమం" అని ఋగ్వేదం కీర్తించింది.

ముక్తిదాయకం గిరిప్రదక్షిణం

అరుణాచలేశ్వరుని దేవేరి అపీత కుచాంబ. నలుదిశలా ఎత్తైన ప్రాకారాలతో, అరుణగిరి సానువులో నెలకొన్న అతి విశాలమైన అరుణాచలాలయంలో శివ కుటుంబంలోని గణపతి, కుమారస్వామి ఆలయాలున్నాయి. ఈ గిరి చుట్టూ ముక్కోటి దేవతలు శివలింగాలను ప్రతిష్ఠించారు. అరుణగిరిపై దక్షిణామూర్తి కొలువు తీరాడు. బ్రహ్మాది దేవతలందరూ అరుణగిరి ప్రదక్షిణం చేసేవారని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరమణ మహర్షి కూడా అరుణగిరి ప్రదక్షిణం చేయాల్సిందిగా భక్తులకు చెప్పడమే కాదు- ఆయన కూడా భక్తులతో కలిసి ప్రదక్షిణం చేసేవారు.

వైభవంగా శివరాత్రి

అరుణాచలంలో సంవత్సరంలో ఎన్నో పండుగలు, పర్వాలు జరుగుతాయి. అన్నిటిలో ప్రధానమైనది శివరాత్రి. ఆ రోజున దివారాత్రాలు అసంఖ్యాకంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. రోజంతా అరుణాచలేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు నిరంతరాయంగా జరుగుతాయి. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఒక్కసారిగా గుడిలోని గంటలన్నీ మ్రోగుతాయి. శంఖనాదాలు మిన్నుముడతాయి. కర్పూర హారతి ప్రకాశిస్తూ ఆకాశంలో పున్నమి చంద్రుడి వెన్నెలను భాసింపజేస్తుంది. "అరుణాచల శివా! అరుణాచల శివా!" అనే శరణు ఘోష దశదిశలా ప్రతిధ్వనిస్తుంది.



అరుణాచలేశ్వరునీ, అపీత కుచాంబనూ దర్శించి భక్తులు తన్మయులవుతారు.

అత్యద్భుతమైన ఈ ప్రాచీన ఆలయంలో శ్రీకృష్ణదేవరాయలు మంటపాలను, గోపురాలను నిర్మించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. 'అరుణగిరి వాసం, ఇక్కడ మరణం ముక్తిదాయకం. ఇది గొప్ప తీర్థక్షేత్రం. స్మరించిన మాత్రాన ముక్తి కలుగుతుంది' అని శివపురాణం ఉల్లేఖించింది. శివభక్తికి ప్రధాన క్షేత్రమైన అరుణాచలంలో ఈశ్వరుని, అపీత కుచాంబను, అరుణగిరిని దర్శించినవారికి ఆ ఆది దంపతుల అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

● ఏ. సీతారామారావు



ప్రేమ రంగు వెలిసిందా?

రోజూ ఒకే కూర తింటే మొహం మొత్తుతుంది. అలాగే జంటల మధ్య ప్రేమానుబంధం కూడా! అనుబంధం మరీ రొటీన్‌గా మారినట్టు అనిపిస్తే, బీరువాలో దాచుకున్న ప్రేమ లేఖలు, సందేశాలు, బహుమతులు బయటికి తీసి ఆ సందర్భాలను గుర్తు చేసుకోవాలి. కలిసి తిరిగిన ప్రదేశాలను సందర్శించాలి. ఇష్టమైన పనులు కలిసి చేయాలి. అంతే! తుర్రుమన్న ఆకర్షణ, ఆప్యాయతలు మళ్లీ దరి చేరతాయి.

ప్రేమ మతలబులు

లవ్ ఫ్యాక్ట్స్

ప్రేమలో ఎందుకు పడ్డావు? అని అడిగితే...'ప్రేమలో పడటానికి నిర్దిష్ట కారణమంటూ ఉండదు. అలా ఉంటే అది ప్రేమెలా అవుతుంది?' అని ఎదురు ప్రశ్నిస్తూ ఉంటారు ప్రేమికులు. శాస్త్రీయంగా పరిశీలిస్తే వాళ్ల మాటల్లోనూ నిజం లేదనిపిస్తుంది. ఎందుకంటే...

- ఎక్కువ శాతం మంది స్త్రీలు బాగా నవ్వించే పురుషుల్ని ఇష్ట పడుతూ ఉంటారు. నవ్వించే గుణం వాళ్లలోని తెలివితేటలకు, నిజాయితీకి దర్పణాలని పరిశోధనల్లో తేలింది.
- ప్రేమించిన వ్యక్తి చేతులు పట్టుకుని కొద్దిసేపు కళ్లలోకి సూటిగా చూస్తే, ఒంటి నొప్పులు, ఒత్తిడి, భయాలు తగ్గుతాయని ప్రయోగాల్లో రుజువైంది.
- ప్రేమలో వైఫల్యం చెంది, పార్ట్‌నర్‌కు దూరమైతే 'ఫ్రస్ట్రేషన్ అట్రాక్షన్' అనే చిత్రమైన స్థితికి లోనవుతారు. ఇలాంటప్పుడు వదిలేసిన వ్యక్తి మీదే విపరీతమైన ఆకర్షణ, ప్రేమ పెరిగిపోతాయి.

స్వయంతృప్తి తప్పా? ఒప్పా?



సెక్సువల్ హెల్త్

ప్రశ్న: నాకు చిన్నప్పటి నుంచి స్వయంతృప్తి అలవాటు ఉంది. కానీ నాకే ఈ అలవాటు ఉందా? అందరికీ ఉంటుందా? అనే అనుమానం నన్ను వేధిస్తూ ఉంటుంది. స్వయంతృప్తితో భావప్రాప్తి పొందిన ప్రతిసారీ తప్పు చేసిన భావన కలుగుతూ ఉంటుంది. అలాగని ఆ పని చేయకుండా ఉండలేకపోతున్నాను. అసలు స్వయంతృప్తి పొందటం అనేది సహజసిద్ధమైన చర్యేనా? స్వయంతృప్తి వల్ల ఆరోగ్య సమస్యలొస్తాయా?

స్వయంతృప్తి సహజసిద్ధమైన, సాధారమైన చర్య. ప్రతి ఒక్కరూ స్వయంతృప్తి పద్ధతులను అనుసరిస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరు స్వయంతృప్తి ద్వారానే జీవితంలో మొదటి లైంగిక తృప్తి పొందుతారు. మీరు అనుకుంటున్నట్టు ఈ పని తప్పేమీ కాదు. కాబట్టి మీరు నిరభ్యంతరంగా స్వయంతృప్తి పొందవచ్చు. స్వయంతృప్తి వల్ల శారీరకంగా, మానసికంగా ఎటువంటి అస్వస్థతలూ కలగవు. ఎంత తరచుగా చేసినా ఎటువంటి సమస్యలూ తలెత్తవు. అయితే అతి తక్కువ సమయంలో ఎక్కువ సార్లు స్వయంతృప్తి సాధన చేయటం వల్ల మర్మాయవాల్లో కొద్దిగా నొప్పితో కూడిన అసౌకర్యం కలగవచ్చు. కొందరు భాగస్వాములతో స్వయంతృప్తి పొందుతూ ఉంటారు. ఈ పద్ధతి లైంగిక కలయిక కంటే ఎంతో సురక్షితం. ఈ పద్ధతి వల్ల ఒకరి నుంచి మరొకరికి సుఖ వ్యాధులు సోకకుండా ఉంటాయి. అయితే మర్మావయవ స్రావాలు చేతుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సరఫరా జరగకుండా ఉండాలి. చాలామంది స్వయంతృప్తి గురించి మాట్లాడటానికి సిగ్గు పడుతూ ఉంటారు. కానీ ఈ అలవాటు గురించి జంకవలసిన అవసరం లేదు. ఎంత తరచుగా స్వయంతృప్తి పొందినా ఎటువంటి నష్టమూ జరగదు. లైంగిక కోరికలను అదుపు చేసుకుని ఒత్తిడికి లోనవటం లేదా లైంగిక కోరికలను అదుపు చేసుకోలేక లైంగిక దాడులకు పాల్పడటం కంటే స్వయంతృప్తితో లైంగిక సంతృప్తి పొందటం అన్ని విధాలా క్షేమకరం. అయితే స్వయంతృప్తి అలవాటు వల్ల మీ దైనందిన జీవితం ఇబ్బందికరంగా మారితే తప్పకుండా సెక్సాలజిస్ట్‌ని సంప్రదించి తగిన సూచనలు తీసుకోండి.




డా॥ షర్మిలా మజుందార్,
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకోఅనలిస్ట్,
Email :mili77@gmail.com

ప్రేమారోగ్యాన్ని పెంచే విటమిన్లు

హెల్త్ వెల్త్

ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే మనసు ఉరకలేస్తూ, ఉల్లాసంగా ఉంటుంది. అలాంటి స్థితిలోనే ప్రేమలో పడటమూ సాధ్యపడుతుంది. కాబట్టి అన్ని విటమిన్లూ సరిపడా అందే ఆహారం తినాలి. అన్నిటికంటే ముందు ఆ విటమిన్ల వల్ల ఉపయోగాలేంటో? ఎందుకు తినాలో తెలుసుకుందాం!



విటమిన్ ఎ
దీనికి 'రెటినాల్' అనే మరో పేరు కూడా ఉంది.
క్యారెట్లు, ఆకు పచ్చని కూరగాయలు, ఆకు కూరలు, చిలకడ దుంపల్లో ఎ విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
కంటి చూపుకు ఎ విటమిన్ ఎంతో అవసరం.
ఈ విటమిన్ లోపిస్తే రాత్రివేళ కంటి చూపు తగ్గుతుంది.

విటమిన్ బి
దీనికి 'విటమిన్ బి కాంప్లెక్స్' అనే మరో పేరు కూడా ఉంది.
జంతు, డైరీ ఉత్పత్తుల్లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
ఆహారాన్ని ఇంధనంగా మార్చి, శరీరానికి శక్తిని సమకూర్చటానికి బి విటమిన్ ఎంతో అవసరం.
విటమిన్ బిలో...బి1, బి2, బి3, బి5, బి6, బి7, బి9, బి12 రకాలుంటాయి.

విటమిన్ సి
దీన్ని 'ఆస్కార్బిక్ యాసిడ్' అనే మరో పేరుతో కూడా పిలుస్తారు.
పుల్లని పండ్లు, టమాటాల్లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
ఎదుగుదలకు, శరీరంలోని కణజాలాలు సమర్థంగా పని చేసి గాయాలు మానటానికి సి విటమిన్ ఎంతో అవసరం.
సి విటమిన్ లోపంతో స్కర్వీ వ్యాధి తలెత్తుతుంది.

విటమిన్ డి
దీనికున్న మరో పేరు 'కాల్సిఫెరాల్'.
కొవ్వుతో కూడిన చేపలు, గుడ్డులోని పచ్చ సొన, చీజ్‌లో డి విటమిన్ పుష్కలంగా ఉంటుంది.
బలమైన ఎముకలు, దంతాల కోసం డి విటమిన్ అవసరం.
విటమిన్ డి లోపంతో రికెట్స్‌కు గురవుతాం.

విటమిన్ ఇ
దీనికి 'టోకోఫెరాల్' అనే మరో పేరు కూడా ఉంది.
సోయాబీన్, బాదం, వేరుశనగల్లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
రోగనిరోధక శక్తికి, పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం పెరగటానికి విటమిన్ ఇ ఎంతో ఉపయోగపడుతుంది.
ఈ విటమిన్ లోపిస్తే నరాలు బలహీనపడతాయి.

విటమిన్ కె
దీన్ని 'ఫిలాక్వినోన్' అని కూడా పిలుస్తారు.
కేల్, బచ్చలి కూరల్లో కె విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
రక్తం గడ్డ కట్టడానికి ఈ విటమిన్ అవసరం.
ఈ విటమిన్ లోపిస్తే రక్తస్రావంతో సంబంధం ఉండే వ్యాధుల బారిన పడతాం!

ప్రేమమ్



లవ్ సైకాలజీ

ప్రేమ అనే పదానికి నిర్వచనాలు అనేకం. ఒకే ఆత్మ, రెండు శరీరాలతో జీవించటమే ప్రేమ అంటారు కొందరు. ఎదుటి వ్యక్తి సంతోషమే లక్ష్యంగా జీవించటమే ప్రేమ అంటారు మరికొందరు. ఆకలిలా ప్రేమ అనేది ఓ జీవితావసరం అంటారు ఇంకొందరు. వీటన్నిటిలో ఏది నిజం? అసలు ప్రేమ అనేది ఉందా? లేక పరస్పర ఆకర్షణనే ప్రేమగా భావిస్తున్నామా? వాలంటైన్స్ డే సందర్భంగా ప్రేమ అనుపానాలు తెలుసుకుందాం!

ప్రేమలో పడటం అత్యంత సహజమైన చర్య. ఎదుగుదలలో ఓ భాగం. చిన్నప్పటి నుంచీ ఎరిగిన తల్లితండ్రుల ప్రేమను మించిన మరేదో గమ్మత్తైన ప్రేమ మాయ యుక్త వయసులోకి అడుగు పెట్టిన ప్రతి ఒక్కరినీ ఏదో ఓ సందర్భంలో కమ్మేస్తుంది. అయితే ఆ మత్తులోకి జారిపోయే తీరు దశలవారీగా, కాలక్రమేణా జరుగుతుందా? లేక ఉరకలేసే కడలి అలలా ఒక్కసారిగా ప్రేమ సముద్రంలో ముంచేస్తుందా? ఇలా ప్రశ్నించుకోగలిగితే ప్రేమ తత్త్వం బోధపడుతుంది. ప్రేమంటే ఒకరిని విడిచి మరొకరు ఉండలేకపోవటం, ప్రేమించిన వ్యక్తి సంతోషం కోసం పరితపించటం...అనుకుంటే ఇవి అన్ని అనుబంధాల్లోనూ ఉంటాయి. తల్లి తన పిల్లల మీద ఇలాంటి ప్రేమనే కలిగి ఉంటుంది. అన్నకూ చెల్లెలి మీద ఇదే ప్రేమ ఉంటుంది. అలాంటప్పుడు ప్రేమికుల మధ్య ఉండే ప్రేమ మిగతా ప్రేమల కంటే ఏ రకంగా గొప్పది? ప్రాణాధిక ప్రేమలు ప్రేమికుల మధ్యే కాదు, కుటుంబసభ్యులందరి మధ్యా ఉంటాయి. కాబట్టి ప్రేమ లోతులు తెలుసుకోవాలంటే ఎవరికి వారు స్వీయ విశ్లేషణ చేసుకోవాలి.


స్వీట్ సిక్స్‌టీన్

యౌవనం జీవితాన్ని మలుపు తిప్పే కీలకమైన దశ. ఎంచుకున్న జీవిత లక్ష్యం కేసి సూటిగా సాగిపోవటానికి, లక్ష్యం గురి తప్పటానికీ ప్రతి వ్యక్తికీ ఓ క్లిష్ట పరీక్ష...యౌవనం. శరీరంలో విజృంభించే హార్మోన్లు, పరిసరాలు, పెరిగే వాతావరణం, చుట్టూ ఉండే వ్యక్తుల ప్రభావాలు...ఇలా ఎన్నో అంశాలు ప్రేమ భావనలను శాసిస్తాయి. అంతకు ముందు వరకూ లేని ఆకర్షణలు, ఆరాధనలు మొదలవుతాయి. నచ్చిన వ్యక్తికి అందంగా కనిపించాలనే తాపత్రయం పెరుగుతుంది. ఒకరి సాంగత్యం మరొకరికి అపురూపం అవుతుంది. నచ్చిన వ్యక్తి పొగడ్తల వర్షంలో తడిసి ముద్దవ్వాలనే ఆరాటం పెరుగుతుంది. ప్రారంభంలో ఇవన్నీ సహజమే! అయితే ఈ లక్షణాలన్నీ ఆకర్షణలో భాగాలే అనే విషయం అర్థం చేసుకోవాలి.

లోపాలు కూడా గ్రహించాలి

ప్రేమించిన వ్యక్తిలో మంచే కనిపిస్తుంది. లోపాలున్నా వాటి మీదకు మనసు వెళ్లదు. కానీ తమది సిసలైన ప్రేమో కాదో తెలుసుకోవాలంటే...ప్రేమించిన వ్యక్తిలోని లోపాలనూ కనిపెట్టగలగాలి. 'అతను/ఆమె అందంగా ఉంటాడు/ ఉంటుంది, అందుకే ప్రేమించాను' అంటే అది ఆకర్షణే తప్ప ప్రేమెలా అవుతుంది? 'ఫలానా రోజు నాకు సహాయం చేశాడు, అందుకే ప్రేమలో పడ్డాను' అంటే అది కృతజ్ఞతాభావనే...

లవ్ కెమిస్ట్రీ



'ఆకలుండదు, దాహముండదు నిన్ను చూస్తుంటే! వేరే ఆశ ఉండదు, ధ్యాస ఉండదు, నువ్వు తోడుంటే!' ఈ పాట గుర్తుందా? ప్రేమలో పడ్డప్పుడు అచ్చుగుద్దినట్టు ఇలాగే జరుగుతుంది. అయితే ఇందుకు కారణం ఇంకేదో...

భావోద్వేగాలు ప్రేమలు కావు

జీవిత లక్ష్యానికి ప్రేమ దన్ను కావాలి!

అతివృష్టి ప్రేమలు

ప్రేమించిన వ్యక్తికి ఊపిరాడనివ్వకుండా చేసే ప్రేమలుంటాయి. మనసు విరిచి ప్రాణాలు హరించే ప్రేమలూ ఉంటాయి. స్వేచ్ఛను హరించే అతివృష్టి ప్రేమలు విపరీతమైన పొసెసివ్‌నెస్‌తో అనుక్షణం అనుసరిస్తూ, గంటల తరబడి మాట్లాడుతూ, ప్రతి విషయాన్నీ పంచుకునే ప్రేమికుడిని చూసి ప్రారంభంలో ముచ్చటేస్తుంది. 'ఇతనికి నేను తప్ప వేరే లోకం లేదు' అనుకుని మురిసిపోతుంది. కానీ ఇదే తీరు మరింత ముదిరి, ఫోన్లు చెక్ చేయటం, ఇతరులతో మాట్లాడితే అనుమానించటం లాంటివి చేస్తుంటే ప్రేమ కాస్తా భయంగా మారుతుంది. ఇలా ప్రవర్తించే అమ్మాయిలూ లేక పోలేదు. అయితే అలాంటి ప్రవర్తనను ప్రేమగా చెబుతూ, తమను తాము సమర్థించుకోవటం వీళ్ల నైజం. అనుమానం, జెలసీలు వాళ్ల వ్యక్తిత్వంలో భాగాలై ఉండి, ప్రేమించిన వ్యక్తి జీవితాన్ని నరకప్రాయం చేస్తూ ఉంటారు. ఇలాంటి ప్రేమను బలవంతంగా భరించాల్సిన అవసరం లేదు. స్వేచ్ఛకు భంగం కలిగించేది ఏదీ ప్రేమ కాదు. కాబట్టి అనుమానం పెనుభూతమై ప్రమాదంలోకి తోసేయకముందే కళ్లు తెరవాలి. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలి. లోనవుతున్న ఇబ్బంది గురించి చెప్పాలి. అవసరమైతే చట్టాన్ని ఆశ్రయించాలి. ప్రేమలో పడిన పిల్లల్లో ఇలాంటి అతివృష్టిని తల్లితండ్రులూ తేలికగానే కనిపెట్టవచ్చు. అదెలాగంటే...

- ఎప్పుడూ ప్రేమించిన వ్యక్తి గురించే మాట్లాడుతూ ఉండటం.
- ప్రతి క్షణం ప్రేమించిన వ్యక్తికి ఫోన్ చేస్తూ, వారి కదలికలను కనిపెడుతూ ఉండటం
- తనతో తప్ప వేరొకరికి దగ్గర కావటాన్ని భరించలేకపోవటం
- అసహనం, కోపం పెరగటం
- చిరాకుతో కుటుంబసభ్యులతో తగాదాలు పడటం
- స్నేహితులను అడిగి ప్రేమించిన వ్యక్తి ఆరాలు తీయటం
- తమ మాట కాదంటే విపరీతంగా ఆవేశపడిపోయి భౌతిక దాడికి దిగడం

ప్రేమకు ప్రేమే పరిష్కారం!

ప్రేమోన్మాదాన్ని తగ్గించి, మామూలు మనుషుల్ని చేయవలసిన బాధ్యత తల్లితండ్రులతోపాటు ప్రేమించిన వ్యక్తీ తీసుకోవాలి. ఇందుకోసం...

- వారి చర్యల వల్ల తామెంత ఇబ్బంది పడుతున్నారో విడమరిచి చెప్పాలి.
- ప్రేమకు నమ్మకమే పునాది అనే విషయం అర్థమయ్యేలా చెప్పాలి.
- అనుమానంతో ప్రేమ అంతమవుతుందనే నిజాన్ని తెలియజెప్పాలి.
- వారి మీదున్న అవ్యాజ్యమైన ప్రేమను చేతల్లో చూపించే ప్రయత్నం చేయాలి.
- ఎటువంటి పరిస్థితుల్లోనూ తమ ప్రేమ తరిగిపోదనే నమ్మకాన్ని కలిగించాలి.
- తనకు దక్కకుండా పోతారేమోననే అభద్రతాభావాన్ని తొలగించాలి.



డాక్టర్. నరేష్ వడ్లమాని, సైకియాట్రిస్ట్, కొలంబస్ హాస్పిటల్, బేగంపేట, హైదరాబాద్.

అనావృష్టి ప్రేమలు

ప్రేమ వైఫల్యాలు కొందరి కళ్లు తెరిపిస్తే, మరికొందరి కళ్లను...

రాగి మొలకల జావ

హెల్దీ రెసిపీ



పసికందుల్లో కామెర్లు?

చైల్డ్ కేర్

అప్పుడే పుట్టిన పసికందుల్లో కామెర్లు ఎందుకు కనిపిస్తాయి? ఇలాంటి పిల్లలను ఎండ సోకేలా ఉంచితే కామెర్లు తగ్గిపోతాయా? ఒకవేళ తగ్గకపోతే బిడ్డ ఆరోగ్యం దెబ్బ తింటుందా?



72% నుంచి 80% మంది పిల్లలకు పుట్టిన వెంటనే కామెర్లు వస్తాయి. సాధారణంగా కామెర్లు ప్రసవం జరిగిన రెండవ రోజు నుంచే మొదలవుతాయి. ఆ తర్వాత 3 నుంచి 5 రోజుల్లో కామెర్లు పెరిగి, వారాంతంలోగా తగ్గిపోతాయి. పసికందుల్లో పుట్టుకతో తలెత్తే అధిక శాతం కామెర్లకు చికిత్స అవసరం ఉండదు. స్వతహాగానే కామెర్లు తగ్గిపోతాయి. పసికందుల్లో కనిపించే కామెర్లు పెద్దల కామెర్లలాంటివి కావు. ఈ కామెర్లకు కాలేయంతో సంబంధం ఉండదు. పుట్టిన వెంటనే పరిస్థితులకు అలవాటుపడే క్రమంలో పసికందుల శరీరంలో జరిగే మార్పుల ఫలితంగానే కామెర్లు కనిపిస్తాయి. కాబట్టి సాధారణంగా చికిత్సతో పని లేకుండానే వారంలోగా సర్దుకుంటాయి. కానీ కొందరు పిల్లల్లో కామెర్లు విపరీతంగా వస్తాయి. ముఖం, ఛాతీలతోపాటు కాళ్లూ, చేతులు కూడా పసుపు పచ్చగా మారిపోతాయి. ఇలాంటి పరిస్థితిలో పిల్లలకు ఫొటోథెరపీ లైట్స్ పెట్టి కామెర్లను తగ్గించవచ్చు. పిల్లల మూత్రం కూడా పచ్చగా ఉండి, మలం తెల్లగా ఉండి, కామెర్లు రెండు వారాలకు మించి కొనసాగితే పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఇలాంటి కామెర్లు తల్లీబిడ్డల రక్తగ్రూపు విభేదించినప్పుడు కనిపిస్తాయి. తల్లిది నెగిటివ్ బ్లడ్ గ్రూప్ ఉండి, బిడ్డది పాజిటివ్ ఉన్నా, తల్లిది ఓ పాజిటివ్ ఉండి, బిడ్డ రక్తం ఎ లేదా బి పాజిటివ్ ఉన్నా...పుట్టే పిల్లలకు కామెర్లు విపరీతంగా వస్తాయి. పిల్లలకు కామెర్లు ఉండటం మూలంగా తల్లి పథ్యాలు చేయవలసిన అవసరం లేదు. ఎటువంటి భయాలకూ లోనవకుండా బిడ్డకు నిరభ్యంతరంగా పాలివ్వవచ్చు. అయితే పిల్లలకు ఏ రకం కామెర్లు వచ్చాయనేది మాత్రం గమనించుకోవాలి. ఎండలో ఉంచినా కామెర్లు తగ్గకుండా, వారానికి మించి కొనసాగితే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. పుట్టుకతో కామెర్లు కనిపించిన పిల్లలను కచ్చితంగా నాలుగు, ఐదు రోజులకు వైద్యుల చేత పరీక్ష చేయించాలి. ఇక ఎండలో పెడితే ఎంతటి కామెర్లయినా తగ్గిపోతాయిలే అనుకుంటే పొరపాటు. కామెర్లు తగ్గటానికి ఎండ కొంత మేరకే తోడ్పడుతుంది.



డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
బంజారాహిల్స్, హైదరాబాద్.

విడిపోతారెందుకు?

పరిశీలన



ప్రేమికులంతా.... బతికినంత కాలం కలిసే ఉండాలని, ఉంటామని బలంగా అనుకున్నవారే కదా! అలా అనుకునే కదా పెళ్లికి సిద్ధమైపోతారు. అలా దంపతులైన వాళ్లల్లో కొందరు ఆ తర్వాత కాలంలో విడిపోవాలని అనుకుంటారెందుకు? అనుకున్న వారంతా విడిపోతారనేమీ కాదు గానీ, అందులో కొందరైతే నిజంగానే విడిపోతున్నారు కదా! ఎందుకలా అంటే ఎవరైనా ఏం చెప్పగలరు? ఒక్కొక్కరికీ ఒక్కో కారణం ఉంటుంది. తప్పనిసరై నాలుగు మాటల్లో ఏమైనా చెప్పాల్సివస్తే, మౌలికంగా కొన్ని కారణాలు కనిపిస్తాయి.

- ప్రేమికులను భావోద్వేగాలే ఎక్కువగా నడిపిస్తాయి. ప్రతి దాంట్లోనూ, భావుకత, కవితాత్మకత పొంగిపొర్లుతూ ఉంటుంది. "ఆకాశం దించాలా? నెలవంక తుంచాలా?" అన్నట్టుగా ఉంటుంది. పెళ్లి తర్వాత ఆ భావుకత అంతా ఎగిరిపోయి ఆ స్థానంలోకి వాస్తవికత చొరబడుతుంది. పెళ్లి అనేది ఎన్నో బాధ్యతల్ని తెచ్చిపెడుతుంది. ఆ బాధ్యతల నిర్వహణలో ఆ భావోద్వేగాలన్నీ కనుమరుగైపోతాయి. దీంతో అంతా చప్పగా రొటీన్‌గా అనిపిస్తుంది. అంతకన్నా మించి ఆ బాధ్యతా నిర్వహణలో ఎంత తలమునకలైపోయినా, అందులో తప్పులు వెతికే ధోరణి జీవిత భాగస్వామిలో రోజురోజుకూ పెరుగుతూ వెళుతుంది. ఇది బాగా చిరాకు పుట్టిస్తుంది.
- పెళ్లికి ముందు ప్రేమికులు ఏ విషయంలో ఏం చెప్పుకున్నా దాని వెనుక అనునయింపే ఉంటుంది. పెళ్లి తర్వాత చాలా వరకు అధికారికంగా చెప్పడమే ఉంటుంది. అధికారక ధోరణి మొదలైన మరుక్షణం నుంచే ప్రేమ హృదయం బీటలు బారడం మొదలవుతుంది. ఆ బీటలు ఇంకా ఇంకా పెరిగిపోతే అది శాశ్వతంగా దూరమయ్యేలా చేస్తుంది.
- ప్రపంచంలోని ఏ ఇద్దరి వ్యక్తిత్వాలూ ఒకటి కాకపోవడం విడిపోవడానికి గల ఒక ప్రధాన కారణం. కాకపోతే పెళ్లికి ముందు చాలా మంది ప్రేమికులు పరస్పరం నచ్చే సారూప్యాలను మాత్రమే బయటపెట్టి, వైరుధ్యాలను దాచేసుకుంటారు. అలా దాచేసుకోకపోతే ప్రేమ బెడిసికొడుతుందన్న భయమే అందుకు కారణం. పెళ్లయ్యేదాకా ఇరువురు ఆ జాగ్రత్తలతోనే ఉంటారు. అయితే పెళ్లయిపోయాక అలా దాచిపెట్టుకోవాల్సిన అవసరం కనిపించదు. అందుకే ఇన్నాళ్లు దాచిపెట్టుకున్న మరో పార్శ్వాన్ని నిస్సంకోచంగా బయటపెట్టేస్తారు. అప్పటిదాకా ఆ పార్శ్వాన్ని చూడని ఆ వ్యక్తిని ఇది దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. కొన్నాళ్లు ఏదోలా సర్దుకుపోయినా, ఈ వ్యక్తిని జీవితాంతం భరించడం కష్టమేనని, అందువల్ల విడిపోవడమే మేలనే అభిప్రాయానికి వచ్చేస్తారు.
- లోతుల్లోకి వెళితే విడిపోని వారంతా కలిసి ఉన్నట్లేమీ కాదు. బయటికి కనపడకుండా, లోలోపల అంతర్యుద్ధాలు చేస్తూనే ఉంటారు. ఏదో ఒక రోజున ఈ వైరుధ్యాలు సమసిపోయి, ఈ ఘర్షణలు ఆగకపోతాయా అని కొంత కాలం ఎదురు చూస్తూ ఉంటారు. ఒకవేళ అది ప్పటికీ జరగదని తేలిపోతే, ఈ తలనొప్పుల కన్నా ఎవరి జీవితం వాళ్లు జీవించమే ఉత్తమం అనే అభిప్రాయానికి వచ్చేస్తారు. ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోవడానికి సిద్ధమైపోతారు.

చేతులు బలంగా!

ఫిట్‌నెస్



ప్రేమను ప్రదర్శించటానికి వీలున్న సాధనాల్లో ఆలింగనం ఒకటి. ఆ ఆలింగనానికి అవసరమైన చేతులు అందంగా ఉండాలంటే, కొన్ని వ్యాయామాలు చేయక తప్పదు. మరీ ముఖ్యంగా నడుము పై భాగం, చేతులు, మోచేతి పైన ఉండే మూడు కండరాల సముదాయం 'ట్రైసెప్స్' చక్కని ఆకృతి సంతరించుకోవాలంటే 'ఛెయిర్ డిప్స్' వ్యాయామం చేయాలి. ఇందుకోసం...

- ★ బలంగా ఉండే కుర్చీని ఎంచుకోవాలి.
- ★ కుర్చీని ఆనుకుని నేల మీద కూర్చుని కాళ్ళను పొడుగ్గా చాపి, రెండు చేతులను కుర్చీ మీద ఉంచి, చేతుల సహాయంతో శరీరాన్ని పైకి లేపాలి.
- ★ పైకి లేచి, కిందకి కుంగేటప్పుడు కాళ్లు రెండూ మోకాళ్ల దగ్గర వంచాలి.
- ★ ఇలా చేస్తున్నప్పుడు పూర్తి శరీర బరువు చేతుల మీద పడుతుంది.
- ★ ఇలా 20 సార్లు, వరుసగా 3 సెట్లు చేయాలి.
- ★ ఈ వ్యాయామం వల్ల భుజాలు, వెన్ను, చేతుల్లోని కండరాలు బలపడతాయి.

మీకు తెలుసా?

ప్రేమకు కొలమానం?

ఇతర స్త్రీలను ఆకర్షించే పురుషుడిని మహిళలు ఎక్కువగా ప్రేమిస్తారు.

ప్రేమలో పడితే?

ప్రేమ పైన వినిపించే వ్యాఖ్యానాలు, నిర్వచనాలు కేవలం భావోద్వేగంతో చెప్పినవే తప్ప వాటిల్లో వాస్తవికత లేదని కొందరు అంటూ ఉంటారు. కానీ, శరీరం మీద, నాడీ వ్యవస్థ మీద కనిపించే కొన్ని ప్రభావాలు అందుకు తార్కాణాలేనని ఇటీవల జరిగిన పరిశోధనల్లో స్పష్టమయ్యింది. అందుకు ఉదాహరణగా.....

- ప్రేమ నాడీ వ్యవస్థను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఆ ప్రభావం కొకైన్ అంతగా మత్తెక్కిస్తుంది.
- ప్రేమికుల ఆలింగనం, పెయిన్ కిల్లర్‌కు సమానంగా పనిచేస్తుంది.
- పేమికుల ఛాయాచిత్రాలనో, పెయింటింగ్స్‌నో చూసినా పెయిన్ కిల్లర్ల ప్రభావం కనిపిస్తుంది.
- సమవయస్కుల్లోని ఆకర్షణలు వారి ఆయుష్షును స్థిరంగా కొనసాగేలా చేస్తాయి.
- భావసారూప్యత గల ప్రేమికుల జీవితాలు దాదాపు ఒకేలా గడుస్తాయి.
- ప్రేమలో గుండెలు కదిలిపోతాయనేది ఉత్త ఉపమానమేమీ కాదు. వాస్తవికంగానే గుండెలో ఆ కదలిక కనిపిస్తుంది.
- ప్రేమ గురించిన లేదా శృంగారం గురించిన ఆలోచనలు మనిషిలో సృజనాత్మకతను, స్థిరమైన ఆలోచనా పంథాను పెంచుతాయి.

డైలీ సుడోకు - 105

3			5			1		9
		9	1			4		2
		2		9			3	6
			7				6	
		6				2		
	8				9			
1	2			5		9		
6		5			1	8		
9		8			2			1

ఎలా పూరించాలి?


ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 104 సమాధానం

అమితాబ్‌కు 102.. రిషికి 75!



అమితాబ్ బచ్చన్, రిషికపూర్ మళ్లీ చాలా కాలం తర్వాత కలసి నటిస్తున్నారు. ఆ సినిమా పేరేమిటో తెలుసా?.. '102 నాటవుట్'. ఆ పేరుతోనే సౌమ్య జోషి రాసిన గుజరాతీ నాటకం ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా అమితాబ్, రిషి నటిస్తున్నారు. తండ్రి వయసు 102, కొడుకు వయసు 75. శతాధిక వృద్ధుడైనా ఫుల్ ఎనర్జీ కలిగిన పాత్రను అమితాబ్ పోషిస్తున్నారు. సహజంగా తండ్రుల్ని కొడుకుల వృద్ధాశ్రమానికి పంపిస్తుంటారు. కానీ ఈ చిత్రంలో తండ్రే కొడుకుని పంపించాలనుకొంటాడు. ఈ చిత్రం టీజర్‌ను అమితాబ్ సోమవారం ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత చింటూ(రిషికపూర్)తో కలసి నటిస్తున్నారు. మా ఇద్దరి కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన చిత్రాలు వచ్చాయి. ఓ కొత్తతరహా కథతో మళ్లీ మేమిద్దరం ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం' అని తెలిపారు.

అమితాబ్‌తో నటిస్తుంటే పాత రోజులు గుర్తుకు వస్తున్నాయనీ రిషికపూర్ పేర్కొన్నారు. ఓ విభిన్న చిత్రంలో అమితాబ్‌తో కలసి నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. '102 నాటౌవుట్' చిత్రం మే నాలుగున విడుదల కానుంది.

ప్రియా... ఏం కన్ను గీటావ్!



**ఆ కళ్ళేంట్రా బాబూ....
కుదురుగా కూర్చోనీయడం లేదు!
ఆ కన్ను గీటడం ఏంట్రా బాబూ...
కుర్రాళ్ళను కంటి నిండా కునుకు తీయనివ్వడం లేదు!**

మూడు నిమిషాల పాటలో ముద్దు ముద్దుగా ముప్పై సెకన్లు కనిపించింది. ఏదో మాయ చేసింది. అందర్నీ తన మాయలో పడేసింది. అసలు, ఈ అమ్మాయి ఎవరో కూడా తెలియకుండా వాట్సాప్ స్టేటస్‌లు పెడుతున్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ఈ అమ్మాయి వీడియో షేర్‌చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ అమ్మాయి గురించే చర్చ.



ఎవరీ అమ్మాయి? పేరు... ప్రియా ప్రకాశ్ వారియర్. ఊరు... కేరళలోని త్రిసూర్. వయసు... 18 ఏళ్లు! సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఆ వీడియో... మలయాళ చిత్రం 'ఒరు ఆదార్ లవ్'లోని పాట 'మాణిక్య మలయ పూవి'లోనిది. ఫిబ్రవరి 9న పాట విడులైంది. తర్వాత కొన్ని గంటల్లో పాట, అందులో ప్రియ పలికించిన హావభావాలు పాపులర్ అయ్యాయి. ప్రియ అందం ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. విశేషం ఏంటంటే... 'ఒరు ఆదార్ లవ్'తో ప్రియ వెండితెరకు పరిచయమవుతోంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కొంచెం ముందుగా పాటను విడుదల చేశారు.

ప్రియ ఫాలోయింగ్ (సోమవారం సాయంత్రానికి)
ఇన్‌స్టాగ్రామ్‌లో: 1.1 మిలియన్
ట్విట్టర్‌లో: 23,10,000
ఫేస్‌బుక్‌లో: సుమారు 79 వేల మంది ఫాలో అవుతున్నారు, 76 వేల మంది ప్రియ పేజీని లైక్ చేశారు.

ఏప్రిల్ నెలాఖరున సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికంటే ముందు మూడు షార్ట్ ఫిల్మ్‌లో నటించింది. కొన్ని ఫ్యాషన్ షోలలో పాల్గొంది. మోడల్‌గా ర్యాంప్ వాక్స్ చేసింది. ప్రియ మోహినీఆట్టం కళాకారిణి కూడా! చిన్నప్పటి నుంచి నటన, సినిమాలు అంటే ఇష్టమనీ, స్కూల్ డేస్‌లో చాలా నాటకాల్లో నటించానని ఆమె తెలిపింది. ఇక, సీబీఎస్‌సీ ప్లస్ 2 బోర్డ్ ఎగ్జామ్స్ రాయడానికి ముందు ఈ సినిమా ఆడిషన్స్‌కి వెళ్ళింది. ముందు అవకాశం రాదేమోనని ప్రియ అనుకుందట! కట్ చేస్తే... ఛాన్స్ ఆమెను వరించింది.

'మాణిక్య మలయ పూవి' పాట ప్రియాను ఎంత పాపులర్ చేసిందంటే.. ఒక్క రోజులో (ఫిబ్రవరి 12న) ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను అనుసరించే వారి సంఖ్య ఆరు లక్షల మంది పెరిగారు. అంతకు ముందు హాలీవుడ్ మోడల్, నటి కైలీ జెన్నర్‌ను ఈ నెల 5న 8.6 లక్షల మంది ఫాలో అయ్యారు. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డోను గతేడాది 13న 6.5 లక్షల మంది ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క రోజులో అత్యధిక ఫాలోయర్లును సాధించుకున్న సెలబ్రిటీగా ప్రియ చరిత్ర సృష్టించారు.

శక్తి ధారపోయను!

- అనుష్క



"నేను ఒరిజినల్‌గా 'బాహుబలి'లో దేవసేననూ కాదు, 'భాగమతి'లో చంచలనూ కాదు. సినిమా పరిశ్రమలో ఉన్నంత సేపు అనుష్కను. మా ఇంట్లో స్వీటీని. ప్రతి ఒక్కరికీ ఓ వ్యక్తిత్వం ఉన్నట్టు నాక్కూడా నాదైన వ్యక్తిత్వం ఉంటుంది. బలాలు, బలహీనతలూ ఉంటాయి" అని చెప్పారు అనుష్క. ఆమె మాట్లాడుతూ "చాలా మంది అమ్మాయిలు నన్ను కలిసి 'మీలాగా ఉండాలని ఉంటుందండీ. మీరు చాలా కామ్‌గా ఉంటారట కదా.. ఎలా ఉండగలుగుతున్నారు? సీక్రెట్స్ చెప్పండి' అని అడుగుతుంటారు. నా ముందు ఎవరైనా నిలబడి పొగుడుతుంటే వినడానికి చాలా ఆనందంగా ఉంటుంది. కానీ నిజమేంటంటే, నేను కూడా ఎల్లప్పుడూ అందరితోనూ నెమ్మదిగా ఏమీ ఉండను. కొన్ని సార్లు నాక్కూడా కోపం వస్తుంటుంది. కాకపోతే త్వరగా వ్యక్తం చేయను. అందుకు ఓ కారణం ఉంది. కష్టపడి సంపాదించి, ఆ డబ్బుతో తిన్న ఆహారాన్ని... దాని ద్వారా తెచ్చుకున్న శక్తిని పనికిరాని కోపం కోసం ధారపోయడం నాకిష్టం లేదు. నాకే కాదు.. ప్రతి ఒక్కరిలోనూ పాజిటివ్ అంశాలు ఉంటాయి. అవేంటో గుర్తించగలిగితే సగం విజయం సాధించినట్టే" అని అన్నారు.

చిన్నదే.. కానీ పెద్దది!

- నివేదా థామస్



హీరోయిన్లంటే అత్యంత సుకుమారులనుకుంటాం. ఏసీ గదుల్లోనూ, ఏసీ కారుల్లోనూ తిరుగుతూ ఎండ కన్నెరగకుండా ఉంటారనుకుంటాం. పిల్లిని, బల్లిని, నల్లిని చూసి భయపడుతారనుకుంటాం. అలా అనుకున్న వారందరూ ఇక్కడున్న ఫొటోలు చూసి.. అదేదో ప్రకటనలో చెప్పినట్టు 'అవాక్కవుతారేమో'. నిజమే. ఈ ఫొటోలో మీరు చూస్తున్న భామ హీరోయిన్ నివేదా థామస్. తెలుగులో 'జెంటిల్‌మేన్'తో హిట్ బోణీ కొట్టి 'నిన్నుకోరి', 'జై లవకుశ'తో ఆ విజయపరంపరను కొనసాగించారు. మలయాళ కుటుంబానికి చెందిన నివేదా ఈ మధ్య కొండచిలువను సందర్శించారు. అంతే కాదు, దాన్ని చేతుల్లోకి తీసుకుని కాసేపు ఆడుకున్నారు. మెడలోనూ వేసుకున్నారు. ఆ సమయంలో తీసుకున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి 'బాబ్రాను కలవండి. ఇది చిన్న విషయమే. కానీ నా దృష్టిలో ఇది అంత చిన్న విషయం కూడా ఏమీ కాదు" అని రైటప్ కూడా రాశారు.



'నీకు పిచ్చి పట్టిందా?' అనడిగాడు మహేశ్!

- మంజుల

"నేను దర్శకత్వం చేయబోతున్నానని చెప్పగానే నాన్నగారు (సూపర్‌స్టార్ కృష్ణ) చాలా థ్రిల్ ఫీలయ్యారు. నేను కాకుండా బయట నిర్మాత చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చారని తెలిసి సంతోషించారు. మహేశ్‌కి చెప్పగానే 'వాట్! నీకు ఏమైనా పిచ్చి పట్టిందా? దర్శకత్వం అంత సులభం కాదు' అన్నాడు. తనకి నేనే కథ వివరించగా కన్విన్స్ అయ్యాడు. ట్రైలర్ చూసి బాగుందన్నాడు. మనం సినిమా బాగా తీస్తేనే కదా! ట్రైలర్ అంత బాగా కట్ చెయ్యొచ్చు. పాటలకు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నా" అన్నారు మంజుల ఘట్టమనేని. నటిగా, కృష్ణ కుమార్తెగా, మహేశ్‌బాబు సోదరిగా ప్రేక్షకులకు తెలిసిన మంజుల దర్శకురాలిగా పరిచయం అవుతున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్‌కిషన్ హీరోగా అమైరా దస్తూర్, త్రిధా చౌదరి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ "నా ఫస్ట్ లవ్ దర్శకత్వమే. నటించే అవకాశం సులభంగా రావడంతో నటిగా ప్రేక్షకుల ముందుకు వచ్చా. దర్శకురాలిగా మారాలనుకున్న తర్వాత నా మనసుకు నచ్చిన కథ చెప్పాలనుకున్నా. మనమంతా బిజీ లైఫ్‌లో చిన్న చిన్న మూమెంట్స్ మిస్సవుతున్నాం. ఉదాహరణకు... సూర్యోదయం, సూర్యాస్తమయం, ప్రకృతి వంటివి. వాటిని దృష్టిలో పెట్టుకుని అందమైన ప్రేమకథ రాశా. ఈ చిత్రానికి ప్రకృతి హీరో అని చెప్పొచ్చు. ఆ ప్రకృతికి మహేశ్ వాయిస్ ఓవర్ ఇచ్చాడు. నా జీవితంలో ప్రేమకథ ఉన్నా... ఇందులోని ప్రేమకథకు, నా కథకు సంబంధం ఉండదు. చిన్నప్పటి నుంచి మహేశ్‌తో కలిసి పెరగడం వల్ల హీరో పాత్రలో అతని మేనరిజమ్స్ కొన్ని పెట్టాను. హీరోగా సూరజ్ పాత్రలో సందీప్ చక్కగా ఒదిగిపోయాడు. రధన్ మంచి పాటలిచ్చాడు" అన్నారు. మహేశ్‌ను దర్శకత్వం వహించే అవకాశం వస్తే మీరు ఎలాంటి కథ రాస్తారు? అని మంజులను ప్రశ్నిస్తే "మహేశ్ ఏ కథలో నటించలేడు చెప్పండి? తన అందం, నటన, వ్యక్తిత్వం ప్రతి పాత్రకూ సూటవుతాయి. కాకపోతే... మహేశ్ ఇమేజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి కదా! హాలీవుడ్ రేంజ్ హీరో మన తెలుగు ఇండస్ట్రీలో ఉన్నందుకు, అదీ నా సోదరుడు అయినందుకు నేనెప్పుడూ గర్వపడతా. నా సినిమాలు చూశాక మహేశే ఏదో ఒక రోజు పిలిచి 'మంజూ... నాతో సినిమా చెయ్!' అని అడుగుతాడని ఆశిస్తున్నా" అన్నారు. "ప్రజలకు మంచి చేయాలనే వ్యక్తిత్వం, తపన పవన్‌కల్యాణ్‌లో చూశా. నేను రాసుకున్న ఒక కథ ఆయనకు బాగా సూటవుతుందని అన్పించింది. సందీప్‌తో ఆ కథ గురించి డిస్కస్ చేశా. మొన్న మీడియా ముందు చెప్పేశాడు. పవన్‌తో సినిమా చేసే ఛాన్సులు తక్కువ. కానీ, ప్రయత్నిస్తా" అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పాటల 'జువ్వ'

బొత్స సత్యనారాయణ, రంజిత్, వినాయక్, కీరవాణి

రంజిత్, పాలక్ లల్వాని జంటగా త్రికోటి దర్శకత్వం వహించిన చిత్రం 'జువ్వ'. భరత్ సోమి నిర్మాత. కీరవాణి స్వరాలందించారు. ఆదివారం హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. వి.వి.వినాయక్ సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కీరవాణిగారు సంగీతం అందించారంటే సినిమాలో ఏదో విషయముందని అర్థమవుతోంది. రంజిత్‌కు నటుడిగా మంచి గుర్తింపు రావాలి" అని అన్నారు. "విందు భోజనం లాంటి కమర్షియల్ సినిమా ఇది. అన్నీ రకాల ఎమోషన్స్ ఉన్నాయి" అని కీరవాణి చెప్పారు. "దర్శకుడిగా నా రెండో చిత్రమిది. ఎం.రత్నం చక్కని కథ ఇచ్చారు. కీరవాణిగారు నాకు దేవుడుతో సమానం. చక్కని బాణీలిచ్చారు. హీరోహీరోయిన్లు ఇద్దరు కష్టపడి యాక్ట్ చేశారు" అని దర్శకుడు అన్నారు. "తొలి చిత్రానికే కీరవాణిగారు సంగీతం అందించటం అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాకు కథే హీరో. అందరికీ నచ్చే అంశాలున్న సినిమా ఇది" అని రంజిత్ అన్నారు. "ఫిబ్రవరి 23న సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. బొత్స సత్యనారాయణ దంపతులు, అలీ, సప్తగిరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలుగులో 'గోదా'

గత ఏడాది స్పోర్ట్స్ కామెడీ కాన్సెప్ట్‌తో విడుదలై ఘనవిజయం సాధించిన మలయాళ చిత్రం 'గోదా' రీమేక్ హక్కుల్ని కొంకా ప్రొడక్షన్స్ సంస్థ సొంతం చేసుకొంది. టవీనో థామస్, వామికా గబ్బీ నటించిన ఈ చిత్రానికి బసిల్ జోసెఫ్ దర్శకత్వం వహించారు. చిన్న సినిమాగా విడుదలైన 'గోదా' పెద్ద విజయాన్ని సాధించడంతో తెలుగు హక్కుల కోసం ఎంతోమంది పోటీ పడగా, కొంకా ప్రొడక్షన్స్ అధినేత సంతోష్ కొంకా ఫ్యాన్సీ ఆఫర్‌తో తెలుగు డబ్బింగ్, రీమేక్ రైట్స్ సొంతం చేసుకొన్నారు. ఈ సినిమాను తెలుగులోకి రీమేక్ చేస్తామనీ, స్క్రిప్ట్ వర్క్ పూర్తికాగానే ఆర్టిస్టులు, టెక్నీషియన్ల వివరాలు వెల్లడిస్తామనీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ కె. రామ్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
బిజినెస్
11
విజయవాడ • మంగళవారం 13 ఫిబ్రవరి 2018
andhrajyothibusiness@gmail.com

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ఎస్‌సిడబ్ల్యుఎఫ్‌కు బదిలీ చేయండి

» బీమా కంపెనీలకు ఐఆర్‌డిఎ ఆదేశం

న్యూఢిల్లీ : పదేళ్లుదాటినప్పటికీ పాలసీదారులకు సంబంధించిన డిపాజిట్లను ఎవరూ క్లెయిమ్ చేసుకోనట్టయితే (అన్‌క్లెయిమ్డ్) ఆ డిపాజిట్లను సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్ (ఎస్‌సిడబ్ల్యుఎఫ్)కు బదిలీ చేయాలని అన్ని బీమా కంపెనీలకు భారత బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డిఎ) ఆదేశాలు జారీ చేసింది. మార్చి ఒకటో తేదీ వరకు ఈ పని పూర్తి చేయాలని పేర్కొంది. 2017 సెప్టెంబరు 30 వరకు పదేళ్లు దాటిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను బీమా కంపెనీలు ఎస్‌సిడబ్ల్యుఎఫ్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది.

గెయిల్ బొనాంజా

ప్రతి మూడు షేర్లకు ఒక బోనస్ షేరు
క్యు3 లాభంలో 28 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: సహజవాయువు సరఫరా, మార్కెటింగ్ సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్.. మార్జిన్ల దన్నుతో ఆశాజనక ఫలితాలు ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యు3)లో ఈ ప్రభుత్వ రంగ సంస్థ లాభం 28 శాతం పుంజుకుని రూ.1,262.22 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదేకాలానికి లాభం రూ.982.92 కోట్లుగా నమోదైంది. ఎల్‌పిజి (వంట గ్యాస్)తోపాటు కంప్రెస్డ్ గ్యాస్ (సిఎన్‌జి) సరఫరా, మార్కెటింగ్ విభాగాలు మెరుగైన పనితీరు కనబర్చడం లాభాల పెరుగుదలకు తోడ్పడిందని గెయిల్ వెల్లడించింది. షేర్ హోల్డర్లకు ప్రతి మూడు ఈక్విటీ షేర్లపై ఒక బోనస్ షేరు జారీకి బోర్డు ఆమోదం తెలిపిందని సంస్థ ప్రకటించింది.

క్యు3లో కంపెనీ ఆదాయం 17 శాతం పెరిగి రూ.14,717 కోట్లకు చేరుకుంది. వార్షిక ప్రాతిపదికన పోలిస్తే.. మూడో త్రైమాసికంలో అన్ని విభాగాలు మెరుగైన వృద్ధి చెందాయని, దాంతో ఆదాయం, లాభం రెండూ పుంజుకున్నాయని గెయిల్ ఛైర్మన్, ఎండి బిసి త్రిపాఠి అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేసిన త్రిపాఠి.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో రూ.6,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు.

Q3 ఫలితాలు

భారీ నష్టాల్లో బిఒఐ

» క్యు3 నష్టం రూ.2,341 కోట్లు

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ)కు మొండిబకాయిలు భారీ గండి కొట్టాయి. డిసెంబరు 2017తో ముగిసిన మూడో త్రైమాసికం(క్యు3)లో బిఒఐ రూ.2,341.10 కోట్ల నష్టం ప్రకటించింది. బ్యాంక్ నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) అనూహ్యంగా పెరిగాయి. దాంతో ప్రొవిజనింగ్ 72 శాతం పెరగడం భారీ నష్టాలకు కారణమైంది. గత ఆర్థిక సంవత్సరం(2016-17)లో మూడో త్రైమాసికానికి బ్యాంక్ రూ.101.72 కోట్ల లాభాన్ని నమోదు చేసుకుంది. క్యు3లో బిఒఐ ఆదాయం రూ.10,376.03 కోట్లకు తగ్గింది. అంతకు ఏడాదిక్రితం ఇదే సమయంలో రూ.11,594 కోట్ల రెవెన్యూ ఆర్జించగలిగింది. గత ఏడాది డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో బ్యాంక్.. ఎన్‌పిఎల కోసం రూ.4,373.06 కోట్ల కేటాయింపులు జరిపింది. అంతక్రితం సంవత్సరంలో ఇదే సమయానికి కేటాయింపులు రూ.2,546.20 కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్ 2016 చివరినాటికి 13.38 శాతంగా నమోదైన స్థూల ఎన్‌పిఎలు గతేడాది చివరికల్లా 16.93 శాతానికి ఎగబాకాయి. నికర ఎన్‌పిఎలు 7.09 శాతం నుంచి 10.29 శాతానికి పెరిగాయి.

ఎన్‌పిఎల్లో రూ.14 వేల కోట్ల వ్యత్యాసం

గడిచిన ఆర్థిక సంవత్సరం (2016-17)లో బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.14,057 కోట్ల మొండిబకాయిలను తక్కువ చేసి(అండర్ రిపోర్టింగ్) చూపింది. గత సారికి బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలను రూ.52,045 కోట్లుగా పేర్కొనగా.. ఆర్‌బిఐ తనిఖీలో రూ.66,102 కోట్లని వెల్లడైంది. నికర ఎన్‌పిఎల్లోనూ రూ.9,707 కోట్ల వ్యత్యాసం ఉన్నట్లు ఆర్‌బిఐ పరిశీలనలో తేలింది. దాంతో ఎన్‌పిఎల కోసం కేటాయింపుల్లోనూ రూ.4,350 కోట్ల తేడా వచ్చింది. 2016-17లో బ్యాంక్ రూ.1,558 కోట్ల నష్టం ప్రకటించింది. కేటాయింపుల వ్యత్యాసం రూ.4,350 కోట్లతో కలుపుకుంటే రూ.6,248 కోట్లకు పెరిగినట్లైంది. గత సంవత్సరం చివరినాటికి బ్యాంక్ ప్రొవిజనింగ్ కవరేజీ రేషియో 56.96 శాతంగా నమోదైంది.

ఇండియన్ బ్యాంక్ లాభం రూ.303 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి(క్యు3) ఇండియన్ బ్యాంక్ లాభం 18.8 శాతం తగ్గి రూ.303.06 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం(2016-17)లో ఇదేకాలానికి బ్యాంక్ లాభం రూ.373.47 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ పెట్టుబడులపై రూ.407 కోట్ల మేర మార్క్ టు మార్కెట్ తరుగుదల వల్లే లాభాలు తగ్గాయని ఫలితాల విడుదల కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఎండి, సిఇఒ కిశోర్ ఖారత్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు (ఏప్రిల్-డిసెంబరు 2017)గాను బ్యాంక్ నికర లాభం రూ.1,127.01 కోట్లుగా నమోదైంది. 2016-17లో ఇదేకాలానికి లాభం రూ.1,085.97 కోట్లుగా ఉంది.

సమీక్ష కాలానికి బ్యాంక్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.4,557.25 కోట్ల నుంచి రూ.4,903.07 కోట్లకు పెరిగింది. డిసెంబర్ 2016లో 7.69 శాతంగా నమోదైన బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎ).. గతేడాది చివరినాటికి 6.27 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 4.76 శాతం నుంచి 3.30 శాతానికి తగ్గాయి.

దేశీ ఫార్మా సవాళ్లపై
బయో ఏషియా దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భారత ఫార్మా రంగం ఎదుర్కొంటున్న రెగ్యులేటరీ సవాళ్లపై బయో ఏషియా సదస్సు ప్రధానంగా దృష్టి సారించనుంది. అమెరికా సహా యూరోపియన్ మార్కెట్లలో రెగ్యులేటరీ పరమైన ఇబ్బందులు తలెత్తటంతో దేశీయ ఫార్మా కంపెనీల రాబడులు గణనీయంగా తగ్గిపోవటమే కాకుండా మార్కెట్ క్యాపిటలైజేషన్ భారీగా పడిపోయిందని బయో ఏషియా, డెలాయిటీ సంయుక్తంగా రూపొందిన నివేదిక వెల్లడించింది. మరోవైపు ఇంపోర్ట్ అలర్ట్స్ (దిగుమతి ఆంక్షలు), హెచ్చరిక లేఖలతో పరిస్థితి మరింత దారుణంగా మారిపోవటంతో పాటు పశ్చిమ దేశాల్లో భారతీయ కంపెనీలు తమ వ్యాపారాలను నిర్వహించటం సవాల్‌గా మారిందని పేర్కొంది. అమెరికా వంటి దేశాలు రక్షణాత్మక ధోరణులను అవలంబిస్తుండటంతో దేశీయ ఫార్మా కంపెనీలకు సంకటంగా మారిందని తెలిపింది. కాగా ప్రస్తుతం ఫార్మా రంగం ఎదుర్కొంటున్న తయారీ, రెగ్యులేటరీ ప్రమాణాలు, తదితర అంశాలపై ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో జరగనున్న బయో ఏషియా 2018 సదస్సు విస్తృత స్థాయిలో చర్చించనుంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఫార్మా కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 13 శాతం మేర తగ్గింది. ఇదే సమయంలో గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (జిఎంపి) సరిగా లేవంటూ భారతీయ కంపెనీలకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఎ) హెచ్చరిక లేఖలు దాదాపు 40 శాతానికి పైగా పెరిగాయి. దేశంలోని పది అగ్రశ్రేణి లిస్టెడ్ ఫార్మా కంపెనీల నికర విక్రయాలు స్వల్పంగా 4.7 శాతం మాత్రమే పెరిగాయి. ఇది గడచిన దశాబ్ద కాలంలో అత్యంత తక్కువ వృద్ధి రేటు కావటం గమనార్హం.

మార్చి 8 నుంచి పొగాకు కొనుగోళ్లు

గుంటూరు/ఒంగోలు (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 8 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తామని పొగాకు బోర్డు కార్యదర్శి అద్దంకి శ్రీధర్ బాబు తెలిపారు. గుంటూరులోని బోర్డు కార్యాలయంలో సోమవారం ఏపిలో 2017-18 పొగాకు కొనుగోళ్లపై రైతులు, వ్యాపార వర్గాలతో ఆయన సమీక్షించారు. మార్చి 8, 19న ప్రకాశం జిల్లాలో, ఏప్రిల్ 11న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తామన్నారు. కిలో పొగాకు రూ.176 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరామ్, ఇండియన్ టుబాకో అసోసియేషన్ (ఐటిఎ) అధ్యక్షుడు మిట్టపల్లి ఉమామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 13.5 కోట్ల కిలోల పొగాకు ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతిచ్చింది. అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 8.5 కోట్ల కిలోలు, గోదావరి జిల్లాలకు ఐదు కోట్ల కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇచ్చారు. కాగా వేలం ప్రారంభం నుంచే వ్యాపారులందరూ పాల్గొనేలా చూడాలని, అలాగే ఉత్పత్తి ఖర్చులు ప్రామాణికంగా ధరలు వచ్చేలా చూడాలని రైతు ప్రతినిధులు కోరినట్లు సమాచారం.

పొంచి ఉన్న ద్రవ్యోల్బణం ముప్పు

శృతి మించితే వడ్డీ రేట్లకూ సెగ : డాయిష్ బ్యాంక్

ముంబై : ద్రవ్యోల్బణం అదుపు తప్పితే ఆర్‌బిఐ వడ్డీ రేట్లు పెంచక తప్పదని జర్మనీకి చెందిన బ్రోకరేజ్ సంస్థ డాయిష్ బ్యాంక్ అంచనా వేసింది. అయితే ఇటీవల పరపతి, ద్రవ్య విధానం సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ వ్యాఖ్యలను చూస్తే మాత్రం ఆర్‌బిఐ ఇప్పట్లో కీలకమైన రెపో రేట్ల పెంపుకు పోకపోవచ్చని తెలిపింది. డిసెంబరులో 5.21 శాతం ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం ఈ సంవత్సరం జనవరిలో ఐదు శాతానికి దిగొచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. జూలై నుంచి ద్రవ్యోల్బణం సెగ మరింత తగ్గుతుందని తెలిపింది. మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతం వద్ద కట్టడి చేయాలన్న లక్ష్యానికి ఆర్‌బిఐ కట్టుబడి ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

జిడిపి వృద్ధి మరింత పైకి..

వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) భారత జిడిపి వృద్ధి రేటు 7.5 శాతం వరకు ఉండే అవకాశం ఉందని డాయిష్ బ్యాంక్ అంచనా. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టితో ఆర్థిక వ్యవస్థ 2017-18లో 6.6 శాతానికి మించి ముందుకు సాగే అవకాశం లేదని పేర్కొంది.

కార్పొరేషన్ బ్యాంక్ నష్టం రూ.1,240 కోట్లు

న్యూఢిల్లీ : డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి కార్పొరేషన్ బ్యాంక్ 1,240.49 కోట్ల రూపాయల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ 159 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. మొండి పద్దుల కోసం అధికంగా కేటాయింపులు జరపడం వల్లనే ఈసారి నష్టాలు వచ్చినట్లు బ్యాంక్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంకు నష్టం 1,035 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 5,839.56 కోట్ల రూపాయల నుంచి 4,841.37 కోట్ల రూపాయలకు తగ్గింది. డిసెంబరు చివరినాటికి బ్యాంక్ మొండి పద్దులు 15.92 శాతానికి ఎగబాకాయి. ఇదే త్రైమాసికంలో స్థూల మొండి పద్దుల (ఎన్‌పిఎ) మొత్తం 21,817.96 కోట్ల రూపాయలుండగా.. నికర ఎన్‌పిఎలు 13,853.91 కోట్ల రూపాయలున్నాయి. ఎన్‌పిఎల కోసం కేటాయింపులు 991.63 కోట్ల రూపాయల నుంచి 2,494.71 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

ప్యాసింజర్ వాహనాలకు గిరాకీ

జనవరి అమ్మకాల్లో 7.57 శాతం వృద్ధి

గ్రేటర్ నోయిడా : ప్యాసింజర్ వాహనాలకు గిరాకీ పెరుగుతోంది. గత జనవరిలో ఈ వాహనాల అమ్మకాలు 7.57 శాతం పెరిగి 2,85,477 యూనిట్లకు చేరుకున్నాయి. యుటిలిటీ వాహనాల వృద్ధి ఇందుకు దోహదపడింది. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) గణాంకాల ప్రకారం.. దేశీయ ప్యాసింజర్ వాహనాల (పివి) అమ్మకాలు గత ఏడాది జనవరిలో 2,65,389 యూనిట్లుగా ఉన్నాయి. ఈ జనవరిలో కార్ల అమ్మకాలు మాత్రం 1.25 శాతం మేర తగ్గి 1,86,596 నుంచి 1,84,264కు చేరాయి. పివి అమ్మకాల్లో వృద్ధి అంచనాలకు తగిన విధంగానే ఉందని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ తెలిపారు. జనవరిలో యుటిలిటీ వాహనాల (యువి) విక్రయాలు 85,850గా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదే నెలతో (62,263) పోల్చితే అమ్మకాల్లో వృద్ధి 37.88 శాతంగా ఉంది. గత ఏడాది జూలైలో అత్యధికంగా 86,874 యువిలు అమ్ముడయ్యాయి. రెండోసారి జనవరిలో అత్యధిక (85,850) అమ్మకాలు నమోదయ్యాయి. ఎంట్రీ స్థాయిలో కొత్త మోడళ్లు రావడం లేదని, ఫలితంగానే కార్ల అమ్మకాలు తక్కువగా నమోదు అవుతున్నాయని మాథుర్ తెలిపారు. చాలా మంది కస్టమర్లు క్రాసోవర్లు, కాంపాక్ట్ ఎస్‌యువిలకు మారిపోతున్నారని చెప్పారు. గత జనవరిలో మారుతి సుజుకీ దేశీయంగా 1,39,189 ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఇదే నెలలో హ్యుండయ్ 45,508, టాటా మోటార్స్ 21,872 ప్యాసింజర్ వాహనాలను విక్రయించాయి.

ఎలక్ట్రిక్ వాహనాలకు పరిశ్రమ రెడీ :సియామ్

ఎలక్ట్రిక్ వాహనాలు తెచ్చేందుకు ఆటో పరిశ్రమ వేగంగా సిద్ధమవుతోందని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ తెలిపారు. అయితే పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక విధానాన్ని తీసుకురావాలని ఆయన సూచిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రస్తుతం జిఎస్‌టి 12 శాతంగా ఉందని, దీన్ని 5 శాతానికి తగ్గించాలన్న డిమాండ్ ఉందని ఆయన చెప్పారు. పన్నుల భారం తగ్గితేనే ఎలక్ట్రిక్ వాహనాల ధరలు అందుబాటులోకి వస్తాయని, టెక్నాలజీకి మరింత ఆదరణ లభిస్తుందని ఆయన తెలిపారు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పోలో విభిన్న విభాగాల్లో మార్కెట్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్న 28 ఎలక్ట్రిక్ వాహనాలను టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అశోక్‌లేలాండ్, లోహియా, జెబిఎం వంటి కంపెనీలు ప్రదర్శించాయి.

దీన్ని బట్టే ఆటో పరిశ్రమ ఎలక్ట్రిక్ వాహనాలు తెచ్చేందుకు సిద్ధమైనట్టు స్పష్టమవుతోందని మాథుర్ తెలిపారు. ప్రదర్శనలో విడుదల చేసిన ఎలక్ట్రిక్ వాహనాల్లో 11 కారు సెగ్మెంట్లో, ఐదు బస్ సెగ్మెంట్లో, రెండు చొప్పున చిన్న వాణిజ్య వాహనాలు, త్రీవీలర్ సెగ్మెంట్లో, ఎనిమిది టూవీలర్ సెగ్మెంట్లో విడుదలయ్యాయి. 2030నాటికి ప్రజారవాణాలో 100 శాతం, వ్యక్తిగత రవాణాలో 40 శాతం ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రభుత్వంస్పష్టమైన విధానం తీసుకురావడంతోపాటు పరిశ్రమకు, వాహనదారులకు ప్రోత్సాహకాలు కల్పించాలని పరిశ్రమవర్గాలు అంటున్నాయి.

చార్జింగ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలే ప్రధాన సమస్యగా మారాయని, ఈ సమస్యను అధిగమిస్తే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం జోరందుకుంటుందంటున్నారు.


టూ వీలర్లు..

జనవరిలో టూవీలర్ల అమ్మకాలు 33.43 శాతం వృద్ధి చెంది 16,84,066కు చేరాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో టూవీలర్లు, స్కూటర్లకు గిరాకీ అధికంగా ఉంటోందని, ఫలితంగానే ఈ రంగంలో మెరుగైన వృద్ధి నమోదు అవుతోందని విష్ణు మాథుర్ తెలిపారు. జనవరిలో మోటార్‌సైకిళ్ల అమ్మకాలు 28.64 శాతం పెరిగి 10,54,062 యూనిట్లకు చేరాయి. హీరో మోటోకార్ప్ అమ్మకాలు 24.39 శాతం వృద్ధితో 5,43,325కు చేరుకున్నాయి. హోండా స్కూటర్ అండ్ మోటార్‌సైకిల్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) 1,69,537 టూవీలర్లను విక్రయించింది. బజాజ్ ఆటో 1,63,111, టీవీఎస్ మోటార్ 84,140 మోటార్ సైకిళ్లను విక్రయించాయి.



మాల్యాకు మరో ఎదురుదెబ్బ

» బిఒసితో కేసులో కింగ్‌ఫిషర్‌కు వ్యతిరేక తీర్పు
» రూ.585 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం



లండన్ / సింగపూర్: లిక్కర్ కింగ్ విజయ్‌మాల్యా.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి మరో కేసు ఓడిపోయారు. విమానాలు అద్దెకిచ్చే సింగపూరు సంస్థ బిఒసి ఏవియేషన్‌తో కేసులో కింగ్‌ఫిషర్‌కు వ్యతిరేకంగా లండన్ హైకోర్టు తీర్పునిచ్చింది. బిఒసికి నష్టపరిహారం కింద 9 కోట్ల డాలర్ల (దాదాపు రూ.585 కోట్లు) చెల్లించాలని కోర్టు న్యాయమూర్తి పికెన్ ఆదేశించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. బిఒసి ఏవియేషన్ నుంచి నాలుగు విమానాలను లీజుకు తీసుకునేందుకు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ గతంలో అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారంగా మూడు విమానాలను అందించిన బిఒసి ఏవియేషన్.. అడ్వాన్స్ సొమ్ము పూర్తిగా చెల్లించని కారణంగా నాలుగో విమాన సరఫరాను నిలిపివేసింది. కింగ్‌ఫిషర్ ఎంతకూ బకాయిలు చెల్లించకపోవడంతో బిఒసి లండన్ హైకోర్టును ఆశ్రయించింది. కేసును విచారించిన జస్టిస్ పికెన్.. బకాయిపడ్డ సొమ్ముతో(వడ్డీతో సహా)పాటు బిఒసి న్యాయపోరాటానికైన ఖర్చులను కూడా చెల్లించాలని కింగ్‌ఫిషర్‌ను ఆదేశించారు. బకాయిలు, వడ్డీ, న్యాయ ఖర్చులన్నీ కలిపితే 9 కోట్ల డాలర్లవుతుంది.

దేశీయ బ్యాంకులకు రూ.9 వేల కోట్ల వరకు ఎగవేసిన 62 ఏళ్ల మాల్యా.. ప్రస్తుతం లండన్‌లో తలదాచుకుంటున్నారు. రుణ బకాయిలకు సంబంధించి పలు కోర్టులు ఆయనను ఘోషితాపరాధిగా కూడా ప్రకటించాయి. ఈ కేసుల్లో విచారణ పూర్తి చేసేందుకు వీలుగా మాల్యాను తిరిగి భారత్‌కు పంపించాలని మన విదేశాంగ మంత్రిత్వ శాఖ బ్రిటన్ సర్కారును కోరింది. ప్రస్తుతం లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇందుకు సంబంధించిన కేసుపై విచారణ సాగుతోంది. వచ్చేనెల 16న జరగనున్న తుది విచారణ ఆధారంగా మే నెలలో కోర్టు తీర్పు వెల్లడించే అవకాశం ఉంది. ఈ కేసులో 6.5 లక్షల పౌండ్ల పూచీకత్తుపై మాల్యాకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఐకియాతో శ్రీ మలానీ ఫోమ్స్ జట్టు

» రోల్ ఓవర్ పరుపుల సరఫరా
» రూ.15 కోట్లతో కొత్త ప్లాంట్ ఏర్పాటు
» మరో 60 కోట్లతో విస్తరణ
» ఎస్‌ఎంఎఫ్‌పిఎల్ ఎండి సిద్ధార్థ వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అంతర్జాతీయ ఫర్నీచర్ దిగ్గజం ఐకియా.. తెలంగాణకు చెందిన శ్రీ మలానీ ఫోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌ఎంఎఫ్‌పిఎల్)తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా మలానీ ఫోమ్స్ ప్రపంచవ్యాప్తంగా ఐకియా స్టోర్లకు మ్యాట్రెసెస్‌ను ఉత్పత్తి చేసి సరఫరా చేయనుంది. సోమవారం నాడిక్కడ ఐకియా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పంకజ్ దాటే, ఎస్‌ఎంఎఫ్‌పిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ మలానీ ఒప్పందం వివరాలను వెల్లడించిన సందర్భంగా మాట్లాడుతూ.. భారత్‌లో ఒక మ్యాట్రెసెస్ తయారీ కంపెనీతో ఐకియా ఒప్పందం కుదుర్చుకోవటం ఇదే తొలిసారని చెప్పారు. ఒప్పందంలో భాగంగా మలానీ గ్రూప్.. ఐకియా కోసం రోల్ ఓవర్ మ్యాట్రెసెస్‌ను సరఫరా చేయనుందని ఎస్‌ఎంఎఫ్‌పిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ మలానీ వెల్లడించారు. ప్రస్తుతం ఈ మ్యాట్రెసెస్‌ను దుబాయ్‌లోని ఐకియా స్టోర్‌కు సరఫరా చేస్తున్నామని, త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న తొలి స్టోర్‌కు వీటిని సరఫరా చేయనున్నట్లు మలానీ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ హైదరాబాద్ సమీపంలోని చేగుంటలో సెన్‌ఫ్లెక్స్ ఫోమ్స్ బ్రాండ్‌తో పాలీయురేథిన్ ఫోమ్‌ను ఉత్పత్తి చేస్తోందని చెప్పారు.

ఐకియా కోసం ప్రత్యేకంగా సరఫరా చేయనున్న రోల్ ఓవర్ మ్యాట్రెసెస్ కోసం ఈ ప్లాంట్‌లోనే 15 కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.2 లక్షల యూనిట్లని ఆయన పేర్కొన్నారు. సాంప్రదాయిక పరుపులతో పోల్చితే ఇవి ప్రత్యేకమైనవని ఆయన చెప్పారు. ఐకియాతో ఒప్పంద కాలపరిమితి ఐదేళ్ల వరకు ఉండనుందని, కొత్త టెక్నాలజీలు, కొత్త ఉత్పత్తులతో దీన్ని పొడిగించుకునే వెసులుబాటు ఉందని ఆయన చెప్పారు. ఏటా 25 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వస్తున్న కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 140 కోట్ల రూపాయల రాబడిని ఆర్జించవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రాబడిని 200 కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా 60 కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త పరుపుల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సిద్ధార్థ మలానీ వెల్లడించారు.

70 శాతం స్థానికంగానే..

భారత్‌లోని ఐకియా స్టోర్లకు అవసరమైన ఉత్పత్తులను స్థానికంగా సమీకరిస్తున్నట్లు ఐకియా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పంకజ్ దాటే తెలిపారు. భారత్‌లో ఒక మ్యాట్రెసెస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవటం ఇదే తొలిసారని చెప్పారు. ఐకియా 35కు పైగా విభాగాలకు సంబంధించిన ఉత్పత్తులను 50కి పైగా దేశాలను సమీకరిస్తోందని దాటే తెలిపారు. భారత మార్కెట్లో మరిన్ని విభాగాలకు ఇదే తరహా ఒప్పందాలను కుదుర్చుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్ స్టోర్ రానున్న కొద్ది నెలల్లో ప్రారంభించనున్నట్లు దాటే తెలిపారు.

ఏరో ఇంజనీరింగ్ హబ్ హైదరాబాద్

» జిఇ-టాటా ఏరో ఇంజన్ సెంటర్‌కు శంకుస్థాపన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఏరో ఇంజనీరింగ్ రంగంలో మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు హైదరాబాద్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. సోమవారం నాడిక్కడ రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో టాటా-జిఇ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న ఏరో ఇంజన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు మంత్రి కెటిఆర్ సమక్షంలో టాటా సన్స్ డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రెసిడెంట్ బన్మాలీ అగ్రావాలా, జిఇ దక్షిణాసియా ప్రెసిడెంట్, సిఇఒ విశాల్ వాంఛూ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. టాటా, జిఇ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఏరో ఇంజన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో ఏరో ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందన్నారు. తెలంగాణలో పెట్టుబడుల కోసం గతంలో తాను టాటా-జిఇ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు తెలిపారు. ఆదిభట్లలో యూనిట్ స్థాపనతో తన చర్చలు ఫలించినట్టు పేర్కొన్నారు. జిఇ-టాటా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ కోసం స్థల కేటాయింపుల ప్రక్రియ నెల రోజుల్లోనే పూర్తయి శంకుస్థాపన చేయటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇదే ఊపుతో ఏడాది వ్యవధిలోనే ఏరో ఇంజన్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం టాటా సన్స్ డిఫెన్స్ ఏరో స్పేస్ ప్రెసిడెంట్ మన్మాలీ ఆగ్రావాలా మాట్లాడుతూ.. ఆదిభట్లలో ప్రారంభించే యూనిట్ పర్యావరణహితంగా ఉంటుందన్నారు. ఏడాది కాలంలో ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు. కాగా వినియోగదారుల అభిరుచులు, అంచనాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించటంలో టాటా-జిఇ సంస్థలు అగ్రస్థానంలో ఉన్నాయని జిఇ దక్షిణాసియా ప్రెసిడెంట్, సిఇఒ విశాల్ వాంఛూ అన్నారు. ఈ రెండు సంస్థలు సంయుక్తంగా చేపట్టిన యూనిట్ నుంచి వాణిజ్యపరంగానే కాకుండా రక్షణ రంగ అవసరాలకు ఉపయోగించే విమానయాన యంత్రాలను సమకూర్చడంతో పాటు అత్యుత్తమ నైపుణ్య సామర్థ్యం గల నిపుణులను అందించనున్నట్టు తెలిపారు.

బ్యాంకింగ్‌కు మంచి రోజులు!

» తగ్గుముఖంలో ఎన్‌పిఎలు

న్యూఢిల్లీ : బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్న ఒత్తిడిలో ఉన్న ఆస్తుల భారం తగ్గుముఖం పట్టింది. కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సంస్థ సోమవారం ఒక నివేదికలో ఈ విషయం పేర్కొంది. మొండి బకాయిలు, రుణ బకాయిల చెల్లింపుల్లో సమస్యలు ఎదురవుతున్న బకాయిలను బ్యాంకింగ్ పరిభాషలో ఒత్తిడిలో ఉన్న ఆస్తులంటారు. ఇలాంటి ఆస్తులను బ్యాంకులు స్పెషల్ మెన్షన్ అకౌంట్స్ (ఎస్‌ఎంఎ) పరిగణిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల మొత్తం రుణ ఖాతాల్లో ఈ ఖాతాల సంఖ్య ఒకపుడు గరిష్ఠంగా ఏడు నుంచి తొమ్మిది శాతం వరకు ఉండేవి. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు, 2017 నాటికి ఈ భారం 3.5-5 శాతానికి తగ్గింది. 'ప్రభుత్వ రంగ బ్యాంకుల పని తీరు చూస్తుంటే ఎస్‌ఎంఎల భారం క్రమంగా తగ్గుముఖం పట్టినట్టు కనిపిస్తోంది' అని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్‌కు చెందిన ఎంబి మహేశ్ చెప్పారు. అయితే విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా కొన్ని సమస్యలు ఉన్నందున బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న ఒత్తిడిలో ఉన్న ఆస్తుల సమస్య వేగంగా తగ్గుతుందని భావించలేమని కూడా ఆయన స్పష్టం చేశారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
294.71	84.80	95	5		
34300.47	10539.75	30225	37925	64.32	63.89

ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

ఆస్టర్ ఐపిఒకు 26 శాతం సబ్‌స్క్రిప్షన్

ఆరోగ్య సంరక్షణ సేవలందిస్తున్న ఆస్టర్ డిఎం హెల్త్ పబ్లిక్ ఇష్యూకు తొలి రోజున 26 శాతం సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. 980 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంతో ఈ కంపెనీ 3.74 కోట్ల వాటాలు విక్రయానికి పెట్టగా తొలి రోజు మార్కెట్ ముగిసే సమయానికి 72 లక్షల బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగత ఇన్వెస్టర్ల విభాగం 51 శాతం, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 16 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించాయి. శుక్రవారం ఈ సంస్థ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి 294 కోట్ల రూపాయలు సమీకరించింది. ఇష్యూతో సమీకరించే నిధులను వైద్య పరికరాల కొనుగోలు, రుణాల చెల్లింపు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకుంటామని పేర్కొంది. షేరు ధర శ్రేణి 180-190 రూపాయలు. ఇష్యూ గురువారం ముగుస్తుంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,150	31,100	31,080	31,105	30,210
క్రితం ముగింపు	31,050	31,150	30,900	31,000	30,230
22 క్యారెట్లు	28,840	28,850	28,590	28,680	28,770
క్రితం ముగింపు	28,750	28,800	28,420	28,630	28,790
వెండి (కిలో)	39,000	39,300	38,900	39,200	41,000
క్రితం ముగింపు	38,700	40,200	38,800	39,000	40,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	59.00
కర్నూలు	70.00	నెల్లూరు	67.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	64.00
గోదావరి	74.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.30 — నెక్ (100 గుడ్లు)


హైదరాబాద్	371.00	చిత్తూరు	388.00
వరంగల్	373.00	చెన్నై	395.00
విజయవాడ	370.00	నమక్కల్	380.00
గోదావరి	370.00	బెంగళూరు	377.00
విశాఖపట్నం	375.00	ముంబై	415.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.46	67.79
పౌండ్	80.93	93.86
యూరో	71.78	83.26
ఆస్ట్రేలియా డాలర్	45.78	52.97
బహ్రెయిన్ దినార్	158.33	181.44
కువైట్ దినార్	177.14	220.52
ఒమని రియాల్	155.04	177.38
సౌదీ రియాల్	15.54	18.43
సింగపూర్ డాలర్	44.07	52.20
యుఎఇ దిరమ్	15.91	18.60

ఆర్థికానికి ఊరట

పారిశ్రామికం పెరిగింది, ద్రవ్యోల్బణం తగ్గింది



న్యూఢిల్లీ : పారిశ్రామిక రంగం డిసెంబరు నెలలో రికార్డు బాటను కొనసాగిస్తూ మెరుగైన పనితీరును ప్రదర్శించింది. యంత్రపరికరాలు, కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్ అమ్మకాల్లో వృద్ధి కారణంగా పారిశ్రామికోత్పత్తి 7.1 శాతం పెరిగింది. 2016 డిసెంబరులో ఐఐపి వృద్ధి రేటు 2.4 శాతం ఉంది. నవంబరు నెల ఐఐపి వృద్ధి రేటును కేంద్ర గణాంకాల శాఖ ఎగువకు 8.8 శాతానికి సవరించింది. ముందు ప్రకటించిన గణాంకాల ప్రకారం ఇది 8.4 శాతం. పారిశ్రామికోత్పత్తి సూచీలో 77.63 శాతం వాటా ఉన్న తయారీ రంగం గణనీయంగా పుంజుకోవడం ఇందుకు కలిసి వచ్చింది. ఈ విభాగంలో వృద్ధిరేటు గత డిసెంబరుతో పోల్చితే 0.6 శాతం నుంచి 8.4 శాతానికి పెరిగింది. యంత్రపరికరాల విభాగంలో వృద్ధిరేటు 6.2 శాతం నుంచి 16.4 శాతానికి దూసుకుపోయింది. నాన్ డ్యూరబుల్స్ విభాగంలో కూడా వృద్ధిరేటు 16.5 శాతంగా నమోదైంది. ఈ విభాగంలో వృద్ధిరేటు గత డిసెంబరులో కేవలం 0.2 శాతమే. వినియోగ ఆధారిత వర్గీకరణ ప్రకారం ప్రాథమిక వస్తువుల విభాగంలో 3.7 శాతం, ఇంటర్మీడియట్ వస్తువుల విభాగంలో 6.2 శాతం, మౌలికవసతులు/నిర్మాణ రంగ వస్తువుల విభాగంలో 6.7 శాతం వృద్ధి నమోదయింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంలో వృద్ధి 0.9 శాతం ఉంది. మొత్తం 23 పారిశ్రామిక విభాగాల్లో 16 సానుకూల వృద్ధిని నమోదు చేశాయి.

జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతం

కూరగాయలు, పప్పు, ఇంధనాల ధరలు తగ్గడంతో జనవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతానికి దిగివచ్చింది. డిసెంబరులో ఇది 5.21 శాతం ఉంది. ఇది 17 నెలల గరిష్ఠ స్థాయి. గత జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.17 శాతం. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార వస్తువుల ధరల్లో పెరుగుదల 4.7 శాతానికి తగ్గింది. కూరగాయల ధరల్లో వృద్ధి 26.97 శాతం ఉండగా పప్పు ధరలు 6.24 శాతం పెరిగాయి. ఇంధన విభాగంలో ద్రవ్యోల్బణం 7.73 శాతానికి దిగివచ్చింది.

నాణ్యమైన షేర్ల కోసం వేట

సెన్సెక్స్ 295 పాయింట్లు అప్

నేడు సెలవు
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు.

ముంబై : గత కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్ గణనీయమైన కరెక్షన్ సాధించడంతో పలు ఇన్వెస్టర్లు తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చిన నాణ్యమైన షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు పరుగులు తీయడంతో సోమవారం స్టాక్ ఇండెక్సులు లాభాలబాట పట్టాయి. గత 10 సెషన్లలో ఇండెక్సులు లాభాలతో ముగియడం ఇది రెండోసారి మాత్రమే. అయితే ఆయిల్ ధరలు మాత్రం వరుసగా ఆరు రోజుల పతనం అనంతరం పుంజుకున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి కూడా రికవరీ బాట పట్టింది. మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల వార్తలేవీ లేకపోవడంతో పాటు కార్పొరేట్ ఫలితాలు ఆకర్షణీయంగా ఉండడం, రిటైల్ ద్రవ్యోల్బణం కాస్తంత తగ్గుముఖం పట్టవచ్చునన్న ఆశలు మార్కెట్లో సానుకూల సెంటిమెంట్‌కు దోహదపడ్డాయి.

ఐటిని మినహాయిస్తే తగిన పవర్, రియల్టీ, యంత్రపరికరాలు, బ్యాంకింగ్ షేర్లను ఇన్వెస్టర్లు భారీ పరిమాణంలో కొనుగోలు చేశారు. ఈ ఉత్సాహంతో బలంగా ప్రారంభమైన సెన్సెక్స్ 34351.34 పాయింట్ల గరిష్ఠ స్థాయి వరకు వెళ్లి చివరికి 294.71 పాయింట్ల లాభంతో 34300.47 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 10555.50 పాయింట్లను తాకి చివరికి 84.80 పాయింట్ల లాభంతో 10539.75 వద్ద క్లోజయింది.


● స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం శుక్రవారం దేశీయ ఇన్వెస్టర్లు 588.42 కోట్ల రూపాయల విలువ గల షేర్లను కొనుగోలు చేయగా ఎఫ్‌పిఐలు 1351.70 కోట్ల రూపాయల విలువ గల షేర్లను విక్రయించారు.

టాటా గ్రూప్ షేర్ల అప్

మూడో త్రైమాసికంలో ప్రోత్సాహక ఫలితాలందించడంతో టాటా స్టీల్ షేరు 4.22 శాతం లాభంతో సెన్సెక్స్‌లో అగ్రగామిగా నిలిచింది. అలాగే వృద్ధి ఫలితాలందించిన ఉత్తేజంతో టాటా కమ్యూనికేషన్స్ కూడా లాభపడింది. టాటా మోటార్స్ లాభాలతో ముగిసింది.

● లాభపడిన ఇతర షేర్లలో ఎల్ అండ్ టీ, యస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హీరోమోటోకార్ప్, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి, మారుతి సుజుకీ, ఒఎన్‌జిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, విప్రో, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా ఉన్నాయి.

● అత్యంత నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించడంతో ఎస్‌బిఐ భారీగా 2.67 శాతం నష్టపోయింది.



ఐడియా రూ.3250 కోట్ల సమీకరణ


ప్రమోటర్ గ్రూప్ కంపెనీలకు 32.6 కోట్ల షేర్లను కేటాయించి 3,250 కోట్ల రూపాయలు సమీకరించినట్టు ఐడియా సెల్యులార్ ప్రకటించింది. ఒక్కో షేరు 99.50 రూపాయల ధర (89.50 రూపాయల ప్రీమియం ధర కలిపి) 32,66,33,165 ఈక్విటీ షేర్లను కేటాయించినట్టు ఆ ప్రకటనలో తెలిపింది. జనవరి నాలుగో తేదీన డైరెక్టర్ల బోర్డు ఈ ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది.

జైప్రకాశ్ అసోసియేట్స్ నుంచి ఐడిబిఐ నామినీ రాజీనామా

రుణభారంతో కుంగుతున్న జైప్రకాశ్ అసోసియేట్స్ డైరెక్టర్ల బోర్డు నుంచి తమ నామినీని ఉపసంహరిస్తున్నట్టు ఐడిబిఐ బ్యాంకు ప్రకటించింది. తమ బోర్డులోని ఐడిబిఐ జనరల్ మేనేజర్ సుబ్రత్ కుమార్ మహాపాత్రా రాజీనామా చేశారని, ఇది తక్షణం అమలులోకి వచ్చిందని జైప్రకాశ్ తెలిపింది.

ఐపిఒకు ఇండోస్టార్ క్యాపిటల్

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్ 2,000 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూ జారీ చేయడానికి అనుమతి కోరుతూ సెబికి దరఖాస్తు చేసింది. కంపెనీలో ప్రస్తుత షేర్‌హోల్డర్లు ఈ ఇష్యూలో భాగంగా రెండు కోట్ల షేర్లు విక్రయిస్తారని ఆ దరఖాస్తులో తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను తమ మూలధన పటిష్ఠతకు ఉపయోగించుకుంటామని పేర్కొంది.



దేశీ మార్కెట్లోకి సనోఫీ సరికొత్త ఇన్సులిన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ ఫార్మా సంస్థ సనోఫీ ఇండియా.. సరికొత్త ఇన్సులిన్ ఉత్పత్తిని దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. టోయో పేరుతో లాంచ్ చేసిన ఈ భవిష్యత్ తరం బాసల్ ఇన్సులిన్.. టైప్ 1, 2 డయాబెటీస్ (మధుమేహ వ్యాధి) ఉన్న వారికి ఉపయోగపడుతుంది. ఈ ప్రిస్క్రిప్షన్ ఆధారిత ఔషధం.. కొత్తగా డిజైన్ చేసిన సోలో స్టార్ పెన్‌లోనూ ఫిట్ అవుతుందని సంస్థ తెలిపింది. సాధారణంగా ఇన్సులిన్ వాడేవారిని రక్తంలో చక్కెర స్థాయిలు కనీస స్థాయి కంటే పడిపోవచ్చన్న(హైపోగ్లైసెమియా) భయం వెంటాడుతుంటుంది. హైపోగ్లైసెమియా రిస్క్‌ను తగ్గిస్తూ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించుకుంటూ రావడం టోయో ఇన్సులిన్ ప్రత్యేకతని సనోఫీ పేర్కొంది. ఇన్సులిన్‌ను అతి స్వల్ప మోతాదులో విడుదల చేస్తూ నెమ్మదిగా చక్కెర స్థాయిని తగ్గిస్తుందని, 24 గంటలకు పైగా ప్రభావం చూపుతుందని సంస్థ తెలిపింది.

లుపిన్ నుంచి ఇన్‌ఫ్లూయెంజా ఔషధం

తీవ్రమైన జలుబు, చలి జ్వరం (ఇన్‌ఫ్లూయెంజా) చికిత్సలో ఉపయోగించే ఓసెల్టామివిర్ ఫాస్ఫేట్ కాప్సూల్స్‌ను అమెరికా మార్కెట్లో విడుదల చేసినట్లు లుపిన్ ప్రకటించింది. 30 ఎంజీ, 45 ఎంజీ, 75 ఎంజీ మోతాదుల్లో ఈ ఔషధం లభించనుందని తెలిపింది. హాఫ్‌మన్ లా రోచే ఇంక్‌కు చెందిన టామీఫ్లూ క్యాప్సూల్స్‌కు ఇవి జనరిక్ వెర్షన్.

ఫుడ్‌పాండా రూ.400 కోట్ల పెట్టుబడి

బెంగళూరు: భారత మార్కెట్లో రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు ఫుడ్‌పాండా ప్రకటించింది. ఈ సంస్థ ఆన్‌లైన్ ఆర్డర్‌పై ఇంటివద్దకే ఆహారం సరఫరా చేస్తుంది. ఆన్‌లైన్ బుకింగ్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫుడ్‌పాండా.. టెక్నాలజీ సామర్థ్యాన్ని పెంచుకోవడంతోపాటు భాగస్వామ్య రెస్టారెంట్లు, కస్టమర్లు, ఆహారం సరఫరా చేసే వారికి మరింత మెరుగైన సేవల అనుభూతిని పంచేందుకు ఈ పెట్టుబడులను ఉపయోగించుకోనున్నట్లు తెలిపింది. అంతేకాదు, కస్టమర్లకు ఆహారాన్ని అందించేందుకు వచ్చే 12-15 నెలల్లో 25,000 మంది డెలివరీ రైడర్లను నియమించుకోనున్నట్లు సంస్థ వెల్లడించింది. దేశంలో అతిపెద్ద ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్, డెలివరీ ప్లాట్‌ఫాం అయిన ఫుడ్‌పాండా.. దేశంలోని 150కి పైగా నగరాల్లో సేవలందిస్తోంది. 15వేలకు పైగా రెస్టారెంట్లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. గత ఏడాది డిసెంబరులో ఫుడ్‌పాండాను ఆన్‌లైన్ క్యాబ్ అగ్రిగేటర్ ఓలా కొనుగోలు చేసింది.

తదుపరి నిరోధం 10600

టెక్ వ్యూ

నిఫ్టీ 10500కన్నా పైన పాజిటివ్‌గా ప్రారంభమై సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం చివరికి 84 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో ముగిసింది. టెక్నికల్‌గా గత మూడు సెషన్లలోనూ మైనర్ రికవరీ సాధించినా ఇంకా బలంగా క్లోజ్ కాలేదు. ఇప్పుడు 50 డిఎంఏ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. బలమైన అప్‌ట్రెండ్‌లో ప్రవేశించేందుకు అంతకన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు :** 10500

● ప్రధాన నిరోధం 10600. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయికన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 10700.

● 10600 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10500. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

● మైనర్ రికవరీలో ఉన్న బ్యాంక్ నిఫ్టీ మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 25800 పైన బలంగా క్లోజ్ కావాలి.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

ప్రతి కంపెనీ ఐటి రిటర్న్ ఫైల్ చేయాల్సిందే

న్యూఢిల్లీ : డొల్ల కంపెనీలపై ప్రభుత్వం ఉచ్చు బిగిస్తోంది. రూ.3,000 కంటే తక్కువ పన్ను చెల్లించాల్సి ఉన్నా ఇక ప్రతి కంపెనీ తప్పనిసరిగా ఐటి రిటర్న్ దాఖలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఈ పరిమితికి లోబడి పన్ను చెల్లించాల్సిన వ్యక్తులు, కంపెనీలకు ఐటి రిటర్న్‌ల ఫైలింగ్ నుంచి మినహాయింపు ఉండేది. దీన్ని అడ్డుపెట్టుకుని అనేక మంది ఘరానా పెద్ద మనుషులు డొల్లల కంపెనీలు పెట్టి నల్ల ధనం చలామణి చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) నుంచే ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. రిటర్న్‌లు ఫైల్ చేయకపోతే ఆ కంపెనీ ఎండి లేదా సంబంధిత డైరెక్టర్‌పై జరిమానా లేదా ప్రాసిక్యూషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటారు. నల్లధనంపై వేటలో భాగంగా ఐటి శాఖ ఇప్పటికే తక్కువ లాభాలు చూపిస్తున్న కంపెనీలు, తొలిసారిగా ఐటి రిటర్న్‌లు ఫైల్ చేస్తున్న కంపెనీలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రస్తుతం దేశంలో 12 లక్షల కంపెనీలు ఉంటే అందులో ఏటా రిటర్న్‌లు ఫైల్ చేసే కంపెనీల సంఖ్య ఏడు లక్షలు మాత్రమే. ఇందులో దాదాపు మూడు లక్షల కంపెనీలు పైసా కూడా ఆదాయం లేదని తమ రిటర్న్‌ల్లో చూపిస్తుంటాయి.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 5.26(5.53)2275
AGRO TECH FO 669.55(645.1)1868
AISHWARYA TE 7.15(7.39)18124
ALPHAGEO (I) 843.3(848.6)2318
ALU FLUORIDE 116.95(117.9)18712
AMAR RAJA BA 844.95(798.45)85901
ANDHRA BANK 48.75(47.2)270881
ANDHRA CEMEN 11.88(11.88)21803
ANDHRA PETRO 62.45(64.6)259759
ANJANI PORTL 216.55(211.5)2338
ASTRA MICRO 107.3(105.15)81691
AUROB.PHARMA 607.85(590.15)189543
AVANTEL LTD 607.9(605.5)11895
AVANTI FEEDS 2506.25(2437.95)20941
B.N.RATHI SE 44.25(39.95)13499
BALAJI AMINE 673(644)20048
BAMBINO AGRO 268.8(256)1357
BARTRONICSIN 13.77(13.39)9656
BHAGIRA.CHEM 316.2(287.6)7327
BHAGYA INL 48(43.7)31069
BHARATFIN 1014.8(998.75)11009
BNR UDYOG 32.55(31.5)2483
CAMBRIDGE 83.2(81.6)6524
CCHHL 15.75(15.8)15858
CCL PRODUCTS 293.3(294.1)2936
CELESTIAL 17.8(17.35)22409
CIL SECURITS 32.4(31.4)4922
COROM INTER 530.35(532.7)6234
CUBEX TUBING 24.3(23.85)2154
CYBERMATE 3.84(3.69)132439
CYIENT 626.15(628.05)8966
DANLAW TECH. 76.95(77.25)21973
DECAN CEMENT 580.95(574.85)798
DHAN ROTO SP 40(40.65)3551
DIAMONPOWER 16.75(16.65)28673
DIVI'S LAB. 1035.5(1016.75)23499
DIVYA.GRANIT 108(106.25)478
DQ ENT 16.2(15.95)5830
DR.REDDY'S 2200.05(2194.8)132439
EMPEE SUGARS 4.67(4.71)23491
EVEREST ORG. 147.9(145.35)1083
FACOR ALLOYS 3.84(3.66)170999
FIRSTOBJ 16.75(15.4)16199
GATI LTD. 118.65(116.85)119356
GAYATRI BIO 9.63(9)1216
GAYATRI PROJ 210.25(200.25)23878
GENNEX LAB 5.06(4.91)197104
GMR INFRASTR 20.05(19.65)5770553
GODAVARI DRU 36.8(34.1)2618
GOLDST INFRA 214.65(194.7)59813
GOLDSTONE EN 16(15.25)10146
GRANULES (I) 122.3(118.8)124135
GVK POWERINF 20.6(20.3)881614
HBL P SYS 60.05(57.6)216646
HERITGFOOD 713.65(702.15)735
I.C.S.A. IND 3.99(4)25265
IKF TECHNO .91(.95)72011
INCAP LTD. 102.5(101.85)1837
IPAPPM 353.3(342.95)18315
IVRCL LTD 4.95(4.93)171763
KAKATIYA CEM 311.6(313.75)6424
KALLAM SPG. 24.65(24.25)43376
KARAN WOO-SN 1.9(1.81)1957
KAVERI SEED 479.55(477.5)22663
KCP LTD 138.6(136.85)20315
KERNEX MICRO 43.7(41.65)6047
KNR CONST 326.85(310.35)51860
KREBS BIOCHM 146.7(141.25)944
LANCO INFRA 1.3(1.36)2578269
LOKESH MACH 71.85(71)26832
LOTUS CHOC 50.05(49.35)36946
MADHUCON PRJ 31.1(30.35)19255
MOLD-TEK TEC 63.75(64.95)2373
MOSCHIP SEMI 36.05(35.5)60166
MSR INDIA 42.05(41.2)9445
N C L IND. 244.3(253.45)24624
NACLIND 48.15(47.15)27347
NATCO PHARM 818.3(812.35)33237
NCC 118.5(114.35)358684
NEHA INTER. 8.15(8.61)29562
NETTLINX LTD 85.4(83.05)10876
NEULAND LAB. 700.5(696.7)1814
NIHAR INFO 14.45(13.8)1001
NILE LTD. 889.55(882.85)6760
NTL 4.31(4.11)5044
OIL COUNTRY 45.1(45.05)9900
PADMALAYA TE 4.99(4.96)9454
PALRED 95.45(93.75)4350
PANYAM CEMEN 54.65(54)19707
PENNAR STEEL 64.55(64.8)148329
PFL INFOTECH 10.05(10.04)544
PHYTOCHEM I. 70(68.3)4555
PITTI LAMIN. 91.9(88.4)7739
POKARNA LTD 214.95(210.05)3242
PRAJAY ENGS. 14.95(14.3)24028
PREMIER EXPL 409.8(406.4)1428
PRISM CEMENT 136.3(133)80453
RAIN 392.5(391.65)473794
RAJ PACKAGIN 38.75(38)180
RAJVIR IND 45(45.5)3500
RESTILE CER. 7.9(7.79)16641
SAGAR CEM. 988.75(988.45)1293
SAMKRG PIST. 318.15(308.1)6624
SAMPRE NUTRI 58.2(60.15)14698
SANGHI IND. 122.1(118.15)77569
SATVAH.ISPAT 24.75(25.2)15588
SAVEN TECHNO 20.75(20.55)3301
SIBAR AUTO 21.95(21.55)26977
SMPL 1.43(1.45)27252
SMS PHARMACE 95.5(95.1)7411
SREE RAYALA 194.65(192.65)4060
STEEL EXCH 34.75(33.1)11159
SUJANA INDUS .96(1)61397
SURANATP 5.41(5.6)17031
SURYACHAKRA 1.41(1.46)44800
SURYAMBA SP 75.6(78.95)823
SURYAVA SPIN 7.73(8.13)111
SURYLAK.COTT 87.8(87)2580
SUVEN LIFE S 199.95(195.4)79993
TAJ GVK HOTL 176.7(175.4)5842
TANLA 33.2(32.05)75452
TRANSCORP IN 38.85(37)3890
TRANSGENE BI 2.2(2.19)23251
TRANSPORT CO 293.7(282.65)15537
USHER AGRO 7.53(7.52)9845
VICEROY HOTE 17.1(17.1)70073
VIJAY TEXTIL 55.45(55.95)4680
VIMTA LABS 207.55(197.7)4179
VIRAT CRANE 46(43.95)2701
VIRINCHI 134.95(127.5)98854
VISAKA IND. 727.05(698.15)20534
VISTA PHARMA 46.1(41.95)199437
VIVIMED LABS 87.25(85.45)1222194
VST INDUS. 3250(3218.65)1162
WATERBASE 332.2(368.25)854390
XLENERGY 3(2.96)19722
YBRANTDIGI 6.02(5.98)1271408
ZEN TECH 120.9(114.55)14718
ZENOTECH 44.55(44.5)15644

ఎన్ఎస్ఇ-500 NSE — షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 624.75(612.4)10859
AARTIIND 1132.65(1139.2)8464
ABAN 190.15(186.95)2183620
ABB 1610.65(1590.8)36442
ABFRL 162.65(156.4)423120
ABGSHIP 11.65(11.35)9901
ACC 1651.55(1660.95)252902
ADANIENT 217.25(210.1)7269216
ADANIPORTS 403.35(399)1249277
ADANIPOWER 34(33.8)8726014
ADANITRANS 210.5(205)787993
AEGISCHEM 274.65(261.95)162878
AHLUCONT 340.05(345.6)29612
AIAENG 1451.45(1446.7)21447
AJANTPHARM 1425.6(1416.5)134427
AKZOINDIA 1791.35(1772.3)3471
ALBK 60.85(59.5)2155010
ALLCARGO 196.2(192.6)167584
ALOKTEXT 3.55(3.6)3726392
AMARAJABAT 848.55(800.1)1752595
AMBUJACEM 256.9(258.9)1200752
AMTEKAUTO 24.55(24.3)385435
ANANTRAJ 62.65(59.35)1882636
ANDHRABANK 48.75(47.25)3272410
APARINDS 791.35(767.55)31613
APLLTD 558.6(545.25)29069
APOLLOHOSP 1151.55(1122.7)580640
APOLLOTYRE 274.9(270.8)3624552
ARVIND 406.85(398.6)1032202
ASHIANA 177.2(179.1)191698
ASHOKA 246.8(245.2)377015
ASHOKLEY 133.3(134.2)11892807
ASIANPAINT 1144.4(1130.75)646362
ASTRAL 784.7(795.15)27405
ASTRAZEN 1048.9(1013.55)5235
ATUL 2760.45(2749.05)6633
AUROPHARMA 607.3(589.5)3059695
AVANTIFEED 2506.75(2444)167831
AXISBANK 564.2(557.55)4765319
BAJAJ-AUTO 3154.1(3099.25)239055
BAJAJCORP 493.25(494.25)34432
BAJAJELEC 514(537)806867
BAJAJFINSV 5235.45(5059.35)141176
BAJAJHIND 14(14)3213809
BAJAJHLDNG 2689.9(2693.8)11220
BALKRISIND 1146.35(1138.4)211744
BALLARPUR 14.55(15.2)3096329
BALMLAWRIE 245.4(243.65)58416
BALRAMCHIN 121.85(120.4)1881358
BANKBARODA 168.65(156.25)48926198
BANKINDIA 144.85(142.2)5262434
BASF 2226.05(2121.65)25419
BATAINDIA 714.5(714.9)755572
BBTC 1407.5(1313)443405
BEML 1347.85(1256.15)930863
BERGEPAINT 249.45(246.65)411031
BFUTILITIE 495.2(473.5)1736420
BGRENERGY 125.3(121.9)98304
BHARATFIN 1015.05(997.7)523171
BHARATFORG 776.35(762.8)1567761
BHARTIARTL 424.4(422.5)3593521
BHEL 97.5(94.4)9746825
BHUSANSTL 50.9(53.05)4072692
BIOCON 612.05(606.95)1115591
BIRLACORPN 1002.75(998.9)23532
BLISSGVS 207.8(204.95)607128
BLUEDART 4495.8(4521.6)45333
BLUESTARCO 742.95(744.55)15910
BOMDYEING 251.3(245.1)4743722
BOSCHLTD 19545.85(19482.6)5107
BPCL 467.55(475.4)4569433
BRFL 70.25(66.95)11025
BRIGADE 295.9(295.4)14803
BRITANNIA 4772.5(4641.15)214757
CADILAHC 423.65(411.75)2335436
CANBK 327.8(321.15)3225049
CAPF 698.05(687.2)338859
CARERATING 1375(1351.1)22096
CASTEXTECH 5.3(5.2)607424
CASTROLIND 198.2(196.2)1967195
CCL 293.6(294.65)39170
CEATLTD 1612.3(1548.7)867810
CENTRALBK 69.85(67.4)712682
CENTURYPLY 328.25(324.2)141285
CENTURYTEX 1280.55(1262.35)454445
CERA 3403.35(3380.5)21799
CESC 1035.75(1007.6)365985
CHAMBLFERT 155.2(155.05)345235
CHENNPETRO 378.85(376.4)553226
CHOLAFIN 1365.05(1322.55)528263
CIPLA 621.65(621.4)1957424
CLNINDIA 635.15(620.9)22775
COALINDIA 300.65(300.15)4512970
COLPAL 1093.9(1100.85)167510
CONCOR 1325.3(1317.65)334133
COROMANDEL 526.55(535.05)245763
CORPBANK 35.8(35.6)648458
COX&KINGS 257.4(250.65)77732
CRISIL 1970.55(1945.1)8382
CUB 166.8(162.25)807769
CUMMINSIND 845(824.45)117316
CYIENT 625.65(628.4)103711
DABUR 344.75(340.55)919718
DALMIABHA 2884.75(2794.05)109054
DBCORP 326.55(317.45)30347
DBREALTY 58.8(56)252795
DCBBANK 172.8(171)1010658
DCMSHRIRAM 551.05(543.4)125072
DEEPAKFERT 367.15(361.6)99367
DELTACORP 363.9(350.75)2954147
DEN 111.25(109)262528
DENABANK 22.8(22.4)1553177
DHANUKA 696.2(685.5)11515
DHFL 525.75(514.45)3086170
DISHTV 74.65(73.85)2243711
DIVISLAB 1036.5(1016.55)488773
DLF 233.75(229.05)7012358
DREDGECORP 712.85(707.75)368506
DRREDDY 2204.25(2193.8)482626
DYNAMATECH 1775.35(1763.55)3415
ECLERX 1324.5(1346.3)15516
EDELWEISS 258.1(250)1759113
EICHERMOT 27901.4(27747.95)17594
EIDPARRY 324.8(326.45)75020
EIHOTEL 179.95(181.1)77515
ELECTCAST 33.4(34)376497
ELGIEQUIP 334.4(336.4)33995
EMAMILTD 1080.85(1088.05)116929
ENGINERSIN 173(168.25)1610393
EROSMEDIA 203.4(198.55)505218
ESCORTS 901.5(910.7)1093389
ESSDEE 72.2(68.8)16800
ESSELPACK 274.95(279.85)27489
EVEREADY 377.1(379.55)40734
EXIDEIND 213.05(208.25)1515768
FCONSUMER 63.8(63.7)4183021
FDC 293.6(287)200262
FEDERALBNK 95.1(94.85)7199398
FINCABLES 699.25(669.95)198378
FINPIPE 692.75(696.1)33200
FLFL 378.7(376.75)17394
FORTIS 139(148.6)26330832
FSL 47.55(44.05)23557254
GAIL 465(462.45)2042550
GATI 118.4(116.65)624630
GDL 214.85(214.8)73007
GEPIL 873(859.2)20643
GESHIP 389.1(395.15)165088
GET&D 406.15(406.1)40463
GILLETTE 6536.2(6546.1)982
GLAXO 2449.05(2466.25)11599
GLENMARK 535.35(535.2)1626940
GLOBOFFS 35.95(34.25)32247
GMDCLTD 145.7(148.45)371264
GMRINFRA 20.05(19.55)47674295
GODFRYPHLP 895.1(862.05)152540
GODREJCP 1029.5(1016.6)175715
GODREJIND 550.7(550.05)551695
GODREJPROP 828.55(839.35)86353
GPPL 145.75(145.95)571428
GRANULES 122.45(118.75)2394952
GREAVESCOT 131.85(131.3)1007424
GREENPLY 365.85(367.35)22592
GRINDWELL 504.85(499.65)4948
GRUH 532.55(532.85)290312
GSFC 137.85(132.5)6776209
GSKCONS 5971.1(6080.2)10195
GSPL 199.6(202.5)1061455
GUJFLUORO 787.55(776.95)64134
GUJGASLTD 850.65(856.85)35106
GULFOILLUB 1039.65(1075.05)18920
GVKPIL 20.55(20.3)3308768
HATHWAY 39.6(37.05)1477098
HAVELLS 516.05(515.25)724602
HCC 35.95(35.1)7420654
HCL-INSYS 60.65(57.7)5560117
HCLTECH 939.15(964)1487794
HDFC 1805.45(1773.05)3194895
HDFCBANK 1876.65(1849.5)1095277
HDIL 54.8(51.55)18602480
HEIDELBERG 161.6(161.65)243159
HEROMOTOCO 3611.9(3546.1)385092
HEXAWARE 329.55(341.2)1244080
HFCL 30.65(30.7)9751712
HIMATSEIDE 364.85(364.15)57625
HINDALCO 243.25(243.5)5557349
HINDCOPPER 79.8(79.2)2185373
HINDPETRO 391.45(395.7)4523355
HINDUNILVR 1344.45(1333.05)1166428
HINDZINC 307.65(303.55)4332375
HMT 36(35.2)2215
HMVL 244.6(243)2267
HONAUT 17822.4(16985.95)3920
HOTELEELA 23.4(23.75)4660453
HSIL 423.2(419.25)119297
HTMEDIA 95.8(95.05)157736
IBREALEST 234.65(227.6)11622562
IBULHSGFIN 1314.85(1288.4)995745
ICICIBANK 326.25(326.75)8356351
ICRA 3935.55(3917.05)863
IDBI 67.55(62.75)26402892
IDEA 84.5(83.7)18359301
IDFC 53.75(53.25)4772526
IFBIND 1382.3(1379.55)4111
IFCI 24.15(23.4)12556544
IGARASHI 820.5(813.6)4499
IIFL 761.5(735.75)344728
IL&FSTRANS 77.25(75.8)194633
INDHOTEL 138.05(136.95)1650018
INDIACEM 162.05(161.4)7067514
INDIANB 357.35(339.4)4081209
INDOCO 275.15(273.7)43809
INDUSINDBK 1687.8(1649.85)864259
INEOSSTYRO 950.6(943.95)3702
INFRATEL 338.25(341.5)3252157
INFY 1102.8(1109.15)3145986
INGERRAND 758.8(745)13631
INOXLEISUR 302.3(305.4)72571
INOXWIND 126.55(123.85)173662
INTELLECT 201.15(196.2)979306
IOB 21.8(20.9)961306
IOC 379.05(378.65)3116035
IPAPPM 353.45(343.25)76623
IPCALAB 639.55(620.05)670024
IRB 227.5(221.9)1456179
ITC 269.85(271.35)6713679
J&KBANK 70.5(70.2)274157
JAGRAN 170.2(168.95)42051
JAICORPLTD 168.5(161.5)2674861
JBCHEPHARM 318.3(300.5)199414
JBFIND 179.5(177.15)47202
JCHAC 2320.55(2324.65)5287
JETAIRWAYS 823.4(791.7)3981483
JINDALPOLY 355(345.45)59773
JINDALSTEL 274.1(272.65)7007854
JISLJALEQS 123.15(118.15)10629353
JKCEMENT 1027.4(1025.85)15595
JKIL 362.65(316.15)649070
JKLAKSHMI 423.8(415.1)64468
JKTYRE 190.3(177.25)4345201
JMFINANCIL 154.25(150)710329
JPASSOCIAT 17.85(17.5)41190709
JPINFRATEC 15.1(14.95)2257241
JPPOWER 6.5(6.45)1838187
JSWENERGY 82.55(82.5)2459367
JSWHL 1740.9(1722.85)3038
JUBILANT 936.5(942.1)1007739
JUBLFOOD 2026.65(1998.7)653313
JUSTDIAL 474.1(449.05)3889244
JYOTHYLAB 353.4(352.35)46058
KALPATPOWR 475(472.6)177616
KANSAINER 504.75(504.35)125168
KEC 363(357.55)438826
KESORAMIND 138.55(141.2)395427
KIRLOSENG 379.05(374.95)6061
KITEX 249.65(290.65)1218001
KOLTEPATIL 345.6(326.55)219376
KOTAKBANK 1042.95(1032)772861
KPIT 215.45(215.25)2621514
KRBL 600.2(586.8)250548
KSCL 479.3(478.55)361893
KSK 14.95(14.25)600759
KTKBANK 139.4(135.95)2476669
KWALITY 91.4(89.45)2296393
L&TFH 166.45(163.5)4441247
LAKSHVILAS 125.6(124.5)422185
LAOPALA 618.35(618.3)8307
LAXMIMACH 5862.65(5738.3)1903
LICHSGFIN 521.5(511.85)1574905
LITL 1.35(1.4)794527
LT 1350.5(1329.25)1543603
LUPIN 840.45(822.15)1781070
M&M 746(750.05)2662221
M&MFIN 444.45(444.3)668740
MAGMA 167.15(160.2)45783
MAHINDCIE 215.35(213.9)201328
MAHLIFE 469.05(460.9)33401
MANAPPURAM 105.9(104.35)2760059
MANPASAND 420.5(399.95)444454
MARICO 310.05(297.2)3514638
MARKSANS 41.35(39.9)6808116
MARUTI 9117.85(8936.1)408523
MAYURUNIQ 511.2(497.25)10699
MCDOWELL-N 3268.2(3194)426360
MCLEODRUSS 173.15(171.65)165699
MERCK 1550.9(1497.35)23814
MHRIL 319.25(305.3)216631
MINDACORP 212.3(197.85)707123
MINDTREE 722.4(717.2)741147
MMTC 58.6(56.75)1274780
MOIL 230.5(234.5)353843
MONSANTO 2497.4(2503)6889
MOTHERSUMI 364.45(359.95)2097972
MOTILALOFS 1156.1(1129.6)93755
MPHASIS 857.7(897.6)479338
MRF 71640.9(70013.8)7298
MRPL 118.75(118.75)548590
MTNL 23.35(22.4)1676467
MUTHOOTFIN 417.55(421.9)1087669
NATCOPHARM 819.65(813.5)295019
NATIONALUM 75.25(73.5)16755424
NAUKRI 1245.6(1293.5)13548
NAVKARCORP 174.75(171.15)109935
NCC 118.55(114.25)4742526
NETWORK18 52.1(51.6)471958
NHPC 29.5(28.7)6398230
NIITTECH 829.05(829.95)439173
NITINFIRE 6.6(6.3)233297
NLCINDIA 101.8(101.2)663519
NMDC 137.4(136)3348659
NTPC 164.9(163.25)8722064
OBEROIRLTY 463.25(454.45)266764
OFSS 4052.7(4069.15)14832
OIL 360.75(355.05)1037814
OMAXE 229.55(228.8)255882
ONGC 191(187.35)14960914
ORIENTBANK 112.55(110.3)2491890
ORIENTCEM 150.9(151.05)39923
ORISSAMINE 1798(1752.95)4439
PAGEIND 22069.3(21398.95)20299
PARSVNATH 22.6(22.25)131654
PCJEWELLER 385.25(369.8)7894013
PEL 2687.3(2633.75)120120
PERSISTENT 783.3(796.3)78955
PETRONET 248.7(246.8)1815272
PFC 111.25(109.3)4612747
PFIZER 2321.4(2309.3)69424
PFS 34.25(33.5)733023
PGHH 9344.1(9310)1700
PHOENIXLTD 599.9(589.3)19328
PIDILITIND 894.5(878.2)926463
PIIND 840.45(810.45)89107
PNB 161.65(156.8)15391679
POLARIS 468.85(469.3)335361
POWERGRID 198.5(193.2)6608165
PRAJIND 97.75(94.95)1380031
PRESTIGE 309.65(301.95)434919
PRISMCEM 136.3(133.25)620844
PTC 102.55(99.05)2216386
PUNJLLOYD 22.1(21.85)1054103
PURVA 153.15(153.35)330113
PVR 1412.75(1396.6)99422
RADICO 353.55(335.45)2696978
RAIN 392.5(392.25)3068434
RAJESHEXPO 815.1(812.45)295936
RALLIS 232.1(229.35)216186
RAMCOCEM 739.9(710.9)224367
RAMCOSYS 452.8(458.2)29428
RATNAMANI 962.1(960.85)15080
RAYMOND 979.1(966.15)554296
RCF 86.75(87.15)2734858
RCOM 27.1(27)72132568
RECLTD 154.05(149.95)4282712
REDINGTON 152.2(141.9)440413
RELAXO 601.35(612.75)34077
RELCAPITAL 507.4(494.7)7324771
RELIANCE 915.5(897.85)5429792
RELINFRA 461.15(451.5)3527069
RENUKA 16.25(15.65)2777497
REPCOHOME 592.2(588.15)318859
RIIL 495.25(479.5)849564
RKFORGE 800.6(797.65)93852
RNAVAL 41.7(40.2)7277629
ROLTA 77.65(68.7)7237498
RPOWER 47.35(44.9)18285447
RTNPOWER 6.65(6.4)6066209
RUCHISOYA 17.1(16.4)1243158
SADBHAV 400.65(395.85)285636
SADBHIN 137.25(136.3)84974
SAIL 95.35(93.95)28901756
SANOFI 4818.05(4724.9)8742
SBIN 288.75(296.4)50839665
SCHAEFFLER 5383(5345.45)4682
SCHNEIDER 113.55(111.4)340359
SCI 85.45(77.4)3405670
SHARDACROP 394.15(382.9)36070
SHILPAMED 508.75(520.15)43071
SHK 284.35(281.8)23675
SHOPERSTOP 532.25(535.5)21041
SHREECEM 16953.35(17041.45)14916
SHRIRAMCIT 2021.35(1935.75)3917
SIEMENS 1255.5(1229.4)124117
SIMPLEXINF 572.4(575.1)9620
SINTEX 22.6(22.35)1871211
SITINET 19.7(19.7)69587
SJVN 36.8(36.95)1042620
SKFINDIA 1834.65(1791.45)8633
SMLISUZU 817.9(805.1)293303
SNOWMAN 53.75(52.55)778019
SOBHA 562.2(567.15)393738
SOMANYCERA 699.7(694.2)10532
SONATSOFTW 294.6(285.95)197006
SOUTHBANK 28.2(27.5)7622593
SPARC 446.85(440.25)288712
SREINFRA 83.5(81.75)1608955
SRF 1893.45(1875.05)116947
SRTRANSFIN 1325.9(1311.3)663190
STAR 738.9(739.75)749668
STCINDIA 159.25(155.55)51547
SUNDARMFIN 1658.25(1661.45)23357
SUNDRMFAST 535.2(529.65)95986
SUNPHARMA 589.15(582.7)10261511
SUNTV 985.1(973.55)1436715
SUPREMEIND 1197.05(1185.8)28863
SUVEN 200.1(195.45)402823
SUZLON 13.5(13.5)51777656
SWANENERGY 199.25(198.7)136133
SYMPHONY 1719.8(1688.7)8926
SYNDIBANK 65.75(65)6358894
SYNGENE 604.05(593.9)55684
TAKE 170.6(169)169731
TATACHEM 715.5(700.75)641361
TATACOFFEE 142.5(138.8)335603
TATACOMM 650(638.1)414890
TATAELXSI 1007.65(998.25)419067
TATAGLOBAL 285.1(278.25)4583181
TATAMOTORS 371.8(368.75)6002369
TATAMTRDVR 208.2(207.1)3085144
TATAPOWER 86.75(85.05)3958245
TATASPONGE 1054.05(1047.3)82155
TATASTEEL 713.1(685.3)12036307
TBZ 119.45(116)195857
TCS 2967.3(2971.7)987281
TECHM 590.35(595.25)2343988
TECHNO 365.15(364.9)20119
TEXRAIL 95.65(93.6)537290
THERMAX 1181.05(1183.65)39678
THOMASCOOK 243.5(238.25)102337
TIDEWATER 6825.45(6565.8)2688
TIMKEN 820.45(826.9)10924
TITAN 809.05(796.8)2067452
TNPL 419(421.15)85879
TORNTPHARM 1430.8(1434.35)86563
TORNTPOWER 270.1(268.5)1149505
TREEHOUSE 13.45(13.1)22933
TRIDENT 75.9(73.05)508412
TRITURBINE 123.75(125.85)223308
TTKPRESTIG 7019.4(7040.85)2277
TTML 6.65(6.5)731413
TV18BRDCST 56.45(55.4)3425077
TVSMOTOR 661.25(664.8)345065
TVSSRICHAK 3642.4(3627.1)4671
TVTODAY 475.95(478.65)540339
UBL 1077.45(1063.35)181105
UCOBANK 29.55(29.2)689274
UFLEX 384.1(389.35)191202
ULTRACEMCO 4200.3(4153.3)218964
UNICHEMLAB 377.45(370.4)1173708
UNIONBANK 127.4(126.25)4453664
UNITECH 7.6(7.5)18649537
UPL 726.5(708.35)1291508
VAIBHAVGBL 700.15(693.15)14324
VAKRANGEE 211.75(201.7)807823
VEDL 315.55(316.3)9097394
VIDEOIND 18.9(19)3493037
VIJAYABANK 61.2(61.1)1435729
VINATIORGA 868.45(879.9)17960
VIPIND 354.2(356.45)227211
VOLTAS 592.5(593.7)1056620
VRLLOG 427.95(432.4)26188
VSTIND 3249.55(3208.3)1801
VTL 1316.9(1319.65)32463
WABAG 558.45(569.6)281696
WABCOINDIA 7258.45(7039.7)5761
WELCORP 164.6(165)501321
WELSPUNIND 71.85(67.65)1636325
WHIRLPOOL 1510.5(1543.65)56062
WIPRO 288.95(285)2520859
WOCKPHARMA 814.7(808.25)1776471
WONDERLA 386.4(366.95)136050
ZEEL 584.5(580.95)908184
ZEELEARN 44.3(43.25)474886
ZENSARTECH 931.65(936.7)10576
ZYDUSWELL 1133.95(1147.2)11778

150 మంది కొలువులు ఫట్?

» విజయవాడ రైల్వే ఉద్యోగుల జాబితా సిద్ధం

» దీర్ఘకాలం అనధికారిక సెలవులే కారణం



విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న వారిపై రైల్వేశాఖ కొరడా ఝుళిపించనుంది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో తొమ్మిది విభాగాల్లో పనిచేస్తున్న 150 మంది ఉద్యోగులపై వేటుకు పర్సనల్ విభాగం అధికారులు జాబితా సిద్ధం చేసి అత్యంత రహస్యంగా ఉంచినట్టు సమాచారం. ఎలాంటి కారణాలు లేకుండానే సెలవుల్లో ఉండడాన్ని రైల్వే బోర్డు సీరియస్‌గా పరిగణించింది. దీనిపై గత కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇక ఉపేక్షించకూడదని ఉన్నత స్థాయి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వేటు పడేవారిలో ఇంజనీరింగ్ విభాగం, క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కారణం తెలపకుండా దీర్ఘకాలం అనధికారిక సెలవుల్లో ఉన్నవారికి ఇప్పటికే పలు దఫాలుగా నోటీసులు ఇచ్చినా, వారినుంచి సమాధానం రాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నట్టు రైల్వే బోర్డు అధికారులు చెబుతున్నారు. కొందరు కేంద్ర స్థాయిలో పావులు కదిపి, మంత్రులు, వారి అనుచరుల కనుసన్నల్లో మెలుగుతూ అనధికారికంగా సెలవుల్లో ఉంటూ, రైల్వేలో వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారినీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరికగానే ఒకేసారి 150 మందిని విధుల నుంచి తొలగించడానికి నిర్ణయించినట్టు తెలిసింది. ఇప్పటికే కసరత్తు పూర్తయినట్లు సమాచారం. తదుపరి న్యాయస్థానాన్ని ఆశ్రయించే పరిస్థితి కూడా లేకుండా ఉన్నత స్థాయి అధికారులు జాగ్రత్త పడుతున్నట్టు తెలిసింది.

బెజవాడలో మరో భూమాయ!

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఏపూరి మధుసూదనరావు వైద్యవృత్తిలో ఉన్నారు. ఆయన ఇద్దరు కుమార్తెలు, స్నేహితుడు నాదెండ్ల మాధవరావు పేరున పటమటలో 1,484 చదరపు గజాల స్థలం ఉంది. ఇద్దరు కుమార్తెలూ అమెరికాలోనే ఉండడంతో ఈ స్థలానికి మధుసూదనరావు జీపీఏ హోల్డర్‌గా ఉన్నారు. ఆయన ఈ స్థలాన్ని 2012లో అరుణా మోటార్స్ కంపెనీకి అద్దెకు ఇచ్చారు. ఇక్కడ వాచ్‌మన్‌గా విజయవాడకు చెందిన సుద్దపల్లి గోపీ కమలాకర్ అలియాస్ గోపీని ఆ కంపెనీ ఏర్పాటు చేసుకుంది. ఈ స్థలం లీజు గడువు 2017తో ముగియడంతో, ఈ స్థలాన్ని కంపెనీ ఖాళీ చేసి మరో చోటకు వెళ్లిపోయింది. అయితే, తమకు మరో చోట గూడు దొరికేవరకు ఇక్కడే ఉంటామని చెప్పుకొని.. సుద్దపల్లి గోపీ తన తల్లి విజయకుమారి, తండ్రి శివయ్యతో కలిసి ఉంటున్నాడు. కాగా, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మందాడి ఆదిరెడ్డి, సందిపోగు రవీంద్ర అలియాస్ బుజ్జి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. అందులోభాగంగా విజయవాడకు వచ్చిన వీరు, పటమటలో ఉన్న మధుసూదనరావు కుటుంబం భూమిపై కన్నేశారు. అక్కడ వాచ్‌మెన్‌లుగా ఉన్న గోపీ, విజయకుమారికి డబ్బుల ఆశ చూపించి, తమలో కలుపుకొన్నారు. తమ జిల్లా భగవాన్‌రాజుపాలెం గ్రామానికి చెందిన నార్నె పోతురాజును ఆదిరెడ్డి, రవీంద్రలు తెరపైకి తెచ్చారు. తాము చెప్పినట్టుగా చేస్తే కొంత నగదు ఇస్తామని ఆశ చూపించారు. దీంతో ఈ స్థలం యజమానిని తానేనంటూ నార్నె పోతురాజు ముందుకొచ్చాడు. గోపీ, విజయకుమారిని తానే ఆ స్థలానికి వాచ్‌మన్‌గా నియమించానని పోతురాజు చెప్పగా.. పథకంలో భాగంగా 'అవును.. ఆయనే మా యజమాని' అని ఆ ఇద్దరూ ప్రకటించారు.



నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

ఎదురు కేసుల ఎత్తుగడతో..

పోతురాజు పేరున నకిలీ దస్తావేజులు సృష్టించారు. పేర్లు కనిపించకుండా, కేవలం రౌండ్ మాత్రమే కనిపించే సీల్ స్టాంపులను వాటిపై వేశారు. తర్వాత ఆదిరెడ్డి, రవీంద్ర కలిసి.. అబ్దుల్లా అనే బ్రోకర్ ద్వారా ఖాజా అనే వ్యక్తికి రూ.1.10 కోట్లకు ఆ స్థలాన్ని విక్రయించడానికి బేరం కుదుర్చుకున్నారు. అగ్రిమెంట్ చేసుకుని రూ.10లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. దస్తావేజులు నకిలీవని తెలిసినా, తక్కువ ధరకు వస్తుండడంతో ఈ స్థలాన్ని కొనుగోలు చేయడానికి మరికొంతమందితో కలిసి ఖాజా సిద్ధపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మధుసూదనరావు, తన స్థలం ఖాళీ చేయాల్సిందిగా గోపీ, విజయకుమారీలకు తేల్చిచెప్పాడు. అయినా వారు అక్కడి నుంచి కదల్లేదు. పైగా ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం.. పోతురాజు, విజయకుమారి ఒకరిపై ఒకరు సివిల్ కోర్టులో కేసులు వేసుకున్నారు. తర్వాత ఈ కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో స్థలం ఖాళీ చేయాలంటే తనకు రూ.2లక్షలు ఇవ్వాలని మధుసూదనరావును విజయకుమారి డిమాండ్ చేయగా, ఆ మొత్తాన్ని ముట్టజెప్పాడు. మరోవైపు 'మీరు చెప్పినట్టు వినాలంటే నాకు భారీగా డబ్బులు ఇవ్వాలి' అంటూ ఆమె భూమాయగాళ్ల నుంచి రూ. 10 లక్షలు తీసుకొంది. ఈ ముఠాతో కుదిరిన సర్దుబాటులో భాగంగా.. తనను అన్యాయంగా స్థలం ఖాళీ చేయమంటున్నారంటూ వైద్యుడిపై పటమట పోలీసులకు విజయకుమారి ఫిర్యాదు చేసింది. అదే సమయంలో పోతురాజు, విజయకుమారిపై మధుసూదనరావు కూడా ఫిర్యాదు చేశారు. క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు.. వైద్యుడికి అన్యాయం జరిగినట్టు గుర్తించారు. సందెపోగు రవీంద్ర, నార్నె పోతురాజు, సుద్దపల్లి విజయకుమారి, సుద్దపల్లి గోపీ కమలాకర్, షేక్ అబ్దుల్లా, నక్కా వీరకుమార్, మర్రి రవీంద్ర, ఖాజా, షేక్ సిరావుద్దీన్ అలియాస్ దిలీప్ కుమార్‌ల ముఠాను అరెస్టు చేశారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ మందాడి ఆదిరెడ్డి పరారీలో ఉన్నాడు. అసలు దస్తావేజుల గురించి పోలీసులు ప్రశ్నించగా, 1989లో వంగవీటి రంగా హత్య తర్వాత జరిగిన అల్లర్లలో గాంధీనగర్ రిజిస్టర్ కార్యాలయం దహనమైనప్పుడు కాలిపోయాయని ఈ ముఠా చెప్పడం గమనార్హం. పైగా వైద్యుడి స్థలాన్ని తనఖా పెట్టి రూ.కోటి రుణానికి వీరు ఓ బ్యాంక్‌కు దరఖాస్తు చేశారు.

ఏపీలో పోగేసి..

పొరుగు రాష్ట్రంలో దాచి!

» తమిళనాడులో బయటపడ్డ ప్రదీప్‌కుమార్ ఆస్తులు

» భారీగా బంగారు నగలు, స్థిరాస్తి పత్రాలు

» మరికొందరి ఆస్తులపై ఏసీబీ ఆరా

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన వుడా అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఆస్తులు తమిళనాడు రాజధాని చెన్నైలో బయటపడ్డాయి. తెలుగు రాష్ట్రాల్లో 20 ప్రాంతాల్లో సోదాలు చేపట్టిన ఏసీబీ అధికారులు ప్రదీప్‌కు భారీగా ఆస్తులున్నట్లు గుర్తించిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఆయన ఇంట్లో సోదాల సందర్భంగా లభించిన ఆధారాలను బట్టి.. చెన్నైతో పాటు విశాఖపట్నంలో బినామీల పేర్లతో లాకర్లున్నట్లు గుర్తించారు. ప్రదీప్ సోదరి భర్త పేరుతో చైన్నై టీ-నగర్‌లోని ఎస్‌బీఐ లాకర్‌ను సోమవారం తెరిచారు. సుమారు కిలో బంగారం, స్థిరాస్తి పత్రాలు లభించినట్లు ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ వెల్లడించారు. ఇప్పటికే పలువురు అవినీతిపరుల కేసుల్లో రహస్య ఆస్తులను బెంగళూరు, ఇతరత్రా ప్రాంతాల్లో ఉంచినట్టు ఏసీబీ అధికారులు గుర్తించి శోధిస్తున్నారు.

ఆర్టీసీని ఆదుకోరూ: ఎన్‌ఎంయూ

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీని అన్ని విధాలా ఆదుకోవాలని గుర్తింపు యూనియన్ ఎన్‌ఎంయూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులతో కూడిన బృందం అమరావతిలో సోమవారం సీఎంతో భేటీ అయ్యింది. ఆర్టీసీ అప్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈక్విటీగా మార్చాలని... కొత్త బస్సుల కొనుగోలుకు రూ.1000 కోట్లు కేటాయించాలని, విమానాల తరహాలో డీజిల్‌పై వ్యాట్ రాయితీ ఇవ్వాలని, పల్లెవెలుగుల నష్టాన్ని ప్రభుత్వమే భరించి ఎంవీ టాక్స్ హాలిడే ప్రకటించాలని, చట్టవ్యతిరేకంగా తిరుగుతున్న వాహనాలను నియంత్రించాలని ఎన్‌ఎంయూ నేతలు కోరారు. కార్మికుల సమస్యలను సైతం సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి ఎన్‌ఎంయూ నేతలు విన్నవించారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయండి

» రాష్ట్రానికి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 2016-17, అంతకుముందు ప్రారంభించి వదిలేసిన ఉపాధి పనులన్నీ పూర్తిచేసి, కొత్త పనులు చేస్తే బాగుంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్రానికి సూచించింది. ఏపీలో 2016-17 లో 55,31,871 పనులు చేపట్టారని, అందులో 4.80 లక్షల పనులు అసంపూర్తిగా ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ సెక్రటరీ అపరాజిత సారంగి పంపిన లేఖలో పేర్కొన్నారు.

కష్టాలతో వచ్చి సీఎంకు మొర

» పెద్ద మనసుతో చంద్రబాబు సాయం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమ కష్టాలు తీర్చాలని, ఆదుకోవాలని కోరుతూ వచ్చిన సందర్శకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసుతో సాయం చేశారు. సచివాలయంలో సోమవారం తనను కలవడానికి వచ్చిన సందర్శకుల సమస్యలను ముఖ్యమంత్రి సావధానంగా విని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. గుంటూరు జిల్లా చుండూరు మండలం దుండిపాలెంలో నుంచి వచ్చిన వట్టిప్రోలు ప్రసన్నకుమార్ తలసీమియాతో బాధపడుతున్నాడు. అతనికి రూ.3 లక్షలు, అదే మండలం వలివేరు గ్రామానికి చెందిన వంశీకి కాక్లియర్ ఇప్లాంటేషన్‌కు రూ. 5,18,100, చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కోటాల గ్రామానికి చెందిన సుబ్బారామానాయుడుకు రూ.5 లక్షలు, అదే మండలం కల్‌రోడ్‌పల్లె గ్రామం నుంచి వచ్చిన ఎన్ గంగులుకు రూ.లక్ష మంజూరు చేశారు. ప్రకాశం జిల్లా చినగంజాం నుంచి వచ్చిన మేడికొండ రజనికి రూ. లక్షా 38 వేలు మంజూరు చేశారు.

ఇంటర్వ్యూలు వాయిదా వేయండి

» ప్రొఫెసర్ల భర్తీపై 3 వర్సిటీలకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్, సహాయ ప్రొఫెసర్, బాక్‌లాగ్ ఖాళీల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూలను వాయిదా వేయాలని జేఎన్‌టీయూకే(కాకినాడ), విక్రమసింహపురి(నెల్లూరు), రాయలసీమ(కర్నూలు) విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీచేసింది. ఆయా వర్సిటీ వీసీల పదవీకాలం 2018 ఏప్రిల్‌లో ముగియనున్నందున, కొత్త వీసీలు నియమితులయ్యే వరకు ఇంటర్వ్యూల ప్రక్రియ చేపట్టరాదని ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లకు సోమవారం మండలి సెక్రెటరీ వరదరాజన్ లేఖ రాశారు. ఈ విషయమై మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి కార్యాలయం సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.



గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్).. ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరడంతోపాటు పీఎస్‌యూల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్, ట్రైనీ ఇంజనీర్స్ కొలువుల భర్తీకి పరిగణనలోకి తీసుకొనే పరీక్ష. ఈ ఏడాది గేట్ వ్యవహారాలను ఐఐటీ - గౌహతి పర్యవేక్షించింది. ఈ నెల 3, 4, 10, 11 తేదీల్లో ఆన్‌లైన్‌లో దేశవ్యాప్తంగా 199 కేంద్రాల్లో గేట్ - 2018 పరీక్షను నిర్వహించారు. ఇటీవలి సంవత్సరాలతో పోల్చుకుంటే ఈసారి గేట్ పరీక్ష కొంత సులభంగా ఉన్నట్టు నిపుణుల అంచనా. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్రాంచ్‌లకు సంబంధించి విశ్లేషణ...

గేట్ కటాఫ్ ఎంత..?

గతేడాదితో పోల్చితే ఈ సారి గేట్ పరీక్షలో కొన్ని పేపర్లు క్లిష్టంగా, మరికొన్ని మధ్యస్తంగా ఉన్నాయి. చాలా వరకు కాన్సెప్ట్ బేస్డ్‌గా ప్రశ్నలను అడగటానికి ప్రాధాన్యం ఇచ్చారు. కాబట్టి ఫండమెంటల్స్ (ప్రాథమిక్ భావనలు), కోర్ కాన్సెప్ట్స్‌పై పట్టు ఉన్నవారు ఈ ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తిస్తారు. గేట్ పరీక్షలో మొత్తం 23 సబ్జెక్ట్ పేపర్లు ఉన్నాయి. ప్రతి పేపర్‌లో 65 ప్రశ్నలు ఇచ్చారు. కేటాయించిన మార్కులు 100. సమాధానాలను ఇవ్వడానికి మూడు గంటల సమయం కేటాయించారు. న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉన్నాయి. ఫలితాలను మార్చి 23న ప్రకటిస్తారు.

2018 కటాఫ్ (అంచనాలు)

పేపర్‌కోడ్	బ్రాంచ్	జనరల్	ఓబీసీ	ఎస్సీ/ఎస్టీ/పీహెచ్
CS	కంప్యూటర్ సైన్స్	26	23	17
BT	బయోటెక్నాలజీ	39	34	22
EE	ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	26	24	17
CH	కెమికల్ ఇంజనీరింగ్	40	36	22
IN	ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్	35	27	19
EC	ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్	26	23	17
CE	సివిల్ ఇంజనీరింగ్	29	25	18
ME	మెకానికల్ ఇంజనీరింగ్	33	28	21

ఈసీఈ

ఈసీఈ సబ్జెక్టు ప్రశ్నల రూపకల్పనలో కూడా ప్రాథమిక భావనలకు ప్రాధాన్యం ఇచ్చారు. కామన్ అంశాలు మినహాయిస్తే కోర్ సబ్జెక్టు ప్రశ్నలు కొంచెం కష్టమే. రెండు సెషన్లలో విభాగాల వారీగా ఇచ్చిన వెయిటేజీ.. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ (29 మార్కులు), ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్ (22 మార్కులు), జనరల్ ఆప్టిట్యూడ్ (30 మార్కులు), సిగ్నల్ అండ్ సిస్టమ్ (21 మార్కులు), డిజిటల్ సర్క్యూట్స్ (22 మార్కులు) కంట్రోల్ సిస్టమ్ (20 మార్కులు).

గత కటాఫ్ మార్కులు

Year	జనరల్	ఓబీసీ	ఎస్సీ/ఎస్టీ/పీహెచ్
2017	25.00	22.50	16.60
2016	25	22.5	16.6
2015	25	22.5	16.67
2014	25.56	23.01	17.04
2013	25	22.25	16.67

సివిల్ ఇంజనీరింగ్

సివిల్ ఇంజనీరింగ్‌లో ప్రశ్నలు కాన్సెప్ట్ బేస్డ్‌గా ఉన్నాయి. ఫ్లూయిడ్ మెకానిక్స్, జియోటెక్నికల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అంశాలకు అధిక వెయిటేజీ ఇచ్చారు. స్ట్రక్చరల్ అనాలిసిస్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, సీఎంఎం, స్టీల్ స్ట్రక్చర్ అంశాలు కొంత వరకు కఠినంగా ఉన్నాయి.

గత కటాఫ్ మార్కులు

Year	జనరల్	ఓబీసీ	ఎస్సీ/ఎస్టీ/పీహెచ్
2017	28.7	25.8	19.1
2016	25	22.5	16.6
2015	25	22.5	16.67
2014	26.57	23.91	17.71
2013	27.13	24.42	18.09

మెకానికల్

ఈ పేపర్లో అడిగిన ప్రశ్నలు భావలన ఆధారంగా ఉన్నాయి. ఇతర విభాగాలతో పోల్చుకుంటే జనరల్ ఆప్టిట్యూడ్, మ్యాథమెటిక్స్ సులభమని భావించవచ్చు. కోర్ సబ్జెక్ట్ ప్రశ్నలు 50 శాతం సులభంగా, 30 శాతం మధ్యస్తంగా, 20 శాతం క్లిష్టంగా ఉన్నాయి.

- రెండు సెషన్లలో ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ (27 మార్కులు), ఇంజనీరింగ్ మాన్యుఫాక్చరింగ్ (33 మార్కులు), జనరల్ ఆప్టిట్యూడ్ (30 మార్కులు) విభాగాలకు అధిక ప్రాధాన్యం లభించింది.
- తరవాత మెకానిక్స్ మెటీరియల్ (22 మార్కులు), థర్మోడైనమిక్స్ (22 మార్కులు), థియరీ ఆఫ్ మెకానిక్స్ (15 మార్కులు), ఫ్లూయిడ్ మెకానిక్స్ (19 మార్కులు) వెయిటేజీ ఇచ్చారు.

గత కటాఫ్ మార్కులు

Category	2017	2016	2015	2014	2013
జనరల్	32.87	29.6	32.73	28.86	25
ఓబీసీ	29	26.6	29.46	25.97	22.25
ఎస్సీ / ఎస్టీ / పీహెచ్	21	19.7	21.82	19.24	16.67

సీఎస్

సీఎస్‌లో అడిగిన ప్రశ్నలు కూడా ఎక్కువగా భావనల చుట్టూ తిరిగాయి. కామన్ అంశాలైన జనరల్ ఆప్టిట్యూడ్, మ్యాథమెటిక్స్ విభాగాలు సులభమని చెప్పవచ్చు. సీఎస్ సబ్జెక్ట్ ప్రశ్నలు 50 శాతం సులభంగా, 30 శాతం మధ్యస్తంగా, మిగతావి కష్టంగా ఉన్నాయి.

- ఈ పేపర్‌లో విభాగాల వారీగా ఇచ్చిన వెయిటేజీ.. జనరల్ ఆప్టిట్యూడ్ (15 శాతం), కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చర్ (11 శాతం), డిస్క్రిట్ మ్యాథమెటిక్స్ అండ్ గ్రాఫ్ థియరీ (12 శాతం), ప్రోగ్రామింగ్ అండ్ డేటా స్ట్రక్చర్ (10 శాతం), ఆపరేటింగ్ సిస్టమ్ (10 శాతం), ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ (7 శాతం), థియరీ ఆఫ్ కంప్యూటేషన్ (7 శాతం), కంపైలర్ డిజైన్ (6 శాతం).

గత కటాఫ్ మార్కులు

Year	జనరల్	ఓబీసీ	ఎస్సీ/ఎస్టీ/పీహెచ్
2017	25.00	22.50	16.60
2016	25.00	22.50	16.60
2015	25.00	22.50	16.67
2014	25	22.25	16.67
2013	25	22.25	16.67

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

ఇందులో అడిగిన ప్రశ్నలు చాలా కాన్సెప్ట్ బేస్డ్‌గా నేరుగా ఉన్నాయి. పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మెకానిక్స్, పవర్ సిస్టమ్ సబ్జెక్ట్‌లకు ప్రాధాన్యం లభించింది. జనరల్ ఆప్టిట్యూడ్ ప్రశ్నల క్లిష్టత మధ్యస్తంగా ఉంటే, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్, సిగ్నల్ అండ్ సిస్టమ్స్, పవర్ సిస్టమ్ విభాగాలు క్లిష్టంగా ఉన్నాయి. ఈ పేపర్‌లో విభాగాల వారీగా ఇచ్చిన వెయిటేజీ.. జనరల్ ఆప్టిట్యూడ్ (15 శాతం), కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చర్ (11 శాతం), ఎలక్ట్రికల్ మెకానిక్స్ (12 శాతం), పవర్ సిస్టమ్స్ (10 శాతం), పవర్ ఎలక్ట్రానిక్స్ (10 శాతం), కంట్రోల్ సిస్టమ్ (8 శాతం), అనలాగ్ సర్క్యూట్స్ (8 శాతం), నెట్‌వర్క్ థియరీ (8 శాతం), డిజిటల్ సర్క్యూట్స్ (7 శాతం).

గత కటాఫ్ మార్కులు

Year	జనరల్	ఓబీసీ	ఎస్సీ/ఎస్టీ/పీహెచ్
2017	25.20	25.20	16.70
2016	25.1	22.5	16.7
2015	25	22.5	16.67
2014	25	22.5	16.67
2013	25.74	23.17	17.16

జాబ్ కార్నర్

యూపీఎస్సీ

ఖాళీలు 33

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీ ఖాళీలు: ట్రాన్స్‌లేటర్ 1, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ (జనరల్ మెడిసిన్) 32
- వయసు: 35 ఏళ్లు మించరాదు.
- అర్హత: ట్రాన్స్‌లేటర్ పోస్టుకు డిగ్రీ/ డిప్లొమా (ఇంగ్లీషు, ఫారిన్ లాంగ్వేజ్) ఉత్తీర్ణులై ఉండాలి. మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎండి (జనరల్/ జనరల్ మెడిసిన్/ మెడిసిన్ & థెరపిటిక్స్)/ ఎంఆర్‌సిపి పూర్తిచేసి ఉండాలి. సంబంధిత విభాగంలో కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 1
- వెబ్‌సైట్: www.upsconline.nic.in

ఇండియన్ ఆయిల్

ఖాళీలు 225

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)- టెక్నికల్ & నాన్ టెక్నికల్ ట్రేడ్ & టెక్నీషియన్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / ఎలక్ట్రానిక్ మెకానిక్ / ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ / మెషినిస్ట్ / మెకానికల్ / ఎలక్ట్రికల్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ / సివిల్ / ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ / అకౌంటెంట్
- ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
- వయసు: జనవరి 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: ట్రేడ్ అప్రెంటీస్‌లకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ల ఐటిఐ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అకౌంటెంట్ విభాగానికి మాత్రం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. టెక్నీషియన్ అప్రెంటీస్‌లకు సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా చేసి ఉండాలి. బిఇ / ఎంబిఏ / ఎంసిఏ / సీఏ / ఐసిడబ్ల్యుఏ / ఎల్ఎల్‌బి కోర్సులు చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- రాత పరీక్ష వివరాలు: ఇందులో 100 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఇస్తారు. గంటన్నర సమయంలో వీటికి సమాధానాలు గుర్తించాలి. టెక్నికల్ అక్యూమిన్, జనరిక్ ఆప్టిట్యూడ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీస్, బేసిక్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. అకౌంటెంట్ అభ్యర్థులకు టెక్నికల్ పరీక్ష ఉండదు. రాత పరీక్షకు 85 శాతం, ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీని ఇస్తారు.
- రాత పరీక్ష: మార్చి 4
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25
- వెబ్‌సైట్: www.iocl.com

గోల్కొండ కేంద్రీయ విద్యాలయ

హైదరాబాద్‌లోని గోల్కొండ కేంద్రీయ విద్యాలయ నెం. 1 - కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, కోచ్
- పీజీటి విభాగాలు: ఇంగ్లీష్, హిందీ, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్స్, ఇన్ఫర్మాటిక్స్.
- టిజిటి విభాగాలు: ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్
- కోచ్ విభాగాలు: స్పోర్ట్స్ / యోగా / డ్యాన్స్ / మ్యూజిక్/ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్ / స్టాఫ్ నర్స్ / డేటా ఎంట్రీ ఆపరేటర్స్ / జర్మన్ లాంగ్వేజ్ టీచర్స్
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 17
- వెబ్‌సైట్: www.kv1golconda.edu.in

'ఆపరేషన్ గ్రీన్స్' దేని కోసం..?

కేంద్ర బడ్జెట్ 2018-19లో ప్రకటించిన కొత్త పథకాలు, వివిధ రంగాలకు కేటాయింపులపై పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన అవసరం. ఈ నేపథ్యంలో సంబంధిత అంశాలపై విశ్లేషణ..

జనరల్ స్టడీస్
ఎకానమీ



వ్యవసాయ రంగం

- తాజా బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు 63,836 కోట్లు కేటాయించారు. ఇది 2017 - 18 సవరించిన బడ్జెట్ అంచనా 56,589 కోట్ల కంటే 11.35 శాతం అధికం. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో వ్యవసాయరంగానికి పలు ప్రతిపాదనలు చేశారు.
- ఖరీఫ్ పంటలకు కనిష్ఠ మద్దతు ధరను సాగు వ్యయం కన్నా కనీసం ఒకటిన్నర రెట్లు పెంచుతున్నట్లు వెల్లడించారు. రబీ పంటకు ఇప్పటికే ఈ సూత్రాన్ని వర్తింపజేస్తున్నారు. తాజా ప్రతిపాదనతో దాదాపు అన్ని పంటలకు గిట్టుబాటు ధరను కల్పించనట్లవుతుంది.
- వ్యవసాయ రంగానికిచ్చే సంస్థాగత రుణ పరిమితిని 2017- 18 నాటి 10 లక్షల కోట్ల నుంచి 11 లక్షల కోట్లకు పెంచారు. ఇది 2014 - 15లో 8.5 లక్షల కోట్లుగా ఉంది.
- రైతుల పంటలకు తగిన ధరను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నీతి ఆయోగ్ సంప్రదించి పగడ్బందీ ఏర్పాటు చేయనుంది.
- ప్రత్యేకమైన ఔషధ, సుగంధ మొక్కల వ్యవస్థాపక సాగుకు, సంబంధిత పరిశ్రమకు 200 కోట్లు కేటాయించారు.
- వినియోగదారులకు, అధిక స్థాయిలో కొనుగోళ్లు చేసే కొనుగోలుదారులకు రైతులు నేరుగా విక్రయాలు జరిపేందుకు వీలుగా 22000 గ్రామీణ సంతలను, గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు (గ్రామ్స్)గా అభివృద్ధి చేస్తారు.
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లతోపాటు 585 మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 200 కోట్లను నిధులను సమకూరుస్తారు.
- ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి గాను తాజా బడ్జెట్‌లో 1400 కోట్లు కేటాయించారు.
- రైతులకు ఇచ్చే కిసాన్ క్రెడిట్ కార్డుల సౌకర్యాన్ని మత్స్య, పశు పోషణ దారులకు కూడా వర్తింప జేస్తారు. ఈ రెండు రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 10,000 కోట్ల కార్పస్ ఫండ్‌తో మత్స్య రంగానికి ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను పశుగణాభివృద్ధి కోసం యానిమల్ హజ్‌బెండ్రీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తారు.
- ఆకుపచ్చ బంగారంగా పరిగణించే వెదురు రంగాన్ని సమగ్రంగా ప్రోత్సహించేందుకు 1290 కోట్లతో పునర్వ్యవస్థీకరించిన జాతీయ వెదురు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అటవేతర భూముల్లో పెంచే వెదురు చెట్లను దీని నుంచి మినహాయిస్తారు.
- పెద్ద క్లస్టర్లలో సేంద్రీయ సాగు చేసే ఫార్మల్ ప్రొడ్యూసర్ సంస్థలను, గ్రామీణ ప్రొడ్యూసర్ సంస్థలను ప్రోత్సహిస్తారు.
- జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా సేంద్రీయ సాగు చేసేలా ప్రోత్సాహమిస్తారు.

పారిశ్రామిక రంగం

- భారత్‌లో తయారీకి ఊతమిచ్చేందుకుగాను ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకొనే మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. ఆ ఫోన్లతోపాటు కొన్ని టీవీల విడి భాగాలు, ఉపకరణాల మీద కూడా 15 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
- ఉపాధి, ఆర్థిక వృద్ధి సాధన కోసం తాజా బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ప్రాధాన్యమిచ్చారు. ఈ రంగంలో రుణ మద్దతు, మూలధనం, వడ్డీ రాయితీ, నవ కల్పనల కోసం మొత్తం 3,794 కోట్లు కేటాయించారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ముద్ర యోజన కింద 3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ లక్ష్యం 2017 - 18లో 2.44 లక్షల కోట్లు. ముద్ర యోజనను 2015 ఏప్రిల్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి 2018 జనవరి 19 వరకు మొత్తం 10.38 కోట్ల రుణాలకు గాను 4.6 లక్షల కోట్లు మంజూరు చేశారు.
- ముద్ర పథకం కింద ఇప్పటి వరకు 76 శాతం మంది మహిళలు రుణం పొందగా వారిలో 50 శాతానికి పైగా ఎస్సీ/ ఎస్టీ/ ఒబిసి వర్గాలవారు ఉన్నారు. ఈ పథకం కింద మూడు విభాగాల్లో రుణాలు అందిస్తారు. శిశు విభాగానికి రూ.5000, కిషోర్ విభాగానికి రూ.5000 నుంచి రూ.5,00,000 వరకు తరుణ్ విభాగానికి రూ.5,00,000 నుంచి రూ.10,00,000 వరకు రుణాలు ఇస్తారు.
- 250 కోట్ల టర్నోవర్‌లోపున్న ఎంఎస్ఎంఇలు చెల్లించాల్సిన కార్పొరేషన్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. దీనివలన ఎంఎస్ఎంఇలపై పన్నుల భారం తగ్గుతుంది.

కొత్త పథకాలు

- త్వరగా పాడయిపోయే బంగాళదుంప, టోమాట, ఉల్లి వంటి పంట ధరల్లో అనుహ్యమైన హెచ్చుతగ్గుల పరిష్కారం కోసం ఆపరేషన్ ఫ్లడ్ తరహాలో 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. దీనికి రూ. 500 కోట్లు కేటాయించారు. దీనితో ఉత్పత్తి దారులకు, వినియోగదారులకు లబ్ది చేకూరుతుంది.
- దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా మార్చేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి జీవన ప్రమాణాలను మెరుగుపరడానికి 'గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో ఆగ్రో రిసోర్సెస్ ధన్ (GOBAR - DHAN)' అనే పథకాన్ని ప్రకటించారు.
- ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య - వెల్‌నెస్ కేంద్రాలు, జాతీర ఆరోగ్య సంరక్షణ పథకం (HNPS), అనే రెండు ఆరోగ్య సంబంధిత ఫ్లాగ్‌షిప్ పథకాలను ప్రతిపాదించారు.
- ఎయిర్‌పోర్టుల సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచడం ద్వారా ఒక సంవత్సరంలో బిలియన్ ట్రిప్స్‌ను సాధించడం కోసం పౌర విమానయానరంగంలో 'నభ్ నిర్మాణ్ (NABH Nirman)' కార్యక్రమాన్ని ప్రకటించారు.
- ప్రముఖ విద్యా సంస్థల్లో పరిశోధన, మౌలిక సదుపాయాల కోసం 'విద్యా సంస్థల మౌలిక సదుపాయాల పునరుత్తేజం (RISE - Revitalising Infrastructure and Systems in Education)' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రతిపాదించారు.
- ప్రముఖ విద్యా సంస్థల్లో బీటెక్ చదివే 1000 మంది ఉత్తమ విద్యార్థులకు ఆకర్షణీయమైన ఫెలోషిప్స్ అందజేయడం కోసం 'ప్రైమినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ (PMRF)' పథకాన్ని ప్రకటించారు.
- కిసాన్ క్రెడిట్ కార్డులను మత్స్యకారులు, పశుపోషణ చేసే రైతులకు కూడా వర్తింప చేస్తూ ఈ పథకాన్ని విస్తరించారు.
- వాయు కాలుష్యంతో సతమతమవుతున్న హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఢిల్లీకి తోడ్పాటునందించడానికి, పంట వ్యర్థాల సమస్య పరిష్కారానికి అవసరమయ్యే యంత్రాలను రాయితీ మీద అందించేందుకు ప్రత్యేక పథకాన్ని రూపొందిస్తారు.
- ఆదివాసీ కుటుంబాల పిల్లలకి వారి సొంత పరిసరాల్లోనే ఉత్తమమైన, నాణ్యమైన విద్యను అందించాల్సిన ఆవశ్యకత ఉందనీ, దీనికోసం 2022 నాటికి 50 శాతానికి పైగా ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాల్లోను, కనిష్ఠంగా 20,000 మంది ఆదివాసీలు ఉన్న ప్రతి బ్లాక్‌లోను 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏకలవ్య పాఠశాలలను నవోదయ విద్యాలయాలతో సమానంగా పరిగణిస్తారు. ఈ పాఠశాలల్లో స్థానిక కళలను, సంప్రదాయాలను పరిరక్షించే రీతిలో ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పనతోపాటు క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.

విద్యా రంగం

- తాజా బడ్జెట్‌లో విద్యా రంగానికి 85,010 కోట్లు కేటాయించారు. ఇది 2017 - 18 సవరించిన బడ్జెట్ అంచనా ప్రకారం 81,869 కోట్లు. అంటే గతేడాది కంటే ప్రస్తుతం 3,141 కోట్లు అధికమని తెలుస్తోంది.
- విద్య నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రీ నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యను అవిభాజ్య తత్వ సంబంధమైనదిగా పరిగణిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యా రంగంలో డిజిటల్ ఆధికృతకు పెద్ద పీట వేయాలని సంకల్పించారు. బ్లాక్ బోర్డు నుంచి వైదొలగి డిజిటల్ బోర్డుకు మళ్ళాలని ప్రతిపాదించారు. విద్య నాణ్యతను మెరుగుపరచడం కోసం జిల్లావారీ వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు.
- సర్వీసులో ఉన్న కాలంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడాన్ని కీలకాంశంగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కోసం ఒక సమగ్ర బిఇడి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌ను నెలకొల్పే కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ దీని కోసం 100కి పైగా దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. 'వడోదరా'లో ఒక ప్రత్యేక తరహా రైల్వేస్ యూనివర్సిటీని నెలకొల్పుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
- ఐఐటి, ఎన్ఐటిల్లో 18 స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఇవి స్వతంత్ర ప్రతిపత్తి గల పాఠశాలలుగా కొనసాగుతాయి.

- పన్ను ప్రయోజనాలు పొందడం కోసం అంకుర సంస్థల నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ప్రతిపాదిత మార్పుల ప్రకారం 2021 ఏప్రిల్ 1 వరకు ఆదాయపు పన్ను ప్రయోజనాలను పొడిగించారు. అంతకు ముందు దీన్ని 2019 వరకు పెంచారు. అలాగే 25 కోట్ల కంటే తక్కువ టర్నోవర్ ఉన్న అంకుర సంస్థలు అవి ఏర్పాటైన ఏడేళ్ల వరకు ఆదాయపు పన్ను మినహాయింపును పొందవచ్చు.
- దేశీయ పరిశ్రమలను కాపాడాలనే ఉద్దేశంతో కమలా పళ్ల రసాల దిగుమతిపై 30 నుంచి 35 శాతానికి, ఇతర పళ్ల రసాలతోపాటు కూరగాయల రసాలపై 30 నుంచి 50 శాతానికి, క్రాన్ బెర్రి రసంపై 10 నుంచి 50 శాతానికి, సోయా ప్రోటీన్ మినహా ఇతర ఆహార తయారీ పదార్థాలపై 30 నుంచి 50 శాతానికి కస్టమ్స్ పెంచారు.



వి. కరుణ
సబ్జెక్టు నిపుణులు

10 గంటలు.. 93 వాహనాలు.. 35 టన్నుల చెత్త!

తాగునీటి రిజర్వాయర్‌ను శుభ్రం చేసిన ఎన్నారై

బర్మేర్.. రాజస్థాన్‌లోని ఎడారి నగరం. స్థానికుల తాగునీటి కోసం 50 ఏళ్ల కిందట 'కరేలి నది' రిజర్వాయర్‌ను నిర్మించారు. గత కొన్నేళ్లుగా ఈ రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేశారు. ఇందిరా గాంధీ కాలువ నిర్మాణంతో కరేలి నది ప్రాధాన్యం తగ్గిపోయింది! స్థానికులు క్రమంగా ఈ రిజర్వాయర్‌ను చెత్త డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఆస్పత్రుల వ్యర్థాలు, ప్లాస్టిక్, ఇళ్లలో వ్యర్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు.. ఇలా నగరంలోని చెత్తనంతా ఈ రిజర్వాయర్‌లోనే వేసేశారు. ఫలితంగా ఇందులో నీటిని నిల్వ చేసేందుకు అతికొద్ది స్థలం మాత్రమే మిగిలింది. ఈ పరిస్థితిని చూసి ప్రవాస భారతీయుడు నావల్ కిషోర్ గోడారా చలించిపోయారు. గత ఏడాది డిసెంబరులో జిల్లా కలెక్టర్ శివప్రసాద్ ఎం.నకాటే, మున్సిపల్ కమిషనర్ గుంజన్ సోని రిజర్వాయర్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి, పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసే మార్గాలను అన్వేషిస్తుండగా.. గోడారా ముందుకొచ్చారు. కరేలి నదిని తాము శుభ్రం చేస్తామంటూ సోదరుడితో కలిసి రంగంలోకి దిగారు. జనవరి 6న రిజర్వాయర్‌లో చెత్తను తొలగించే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి కేవలం పది గంటల్లోనే 35 టన్నుల చెత్త, పూడికను తొలగించారు. ఇందుకోసం ఏడు హైడ్రాలిక్ ఎక్స్‌కావేటర్లు, 70 డంపర్లు, 12 జేసీబీలు, 4 ట్రాక్టర్లు.. మొత్తం 93 వాహనాలు వినియోగించారు. చెత్తతో పాటు రిజర్వాయర్‌లోని పూడికను తొలగించారు. ఆ తర్వాత కొత్తగా మట్టిని తీసుకొచ్చి పోశారు. కట్టపై మొక్కలను నాటారు. ఈ స్వచ్ఛతా కార్యక్రమాన్ని ప్రధాని మోదీకి అంకితమిస్తున్నట్లు గోడారా తెలిపారు.



పెద్దలను గౌరవించుము..

▸ ఫిలిప్పైన్స్‌లో సూత్రమిది!

ఫిలిప్పైన్స్ ఏడు వేల ద్వీపాల సమూహం. ఎటువైపు చూసినా అందమైన సముద్రతీరాలతో.. హడావిడిగా కనిపించే జీవనశైలితోను ఉండే ఫిలిప్పైన్స్‌కు వెళ్లే పర్యాటకులు కొన్ని అంశాలను తప్పనిసరిగా తెలుసుకోవాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం..

దేశాన్ని అవమానపరచవద్దు..

ఫిలిప్పైన్ పౌరులు చాలా స్నేహంగా ఉంటారు. అదే సమయంలో తమ దేశాన్ని చాలా గౌరవిస్తారు. ఎవరైనా తమ దేశం గురించి పల్లెత్తు మాట అన్నా ఊరుకోరు. ఫిలిప్పైన్స్‌కు వెళ్లే పర్యాటకులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మత్తుమందుల మాఫియాల గురించి, కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థ గురించి అక్కడ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఫిలిప్పైన్స్ సమాజంలో వృద్ధులకు అపారమైన గౌరవం ఉంటుంది. వారు కనిపించిన వెంటనే సలాం చేసినట్లు కొద్దిగా వంగి.. అవతల వ్యక్తి చేతిని తీసుకొని నుదిటికి తాకిస్తారు. దీనినే అక్కడ ప్యాగ్‌మామానో అంటారు. పర్యాటకులు ఆ విధంగా చేయాల్సిన అవసరం లేదు కానీ వయస్సులో పెద్దవారిని కించపరచకుండా మాట్లాడితే చాలు. ఫిలిప్పైన్స్‌లో శాంతి భద్రతల సమస్యలు ప్రస్తుతం పెద్దగా లేవు కానీ.. పర్యాటకులు తమ జాగ్రత్తలో మాత్రం ఉండాలి. ఉదాహరణకు రాత్రి వేళల్లో నిర్జన ప్రదేశాలలో సంచరించకూడదు. తెలియని ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదు.

- స్పెషల్ డెస్క్

మతం గురించి వద్దు..


ఫిలిప్పైన్స్‌లో మతం చాలా సున్నితమైన అంశం. అందువల్ల మతానికి సంబంధించిన అంశాలను వీలైనంత వరకూ మాట్లాడకుండా ఉంటే మంచిది.

ఫిలిప్పైన్స్ పర్యాటకులు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ దేశంలో శాఖహారం దొరకటం చాలా కష్టం. ఇక్కడ ప్రజలు రకరకాల జంతువులు, పక్షుల మాంసాన్ని తింటారు. వాటి పేర్లను చూసి ఆర్డర్ చేస్తే ఇబ్బంది పడే అవకాశముంది.

ఏ దేశంలో ఏముంది? Foreign



ఎడారంటి ఆశల్లో ప్రాణాలు ఆవిరి!



▸ అర్థం కాని యజమానుల మర్మం

▸ ఇతర దేశస్థుల నుంచి ఎంతో పోటీ

▸ ఒంటరి పోరులో ఓడిపోతున్న వైనం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వివిధ దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రవాసీయులు ఉండే గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల్లో ఇమడడం తెలుగు వారందరికీ సాధ్యం కాదు. ఇక్కడ నెట్టుకొచ్చి నాలుగు రాళ్ళు సంపాదించాలంటే ప్రతిభ కంటే చాణక్యం ఉండాలి. ప్రత్యేకించి పాకిస్థాన్, బంగ్లాదేశ్ జాతీయులతో ఇటు కేరళీయులతో పోటీ పడాలి. వారి వ్యూహాలకు దీటుగా రాణించలేక అనేక మంది తెలుగువారు నష్టపోతున్నారు.ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన తోట నాగరాజు (30) బంగ్లాదేశీయులైన యజమానుల మర్మం అర్థం కాక నిస్పృహతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగరాజు కొన్నాళ్ళుగా కువైత్‌లోని షుయాఖ్‌లో వాహనాలు శుభ్రం చేసే ఒక ప్రముఖ కంపెనీలో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆ సంస్థ సరిగ్గా పని చేయక యాజమాన్యాలు మారాయి. దీంతో అతనితో పాటు పని చేసే బంగ్లాదేశ్ ఉద్యోగులు బయటకు వెళ్లిపోయారు. నాగరాజు మాత్రం ఆ సంస్థనే నమ్ముకొని ఉండిపోయాడు. యాజమాన్యం అతనికి 200 దినార్ల (సుమారు రూ.42 వేలు) జీతం కుదిర్చింది. రెండు నెలల క్రితం సంస్థ బంగ్లాదేశ్‌కు చెందిన వారి చేతుల్లోకి వెళ్లింది. నాగరాజు స్థిర జీతానికి బదులుగా కమిషన్ పద్ధతిలో పనికి కుదిరాడు. కొత్త లెక్క ప్రకారం తనకు 500 దినార్లు (సుమారు రూ.లక్షా 7 వేలు) రావాలని ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మిత్రులకు వాట్సప్‌లో చెప్పిన సమాచారం. సాధారణంగా కువైత్‌లో కార్ల క్లీనర్లకు ఈ స్థాయిలో జీతం లేదు. పైగా నాగరాజు వాడిన యంత్రాలు చెడిపోయాయని, వాటి మరమ్మతు ఖర్చును జీతంలో తగ్గించారు. గిరాకీ లేదంటూ మరికొంత కోత వేశారు. చివరకు కేవలం 100 దినార్లే (సుమారు రూ.21 వేలు) ఇస్తామని చెప్పడంతో నాగరాజు ఆందోళన చెందాడని సమాచారం. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి వైద్య ఖర్చులకు డబ్బు పంపాలి.ఈ పరిస్థితిలో బంగ్లాదేశీయుల లెక్కల అర్థకం కాక, ఆశించిన డబ్బు అందక నిస్పృహకు గురయ్యాడు. ఈ వివరాలను మిత్రులకు వాట్స్ ఎలో పంపాడు. పని చేస్తున్న చోటే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే రకమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా నెలన్నర క్రితం దుబాయిలో గొల్లపల్లి మండలం యశ్వంతరావు పేట గ్రామానికి చెందిన 24 ఏళ్ల పంబళ్ల శ్రీనివాస్ కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పాకిస్థాన్, ఈజిప్టు వారు, కేరళీయుల నుంచి పోటీ ఎదుర్కోలేక ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కొందరు వ్యాపారాలు వదిలిపెట్టి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు.

గల్ఫ్‌లో తెలంగాణ యువకుల ఆత్మహత్య

సేవే దైవం




విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఎన్నారై గులాం అహ్మద్ (ఫైల్‌ఫోటో)

సంపాదనలో కొంత పేదపిల్లలకు!

గల్ఫ్ ప్రవాసి గులాం అహ్మద్ దాతృత్వం


కొండపాక: సాటి వారికి సేవ చేయడంలోనే దైవత్వం ఉందని బలంగా నమ్మే వ్యక్తి.. గులాం అహ్మద్. మెదక్ జిల్ల కొండపాక మండలం సింగారం గ్రామానికి చెందిన గులాం అహ్మద్ సౌదీ అరేబియాలో ఉద్యోగం చేస్తున్నారు. చదువుకుంటున్న సమయంలో పేదరికాన్ని అనుభవించిన ఆయన.. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. తన తాతగారైన జానిమియా పటేల్ స్మారకార్థం ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం తన సంపాదనలో 14 శాతాన్ని కేటాయిస్తున్నారు. ఇలా 6-7 సంవత్సరాలుగా ఏటా ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని అక్కడ ఉంటూనే తన బంధువుల ద్వారా నిర్వహింపజేస్తున్నారు.



బండపల్లి గ్రామం

మెతుకు వేటలో

గల్ఫ్.. నా జీవితాన్నే మార్చింది



"గ్రామంలో అందరికన్నా ముందు 1970లో మస్కట్ వెళ్లాను. తర్వాత జోర్డాన్, దుబాయ్, దోహ ఖతార్, బహ్రెయిన్ తదితర దేశాల్లో పనిచేశాను. దాదాపు 30 ఏళ్లు గల్ఫ్‌లో ఉండి వచ్చిన డబ్బుతో గ్రామంలో పది ఎకరాల దాకా సాగు భూమి కొన్నాను. మూడు బోర్లు వేశాను. రెండు ఇళ్లు కట్టుకున్నాను. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేశాను. గల్ఫ్‌లో ఉపాధి నా జీవితాన్నే మార్చేసింది"

-కోరె మల్లయ్య

బీఈఎం దక్కిన ఏకైక ఆంధ్రుడు!

బ్రిటన్‌లో సత్తా చాటిన తెలుగు వైద్యుడు.. ప్రసాదరావుకు ప్రతిష్ఠాత్మక పతకం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఆయనదో కుగ్రామం.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టారు.. అయితేనేం డాక్టర్ అవ్వాలనే బలమైన కోరిక.. చదువుకునేందుకు నిత్యం నాలుగు కిలోమీటర్లు నడిచివెళ్లేవారు.. చివరికి అనుకున్నది సాధించారు.. వైద్య వృత్తిలో ప్రవేశించిన తర్వాత విదేశీ గడ్డపైనా తానేమిటో నిరూపించుకున్నారు. వైద్య రంగంలో విశేష సేవలు చేశారు. వాటికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక యునైటెడ్ కింగ్‌డమ్ బ్రిటిష్ ఎంపైర్ మెడల్(బీఈఎం) వరించింది. ఈ పతకం దక్కిన ఏకైక ఆంధ్రుడు! ఆయనే డాక్టర్ ఎస్.వై.ప్రసాదరావు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

నడిచి వెళ్లొచ్చేవాణ్ని..

మాది గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని జల్లేపల్లి గ్రామం. బాల్యం అంతా అక్కడే గడిచింది. నాన్న వీరయ్య వ్యవసాయం చేసేవారు. అమ్మ రాజేశ్వరి. ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరడాలనేది వారి కోరిక. చదువులో టాపర్‌గా ఉండేవాడిని. రెండు మైళ్లు నడిచి ధూళిపూడిలోని పాఠశాలకు వెళ్లొచ్చేవాణ్ని. సమీప బంధువు ఒకరు డాక్టర్ కావడంతో నాకూ డాక్టర్ కావాలన్న కోరిక చిన్నతనంలోనే బలంగా నాటుకుపోయింది. అదే లక్ష్యంగా చదివా. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో పీయూసీ పూర్తిచేశాక.. ఎంబీబీఎస్ కోసం ఆంధ్ర మెడికల్ కళాశాలలో చేరా. ఆ రోజుల్లో ఏఎంసీకి ఎంతో డిమాండ్ ఉండేది. మెరిట్ జాబితాలో ఆరో స్థానంలో నిలిచా. పీజీ కోసం 1973లో ఇంగ్లండ్ వెళ్లా. 40 ఏళ్లకు పైగా అక్కడే గడిచిపోయింది. వైద్యుడిగా చేసిన కృషికి నేడు ఈ గౌరవం దక్కింది. యూకేలో ఆర్థోపెడిక్ జనరల్ సర్జన్‌గా 1980 వరకు చేశాను. అక్కడి నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకు ఉద్యోగం కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రెండేళ్లకోసారి ఊళ్లు మారాల్సి వచ్చేది. అదే సమయంలో నాకు అబ్బాయి పుట్టాడు. భార్యను, చంటిపిల్లాడిని వదిలి వెళ్లడం లోటుగానే అనిపించేది. ఇక ఒకేచోట పనిచేయాలనే నిర్ణయానికి వచ్చేలా చేసింది. స్టోక్ ఆన్ ట్రెంట్‌లో స్థిరపడ్డాను.

పేద, ధనిక భేదాలుండవు..

అక్కడ వైద్య వృత్తిలో లభించే సంతృప్తి మాటల్లో వర్ణించలేం. పేద, ధనిక, కుల, మత, రాజకీయ భేదాలుండవు. రోగులంతా సమానమే. వైద్యుడిగా సేవలందిస్తూనే యూరోపియన్ తెలుగు అసోసియేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. రెండేళ్లకోసారి భారీ కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం.

సమాజానికి సేవలందించినందుకు..

హెల్త్‌కేర్‌లో 'కాంట్రిబ్యూషన్ టు సొసైటీ' కింద నాకు ఈ గౌరవం దక్కింది. వివిధ రంగాల్లో సమాజానికి సేవలందిస్తున్న వారికి ఔట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్, కాంట్రిబ్యూషన్ టు సొసైటీ విభాగాల్లో ఈ మెడల్ ఇస్తారు. కమిటీ నిర్ణయం మేరకు 'క్వీన్స్ న్యూ ఇయర్స్ హానర్స్-2018' జాబితాలో నాకు స్థానం దక్కింది. ఏపీలో ఈ మెడల్ సాధించింది నేనొక్కడినే. నిధులు సేకరించడం, పేదలకు అండగా నిలవడం, ఆశ్రమాల నిర్వహణ ఖర్చులు భరించడం వంటి కార్యక్రమాలు చాలాకాలంగా చేస్తున్నా. ఏపీ నుంచి వచ్చే వైద్యులకు మెంటార్‌గా, గైడ్‌గా వ్యవహరిస్తూ వారికి మార్గం చూపేవాడిని. ఇంత కాలం బ్రిటన్‌కు సేవ చేశా. భవిష్యత్తులో మాతృదేశానికి సేవ చేయాలనుకుంటున్నా.



ఆనందాల ఊట


మారిన గల్ఫ్ కూలీలు, కార్మికుల బతుకుచిత్రం

▸ సొంతూర్లో భూములు కొని, ఇళ్ల నిర్మాణం

▸ బండపల్లి గ్రామస్థుల విజయగాథ

పొట్టకూటి కోసం వెళ్లి ఏజెంట్లు, యజమానుల చేతుల్లో మోసపోయిన బతుకులు.. కుటుంబ సభ్యులకు దూరమై ఏళ్లుగా జైళ్లకు పరిమితమైన జీవితాలు.. గల్ఫ్ వలసల మాటెత్తితే అక్కడికి వెళ్లిన వారి కన్నీటి కష్టాలే స్ఫురణకొస్తాయి! అయితే, సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామ ప్రజల జీవితాల్లో మాత్రం గల్ఫ్ వలసలు వెలుగులు నింపాయి. నిన్నటిదాకా గుక్కెడు గంజి కోసం వగచిన వారు.. పిల్లాపాపలకు కడుపునిండా తిండి పెట్టగలుగుతున్నారు. గుడిసెల స్థానాల్లో చక్కగా ఇళ్లు కట్టుకున్నారు. మొత్తంగా ఆ ఊరు ముఖచిత్రమే మారిపోయింది! ఇలా గల్ఫ్ వలసలు ఆనందమయ జీవితానికి చిరునామా కూడా అని వారు గొప్పగా నిరూపిస్తున్నారు. 1970 దశకం వరకు బండపల్లి గ్రామం సమస్యలకు నిలయంగా ఉండేది. సాగుపనులు, ఉపాధి లేక యువకులు ఖాళీగా ఉండేవారు. ఈ పరిస్థితుల్లో గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు గ్రామస్థులను ఆకర్షించాయి. గ్రామం నుంచి తొలిసారిగా కోరె మల్లయ్య అనే వ్యక్తి ఉపాధి కోసం 1970లో మస్కట్‌కు వెళ్లాడు. తర్వాత గల్ఫ్ దేశాల ఉపాధి వేట జోరందుకుంది. భవన నిర్మాణరంగంలో, హోటళ్లలో, ఒంటెలు, మేకల కాపర్లుగా పనిచేసేందుకు గ్రామం నుంచి పెద్దసంఖ్యలో యువకులు సౌదీ, యూఏఈ, ఒమాన్, ఖతార్, కువైత్‌కు వెళ్లడం మొదలైంది. నాలుగు దశాబ్దాల్లో బండపల్లిలో ప్రతి ఇంటి నుంచి ఒకరు చొప్పున గల్ఫ్ ప్రవాసీయులు ఉండడం విశేషం. బండపల్లిలో ప్రస్తుతం 540 ఇళ్లు ఉన్నాయి. గల్ఫ్.. ఇతర దేశాల్లో సుమారు 300మందికి పైగా ఉపాధిపొందుతున్నారు. తమ ఖర్చులకు కొంత ఉంచుకుని మిగతా సొమ్మును ఇంటికి పంపడం అలవాటుగా మార్చుకున్నారు. దీంతో నిన్నటిదాకా కూలీలుగా, కార్మికులుగా ఉన్న యువకులు సొంతూరుకొచ్చి భూములను కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటున్నారు. మరికొందరు వ్యాపారులుగా మారారు. అప్పట్లో బండపల్లి గ్రామానికి బ్యాంకు అధికారులు క్యూ కట్టేవారు. బకాయి వసూళ్ల కోసం కాదు.. డబ్బులను బ్యాంకులో డిపాజిట్ చేయమని ప్రజలను కోరేందుకు. అప్పట్లోనే గ్రామానికి నెలకు రూకోటికిపైగా విదేశాల నుంచి సొమ్ము వచ్చేదట!

- వేములవాడ-చందుర్తి




బండపల్లి గ్రామంలో వెలసిన పక్కా భవనాలు

ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి



"గల్ఫ్‌లో పనిచేయడం వల్ల కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. బతకుదెరువు లేని పరిస్థితి నుంచి సొంతంగా వ్యవసాయం చేసుకునే స్థాయికి చేరుకున్నాను. గ్రామంలో పాఠశాల అభివృద్ధికి నావంతుగా సాయం చేస్తున్నాను"

-గడ్డం శ్రీనివాస్‌రెడ్డి



గల్ఫ్ ఆదాయంతో బాగుపడ్డాను..

"గల్ఫ్ దేశాల్లో పనిచేయడం ద్వారా వచ్చిన ఆదాయంతో నా జీవితం బాగుపడింది. సౌదీ అరేబియాతో పాటు దుబాయ్‌లో కొంతకాలం పనిచేయగా వచ్చిన ఆదాయంతో వేములవాడలో ఒక ఇల్లు నిర్మించుకున్నాను. గుడి నిర్మాణానికి రూ. 30 వేలు విరాళంగా ఇచ్చాను. తండ్రి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నాను"

-లింగంపల్లి బాబు

5 వరకూ ఓపిక పడతాం

ఆశతో ఎదురుచూస్తాం.. సహనానికీ ఓ హద్దుంటుంది.. ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతింటే ఏమవుతుందో 1983లో చూశారు

▸▸ బీజేపీపై టీడీపీ నేతల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని కేంద్రం మార్చి 5లోపు సవరిస్తుందని భావిస్తున్నాం. అప్పటివరకూ ఓపిక పడతాం. ఆశతో ఎదురుచూస్తాం' అని టీడీపీ నేతలు అన్నారు. వారు సోమవారం వేర్వేరు చోట్ల విలేకరులతో మాట్లాడారు. 'సమర్థుడు, సీనియర్ సీఎం అయిన చంద్రబాబు సారథ్యం వహిస్తున్న నవ్యాంధ్రకే అన్యాయం జరిగితే ఇంకెవరికి చెప్పుకోవాలి. విభజన చట్టంలోని అంశాలు అమలు చేయాలని కేంద్రానికి మోకరిల్లాలా?' అని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి రాజమహేంద్రవరంలో మండిపడ్డారు. 'మొదటి నుంచీ మిత్రపక్షంగా ఉన్న టీడీపీకే అన్యాయం జరిగితే ఎన్‌డీఏలోని ఇతర మిత్రపక్షాల సంగతి ఏంటనే ఆలోచన ఆయా పార్టీలకు వచ్చింది. అందుకే ఆయా రాష్ట్రాలతోపాటు వివిధ పార్టీలన్నీ ఏపీకి మద్దతుగా నిలిచాయి. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని అన్యాయాన్ని సవరించాలి' అని తెలిపారు. విభజన చట్టంలో పొందుపరిచిన 19 అంశాలపై కేంద్రం తక్షణం స్పందించాలని.. లేకుంటే కేంద్రానికి తెలుగుదేశం రాం రాం చెప్పడం తథ్యమని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి కడపలో స్పష్టం చేశారు. కేంద్రం తీరు చూస్తుంటే ఐసీయూలో ఉండే పేషంట్‌కు అవుట్ పేషంట్ వైద్యసేవలందించినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోగా తిరిగి టీడీపీపై తప్పుడు ప్రచారం చేయడం బీజేపీ నాయకులకు తగదని ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్ ఓ ప్రకటనలో సూచించారు. ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతింటే ఏమవుతుందో 1983లో దేశం మొత్తం చూసిందనీ, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. కాగా, సహనానికి కూడా ఓ హద్దు ఉంటుందని, మార్చి 5 నాటికి విభజన హామీలపై కేంద్రం నుంచి స్పష్టమైన కార్యాచరణ రాకుంటే పోరు తీవ్రం చేస్తామని పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గుంటూరులో అన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకుల లెక్కలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని అటవీ మంత్రి సిద్దా రాఘవరావు అన్నారు. ప్రజా సమస్యలు, సంక్షేమంపై ప్రతిపక్ష పాత్ర ఎంతో హుందాగా ఉండాలని.. అయితే ప్రజల దురదృష్టం కొద్దీ ప్రతిపక్ష నేత జగన్ నిర్వాకంతో రాష్ట్రంలో టీడీపీయే అధికార పక్షం, ప్రతిపక్ష పాత్రలు పోషించాల్సి వస్తోందని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కడపలో వ్యాఖ్యానించారు. శాసనసభను వదిలి రోడ్డుపై తిరుగుతున్న జగన్ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని చెబుతుంటే.. ఆయనకు లెఫ్ట్, రైట్‌గా ఉండే వైసీపీ ఎంపీలు పార్లమెంటులో బడ్జెట్ భేషుగ్గా ఉందని కితాబివ్వడం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. బడ్జెట్‌పై కేటాయింపుపై జగన్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని శాసన మండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ అనంతపురంలో మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగినా తొలిరోజు అద్భుతమంటూ జగన్ కొనియాడారని.. తన సొంత పత్రికలో ప్రధాని మోదీని, ఆర్థిక మంత్రి జైట్లీని కృష్ణార్జునులుగా అభివర్ణించారన్నారు. బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథరెడ్డి తిరుమలలో ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని హామీలను తు.చ. తప్పకుండా అమలు చేసే మనసు మోదీకి ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదు. ఏమిచ్చారో చెప్పండి.. దానికి ఆధారాలు చూపండి.. ఊరికే ఇచ్చామని చెబితే సరిపోదు' అని ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. 'ఉత్తర భారతానికే నిధులన్నీ ఇచ్చేసి దక్షిణ భారతానికి అన్యాయం చేస్తున్నారు. దీనిపై ఎన్టీఆర్ ఏనాడో హెచ్చరించారు. మేం దేశం నుంచి విడిపోయే పరిస్థితి తేకండి. దక్షిణ భారతంలోని ఐదు రాష్ట్రాలు ఒక నిర్ణయం తీసుకుంటాయి' అని ఎంపీ మురళీమోహన్ హెచ్చరించారు.

ఎన్ని నిధులిచ్చారో చెబితే రాజీనామా: వైవీబీ

ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రానికి కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో బీజేపీ నేతలు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు రాష్ట్రానికి కేంద్రం ఎన్ని నిధులు విదిల్చిందో తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని విజయవాడలో ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చిన నిధులపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎలాంటి గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదని, ప్రతి లెక్కా ప్రభుత్వం వద్ద స్పష్టంగా ఉన్నట్లు తెలిపారు. రాంగోపాల్ వర్మ తెలుగుజాతికి పట్టిన చీడ పురుగు అని వ్యాఖ్యానించారు. ఆయన తెలుగువాడిగా ఉండడం తమ ఖర్మ అని ధ్వజమెత్తారు. కాగా, రాష్ట్రానికి నిధులపై ప్రకాశంబ్యారేజీపై బహిరంగచర్చకు సిద్ధమా అని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ బీజేపీని సవాల్ చేసింది.



అధికారుల విశ్లేషణ వివరాలు..

బీజేపీ ప్రకటన	రాష్ట్రానికి వచ్చిన నిధులు	రాష్ట్ర ప్రభుత్వ వర్గాల విశ్లేషణ
పెట్రోలియం రంగంలో రూ. 1.40 లక్షల కోట్లు	సున్నా	ఇంతవరకూ ఫీజిబులిటీ నివేదిక తయారు కాలేదు
జాతీయ రహదులకు రూ.లక్ష కోట్లు	రూ. మూడు వేల కోట్లు	1600 కి.మీ. రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మార్చడానికి ఒప్పుకొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది
రైల్వే ప్రాజెక్టులకు రూ. 47989 కోట్లు కేటాయింపు	రూ. 5200 కోట్లు	చెప్పిన దానిలో 11 శాతం మాత్రమే ఉంది. రెగ్యులర్‌గా ఇచ్చే రైల్వే బడ్జెట్ నిధులను ప్రత్యేకంగా ఇచ్చినట్లు చూపిస్తున్నారు.
మెడ్‌టెక్ వైజాగ్‌కు రూ. 20 వేల కోట్ల కేటాయింపు	రూ. రెండు వేల కోట్లు	చేయాల్సింది చాలా ఉంది
జల రవాణాకు రూ. 7015 కోట్లు కేటాయింపు	సున్నా	ఇంతవరకూ డిపిఆర్ తయారు కాలేదు.
వైజాగ్-చెన్నై కారిడార్‌కు రూ.4211 కోట్లు	సున్నా	ఇంకా చర్చల్లోనే ఉంది
కోస్టల్ ఎకనామిక్ జోన్స్‌కు రూ. మూడు వేల కోట్లు	సున్నా	ఇంకా ప్రారంభదశలోనే ఉంది
నాగాయలంక మిస్సైల్ యూనిట్ రూ. వెయ్యి కోట్లు	సున్నా	కేంద్ర ప్రభుత్వ అనుమతులు రాలేదు
నిమ్మకూరు, అనంతపురంలలో బెల్‌కు రూ. వెయ్యి కోట్లు	రూ. 30 కోట్లు	పురోగతి లేదు
ఓర్వకల్ ఎయిర్ రేంజ్‌కు రూ. 500 కోట్లు	సున్నా	అనుమతులు రాలేదు
నెల్లూరు లెదర్ పార్క్‌కు రూ. 278 కోట్లు	సున్నా	ప్రారంభ దశలోనే ఉంది
	రెగ్యులర్ పథకం	
స్మార్ట్ సిటీస్‌కు రూ. 1500 కోట్లు	రూ. 1100 కోట్లు	దేశవ్యాప్తంగా వంద సిటీల్లో ఏపిలో నాలుగు ఎంపిక చేశారు.
ఇఎస్ఐ ఆస్పత్రికి రూ. 400 కోట్లు	రూ. 25 కోట్లు	అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఇచ్చారు
పిఎంఈవై ఇళ్ళకు రూ. 17292 కోట్లు	రూ. 1500 కోట్లు	ఈ పథకం కింద అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఇచ్చారు
హడ్కో లోన్ రూ. 8500 కోట్లు	.....	ఈ రుణానికీ, కేంద్రానికీ సంబంధం లేదు. అన్ని రాష్ట్రాలకు హడ్కో రుణాలు ఇచ్చినట్లే ఈ రాష్ట్రానికి ఇచ్చింది.
విశాఖ లాజిస్టిక్ పార్క్‌కు రూ. 450 కోట్లు	....	కాంకర్ ప్రణాళికలో ఉంది. కేంద్రం ప్రత్యేకంగా ఇచ్చింది లేదు
వైద్య కళాశాలల అభివద్ధికి రూ. 240 కోట్లు	రూ. 56 కోట్లు	అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఇచ్చారు
కామధేను బ్రీడింగ్ ప్రాజెక్టుకు రూ.25 కోట్లు	రూ. 25 కోట్లు	రెగ్యులర్ ప్రాజెక్టు
మానసిక వైద్యశాల, దివ్యాంగుల స్టేడియంకు రూ. 40 కోట్లు	రూ. 40 కోట్లు	రెగ్యులర్ పథకం ప్రత్యేకంగా ఇచ్చింది లేదు

విదిలింపే!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించలేదు. అప్పుడో వంద కోట్లు.. ఇప్పుడో 300 కోట్లు అంటూ.. ఈ నాలుగేళ్లలో రూ.4332 కోట్లు రీయింబర్స్ చేసింది. ఇంకా రూ.2847 కోట్లు ఇవ్వాల్సి ఉంది. దీనినే పూర్తిగా చెల్లించని కేంద్రం.. ప్రత్యేకంగా ప్రాజెక్టు నిర్మాణానికి రూపాయి విడుదల చేయలేదు. అసలు పెరిగిన అంచనా వ్యయాన్నే ఇంతవరకు ఆమోదించలేదు. బీజేపీ నేతలు విడుదల చేసిన నిధుల వివరాల్లో పోలవరం లెక్కలు లేకపోవడం గమనార్హం. ఇక రాష్ట్రంలో జాతీయ రహదారులకు రూ.లక్ష కోట్లు ఇచ్చినట్లు బీజేపీ ప్రకటనలో తెలిపారు. కానీ వచ్చింది మూడువేల కోట్లే. జలరవాణా, విశాఖ-చెన్నై కారిడార్, కోస్టల్ ఎకనమిక్ జోన్, నాగాయలంక మిస్సైల్ యూనిట్‌కు మొత్తం రూ.15,226 కోట్లు ఇచ్చినట్లు బీజేపీ నేతలు గొప్పగా లెక్కలు చెప్పగా.. విడుదల చేసింది సున్నా. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లకు రూ.17,292 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. కానీ 1500 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. ఇక రెవెన్యూ లోటు ఊసే లేదు. అది ఎంత ఉందో ఇంతవరకు కేంద్రం నిర్ధారించలేదు. రెవెన్యూ లోటు భర్తీ, ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా విదేశీ సహకారంతో చేపట్టే ప్రాజెక్టు(ఈఏపీ)ల ద్వారా రావాల్సిన నిధుల గురించి కేంద్ర ఉన్నతాధికారులతో చర్చించడానికి రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ఢిల్లీ వెళ్లారు. అయితే సోమవారం వారెవరూ అందుబాటులో లేకపోవడంతో చర్చలు జరగలేదు.



పెద్దకొండూరులో వైసీపీ నేతలతో జగన్ భేటీ

హోదా కోసం వైసీపీ పోరు

▸▸ 1న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు... 5న జంతర్‌మంతర్ వద్ద ధర్నా

అమరావతి/నెల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా కోసం వైసీపీ పోరాటానికి సిద్ధమవుతోంది. దీనికోసం వచ్చే నెల 1న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద.. ఐదో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని వైసీపీ నిర్ణయించింది. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెద్దకొండూరులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర బడ్జెట్, పార్లమెంటులో టీడీపీ ఎంపీల నిరసనపైనే ఎక్కువసేపు చర్చ జరిగింది. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ నేత బొత్స సత్యనారాయణ సూచించారు. అందరూ ఏకీభవించారు. భేటీ అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'ప్రత్యేక హోదా మన హక్కు... ప్యాకేజీతో మోసపోవద్దు..' అన్న సమరశీల నినాదంతో 1న అన్ని కలెక్టరేట్ల వద్ద వైసీపీ నేతలు, శ్రేణులు ధర్నాలు నిర్వహిస్తారని తెలిపారు. 'మార్చి 3న ప్రకాశం జిల్లా పాదయాత్రలో ఉన్న జగన్‌ను ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కలుస్తారు. అక్కడ మరోసారి కీలక భేటీ జరుగుతుంది. అనంతరం వారంతా ఢిల్లీ బయల్దేరతారు. ప్రజా ప్రతినిధుల వాహన శ్రేణిని జగన్ జెండా ఊపి ప్రారంభిస్తారు. ఐదో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద ధర్నా ప్రత్యేక హోదా డిమాండ్‌తో ధర్నా చేస్తాం' అని తెలిపారు. హోదా కోసం వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారని జగన్ గతంలో చెప్పారని విలేకరులు గుర్తుచేయగా.. అవసరమైతే రాజీనామాలకు తమ ఎంపీలు సిద్ధమేనని భూమన అంటుండగా.. తిరుపతి ఎంపీ వరప్రసాద్ జోక్యం చేసుకుని ఎంపీలు రాజీనామా చేస్తే పార్లమెంటులో మాట్లాడే వారు ఎవరని ప్రశ్నించారు.

అధికారంలోకి వస్తే పేదల కష్టాలు తీరుస్తా!

▸▸ చెల్లెమ్మలు, అక్కయ్యలు పూజలు చేయండి: జగన్

కలిగిరి, ఫిబ్రవరి 12: తాను అధికారంలోకి వస్తే పేదల కష్టాలు తీరుస్తానని వైసీపీ అధ్యక్షుడు జగన్ చెప్పారు. సోమవారం ఆయన నెల్లూరు జిల్లా కలిగిరి మండలంలో పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని అనంతపురం గ్రామం నుంచి సిద్దనకొండూరు, లక్ష్మీపురం, పరికోట, 14వ మైలు, అయ్యపరెడ్డిపాలెం మీదుగా యాత్ర సాగింది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ముందుగా వెళ్లి గ్రామకూడళ్ల వద్ద స్థానిక నేతలతో జనసమీకరణకు సూచనలివ్వడం కనిపించింది. జగన్ మహిళనుద్దేశించి మాట్లాడుతూ పిల్లల్ని బడికి పంపితే సంవత్సరానికి రూ.15వేలు నేరుగా ప్రతి మహిళ ఖాతాలో వేస్తామన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి చెల్లెమ్మలు, అక్కయ్యలు ఒకటికి రెండు ప్రార్థనలు చేయాలని, రెండుకి నాలుగు కొబ్బరికాయలు కొట్టాలని కోరారు.

విభజన హామీలపై 18న రౌండ్‌టేబుల్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన కోసం ఈ నెల 18న విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రకటించారు. సోమవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని పార్టీల ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా, వ్యాపార సంఘాలకు ఆహ్వానాలు పంపుతున్నామన్నారు.

ప్రత్యేక హోదాపై మీకేం తెలుసు?!

▸▸ బీజేపీ ఎంపీ గంగరాజు అసహనం.. టీడీపీ నేతల గెంటివేత



వినతిపత్రాన్ని తిరస్కరిస్తున్న ఎంపీ గోకరాజు గంగరాజు

అండలూరు(వీరవాసరం), ఫిబ్రవరి 12: 'ఏపీకి ప్రత్యేకహోదాపై మీకేం తెలుసు?' అంటూ నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు తెలుగుదేశం పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ నిధులతో నిర్మించిన రహదారుల ప్రారంభోత్సవానికి గంగరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సోమవారం వచ్చారు. అండలూరులో టీడీపీ నేతలు వీరవల్లి చంద్రశేఖర్, రాయపల్లి వెంకటేశ్వరరావు, జడ్డు శ్రీనివాసరావు తదితరులు ప్రత్యేక హోదా, ప్రత్యేక నిధులకు సంబంధించి గంగరాజుకు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో... వారిపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని తీసుకోకుండా గెంటి వేశారు. దీంతో ప్రారంభోత్సవ కార్యక్రమాలను టీడీపీ నేతలు బహిష్కరించారు. బలుసగొయ్యిపాలెంలో గంగరాజుపై ఆ ప్రాంతవాసులు నిరసన వ్యక్తంచేశారు.

హోదా ఇస్తే దేనితోనైనా కలుస్తాం: విజయసాయి

తిరుపతి నగరం, ఫిబ్రవరి 12: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే ఏ ప్రభుత్వంతో చేతులు కలిపేందుకైనా తాము సిద్ధమేనని వైసీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఎవరితోనైనా చేతులు కలపడమా?.. లేదా? అనే నిర్ణయం సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఉంటుందన్నారు. పొత్తులపై ఇప్పటి దాకా నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ కూడా గతంలో ఇదే విషయాన్ని ప్రకటించారన్నారు. బీజేపీతో వైసీపీ చేతులు కలపనుందా అన్న ప్రశ్నకు ఆయన ఈ విధంగా స్పందించారు.

తెలుగువాళ్లంటే చిన్నచూపు: టీఎస్ఆర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగువాళ్లంటే కేంద్రానికి చిన్నచూపు ఉందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి ఆరోపించారు. సోమవారం విశాఖలో విలేకరులతో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర విభజనకు అన్ని పార్టీలు అప్పుడు సహకరించి... ఇప్పుడు ఆ నెపాన్ని కాంగ్రెస్ పార్టీపై నెట్టేస్తున్నాయన్నారు

ఎంపీలు కాదు... జోకర్లు...!

▸▸ టీడీపీ ఎంపీలపై రాంగోపాల్ వర్మ ట్వీట్

▸▸ జోకర్ అంటే విక్టరీ: ఎంపీ శివప్రసాద్

అమరావతి/తిరుపతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు, బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై పార్లమెంట్ సాక్షిగా గళమెత్తిన టీడీపీ ఎంపీలను జోకర్లతో పోలుస్తూ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ వివాదాస్పద ట్వీట్‌లు చేశారు. "ఇలాంటి జోకర్లు ఏపీ ప్రజలకు ప్రతినిధులుగా ఎన్నికవడం చూస్తున్న ప్రధాని మోదీ బహుశా ఏపీని ఓ జోక్‌గా భావిస్తున్నారేమో... వీరంతా జోకర్లకు తక్కువ. ....కు ఎక్కువ. టీడీపీకి చెందిన వీరంతా అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఆ పార్టీ పరువును దేశవ్యాప్తంగా తీసేస్తున్నారు. ఈ చిత్రంలో ఉన్న చిత్తూరు ఎంపీ యాక్టర్ అనే విషయం ఆయన డ్రామా చూస్తే అర్థమవుతోంది. అయితే ఆయన ఓ డాక్టర్ కూడానా?. ఈయన ప్రవర్తనతో సినీ రంగంలో ఉన్న మాతోపాటు సాధారణ ఓటర్లు, డాక్టర్లు కూడా సిగ్గుపడుతున్నారు. తమను అవమానించినందుకుగాను డాక్టర్లందరూ ఆయన ఇంటిముందు ధర్నా చేయాలి." అంటూ వేర్వేరుగా తన ట్వీట్లలో వ్యాఖ్యానించారు. దీనిపై మీడియాలో దుమారం రేగడంతో... "నేను టీడీపీ ఎంపీలందరినీ ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తప్పుగా రాస్తున్నారు. నేను కేవలం కింది ఫొటోలో ఉన్నవారే జోకర్లని నా ఉద్దేశం.. వీరు జోకర్లు కాదని ఎవరైనా అనుకుంటే వారే పెద్ద జోకర్ అయి ఉండాలి." అంటూ వర్మ మరో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్లపై ఎంపీ శివప్రసాద్ స్పందిస్తూ... జోకర్ విజయకారకుడని అభిప్రాయపడ్డారు. ఆర్జీవీ తెలిసో తెలియక చేసిన వ్యాఖ్యలను తాము పాజిటివ్‌గానే తీసుకుంటున్నామన్నారు. ఒకవేళ ఆయన మనసులో వేరేవిధంగా ఉంటే అతని విజ్ఞతకే వదిలేస్తున్నట్టు చెప్పారు.

▸▸ రాష్ట్రం కోసం

ఉడత సాయం



▸▸ ఆర్భాటం కాదు.. ఫలితం ముఖ్యం

▸▸ మాకెవరికీ అధికారం లేదు

▸▸ చిత్తశుద్ధి ఉంది.. బలం లేదు: జేపీ

▸▸ రాష్ట్ర ప్రయోజనాలే ఎజెండా

▸▸ నిపుణులతో చర్చిస్తాం: ఉండవల్లి

▸▸ మూడేళ్లుగా పోరాడుతున్నాం: సీపీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హడావుడి ప్రకటనలు, తాత్కాలిక ఆర్భాటమే తప్ప అంతిమంగా ఏ ఫలితం వస్తుందనే విషయానికి మనదేశంలో అంతగా ప్రాధాన్యం ఉండదని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు. ఆర్భాటాలు చేయకుండా ప్రజలకు ఏం చేశామనేదే ముఖ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి రావలసిన నిధులు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఇప్పటికే నాలుగేళ్లు ఆలస్యం చేశామన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా అందరితో కలిసి ఉడత సాయం చేస్తామని తెలిపారు. కేంద్రం నుంచి ఏపీకి వచ్చిన నిధులపై నిజానిజాలు తేల్చేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రతిపాదించిన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(జేఎఫ్ఎఫ్‌సీ)పై జేపీ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు సోమవారమిక్కడ బేగంపేటలోని జేపీ కార్యాలయంలో చర్చించారు. అనంతరం జేపీ విలేకరులతో మాట్లాడారు. తమకెవరికీ అధికారం లేదని, బలం కూడా లేదని.. కేవలం రాష్ట్రానికి న్యాయం చేయాలనే చిత్తశుద్ధి మాత్రమే ఉందన్నారు. ఉండవల్లి మాట్లాడుతూ... కమిటీలో ఎవరెవరిని కలుపుకోవాలనే విషయంపై చర్చించామని తెలిపారు. కేంద్రం ఎంత ఇచ్చింది.. హామీ ఇచ్చింది ఎంత అనే వాటిపై నిపుణులతో చర్చిస్తామన్నారు. 2-3 గంటలు కూర్చుంటే సరిపోతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అంశాలపైనా చర్చిస్తామన్నారు. ఉండవల్లిది ధృతరాష్ట్ర కౌగిలి అని, పవన్ అందులో చిక్కుకుంటున్నారని మంత్రి జవహర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. 'ధృతరాష్ట్ర కౌగిలి నుంచి కాపాడేందుకు పవన్ పక్కన ఎవడో ఒకడు శ్రీకృష్ణుడు ఉంటాడు' అని వ్యాఖ్యానించారు. సీపీఐ నేత రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలపై ఉండవల్లి, జేపీ చాలా వివరాలు సేకరించారని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన సమితి పేరుతో సీపీఐ మూడేళ్లుగా పోరాడుతోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఒకే అభిప్రాయంతో ఉన్నారనే సంకేతాన్ని ఇటీవల బంద్ ద్వారా కేంద్రానికి ఇచ్చామని చెప్పారు. అన్ని పార్టీల ఎంపీలు, విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులతో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

బుట్టా రేణుకకు

పదవీ గండం?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎంపీ బుట్టా రేణుకకు పదవీ గండం పొంచి ఉందా? ఎంపీగా ఉంటూ.. మరో లాభదాయక పదవిని ఆమె అనుభవిస్తున్నారా? అంటే ఔననే అంటోంది పార్లమెంటరీ స్థాయీ సంఘం. కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు(సీఎస్‌డబ్ల్యూబీ) జనరల్ బాడీ సభ్యులలో బుట్టా రేణుక కూడా ఉన్నారు. వాస్తవానికి సీఎస్‌డబ్ల్యూబీ జనరల్ బాడీలో ఒక చైర్‌పర్సన్, వివిధ రంగాల్లో ప్రముఖులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉంటారు. వీరితోపాటు లోక్‌సభ నుంచి బుట్టా రేణుక, రావత్‌లను కూడా నియమిస్తూ కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ 2016 జూలై 26న నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా, పార్లమెంటరీ కమిటీ అధ్యయనంలో ఇవి లాభదాయక పదవులని తేలడంతో ఈ బోర్డులో సభ్యులుగా ఉన్న ఎంపీలపై అనర్హత వేటుకు సిఫారసు చేసింది. దీనికి ముందు ఈ అంశంపై కేంద్ర న్యాయ శాఖ అభిప్రాయాన్ని కూడా స్థాయీ సంఘం కోరింది.

ప్రభుత్వమే నియమించింది: రేణుకా

ప్రభుత్వమే తమను బోర్డులో నియమించిందని, తాము కానీ తన పార్టీ కానీ బోర్డులో నియమించమని విజ్ఞప్తి చేయలేదని ఎంపీ బుట్టా రేణుక అన్నారు. తనపై అనర్హత వేటు వేయవచ్చని కమిటీ చేసిన సిఫారసు గురించి తనకు తెలియదని చెప్పారు. ఈ అంశంపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "సాధారణంగా ప్రతి బోర్డులోనూ ఇద్దరు ఎంపీలను ప్రభుత్వమే నియమిస్తుంది. బోర్డు జీతభత్యాలు ఏమీ చెల్లించదు. గతంలో నన్ను జూట్ బోర్డులో నియమించారు. ఇటీవల ఆరోగ్య శాఖకు సంబంధించిన బోర్డులో సభ్యురాలిగా నియమించారు. మరి ప్రస్తుతం సభ్యురాలిగా ఉన్న సీఎస్‌డబ్ల్యూబీ నుంచి తొలగించి కొత్త బోర్డులో నియమించారా? లేదా రెండింటిలో కొనసాగుతున్నానా? అన్న అంశంపై నాకూ స్పష్టత లేదు" అని వ్యాఖ్యానించారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

▸▸ మహాసభల్లో సీపీఎం తీర్మానం

▸▸ పార్టీ కార్యదర్శిగా మళ్లీ మధు



భీమవరం, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అన్ని హామీలనూ అమలు చేయాలని, వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని సీపీఎం డిమాండ్ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర 25వ మహాసభల్లో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. దీన్ని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రవేశపెట్టగా, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఓబులు బలపరిచారు. విభజనపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ... ప్రత్యేక హోదా ఐదేళ్లకాదు పదేళ్లు అని చెప్పిందని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు పదేళ్లు కాదు పదిహేళ్లు కావాలని చెప్పారని, కానీ ఆ తరువాత ప్యాకేజీకి ఒప్పుకుని బీజేపీతో కలిసి రాష్ట్రానికి ద్రోహం చేశారని సీపీఎం విమర్శించింది. వైసీపీ కూడా కేంద్రానికి వంతపాడుతూ ప్రధాన ప్రతిపక్ష కర్తవ్యాన్ని నిర్వహించలేకపోతోందని తీర్మానంలో సీపీఎం పేర్కొంది.

ఏకగ్రీవంగా మధు ఎన్నిక

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మధు మరోసారి బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 ప్రారంభమైన మహాసభలు సోమవారంతో ముగిశాయి. కార్యదర్శిగా మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ, ప్రత్యేక ఆహ్వానితులను కూడా ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. అనంతరం మధు మాట్లాడుతూ... రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన ఉద్యమం కోసం ఈ నెల 14న విజయవాడలో వామపక్షాలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

ఏనాడైనా మిత్రధర్మం పాటించారా?

▸▸ గొడవ పెట్టుకుంటే న్యాయం జరగదు

▸▸ విభజన కుట్ర లోకేశ్, బాబుదే

▸▸ బాబు రెండు కళ్ల సిద్ధాంతం వల్లే భద్రాద్రి రాముడు తెలంగాణకు..

▸▸ టీడీపీపై బీజేపీ నేతల ధ్వజం

అమరావతి/ఒంగోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ, టీడీపీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఆరోపణలు, విమర్శల వాన కురుస్తోంది. ఈ నాలుగేళ్లలో టీడీపీ ఏనాడైనా మిత్రధర్మం పాటించిందా అని బీజేపీ నేతలు నిలదీశారు. 'యుద్ధానికి దిగుతాం.. భిక్షం వేస్తున్నారా' అనే మాటలు ఆపితే మంచిదన్నారు. మిత్రపక్షంతో గొడవ పెట్టుకుంటే రాష్ట్రానికి న్యాయం జరగదని.. ప్రతిపక్షాలకే మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ విజయవాడలో, మరో ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్‌రెడ్డి ఒంగోలులో విలేకరులతో మాట్లాడారు. 'యుద్ధానికి సిద్ధమంటున్నారు.. మాకు చేత కాదా? మేం ప్రజల్లోకి వెళ్లలేమా? సమైక్య ఉద్యమ సమయంలో ప్రజల నుంచి ఇంతకంటే ఒత్తిళ్లు ఎదుర్కొన్నాం. మీరు యుద్ధం ప్రకటిస్తే మేమూ సిద్ధమే. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోందని ఇన్ని రోజులూ చెప్పిన మిత్రపక్షం ఇప్పుడెందుకు బీజేపీని, మోదీని నిందిస్తోందో అర్థం కావడం లేదు. విభజన చట్టంలో లేని ఎన్నో సమస్యలను కేంద్రం పరిష్కరించింది. పోలవరానికి వేల కోట్ల రూపాయలు ఇస్తోంది' అని శ్యాంకిషోర్ తెలిపారు. 'వైసీపీలాంటి పార్టీలతో కలవడం సరికాదని పార్లమెంటులో టీడీపీ ఎంపీలు చెబుతారు. ఇక్కడ కాంగ్రెస్, కమ్యూనిస్టులు ధర్నా చేస్తే వారితో కలిసిన వైసీపీతో టీడీపీ జట్టు కడుతుంది.. కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నాలు చేస్తారా? ఇదేనా మిత్ర ధర్మం.. ఆత్మావలోకనం చేసుకోండి' అని టీడీపీ నేతలకు సూచించారు. గత నాలుగేళ్ల కాలంలో తెలుగుదేశం ఏనాడైనా మిత్రధర్మం పాటించిందా అని సురేశ్‌రెడ్డి ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా ప్రశ్నించారు. 'రుణ మాఫీపై రైతాంగంలో అసంతృప్తి పెరిగింది. నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరిగింది. రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టడంతో ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగింది. దానిని కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, కుంభకోణాలకు పాల్పడినవారు టీడీపీ టికెట్లు తెచ్చుకుని ఆ పార్టీనే కబ్జా చేసి పార్లమెంటులో ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. గల్లా జయదేవ్ అవినీతిపై సీబీఐ కేసులు ఉంది వాస్తవం కాదా? చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం వల్లే ఆంధ్రకు రావలసిన భద్రాది రాముడు తెలంగాణకు పోయాడు. విభజన సమయంలో పెద్ద కుట్ర జరిగింది. తెలంగాణకు లోకేశ్, ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రులు కావాలనే ఉద్దేశంతో విభజన చేశారు' అని ఆరోపించారు.

ఏవోబీలో ఎదురుకాల్పులు

▸▸ 30 నిమిషాలు హోరాహోరీ... తప్పించుకున్న అగ్రనేతలు?

మల్కన్‌గిరి (చింతపల్లి), ఫిబ్రవరి 12: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని టిక్కరపాడు గ్రామ సమీపంలో మావోయిస్టులకు, స్పెషల్ ఆపరేషన్ పారామిలటరీ దళాలకు మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఇరువర్గాల్లో ఎవరికీ ప్రాణహాని లేకపోయినా, మావోయిస్టులకు చెందిన ఆయుధాలు, కిట్‌బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాలు, పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీసు స్టేషన్ పరిధి కుంతుభద్రలో పోలీసుల క్యాంపు ఉంది. ఈ క్యాంపుపై మెరుపుదాడి చేసేందుకు సీపీఐ మావోయిస్టులు వారం రోజులుగా సరిహద్దు గ్రామాల్లో మకాం వేసి వ్యూహరచన చేస్తున్నట్టు ఎస్‌వోజీ ఉప్పందింది. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో వండబ పంచాయతీ టిక్కరపాడు సమీప అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల మధ్య సుమారు 30 నిమిషాలపాటు హోరాహోరీగా కాల్పులు జరిగాయి. మావోయిస్టులు తప్పించుకోగా, వారు వదిలేసిన 15 రకాల ఆయుధాలు, కిట్‌బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు మల్కన్‌గిరి పోలీసులు చెబుతున్నారు. వీటిలో జిలెటెన్ స్టిక్ నింపిన రెండు స్టీల్ క్యారేజ్‌లు, 45 కిట్‌బ్యాగులు, తుపాకులు, 16 డిటోనేటర్స్ వంటివి ఉన్నట్లు పేర్కొన్నారు. ఎదురుకాల్పుల అనంతరం పోలీసులు ఇద్దరు సానుభూతిపరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సంఘటన స్థలంలో లభించిన ఆయుధాలను బట్టి కొందరు మావోయిస్టు అగ్రనేతలు తప్పించుకుని ఉంటారని వారు అనుమానిస్తున్నారు. కాగా మావోయిస్టులందరూ కాల్పులు జరుపుతూ తప్పించుకుని పరారయ్యారని విశాఖ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పోలీసులకు కూడా గాయాలు తగలలేదని స్పష్టం చేశారు.

ఇంగ్లండ్ X న్యూజిలాండ్
టీ-20
ఉ.11.30 గం నుంచి
SONY ESPN

ఒమన్ టీటీలో సుహానాకు స్వర్ణం



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ యువ క్రీడాకారిణి సుహానా సైనీ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. హరియాణాకు చెందిన 12ఏళ్ల సుహానా ఒమన్‌లో జరిగిన ఐటీటీఎఫ్ జూనియర్, క్యాడెట్ ప్రీమియర్ సర్క్యూట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించింది. సోమవారం జరిగిన బాలికల సింగిల్స్ ఫైనల్లో సుహానా 10-12, 11-7, 11-6, 11-8తో ఈజిప్టు క్రీడాకారిణి హనా గోదాపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది.

జాతి వివక్షతో దూషించారు



జొహాన్నెస్‌బర్గ్: భారత్‌తో నాలుగో వన్డే సందర్భంగా గ్యాలరీలోని ప్రేక్షకుల్లో ఒకరు తనను జాతి వివక్షతో దూషించారని దక్షిణాఫ్రికా బౌలర్ ఇమ్రాన్ తాహిర్ ఆరోపించాడు. వివరాల్లోకెళితే.. మ్యాచ్ సమయంలో సహచర ఆటగాళ్లకు డ్రింక్స్ అందజేసి తాహిర్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తుండగా ఓ అభిమాని అతణ్ని దూషించాడు. దీంతో అతనితో తాహిర్ గొడవపడ్డాడు. దీన్ని గమనించిన భద్రతా సిబ్బంది ఆ ప్రేక్షకుడిని వెంటనే స్టేడియం బయటకు పంపించారు. కాగా, ఆ ప్రేక్షకుడు తనను జాతి వివక్షతో తిట్టాడని తాహిర్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) క్రికెట్ బోర్డుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణకు ఆదేశించినట్లు సీఎస్ఏ తెలిపింది. ఈ ఘటనలో తాహిర్ తప్పుందని తేలితే అతడిపైనా చర్య తీసుకుంటామని సీఎస్ఏ పేర్కొంది.



హర్మన్‌ప్రీత్, స్మృతి

శుభారంభం అందుకోవాలని..

దక్షిణాఫ్రికాతో నేడు తొలి టీ20 ● భారత్‌కు హర్మన్ సారథ్యం

పోచెఫ్‌స్ట్రూమ్ : మూడో వన్డేలో ఓడినా..తొలి రెండు మ్యాచ్‌లలో అద్భుత విజయాలతో సిరీస్ కైవసం చేసుకున్న భారత మహిళలు దక్షిణాఫ్రికాతో మంగళవారం ఇక్కడ జరిగే మొదటి టీ20లో ఆత్మవిశ్వాసంతో బరిలో దిగుతున్నారు. చివరి వన్డేలో ఏడు వికెట్ల ఓటమి ఒకింత నిరాశపరిచినా.. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మొదటి పోటీలో గెలుపొంది శుభారంభం దక్కించుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. తొలి రెండు వన్డేల్లో సఫారీలపై మిథాలీసేన పూర్తి ఆధిక్యం కనబరిచింది. అయితే టీ20ల్లో కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో భారత్ తలపడుతోంది. డాషింగ్ బ్యాట్స్‌వుమన్ హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టుకు సారథ్యం వహిస్తోంది. వన్డే సిరీస్‌లో అదరగొట్టిన మరో బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధానా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనుంది. పొట్టి క్రికెట్ స్పెషలిస్ట్ అనూజ పాటిల్, తొలిసారి టీ20 జట్టులో చోటు పొందిన ఆల్‌రౌండర్ రాధా యాదవ్, వికెట్ కీపర్ నుజహాత్ ప్రవీణ్‌లతో భారత్ పటిష్ఠంగా కనిపిస్తోంది. ఇక 17 ఏళ్ల ముంబై ప్లేయర్ జెమీమా రోడ్రిగ్స్ టీమిండియాకు ప్రధాన ఆకర్షణ కానుంది. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 గంటలకు మొదలు కానుంది.

ఎదురులేని ఆటతీరును ప్రదర్శిస్తూ వరుసగా మూడు ఏకపక్ష విజయాలతో దూసుకెళ్లిన భారత్‌కు ఒక్కసారిగా బ్రేక్ పడింది. సిరీస్‌ను పట్టేద్దామనుకున్న గులాబీ వన్డేలో గుభాళించలేకపోయింది. ఇప్పటిదాకా తమ బలంగా ఉన్న స్పిన్నర్లే పూర్తిగా తేలిపోయిన క్షణాన దక్షిణాఫ్రికా చేతిలో భంగపాటు ఎదురైంది. ఇక చరిత్రాత్మక సిరీస్ విజయం కోసం మరో రెండు మ్యాచ్‌లు టీమిండియాకు అందుబాటులో ఉన్నాయి. కానీ ఆఖరి మ్యాచ్ వరకు చూడకుండా నేటి ఐదో వన్డేలోనే నెగ్గి 'తొలి' సిరీస్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. అయితే ఇక్కడి సెయింట్ జార్జెస్ మైదానంలో వారికి ఒక్క విజయం కూడా లేకపోవడం ఆందోళన కలిగించేదే..! ఇక సఫారీల ఆత్మవిశ్వాసం ఒక్కసారిగా ఆకాశమంత ఎత్తులో నిలిచింది. నాలుగో వన్డే ముందు వరకు కూడా బేలగా ఉన్న ఆ జట్టు డివిల్లీర్స్ రాకతో ఒక్కసారిగా జోష్‌లోకి వచ్చింది. భారత 'మణికట్టు' మాయాజాలంలో విలవిల్లాడిన సఫారీలు కీలక మ్యాచ్‌లో ఏదో మంత్రం వేసినట్టుగా వీరబాదుడు బాదేసరికి భారత్ బేజారైంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు ఎలాంటి చాన్స్ ఇవ్వకుండా సిరీస్‌ను సమం చేయాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది.

ఇక్కడే తేలుస్తారా?

సా. 4.30 నుంచి
SONY TEN 1



కోహ్లీ

● దక్షిణాఫ్రికాతో ఐదో వన్డే నేడు
● సిరీస్‌పై భారత్ దృష్టి ● ఆత్మవిశ్వాసంతో సఫారీలు

పోర్ట్‌ఎలిజబెత్: టీమిండియా మరోసారి చరిత్రపై కన్నేసింది. దక్షిణాఫ్రికాలో తొలిసారిగా వన్డే సిరీస్‌ను దక్కించుకోవాలనే లక్ష్యంతో నేడు (మంగళవారం) ఐదో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. నాలుగో వన్డేలో ఓటమి ఎదురైనా కోహ్లీ సేన 3-1తో ఇప్పటికీ మెరుగైన స్థితిలోనే ఉంది. దీంతో ఈ మ్యాచ్ గెలిస్తే చరిత్రను తిరగరాసినట్టే.. ఒక వేళ ఓడినా మరో మ్యాచ్ అందుబాటులో ఉండడం వారికి కలిసొచ్చే అంశం. పింక్ వన్డేలో వర్షం కారణంగా మ్యాచ్‌కు రెండు పర్యాయాలు అంతరాయం కలగడంతో పాటు బౌలింగ్, ఫీల్డింగ్‌లో వైఫల్యాలు భారత్ కొంపముంచాయి. తాజా మ్యాచ్‌లో భారత్ తమ బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకుని భారీ స్కోరు సాధించాల్సిన అవసరం ఉంది. అటు సూపర్ విజయంతో ఒక్కసారిగా రేసులోకి వచ్చిన సఫారీ జట్టులో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. టీ20 మ్యాచ్ తరహాలో బ్యాట్స్‌మెన్ అంతా జూలు విదిల్చి సిరీస్‌ను రసవత్తరంగా మార్చారు. అయితే మరోసారి భారత స్పిన్నర్లు, దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ మధ్యనే అసలు పోటీ ఉండనుంది. ఇక్కడ ఆడిన 32 మ్యాచ్‌ల్లో 11 మాత్రమే ఓడిన ప్రొటీస్ పైచేయిలో ఉంది.

మిడిలార్డర్ మెరుగయ్యేనా..!

భారత బ్యాటింగ్ భారమంతా శిఖర్ ధవన్, విరాట్ కోహ్లీలపైనే పడుతుండడం ప్రధాన సమస్యగా మారింది. ఇప్పటిదాకా మిగతా బ్యాట్స్‌మెన్ చేసిన పరుగుల (239) కన్నా కోహ్లీ (393), ధవన్ (271) వ్యక్తిగతంగా చేసిన పరుగులే ఎక్కువ. ఇక మరో ఓపెనర్ రోహిత్ శర్మ దారుణంగా విఫలమవడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడుతోంది. నాలుగు వన్డేల్లో కలిపి అతడు 40 పరుగులే చేయడంతో విమర్శలు ఎక్కువయ్యాయి. ప్రధానంగా మిడిలార్డర్ తడబాటు స్పష్టంగా కనిపిస్తోంది. నాలుగో వన్డేలో 35 ఓవర్లు ముగిసేసరికి 206/3తో ఉన్న స్కోరుకు చివరి 15 ఓవర్లలో 83 పరుగులు మాత్రమే జోడించగలిగారు. రహానె చివరి రెండు వన్డేల్లో 11, 8 పరుగులతో నిరాశపరిచాడు. ఇక తొలి టెస్టులో విజృంభించిన అనంతరం పాండ్యా (మొత్తం 26 పరుగులు) ఇప్పటిదాకా ఆకట్టుకున్నది లేదు. ధోనీ ఒక్కడే కాస్త ఫర్వాలేదనిపిస్తున్నాడు. వీరంతా నేటి మ్యాచ్‌లో తమ బ్యాట్లకు పనిచెప్పాల్సి ఉంది. కేదార్ జాదవ్ గాయం గురించి స్పష్టత లేకపోవడంతో అయ్యర్‌కు మరో అవకాశం దక్కవచ్చు. గత మ్యాచ్‌లో విఫలమైనా స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ ఈసారీ కీలకం కానున్నారు. వీరికి తోడు పేసర్లు భువనేశ్వర్, బుమ్రా వికెట్ల వేట సాగిస్తే తిరుగుండదు. నోబాల్స్, ఫీల్డింగ్ లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది.

సిరీస్ సమంపైనే దృష్టి

దక్షిణాఫ్రికా పరిస్థితి మరోలా ఉంది. కీలక సమరంలో బెదురులేకుండా విరుచుకుపడి తమకు కావాల్సిన విజయాన్ని అందుకుంది. డివిల్లీర్స్ రాకతో మిడిలార్డర్ అత్యంత పటిష్ఠంగా మారింది. శనివారం మ్యాచ్‌లో మిల్లర్, క్లాసెన్ అద్భుత భాగస్వామ్యంతో భారత్‌ను వణికించగా చివర్లో ఫెహ్లుక్వాయో మెరుపులతో వాండరర్స్ దద్దరిల్లిన విషయం తెలిసిందే. ఈసారీ ఈ త్రయం ఇలాగే ఆడితే భారత బౌలర్లకు కష్టకాలమే. ఈ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించనుండడంతో ఇమ్రాన్ తాహిర్ తిరిగి జట్టులోకి రావడం ఖాయం. గతేడాది జనవరిలో అతను శ్రీలంకపై ఈ పిచ్‌మీద 3 వికెట్లు తీశాడు.

5 సెయింట్ జార్జెస్ మైదానంలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఆఖరికి కెన్యాతో జరిగిన మ్యాచ్‌లోనూ నెగ్గలేకపోయింది. ఇక్కడ భారత్ అత్యధిక స్కోరు 176 మాత్రమే.

62 దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అత్యధిక పరుగులు (పీటర్సన్, 454) సాధించేందుకు కోహ్లీకి కావాల్సిన పరుగులు.



మార్‌క్రమ్

పిచ్, వాతావరణం


స్పిన్నర్లకు ఈ పిచ్ స్వర్గధామంగా నిలుస్తుంది. ఇక్కడ తొలి ఇన్నింగ్స్‌లో సగటు స్కోరు 232 ఉండగా, రెండో ఇన్నింగ్స్ 198 మాత్రమే. చాహల్, కుల్దీప్ కీలకం కానున్నారు. వాతావరణం వేడిగా ఉన్నా చిరుజల్లులకు ఆస్కారం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రహానె, అయ్యర్/జాదవ్, ధోనీ, పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్, బుమ్రా, చాహల్.

దక్షిణాఫ్రికా: ఆమ్లా, మార్‌క్రమ్ (కెప్టెన్), డుమిని, డివిల్లీర్స్, మిల్లర్, క్లాసెన్, బెహార్డీన్/మోరిస్, ఫెహ్లుక్వాయో, రబాడ, మోర్కెల్, తాహిర్/షంసీ.

స్మిత్‌కు బోర్డర్ మెడల్



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రతిష్ఠాత్మక అలెన్ బోర్డర్ మెడల్‌ను రెండోసారి అందుకున్నాడు. గత ఏడాది విశేష ప్రతిభ చూపిన స్మిత్, ఈ మెడల్ గెలుచుకునే క్రమంలో సహచర ఆటగాళ్లు డేవిడ్ వార్నర్ (162), నాథన్ లియాన్ (156)ను అధిగమించి 246 ఓట్లతో ప్రథమంగా నిలిచాడు. గతంలో 2015లోనూ స్మిత్ ఈ అవార్డును గెలుచుకున్నాడు. గతేడాది 24 అంతర్జాతీయ మ్యాచ్‌లు (వన్డేలు, టెస్టులు కలిపి) ఆడిన స్మిత్.. 67.46 సగటుతో 1754 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు సెంచరీలున్నాయి. 28ఏళ్ల స్మిత్ గత నెలలో ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు. ఆసీస్ బెస్ట్ ఉమెన్ క్రికెటర్‌కు ఇచ్చే బెలిండా క్లార్క్ అవార్డును ఎలిస్ పెర్రీ దక్కించుకుంది. పెర్రీ ఐసీసీ టెస్టు ఉమెన్ క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్ అవార్డునుకూడా గెలుచుకున్నది.

గాలుల ఉధృతితో పోటీలకు ఆటంకం

ప్యాంగ్‌చాంగ్: వింటర్ ఒలింపిక్స్‌లో సోమవారం నాటి పోటీలకు గాలులు అడ్డుగా నిలిచాయి. అయినా, మహిళల స్లోప్‌స్టైల్ ఫైనల్‌ను బలమైన గాలుల మధ్య నిర్వహించడంపై స్నోబోర్డర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాలుల వల్ల పోటీని తాము సరిగా పూర్తి చేయలేమన్న ఆ అథ్లెట్లు.. ఇలాగే ఆడడం వల్ల ప్రమాదాల బారినపడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలుల ఉధృతి కారణంగా మహిళల 'జెయింట్ స్లాలోమ్' ఈవెంట్‌ను గురువారానికి వాయిదా వేశారు. ఇకపోతే ఈ ఒలింపిక్స్‌ను ఉత్తరకొరియా రాజకీయంగా వాడుకొనేందుకు యత్నిస్తున్నదన్న వాదనలను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ ఖండించారు. కాగా, సోమవారం జరిగిన పోటీల్లో టీమ్ ఫిగర్ స్కేటింగ్‌లో కెనడా స్వర్ణ పతకం గెలిచింది. ఈ ఒలింపిక్స్‌లో కెనడాకిది తొలి పసిడి కావడం విశేషం.



మిరయ్ నగాసు

స్కేటింగ్‌లో మిరయ్ చరిత్ర

ఐస్‌పై స్కేటింగే ప్రమాదకరం.. అందులోనూ ఫిగర్‌స్కేటింగ్ టీమ్ ఈవెంట్‌లో 'ట్రిపుల్ యాక్సిల్' అంటే చాలామంది స్కేటర్లు భయపడతారు. అందుకే ఈ ట్రిపుల్ యాక్సిల్‌ను ఒలింపిక్స్‌లో విజయవంతంగా పూర్తి చేసిన వారు ప్రపంచంలో ముగ్గురే ఉన్నారు. వారిలో 24ఏళ్ల మిరయ్ నగాసు ఒకరు. వింటర్ ఒలింపిక్స్‌లో సోమవారం ఈ ట్రిపుల్ యాక్సిల్‌ను కళ్లు చెదిరే రీతిలో విజయవంతంగా పూర్తిచేసి అదరహో అనిపించింది. అంతేకాదు, ఈ ఘనత సాధించిన తొలి అమెరికన్‌గా చరిత్ర సృష్టించింది. ఇంతకుముందు ఒలింపిక్స్‌లో జపాన్ స్కేటర్లు మిడోరి ఇటో, మావో అసాడా మాత్రమే 'ట్రిపుల్'ను విజయవంతంగా ముగించారు.

ఆంధ్ర 'పాంచ్'

● గుజరాత్‌పై గెలుపు ● విజయ్ హజారే ట్రోఫీ

చెన్నై: విజయ్ హజారే టోర్నీలో ఆంధ్ర వరుసగా ఐదో విజయాన్ని నమోదుచేసింది. గ్రూప్-సిలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 9 వికెట్ల తేడాతో గుజరాత్‌ను మట్టికరిపించింది. గుజరాత్ నిర్దేశించిన 251 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర మరో 28 బంతులు మిగిలుండగానే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ శ్రీకర్ భరత్ (106 నాటౌట్) అజేయ శతకంతో పాటు అశ్విన్(99) రాణించి ఆంధ్రకు విజయాన్ని కట్టబెట్టారు. వీరిద్దరూ కలసి తొలి వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యం జత చేశారు. అంతకుముందు గుజరాత్.. కార్తీక్ రామన్ (4/32) దెబ్బకు 50 ఓవర్లలో 250 పరుగులు చేసింది. రుజుల్ భట్ (74), పీయుష్ చావ్లా (56) అర్ధ శతకాలు నమోదు చేశారు. తానాడిన ఐదు మ్యాచ్‌లనూ నెగ్గిన ఆంధ్ర 20 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్-డిలో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 149 పరుగుల భారీ తేడాతో జమ్మూ కశ్మీర్‌పై విజయం సాధించింది. మిగతా మ్యాచుల్లో గోవాపై ముంబై, మధ్యప్రదేశ్‌పై రాజస్థాన్, జార్ఖండ్‌పై ఛత్తీస్‌గఢ్, సర్వీసెస్‌పై సౌరాష్ట్ర గెలిచాయి.

ఆసియా అథ్లెటిక్స్‌లో భారత్‌కు పతకాల పంట

జకార్తా: ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే తెలుగు కుర్రాడు శ్యామ్‌కుమార్ సహా పదిమంది బాక్సర్లు సెమీస్ చేరి పతకాలు ఖాయం చేయగా.. తాజాగా అథ్లెటిక్స్‌లో నాలుగు స్వర్ణాలు, ఓ రజత పతకం భారత్ సొంతమయ్యాయి.

చివరి వన్డేకు ముందే తేలిపోవాలి!

(కృష్ణమాచారి శ్రీకాంత్)

గత వన్డేలో వర్షం కారణంగా భారత జట్టు విజయానికి బ్రేక్ పడింది. ఇంకా 15 ఓవర్లు ఉండగా రెండు వికెట్లకు 206 పరుగులనుంచి 289 పరుగులకు పరిమితమవడం భారత్ విజయావకాశాలను దెబ్బతీసింది. నాలుగో వన్డేలో కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ వైఫల్యం గురించి అంతగా ఆలోచించనవసరం లేదు. చిత్తడిగా మారిన ఔట్‌ఫీల్డ్, బంతిపై పట్టు లభించకపోవడంతో భారత స్పిన్నర్లు విఫలమయ్యారు. ఇక చివరి వన్డే విషయానికొస్తే.. భారత జట్టు మళ్లీ పుంజుకోగలదన్నదే నా అభిప్రాయం. అయితే రోహిత్ శర్మ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. వన్డేల్లో అద్భుతమైన ఆటగాడైన రోహిత్ రాణించాల్సివుంది. అలాగే ధోనీ, పాండ్యాల నిలకడలేమి కూడా సమస్యగా మారింది. అలాగే భారత బ్యాటింగ్ బలగమంతా పరుగులు చేయాల్సివుంది. నాలుగో వన్డే పరాజయం మనకు ఓ చిన్న బ్రేక్‌లాంటిదే. విఫలమైన బౌలర్లు మళ్లీ రేసులోకి వస్తారన్న నమ్మకం నాకుంది. మొత్తంమీద చెప్పేదేమిటంటే...ఈ సిరీస్‌ను ఇక్కడే గెలవాలి. చివరి వన్డే దాకా వేచిచూడొద్దు.

- టీసీఎం



సెరెనాకు మరోసారి నిరాశ

యూఎస్ఏ: అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌కు పునరాగమనంలో వరుసగా రెండోసారీ నిరాశే ఎదురైంది. తన సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి ప్రతిష్ఠాత్మక ఫెడరేషన్ కప్‌లో తన దేశం తరపున డబుల్స్ బరిలోకి దిగిన సెరెనాకు చుక్కెదురైంది. నెదర్లాండ్స్‌తో జరిగిన ఈ పోరులో అమెరికా జట్టు 3-1తో గెలిచినా, విలియమ్స్ సిస్టర్స్ జోడీ డబుల్స్‌లో 2-6, 3-6తో చిత్తయింది. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన తర్వాత సెరెనా పోటీపడ్డ రెండో మ్యాచ్ ఇదే. ఈ మ్యాచ్‌కు సెరెనా భర్త అలెక్సిస్ ఒహానియన్ కూతురు అలెక్సిస్ ఒలింపియాతో కలిసి హాజరయ్యాడు. ఓవైపు కోర్టులో సెరెనా మ్యాచ్ ఆడుతుండగా, గ్యాలరీలో ఒహానియన్ తన కుమార్తెకు పాలసీసా పట్టిస్తున్న దృశ్యం అందరినీ అలరించింది.



ముప్పు తప్పించిన మహిళా పైలట్

» 261 మంది ప్రాణాలను కాపాడిన అనుపమా కోహ్లీ


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఆకాశంలో రెండు విమానాలు.. అనూహ్యంగా ఎదురెదురుగా వచ్చాయి. రెండింటి మధ్య దూరం 100 మీటర్లే! ప్రమాదాన్ని సూచిస్తూ కాక్‌పిట్‌లో రెడ్‌లైట్ కూడా వెలిగింది. దీంతో పైలట్ కొద్ది క్షణాల పాటు ఆందోళనకు గురయ్యారు. కానీ, అంతలోనే తేరుకొని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) అధికారులకు సమాచారం అందించడం, వారి నుంచి ఆదేశాలందుకొని.. విమానాన్ని మలుపు తిప్పుతూ ఎత్తుకు తీసుకెళ్లడం క్షణాల వ్యవధిలో జరిగిపోయాయి. త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిపోయింది. దీంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్నవారితోపాటు ఎదురుగా వచ్చిన విమానంలోని మొత్తం 261 మంది ప్రాణాలకు ముప్పు తప్పింది. ఇది ఈ నెల 7న చోటుచేసుకున్న ఘటన. ఈ ఘటనలో సమయస్ఫూర్తితో వ్యవహరించి పెనుముప్పును తప్పించారు మహిళా పైలట్ అనుపమా కోహ్లీ. ముంబై నుంచి భోపాల్‌కు 109 మందితో వెళ్తున్న ఎయిరిండియా విమానం ఏటీసీ సూచనల మేరకు 27వేల అడుగుల ఎత్తున ప్రయాణిస్తోంది. అదే సమయంలో 152 మందితో ఢిల్లీ నుంచి పుణెకు వెళ్తున్న విస్తారా విమానం అదే ఎత్తులో ఎదురుగా ఎడమవైపు నుంచి వస్తోంది. పైలట్‌గా 20 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన అనుపమా కోహ్లీ దీనిని గమనించి ఏటీసీకి సమాచారమిచ్చారు. విమానాన్ని వేగంగా పైకి తీసుకెళ్లాల్సిందిగా ఏటీసీ నుంచి అనుపమకు ఆదేశాలందాయి. ఆమె వెంటనే స్పందించి విమానాన్ని కుడి వైపునకు మళ్లిస్తూ పైకి తీసుకెళ్లారు. రెండు విమానాలు 600 మీటర్ల దూరంతో వెళ్లిపోయాయి. పెను ప్రమాదం తప్పింది. దీంతో అనుపమపై ప్రశంసల వర్షం కురుస్తుండగా.. విస్తారా ఎయిర్‌లైన్స్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

ప్రపంచ అత్యుత్తమ మంత్రి ఇంద్రావతి

» ఇండోనేసియా ఆర్థిక మంత్రికి అత్యున్నత పురస్కారం



దుబాయ్, ఫిబ్రవరి 12: ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా ఆర్థిక మంత్రి శ్రీ ముల్యానీ ఇంద్రావతి ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన ఆరవ ప్రపంచ ప్రభుత్వ సదస్సులో ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. పాలనలో పారదర్శకత తీసుకురావడం, అవినీతి వ్యతిరేక పోరాటంలో ఆమె కృషికి నిదర్శనంగా ఈ పురస్కారం దక్కించుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ ఈ పురస్కారాన్ని ఇంద్రావతికి అందజేశారు. అత్యుత్తమ మంత్రి పురస్కారం కోసం తుది ఎంపికలో 8 మంది పోటీ పడగా చివరకు ఇంద్రావతి ఆ అవార్డును పొందారు.



చీరతో స్కైడైవింగ్



చీరకట్టి స్కైడైవింగ్ చేసిన తొలి భారత మహిళగా పుణెకి చెందిన శీతల్ రాణే మహాజన్ సరికొత్త రికార్డు సృష్టించారు. థాయ్‌లాండ్‌లో 13 వేల ఎత్తులో విమానం నుంచి కిందకు దూకారు. 'వచ్చే నెలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని వినూత్న సాహసం చేయాలని అనుకున్నా. మహారాష్ట్ర 'నవారీ' చీర కట్టి డైవింగ్ చేశా' అని శీతల్ చెప్పారు. 9 గజాల పొడవున్న ఈ చీరను కట్టుకోవడానికి తాను భారీ కసరత్తే చేయాల్సి వచ్చిందన్నారు. తాజా స్కైడైవింగ్‌తో కలిపి ఆమె ఇప్పటివరకు 18 జాతీయ రికార్డులు, 6 అంతర్జాతీయ రికార్డులు నెలకొల్పారు. ఎవరెస్ట్ నుంచి డైవింగ్ చేయాలనేది శీతల్ కల.

కత్తులు తుప్పు పట్టాయని..

గర్భిణికి ఆపరేషన్ ఆపేశారు!

ఆకివీడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ చేసే కత్తులు తుప్పు పట్టాయని తొమ్మిది నెలల నిండు గర్భిణికి వైద్యులు ఆపరేషన్ ఆపేశారు. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో భీమవరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఈ ఘటన వెలుగు చూసింది. ఆకివీడుకు చెందిన కొమరిన రూపాదేవి నిండు గర్భిణి. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వచ్చిన ఆమెను వైద్యురాలు మాధవీకల్యాణి పరీక్షించారు. బిడ్డ అడ్డం తిరిగిందని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రూపాదేవికి ఎనీమా ఇచ్చారు. ఇంతలో ఆపరేషన్ చేయాల్సిన కత్తులు తుప్పు పట్టాయని గుర్తించడంతో ఆమెను భీమవరం తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో రూపాదేవి బంధువులు వైద్యులపై మండిపడ్డారు. ఇక్కడి ఆస్పత్రిలో వారం క్రితం ఓ ఆపరేషన్ చేశామని, అప్పుడు కత్తులను శుభ్రం చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవి తుప్పు పట్టిపోయాయని వైద్యుడు రాంబాబు చెప్పారు.

'ఏపీ టెట్'కు రాష్ట్రేతర సెంటర్లు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్)కు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ ముందస్తు పరీక్షే పెడుతోంది. అప్లికేషన్‌లో ఆప్షన్ ఇవ్వకున్నా.. ఆసక్తి లేకున్నా కూడా వేరే రాష్ట్రాల్లో పరీక్ష రాయమంటోంది. కోరుకున్న అభ్యర్థులకు ఇబ్బంది లేకపోయినా.. కోరుకోని వారికి కూడా ఇలా రాష్ట్రేతర కేంద్రాలు కేటాయించడంతో అభ్యర్థులు గంగరగోళానికి గురవుతున్నారు. రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్లను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఐటీ విభాగం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది.

- ఈ నెల 21న జరగనున్న పేపర్-1 పరీక్షకు.. కడప జిల్లాకు చెందిన సిరాజ్(17111414201053)కు బెంగళూరులో సెంటర్ ఇచ్చారు.
- ఇదే జిల్లాకు చెందిన సయ్యద్ రుక్సాన(1710914100017)కు నెల్లూరులో కేటాయించారు.
- హిదూపురం ప్రాంతానికి చెందిన తస్లీమ్ తాజ్(1710714201034)కు గుంటూరులో సెంటర్ కేటాయించారు.
- ఈ నెల 25న జరగనున్న పేపర్-2 పరీక్ష రాసేందుకు.. అనంతపురం జిల్లాకు చెందిన కడ్డిపూడి తన్వీరుల్లా(1721615300057)కు నల్గొండ జిల్లా దేశ్‌ముఖి గ్రామంలో సెంటర్ కేటాయించారు.

అప్లికేషన్‌లో సెంటర్‌కు సంబంధించి 5 ఆప్షన్లు ఇచ్చామని.. కానీ కొంతమంది ఆప్షన్ ఇచ్చిన చోట అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వేరే ప్రాంతాల్లో సెంటర్లు ఇచ్చామని పాఠశాల విద్యా కమిషనరేట్‌లోని ఐటీ విభాగం ఇన్‌చార్జి శ్రీనివాస్‌సింగ్ చెప్పారు. ఎవరికైతే ఇబ్బంది ఉందో వారికి మళ్లీ ఆప్షన్ ఇచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

193 జన్యు వ్యాధులకు ఒకే డీఎన్ఏ పరీక్ష

చిన్నపిల్లలకు రక్షగా 'సీమా4నాటాలిస్'



న్యూయార్క్, ఫిబ్రవరి 12: పిల్లలకు భవిష్యత్తులో జన్యు వ్యాధులు వచ్చే అవకాశం ఉందా అని తెలుసుకునేందుకు తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. కానీ, ఏయే పరీక్షలు చేయించాలి? ఎంత ఖర్చవుతుంది? కచ్చితత్వం ఉంటుందా? అని ఇలా ఎన్నో ప్రశ్నలు మెదళ్లను తొలుస్తుంటాయి. ఈ సమస్యకు తాము అభివృద్ధి చేసిన డీఎన్ఏ పరీక్ష పరిష్కారం చూపుతుందని అమెరికాకు చెందిన జన్యు పరీక్షల కంపెనీ 'సీమా4' చెబుతోంది. కేవలం చీక్ స్వాబ్‌తో పిల్లల చెంపకు ఉన్న లాలాజలాన్ని సేకరించి మూర్ఛ, కండరాల క్షీణత, కేన్సర్.. ఇలా 193 జన్యు రోగాలను ముందే పసిగట్టవచ్చని అంటోంది. 'సీమా4నాటాలిస్' అనే ఈ జన్యు పరీక్షతో అప్పుడే పుట్టినవారి నుంచి పదేళ్ల లోపు పిల్లలకు వచ్చే రోగాలను గుర్తించవచ్చని వెల్లడించారు. వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గుర్తిస్తే, దాని పర్యవసానాన్ని అడ్డుకునేలా వైద్యం అందించేందుకు ఈ పరీక్ష దోహదం చేస్తుందని తెలిపారు. పరీక్ష కిట్ ధర రూ.42వేలు అని, చీక్ స్వాబ్‌తో సేకరించిన లాలాజలాన్ని ఈ కిట్‌లో భద్రపరిచి తమకు పంపిస్తే రోగ నిర్ధారణ చేస్తామని పేర్కొన్నారు.

మీ జన్యు సమాచారాన్ని అమ్ముకోవచ్చు!

మీ జన్యు సమాచారం ద్వారా డబ్బులు సంపాదించుకోవాలనుకుంటున్నారా? 'జన్యు సమాచారం మాకు అందజేస్తే డబ్బు ఇవ్వడానికి మేం సిద్ధం!' అంటోంది అమెరికాకు చెందిన 'నెబ్యూలా జీనోమిక్స్' అనే స్టార్టప్ సంస్థ. పలు వంశపారంపర్యంగా వచ్చే రోగాలను గుర్తించేందుకు శాస్త్రవేత్తలకు, ఫార్మా కంపెనీలకు డీఎన్ఏ సమాచారం అవసరం. అయితే, పరీక్షలు నిర్వహించేందుకు జన్యువుల సమాచారం దొరకడం లేదు. ఆ సమస్య నుంచి గట్టెక్కించేందుకు దాదాపు రూ.65వేలకు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ సంస్థ చెబుతోంది. అయితే, దీనికోసం జరిగే లావాదేవీ క్రిప్టో కరెన్సీ ద్వారానే సుమా! ఒకవేళ జన్యు సమాచారం అమ్మితే, దానికి సంబంధించిన పూర్తి హక్కులు కంపెనీకే చెందుతాయి.



రాజస్థాన్ పాలరాయితో నిర్మించిన అతి పెద్దదైన సుల్తాన్ ఖబూస్ మసీదు ఇది. ఒమాన్‌లో ఈ మసీదును ప్రధాని మోదీ సోమవారం సందర్శించారు



జోర్డాన్, ఫలస్తీన్, యూఏఈ, ఒమాన్‌లలో పర్యటన ముగించుకొని భారత్‌కు వచ్చిన మోదీకి స్వాగతం పలుకుతున్న కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్

శివ పూజ- మసీదు సందర్శన

మస్కట్‌లో మోదీ టూర్.. నవభారత్‌లో పెట్టుబడి పెట్టండి: ప్రధాని

» ఒమాన్ వాణిజ్య వేత్తలకు పిలుపు

» 8 ఒప్పందాలపై సంతకాలు

మస్కట్, ఫిబ్రవరి 8: నవ భారత్ పేరిట మొదలు పెట్టిన కాన్సెప్ట్‌ను విదేశాల ముంగిటకూ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకెళుతున్నారు. దుబాయ్ నుంచి ఒమన్ చేరుకున్న ఆయన -మస్కట్‌లో ఇండియా-ఒమాన్ వాణిజ్యవేత్తల సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు 50 మంది అగ్రశ్రేణి ఒమానీ కంపెనీల సీఈఓలు ఇందులో పాల్గొన్నారు. భారత్‌లో వ్యాపారం చేయడం సులభతరమనీ, పెట్టుబడులకు అనుకూలమైన వాతావారణం ఉందనీ, అనుమతుల మంజూరు కూడా చాలా వేగంగా జరుగుతుందని, అంచేత పెట్టుబడులు పెట్టాలని ఆయన విజ్ఞప్తిచేశారు. భారత్‌ను 21వ శతాబ్దిలో తయారీ రంగంలో అగ్రగామిగా మల్చేందుకు అనేక రంగాల్లో సంస్కరణలు తీసుకొస్తున్నామనీ, జ్ఞాన-ఆధారిత, ప్రతిభ-ఆధారిత సమాజంగా మారుస్తున్నామని, అంచేత అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనీ వీటిని సద్వినియోగం చేసుకోండనీ ఆయన పిలుపిచ్చారు. అంతర్జాతీయంగా స్టార్టప్-సూచీలో భారత్ మూడేళ్లలో మూడోస్థానానికి ఎగబాకిందన్నారు. ప్రపంచంలోనే అతి వేగంగా ఎదుగుతున్న ఆర్థికశక్తి భారత్ అనీ, అంతకుముందు ఒమాన్ సుల్తాన్ ఖబూస్ బిన్‌సయాద్ అల్ సయాద్‌తో ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఇంధనం, భద్రత, వాణిజ్యం, మైనింగ్, పలు రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి చర్చలు జరిగాయి. ఆ తరువాత రక్షణ, ఆరోగ్యం, టూరిజం రంగాల్లో సహకారానికి సంబంధించి 8 ఒప్పందాలపై ఇద్దరు నేతల సమక్షంలో సంతకాలు జరిగాయి. వీసా మినహాయింపు, న్యాయ చట్ట వ్యవహారాల్లో వెసులుబాట్లు, శాంతియుతంగా గగనతల వాడకం..మొదలైన అంశాలపైనా ఒప్పందాలున్నాయి. మస్కట్ చేరిన వెంటనే ఆయన అక్కడున్న 125 ఏళ్ళ నాటి శివాలయంలో పూజలు జరిపారు. ఆ వెంటనే నగరంలో అతి పెద్దదైన ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించి ప్రార్థనలు జరిపారు. 4 దేశాల పర్యటన ముగించుకుని ప్రధాని సోమవారం సాయంత్రం ఢిల్లీ తిరిగి వచ్చారు. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలతో భారత బంధం బలపడుతోందని మోదీ ట్వీట్ చేశారు.

భాగవత్ సైన్యంతో

పోల్చలేదు

» స్వయంసేవకులు సైన్యానికి సాటి కాదు

» యుద్ధ సన్నద్ధతకు మాకు 3 రోజులు చాలు

» సాధారణ పౌరులకైతే ఆర్నెల్లు పడుతుంది

» ఆయన వ్యాఖ్యల్లో అర్థమదే: ఆర్ఎస్ఎస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: సైనికుల యుద్ధ సన్నద్ధతను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తక్కువ చేసి మాట్లాడినట్లు వచ్చిన వార్తలను సంఘ్ ఖండించింది. విపత్కర పరిస్థితి వచ్చినపుడు రాజ్యాంగం అనుమతితో సైన్యం సామాన్య ప్రజలను రిక్రూట్ చేసుకొంటే వారిని యుద్ధానికి సన్నద్ధం చేసేందుకు ఆరేడు నెలలు పడుతుందని, అదే సంఘ్ కార్యకర్తలకు అవకాశమిస్తే మూడు రోజుల్లో యుద్ధానికి సిద్ధమవుతారని భాగవత్ చెప్పినట్లు సంఘ్ వివరణ ఇచ్చింది. భాగవత్ మాటలను మీడియా వక్రీకరించినట్లు వ్యాఖ్యానించింది. ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ మన్మోహన్ వైద్య ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. దేశ రక్షణలో స్వయం సేవకులు సైన్యానికి సాటి రాలేరని చెప్పారు. సంఘ్ కార్యకర్తలకు నిరంతరం ఇచ్చే శిక్షణను, వారి క్రమశిక్షణను దృష్టిలో పెట్టుకొని మూడు రోజుల్లో సన్నద్ధం అవుతారని భాగవత్ చెప్పారన్నారు. ఆదివారం బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో జరిగిన సంఘ్ భేటీలో భాగవత్ సైనిక శిక్షణ గురించి మాట్లాడారు. ఆయన మాటలు సంఘ్ సన్నద్ధతను తెలియజేసేవి మాత్రమేనని రాంమాధవ్ అన్నారు. సైన్యం ధైర్య సాహసాలు, త్యాగాల పట్ల తమకు అపార గౌరవం ఉందని తెలిపారు. సైన్యం కన్నా వేగంగా సంఘ్ యుద్ధానికి సన్నద్ధం కాగలదని మీడియాలో వచ్చిన వార్తలతో విపక్షం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. భాగవత్ వ్యాఖ్యలు ప్రతీ భారతీయుడికీ అవమానమేనని, ఆయన తప్పు అంగీకరించి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఆయన సైన్యాన్ని, ప్రతీ అమరవీరుడిని అవమానించారని అంతకుముందు ట్వీట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్‌శర్మ కూడా భాగవత్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ వ్యవహారాన్ని రాజకీయం చేస్తోంద ని కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిరెన్ రిజిజు విరుచుకుపడ్డారు.



దేవిప్రియకు అవార్డు అందజేస్తున్న కన్నడ రచయిత చంద్రశేఖర కంబార

దేవిప్రియ కవిత చైతన్యగీతిక

» సాహిత్య అకాడమీ అవార్డు ప్రదాన సభలో ప్రశంసలు

» తెలుగు సలహా బోర్డు కన్వీనర్‌గా శివారెడ్డి

» అకాడమీ నూతన అధ్యక్షుడుగా చంద్రశేఖర కంబార

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి దేవిప్రియకు 2017వ సంత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేశారు. అకాడమీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నడ రచయిత చంద్రశేఖర కంబార ఆయనకు సోమవారం నాడు న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. దేవిప్రియ కవిగా, జర్నలిస్టుగా స్క్రిప్టు రచయితగా, సంపాదకుడుగా, గేయ రచయితగా బహుముఖ ప్రతిభా శాలి అని ఆయనకు అందించిన ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. "దేవిప్రియ కవితా సంపుటి- గాలి రంగు -సామాజిక చైతన్యానికి అద్దం పట్టిందని, సామాన్య ప్రజలకు చేరువేయ్యే భాషలో రచించిన ఆయన కవిత్వం భారతీయ సాహిత్య ప్రతిష్టను ఇనుమడింపచేసిందని" అందులో కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఉర్దూ రచయిత ప్రొఫెసర్ మహమ్మద్ బేగ్ ఎహ్ సాస్ కూడా- దఖ్మా పేరుతో రచించిన కథాసంకలనానికి సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకు ప్రశంసాపత్రం, రూ.లక్ష నగదు అందించారు. కాగా కేంద్ర సాహిత్య అకాడమీకి తెలుగు సలహా బృందం కన్వీనర్‌గా ప్రముఖ కవి కె.శివారెడ్డిని ఎంపిక చేశారు. అకాడమీ సాధారణ సమితిలో జరిగిన ఎన్నికల్లో శివారెడ్డిని సభ్యులు అత్యధిక మెజారిటీతో కన్వీనర్‌గా ఎంచుకున్నారు. ఆయనతో పోటీ పడిన రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి అంతకంటే తక్కువ ఓట్లు లభించాయి. ఆరేళ్లుగా ఈ బోర్డుకు ప్రముఖ తెలంగాణ కవి ఎన్.గోపి కన్వీనర్‌గా ఉన్నారు.




కర్ణాటక రాయచూర్‌లోని కలమలలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఇతర నేతలతో కలిసి పకోడా, మిర్చి, చాయ్ తీసుకుంటున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

సీఎంల్లో శ్రీమంతుడు చంద్రబాబు

» చర, స్థిరాస్తులు కలిపి రూ 177 కోట్లు

» కేసీఆర్‌కు నాలుగోస్థానం... రూ 15 కోట్లు

» పేద సీఎం మాణిక్ సర్కార్.. ఏడీఆర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశంలో ఉన్న 31 మంది సీఎంలలో అత్యంత సంపన్నుడెవరో తెలుసా?... ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబునాయుడు! చర, స్థిరాస్తులు రెండూ కలిపితే ఆయన వ్యక్తిగత సంపద రూ 177 కోట్లు. ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్) అనే సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం... చంద్రబాబుకు రూ.134,80,11,728 విలువైన చరాస్తులు, రూ. 42,68,83,883 విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. ఈ రెండూ కలిపితే చంద్రబాబు ఆస్తుల విలువ రూ.177,78,95,611 ఉన్నట్లు ఏడీఆర్ సంస్థ వెల్లడించింది. చంద్రబాబు తర్వాత రెండో ధనిక సీఎం... అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూ. ఈయన ఆస్తుల విలువ రూ.129కోట్లకుపైగా ఉంది. మూడో స్థానం పంజాబ్ సీఎం కెప్టెన్ అమరిందర్ సింగ్‌ది. ఈయన ఆస్తుల విలువ రూ.48 కోట్లకుపైగా ఉంది. ఇక 15 కోట్ల విలువైన ఆస్తులతో తెలంగాణ సీఎం కేసీఆర్ నాలుగో ధనిక సీఎంగా ఉన్నారు. కేసీఆర్ దగ్గర రూ. 6,50,82,464 విలువైన చరాస్తులు, రూ8.65 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. సీపీఎంకు చెందిన త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ ఆస్తుల విలువ రూ. 26 లక్షల 83 వేల 195 మాత్రమే. పేద సీఎంల జాబితాలో రెండో స్థానంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ (రూ.30 లక్షలు), మూడో స్థానంలో జమ్మూ కాశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ (రూ 55 లక్షలు) ఉన్నారు. మమతా బెనర్జీ దగ్గర ఒక్క రూపాయి కూడా విలువ చేసే స్థిరాస్తి లేకపోవడం విశేషం. ఏడీఆర్ నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం 11 మంది సీఎంలపై రకరకాల కేసుల నమోదయ్యాయి. అందులో కొన్ని కోర్టు పరిధిలో ఉండగా... మరికొన్ని నేరాలపై చార్జీ షీట్లు దాఖలయ్యాయి. వీరిలోనూ తెలుగురాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, కేసీఆర్ ఉన్నారు. చంద్రబాబుపై 3కేసులు, కేసీఆర్‌పై 2 కేసులు నమోదయ్యాయి. కేసీఆర్‌పై నమోదైన కేసుల్లో ఒకటి క్రిమినల్ కేసు.

స్టెంట్ల ధరల్లో కేంద్రం సవరణలు

న్యూఢిల్లీ: ఏడాది తర్వాత కరోనరీ స్టెంట్ల ధరలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. గత ఏడాదిలో దాదాపు 85 శాతం ధరల్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా బేర్ మెటల్ స్టెంట్(బీఎంఎస్) ధరను రూ.7,400 నుంచి రూ.7,680కి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్(డీఈఎస్) ధరను రూ.30,180 నుంచి రూ.27,890కు తగ్గించింది. సవరించిన ఈ ధరలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది.

రుణ మాఫీ బాటలో బీజేపీ రాష్ట్రాలు

» రాజస్థాన్‌లో రూ 50 వేల దాకా తీసుకున్న పంటరుణాలు మాఫీ

జైపూర్, ఫిబ్రవరి 12: బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మోదీ బాటను అనుసరిస్తున్నాయి.. గ్రామీణ ఓట్లను సాధించడానికి, వ్యవసాయ రంగ దుస్థితిని తీర్చేందుకు రైతు-అనుకూల నిర్ణయాలు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, యూపీలు ఈ దిశగా నిర్ణయాలు తీసుకొనగా- తాజాగా- రాజస్థాన్‌లోని వసుంధర రాజె సర్కార్ కూడా రైతులపై ఓట్ల వల విసిరింది. రూ 50 వేల దాకా పంటరుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతులకు రుణమాఫీ ప్రకటించింది. దీని వల్ల రూ.8000 కోట్ల భారం పడుతుందని ముఖ్యమంత్రి వసుంధర రాజే చెప్పారు. అటు మధ్యప్రదేశ్ కూడా త్వరలోనే రుణమాఫీ నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది. అంటే వచ్చే 11 నెలల కాలంలో జరగబోయే అన్ని కీలక అసెంబ్లీ ఎన్నికలలోనూ బీజేపీ రుణమాఫీ పథకాన్ని ప్రచారాయుధంగా చేసుకోనుంది. మోదీ ప్రభుత్వం ఇప్పటికే "మద్దతుధరకు ఒకటిన్నర రెట్లు స్కీం"ను ప్రకటించి- ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసిరింది. రాజస్థాన్ ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను వసుంధర సోమవారం ప్రవేశపెట్టారు. రైతు రుణమాఫీ నిర్ణయాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ఒక కమిషన్‌నూ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే మొత్తం రైతులందరికీ వర్తించేలా పథకం ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రూ0.36 లక్షల కోట్ల రుణమాఫీ ప్రకటించింది. దీని వల్ల 87 లక్షల మంది రైతులు ఊరట పొందుతారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం- 89 లక్షలమంది రైతులకు లాభం చేకూర్చే- రూ0.34 లక్షల కోట్ల రుణమాఫీ పథకాన్ని అమలుచేస్తోంది. 10.25 లక్షల మందికి లబ్ధి చేకూర్చే మాఫీని పంజాబ్ చేపట్టింది. 3200 కోట్ల మేర వడ్డీ లేని రుణాలు అందజేస్తోంది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం. 2018-19కి దీన్ని పూర్తి రుణమాఫీగా మార్చేసే ఆలోచనలో ఉంది.

ఎంఎస్పీ స్కీంకు రూ 80 వేల కోట్లు ఖర్చుకాదు: ఎస్‌బీఐ

రుణమాఫీ పథకం కంటే పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధర చెల్లించాలన్న కేంద్ర పథకమే మేలైనదని ఎస్‌బీఐ అభిప్రాయపడింది. ఈ పథకానికి 80 వేల కోట్లు ఖర్చవుతుందంటూ వస్తున్న కథనాలు నిజంకాదనీ, తమ అంచనా ప్రకారం- ఆ మొత్తంలో నాలుగోవంతు కూడా (అంటే 20 వేల కోట్లు కంటే తక్కువ) అవదనీ ఆ రిపోర్టు పేర్కొంది.

జూనియర్ డాక్టర్ల సమ్మె బాట

రేపటి నుంచి నిరవధిక సమ్మె

16నుంచి అత్యవసర కేసులూ

ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం వెల్లడి

గుంటూరు(మెడికల్)/ అమరావతి ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్లు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఉపకార వేతనాలు పెంచాలని కొంతకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా.. సానుకూల స్పందన రాకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. ఈనెల 14నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ, ఎలెక్టివ్ కేసులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే.. 16నుంచి అత్యవసర కేసులు కూడా బహిష్కరించి పూర్థిస్థాయి సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. ఈ సమ్మెలో మెడికల్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, సీనియర్ రెసిడెంట్లు మొత్తం కలిపి దాదాపు 10వేల మంది వరకూ పాల్గొంటున్నట్లు ఆబ్జుడా నేతలు ప్రకటించారు. ఈ మేరకు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎన్. సుబ్బారావుతో పాటు ఆయా వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేశారు. వీరి సమ్మెకు మద్దతు ప్రకటించిన ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం... జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలంటూ డీఎంఈకి లేఖ రాసింది. ప్రస్తుతం ఏపీలో మెడికల్ పీజీ విద్యార్థులకు ప్రథమ సంవత్సరం రూ.23,085, ద్వితీయ సంవత్సరం రూ.25,128, ఫైనలియర్‌లో రూ.26,450 ఉపకార వేతనం చెల్లిస్తున్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని ఫస్ట్ ఇయర్ పీజీలకు రూ.40,000, సెకండియర్‌లో రూ.41,000, థర్డ్ ఇయర్ పీజీలకు రూ.42,000 చెల్లించాలి. ఇంటర్న్‌షిప్ చేస్తున్న హౌస్ సర్జన్లకు ప్రస్తుతం ఉపకార వేతనంగా రూ.10580 చెల్లిస్తున్నారు. దీన్ని రూ.17,000కు పెంచాలి. సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేసే పీజీ విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ రూ.26,450, సెకండియర్ విద్యార్థులకు రూ.27,773, ఫైనలియర్‌లో రూ.29,095 ఉపకార వేతనం చెల్లిస్తున్నారు. వీటిని ఫస్ట్ ఇయర్‌లో రూ.51,000, సెకండియర్‌కు రూ.52,000, థర్డ్‌ఇయర్‌కు రూ.53,000 చొప్పున చెల్లించాలి. ఇవి కాక పలు డిమాండ్లు ఉన్నాయి.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.